
శ్రీ వేమన
పద్యసారామృతము
- సి. పి. బ్రౌన్
మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి-1

సి.పి. బ్రౌన్ సంకలన

# శ్రీ వేమన పద్యసారామృతము

తాత్పర్య కర్త :

కీ॥శే॥ జయన్తి సుబ్రహ్మణ్య శాస్త్రి M.A., B.Ed.,

రాజమండ్రి.



ప్రకాశకులు : ☎ 246 2565

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదురుగా,

కోటగుమ్మం, రాజమండ్రి -1

కాపీరైట్

2016

వెల : 100-00

సి.పి. బ్రౌన్ సంకలన

# శ్రీ వేమన పద్యసారామృతము

తాత్పర్య కర్త :

కీ॥శే॥ జయన్తి సుబ్రహ్మణ్య శాస్త్రి M.A., B.Ed.,

రాజమండ్రి.

సంపాదకులు :

**విద్యారణ్య స్వామి**

రాజమండ్రి. ఫోన్ : 247 0224

© సర్వహక్కులు
ప్రకాశకులవి

ప్రకాశకులు :

**మోహన్ పబ్లికేషన్స్**

అజంతా హోటల్ ఎదురుగా,
కోటగుమ్మం, **రాజమండ్రి -1**
☎ (0883) 246 2565

**Like us on follow Face book / Mohan publications**
**google play android app / Mohan publications**
**www.granthanidhi.com / *www.mohanpublications.com***
***e-books at :- www.kinige.com***

# వేమన పద్య భూమిక

- సి.పి.బ్రౌన్

గ్రంథకర్త అయిన వేమన తెలుగుదేశంలోనూ చుట్టు ప్రక్కల ఉన్న సీమ ప్రాంతాలలోనూ ప్రసిద్ధి చెందారు. అతని దేశాన్ని గురించీ, భాషను గురించిన సమాచారం లేదా విశేషాలూ, పాఠకుడికి ఆమోదయోగ్యమై ఉంటున్నాయి. సువిశాలమైన తెలుగుదేశం భారతదేశంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం. ఇది చాలా ప్రాచీనకాలం నుంచీ ఉంటోంది. అంతేకాక తెలుగు దానికి సంబంధించిన రచనా విశేషాల్నీ కూడగట్టుకుని ఉంది. తెలుగు ప్రజలు పూర్వకాలం నుంచీ మంచి భాషాభిమానం గలవారు, అదే విధంగా ఆ దేశ ప్రభువులు కూడా దేశభాషను పెంపొందించుటకు తగిన చేయూత నిచ్చారు. ప్రాచీన కవులు రచించిన ఉద్గ్రంథాలు తక్కువగా ఉన్నా బృహ ద్రూపమైనవి.

తెలుగుభాషకు క్రమబద్ధమైన వ్యాకరణం ఉంది. ఛందో విధానం గ్రీకు భాషవలె ఎంతో మనోహరమైన పద్ధతులలో కూడి ఉంది. కొన్ని కొన్ని భాషా పద్ధతులను చూస్తే తెలుగుభాష సంస్కృత భాషకంటే కొద్దిగా కష్టం అనిపిస్తుంది.

తెలుగు భాషలో గల పద సౌష్టవము, యింకా పదమాధుర్యము, దాని మనోహరమైన ధ్వనులతో ఎంతో అందగిస్తుంది. ఇందులో రచనలు చేసిన గ్రంథకర్తలు పద మధురిమను చక్కగా ప్రయోగించి చూపియున్నారు. అందుచేత పాశ్చాత్యులు దీనిని ఎంతగానో అంటే భారతదేశపు ఇటలీ భాష అని విశేషంగా శ్లాఘించారు. ఈ భాషను చదివే పాఠకుడు "ఈభాష కొంత కఠినమైనది. ఉచ్చారణకు కష్టమైనది" అని భావించకపోడు. అయితే ఇందుకు కారణం ఇందులో సంస్కృతపదాలు సమ్మేళనం చెందడం చేతనే అయి ఉంటుంది. ఈ సంస్కృతపదాలు కూడా కాఠిన్యత లేకుండా తెలుగు పదాలులాగే మాధుర్యవంతంగానూ, శ్రావ్యంగానూ, తెలుగుపదాలతో సమంగా ఉండేలా ఉంటాయి, ఇందులో సంస్కృతభాష ఇంగ్లీషు లాటిన్ భాషలు కలిసి మెలిసి ఉన్న విధంగానే అతి సన్నిహితం అయి ఉంటుంది. ఇది సహజంగానూ తగినంతగా ఇంగ్లీషులాగే సమర్థవంతంగా ఉంటోంది. తెలుగుభాష మరికొన్ని యితర భాషా పదాలను తనలోకి తీసుకుంటోంది. ఈ భాషలోకి ప్రవేశించే సంస్కృత పదాల సముదాయం రోజురోజుకీ పెరుగుతూ ఉండడంవల్ల తెలుగుభాష మిశ్రమభాషలా తయారవుతోంది.

18వ శతాబ్దంలో మహమ్మదీయులుదేశంలోకి చొరబడుటవల్ల తెలంగాణాలో భాషాగమనం తగ్గిపోయింది. అందుచేత దాని ప్రచారం కొంతవరకూ తగ్గింది. సంభాషణాత్మకమైన భాషలో కొంతవరకూ యితర భాషాపదాలు ప్రవేశించడం వాటిని స్థానికులు విరివిగా మాట్లాడ్డం మూలంగా కొందరు గ్రంథకర్తలు కూడా ఆ తోవలోనే నడిచారు. అయితే ఛందో రీతులలో మార్పులు చాలా తక్కువగా ఉన్నాయి.

25 సంవత్సరాల నుంచీ తెలంగాణాలో బ్రిటిషు పాలన ఏర్పడటంవలన ప్రశాంత వాతావరణం అలుముకుంది. దాని మూలంగా భాష తిరిగి పునరుద్దీపిత

మైంది. గౌరవనీయులైన బ్రిటిషు పరిపాలనా కంపెనీవారు మద్రాసులో కొత్తగా కాలేజీని ప్రారంభించారు. ఆ కారణంచేత తెలుగుభాషకు మంచి ప్రోత్సాహం లభించి, తెలుగు పండితులు క్రొత్త క్రొత్త పోకడలతో రచనలు చేయనారంభించారు. ఈ విషయంలో యింకా ఎంతో కృషి జరగవలసి ఉంది. ఐతే యింతవరకూ చెప్పకోతగ్గ గ్రంథాలు ఏవీ ముద్రింపబడేదాకా రాలేదు. అదే విధంగా ఉన్న తెలుగు గ్రంథాలను యింగ్లీషులోకి అనువదించే ప్రయత్నాలు కూడా యేం జరగలేదు.

ప్రస్తుతం గ్రంథకర్త ఐన "వేమన" గురించి కొంత చెప్పవలసి ఉంది. తెలుగుభాష చదివేవారికి యితని రచనలు ఎంతగానో ఉపయోగకరంగా ఉండి ఒక విశిష్టతను కలిగి ఉన్నాయి. ఇతని రచనా ప్రక్రియ, శైలి, సులభమైనవి. వివిధ విషయాలపై ఇతని భావవృద్ధి విమర్శాత్మకంగా ఉంది. శిష్టభాషలో ఉపయోగకరం కాని సామెతలతో కూడిన పదజాలం ఉదాహరణలతో మిళితమై ఉంటోంది. చక్కనైన తెలుగు మాటలలో అభిప్రాయాలు ఆశయాలూ నిగూఢంగా ఉంటున్నాయి.

ఇతన్ని గురించిన చారిత్రకాంశాలు చాలా తక్కువగా ఉన్నాయి, ఇతను కాపు వంశమువాడు, కడప మండలంలో ఉండి ఉండవచ్చు. బహుశా ఇతను గండికోట పరిసర ప్రాంతములో పుట్టి ఉంటాడని నేననుకుంటున్నాను. యీతను 16వ శతాబ్ధి ప్రథమ భాగంలో జీవించాడు. అతను చెప్పిన ప్రకారంగా అనగా 707 వ పద్యంలో అతని జన్మదినాన్ని గురించి కొంత వ్రాయబడి ఉంది. అది బహుశా అతనిదే అయి ఉంటుంది. ఆ జన్మదిన కాలం **A.D.** 1652 తో సరిపోతుంది. అతని జీవితకాలం తెలుగు సంవత్సర కాలచక్రం ప్రకారంగా ఉంది. ఆ కాలచక్రం ఎన్నో 60 సంవత్సరాల కాలచక్రమో సరిగా చెప్పటానికి వీలుకావడం లేదు. ఇతను రాసిన చాలా పద్యాలు 17వశతాబ్ధి తొలిభాగంలో రాసినవిగా భావించబడుతున్నాయి. ఆ రోజులలో మహమ్మదీయులు ఆ ప్రాంతాలకు పాలకులుగా ఉంటున్నారు. ఇతని వంశంవారు ఆ రోజుల్లో అధికారం పలుకుబడి కలవారుగా ఉంటున్నారు. వేమన అటువంటి పరిస్థితుల్లో కూడా ఆ ప్రపంచాన్ని త్యజించి ఓ యోగిగా మారిపోయాడు.

ఇతను రచించిన పద్యాలలో తనకి సంబంధించినంత వరకూ చారిత్ర కాంశాలేవీ కనబడవు. ఇతర ఏకాంత యోగుల్లాగే ఇతను కూడా తనకు తోచిన విధంగా 'వేమా' 'వేమన'గా పేర్కొంటూ వచ్చాడు. బహుశా ఈ ఏకాంత జీవితంలో వ్రాసిన ఈ పద్యాలలో తన సంభోధన కనబడుతుంది. ఇదే వాస్తవమైతే, అది అత్యంత అహంకారం అనిపిస్తుంది. ఈ విధమైన ప్రక్రియ నిజంగా వేమనలో ఓ విశిష్టమైన అంశం. ప్రస్తుతకాలంలో "వేమ" అనికాని "వేమన" అనికాని తెలుగుపేర్లు పెట్టుకోడం కనబడదు. సంస్కృతంలో "వేమ" అనే పదానికిగాను, "వేమన" అన్నదానికి గాని మగ్గము అను అర్థం యిచ్చేదని తోస్తోంది. (చూ, విల్సన్ గారి సంస్కృత లెగ్గిగాన్ పుట 199) ఇవి బహుశా ఒకరకం బిరుదుల్లా కనబడుతున్నాయి. వీటికి ఏదైనా ఓ ప్రత్యేకమైన అర్ధం యిచ్చేవిలా కనబడ్డంలేదు.

ఇతని పద్యాలు ప్రజల అభీష్టానికి పాత్రమై ఉన్నాయి. ఈ పద్యాలు కాని లేదా ఈ భాగాలుకాని కొన్ని కొన్ని తమిళం మళయాళం, కర్ణాటక భాషలలో తర్జుమా చేయబడి కనబడుతున్నాయి. ఒక్కొక్కసారి ఆ పద్యభాగాన్ని తర్జుమా చేయడంలో ఆ అందం తెప్పించడం చాలా కష్టం.

అటువంటి పద్యరచనా పద్ధతికి భావావేశం భావస్పష్టీకరణ చేయడానికి సాధారణ పదజాలం తక్కువగానూ, పేలవంగానూ, ఉంది. ఇతని సూక్తులెన్నో సాధారణ సామెతలుగా ఆంధ్రదేశంలో వాడుకలో ఉన్నాయి. ఇవి పద్యాలే కావచ్చు పద్యపాదాలైనా సంస్కృతంలోంచి తీసుకోబడ్డవే. అవి బహుశా భగవద్గీతలోవో, హితోపదేశంలోవో అయి ఉన్నాయి. కొన్ని అవే సంస్కృతపదాలు కనపడుతున్నాయి. వేమన సహజంగా అద్వైత వేదాంత పంథకి చెందినవాడు. భారతదేశపు "ప్లేటో" అనదగి అతని ఆశయాలతో ఇతని అభిప్రాయాలు సరిపోల్చదగి ఉన్నాయి. కానీ వేమన నైతిక సిద్ధాంతాలు మాత్రం "డెమాక్రిటస్" ఆశయాలతో సరిపోతున్నాయి.

ఇతని పద్యాలు ముఖ్యంగా మూడు తరగతులుగా విభాగింపదగి ఉన్నాయి.

1) నైతిక 2) ఆక్షేపణ 3) భ్రాంతీ మూలకం అని నైతికతలో చాలా పద్యాలు హిందూ సంప్రదాయంలో ఉండే అటువంటి భక్తి భావాలతో నిండినవి. పద్యభాగం ప్రధానంగా "ఆక్షేపణ" పద్యాలు భారతీయ అంటే జాతీయ మత సంప్రదాయానికీ బ్రాహ్మణుల ఆచార వ్యవహారాలకూ సంబంధించినవీ, మరియు సంప్రదాయాలకూ సంబంధించినవీను.

ఈ భాగంలో ఏవీ సొంత అభిప్రాయాలు గలవికావు. భ్రాంతిబోధక పద్యాలు ముఖ్యంగా భాషాధిక్యతకు ఉదాహరణంగా పేర్కొనవచ్చు. కొన్ని పద్యాలు, విశేషంగా ఆత్మచింతనకూ ఆత్మ శోధనకూ సంబంధించి వ్రాయబడినవి. ఇందులో కొన్ని అజ్ఞాన ప్రభావాన్ని జ్ఞానోత్తేజాన్నీ వర్ణిస్తూ ఉండే శ్రేణికి చెందినవి. ఇతని యొక్క పద్యరచనా శిల్పం తర్జుమా చేయడానికి ఇంగ్లీషులో కంటె లాటిన్‌లో బావుండేటట్లు వుంది. ఇంగ్లీషులోకి తగినట్లుగా ఉన్నవి చేయగా, లాటిన్‌తో తర్జుమాకి నేను వేటినీ వదల లేదు. చాలా కష్టంగా ఉన్నప్పుడు తెలుగు అభిప్రాయాన్ని ఆయా పద్యాలకి అనుసంధింజేసాను.

కొన్ని కొన్ని సందర్భాలలో తెలుగు వివరణలు వ్రాయడము జరిగింది. ఈ విషయం నేను బ్రాహ్మణోత్తములకు ఎంతో ఋణపడి ఉన్నాను. వారు నాకు వ్యాకరణమునూ ఛందోరీతులనూ నేర్పినారు. వారు ఏవరనగా మచిలీపట్నంకు చెందిన తిప్పాభట్ల వేంకటశాస్త్రిగారు మరియు అద్వైత బ్రహ్మయ్యగార్లు నేనక్కడగల న్యాయస్థానంలో గౌరవ నీయులైన సహాయక న్యాయమూర్తిగా పన్చేస్తూన్న కాలంలో వారు ఆ న్యాయస్థానంలో ఉండేవారు.

భ్రాంతి మూలక రచనా పద్యాలలో వివరణ కావలసినప్పుడు టీకా టిప్పణులను చేర్చియున్నాను. అనేక విషయ వివరాలు భగవద్గీత లోనివే. ఈ విషయంలో డా౹౹విల్కిన్ గారి వ్యాఖ్య విలియం జోన్సుగారి వ్యాసము అనుసంధింపబడియున్నవి. ఏషియాటిక్ రిసెర్చి సంపుటములలో ప్రాచ్య కవిత కనబడుచున్నది. ఇంకా ఈ విషయంలో ఉదాహరణలకి ప్రాచీన కవుల రచనలు ఉపకరిస్తాయి. పాఠకులకు ఏ విధంగానూ విశేషమైన విసుబు లేకుండా చేయడానికి కొన్ని సందర్భాలలో కొన్ని పద్ధతులకి చెందిన టీకా టిప్పణులు అనుసంధింపబడినవి. ఎక్కువ భాగం వేమన పద్యాలు ఆటవెలది ఛందస్సులో నాల్గు పాదాలతో కనబడుతున్నాయి. నాలుగవ పాదం సాధారణంగా ఓం మకుటం

కలిగి వుంది. ఈ మకుటం ఏమనగా మొదటి 3 పాదాల తర్వాత "విశ్వదాభిరామ వినురవేమ" అని ఉంటుంది.

ఇతను రచించిన పద్యభాగాలన్నీ ఒక ప్రతిగా దొరకలేదు. ప్రస్తుతం సంకలం చేసిన ఈ పద్యాలు తొమ్మిది ప్రతులలోనివి. ఇవి బళ్ళారి, కడప, మద్రాసు, విశాఖపట్నం, మచిలీపట్నంలలో లభించినవి. కొన్ని ప్రతులలో 500 పద్యాలు ఉన్నవి. ఏ ప్రతిలోనూ మొత్తం 700 పద్యాలు ఉన్నవి లేవు. మొత్తం మీద సేకరింపబడిన పద్యాలు 2100.

ఈ వ్రాత ప్రతులన్నీ ఒక క్రమంలో లేవు. ఈ పద్యాలలో ఛందస్సుగాని పాదములు గాని ఒక పద్ధతిలో లేక తప్పులు కుప్ప తప్పలుగా ఉన్నాయి. పాదాలు సరిగా లేనందుననూ తప్పలతో వ్రాయుటకు కష్టసాధ్యమై ఉన్నాయి. ఈ విధంగా ఇన్ని కష్టాలతో కూడిన ఈ పద్యాలలో పదాల తప్పలు పద్యం తప్పలు చెప్పశక్యం కాకుండా ఉన్నాయి.

ఇంకనూ ఈ పద్యాల లేఖరులు పద్య పాదాలను సరిగా వ్రాయలేదు. ఉదాహరణకి ఒక పదం తీసుకు చూద్దాం. "గురము" అన్నది. ఇది గృహము అనే సంస్కృత పదానికి తద్భవరూపం. కాని లేఖరులు గుర్రము అని వ్రాసారు. గుర్రము అంటే అశ్వము కదా అని అర్థం. అటువంటి తప్పలను సూచించటానికి నేనొక విషయసూచిక అనగా తప్పొప్పల పట్టిక లేక ప్రతులలోని వివిధ పాఠాంతరాలలో అనుక్రమణికలను వ్రాసితిని. వాటిలో ఒకటి వీటిలో ఒక పద్యం ఒక పాదం కలిగి కానీ పదాలు కలిగి కానీ లేవు. అతి కష్టంతో పై అనుక్రమణికలు పట్టికల సహాయంతో సరియనిగా అప్పడు చదువుకొనుట సాధ్యపడుతోంది. సంస్కృత పదజాలమును సాధ్యమైనంతగా చందస్సుకు సరిపోయేలాగున తెలుగులో అభిప్రాయం వచ్చేలా చేయబడినవి.

భ్రాంతి మూలక, వేదాంత పద్యభాగ రచనలలో తెలుగు ఛందస్సుకు సంబంధించినంత వరకూ సంక్షిప్త వివరణలు ఇవ్వబడినవి. ఏర్పరచబడిన పద్ధతి క్రమం మాత్రమే కాని వివరణలు మాత్రం కావు. సర్ విలియం జోన్సుగారు తెలియజేసిన అభిప్రాయం ఏమనగా నిజమైన తెలివికి వ్యాకరణం ఒక సాధనం మాత్రమే. అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఎత్తు పల్లాలు లేని మార్గం నడకకు సాఫీగా ఉన్నట్లుండును. భీమన ఇచ్చిన ఛందో నియమావళి ఈ విషయంలో ఎంతో ఉపకరించినది. దీనిని నేను అతి జాగ్రత్తతో పరిశీలించినాను. దీని నంతనీ ఆయా సారాంశాలను తెలుసుకొని అనవసరమైన చోట్ల ఉచిత రీతిని అనుసరించినాను. ఛందో రీతులలో ఎంతో జ్ఞానం కల పాఠకులకు కూడా తెలుసుకోవడానికి అలవికాక మూలగ్రంథం నిగూఢమై మిళితమై పోయింది. దాన్ని జాగ్రత్తగా నాకు అవగాహన అయిన విధంగా ఏర్చి కూర్చినాను.

అనువాదకుడు

**పండిత. జయన్తి సుబ్రహ్మణ్య శాస్త్రి.**

# వేమన గురించి

వేమనను గురించి చరిత్రకారులు, విమర్శకులూ, వాఙ్మయ ప్రియులు తమ తమ వాద ప్రతివాదాలను అభిప్రాయాలను, పరిశోధిత విషయాలనూ వెలువరించారు. అందలి విషయాలు, అతని జన్మ, జన్మస్థలం, కులం, యింకా పేరూ మొదలైన వాటిని గూరించి వ్రాశారు.

ఇతని పేరు వేమన అని “విశ్వదాభిరామ వినురవేమ” అను మకుటంలో కనబడుతోంది. ఈ పేరు అతని నిజమైన పేరుగా తోచదు. ఈ విషయాన్ని కొద్దిగా సందేహాస్పదంగా తమ ఆంగ్ల పీఠికలో బ్రౌనుగారు వ్యక్తం చేసినారు. ఆ సందర్భంలో బ్రౌను గారు “వేమ” “వేమన” అను పదాలను గురించి యించుక వ్రాశారు.

ఇతనికి ఆ పేరు ఎలా ఏర్పడి ఉంటుంది అని ఊహిస్తే పేరు బట్టి సార్థకతగా అసలు విషయం తెలుస్తుంది. అందుచేత దానిని గురించి ఒక అభిప్రాయం ఏమంటే ఇతని రచనా పద్యాలన్నీ దూషణ విమర్శలుగా కనబడుతున్నాయి. ఇవి కాని పద్యాలుంటే, అంతే మెచ్చుకోవడం లాంటి పద్యాలు బహు స్వల్పం.

ఇతని పద్యాలు దూషణలా విమర్శలా అన్నది కూడా చర్చనీయాంశమే. ఒక విధంగా విమర్శలే ఎక్కువ అనుకుంటే అది ఎందుకోసం? అని ప్రశ్న. ఏదో మంచిమార్గం బోధించడానికే అనిపిస్తుంది. అసలు మంచిమాట చెబితే అది ముందుగా కొంత కటువుగా వుండక మానదు. అది కొంతకాలానికి మధురంగా మారుతుంది. ఆ విషయాన్ని వేమన యిలా చెప్తున్నాడు.

“తినగ తినగ వేము తీయనుండు”

ఈ పాదంలో వేమ యొక్క సహజగుణమును వెలిబుచ్చాడు. అయితే ఇంకొకచోట ఓ సందర్భంలో యిలా అన్నాడు.

“వేము పాలు బోసి వెయ్యేండ్లు బెంచిన చేదు విడిచి తీపి చెందనటుల...” ఇత్యాదిగా.

ఇది వృక్షం యొక్క సహజ గుణాన్ని చెప్పడం మాత్రమే. ఈ సహజగుణం నుంచి విశేషగుణం చెప్పడమే.

“తినగ తినగ వేము తీయనుండు”

ఇంతటి యోగి తన పేరు చెప్పుకుంటాడనుకోవడం సరికాకపోవచ్చు. అందుచేత వేమ+అన్న=వేమన. దీని సంక్షిప్త రూపమే వేమ. అనగా వేమన అన్న వేమన. కాబట్టి మకుటంలో కనబడుతున్న పేరు “వేము” ప్రధానమై ఉంది. పలువురు అతన్ని “వేము” అని పిలిచి ఉండనూవచ్చు. అదే వేమనగా స్థిరపడి ఉండచ్చు.

ఆట వెలది

వెలది అనగా స్త్రీ మాత్రమే. ఆమె ముసలది కావచ్చు. కాని వేమన ఏ వెలదీ లేక ఆటవెలదిని ఆశ్రయించాడు. ఇతను ఆటవెలదిని ఛందో యువతిగా భావించాడు. ఇవి తెలుగుతనం ఉట్టిపడే ఛందస్సు. అతని ఏకాకి జీవితమునకు తోడైనది ఈ ఆటవెలదియే.

అది అలా ఉండగా బ్రౌను గారు ఇతను ఏకాంతవాసం చేసి ఉండవచ్చు అని భావించారు. యోగి కదా అని. అది సరి కాకపోవచ్చు. బహుశా ఇతను మసలిన చోట్ల గుళ్ళూ, గోపురాలు, ధర్మశాలలూ, యజ్ఞశాలలూ, సాంస్కృతిక సమ్మేళనాలు, సభలూ, సమావేశాలూ, తీర్థాలు, ప్రజలు గుమిగూడే ప్రాంతాలు, సంతలూ, సంతపాకలు, మండపాలు, అంగళ్ళూ, జనాలుండే తటాక నదీ ప్రాంతాలు, గ్రామచావడులూ మొ॥వి.

ఇతని కవిత్వం అంతా చదివితే అనిపించేది లోకాన్ని కూకలెయ్యడానికి పుట్టిన పెదతాతయ్య” అనిపిస్తుంది.

ఇతను తన గ్రంథానికి పాఠకులు ఎవరిని భావించాడు? మధ్యతరగతి వార అలాంటి వారూనూ.

అతని పుస్తకమును గురించి అతని అభిప్రాయం ఏమై ఉంటుంది? ఇదియే ద్రవిడ వేదంలాగో పామరుల పాలిట పుట్టిన పురాణంలాగో ఉంటుందని భావించి ఉండవచ్చు. అంత వరకూ తెలుగు వాఙ్మయంలో ఉన్న సారస్వత ప్రక్రియలకి ఇది యింకో పంథా. ఏమైనా తన అభిప్రాయాలను నిర్భయంగా ముక్తకంఠంతో సమాజానికి విస్పష్టంగా చెప్పగలిగాడు. అది తరువాత తరాల వారికి ఆదర్శమైంది.

ఈ గ్రంథమును అభిప్రాయాలు వ్రాయించి ప్రకటించుతున్న మోహన్ పబ్లికేషన్స్ వారి కృషి మిక్కిలి ప్రశంసనీయం.

ఇట్లు బుధజన విధేయుడు
**జయన్తి సుబ్రహ్మణ్య శాస్త్రి,** M.A. B.Ed.,

# ఒక మాట

**"వేమన"** అనగానే శ్రీ సి.పి బ్రౌన్ దొరగారు గుర్తుకొస్తారు. వారు లేకుంటే యీ మహాకవి పద్యాలు లేనేలేవు. వేమన యోగి ఏ శతాబ్దం వారో చెప్పడం సాధ్యం కాదు. చరిత్ర కారులు పలు విధాలుగా చెప్తుతారు.

ప్రముఖ గ్రంథ ముద్రణ కర్తలు, శ్రీ సరస్వతీ పవర్ ప్రెస్ అధినేతలు శ్రీ అద్దేపల్లివారి దివ్య ప్రోత్సాహంతో జానపద వాఙ్మయ బ్రహ్మ - శ్రీ నేదునూరి గంగాధరం గారూ, నేను తంజావూరి గ్రంథాలయం, మద్రాసు వ్రాత ప్రతుల గ్రంథాలయం మొదలైన ప్రదేశాలు పర్యటించి, **"వేమన"** పేరుతో నున్న 5010 పద్యాలు, తాళపత్రాలలో నుంచి సేకరించి తెచ్చి, వాటిని ఎత్తివ్రాసి, ఆకారాదిగా చేర్చి 1960లో ముద్రించగలిగాం.

ప్రస్తుతమా ప్రతులు లేనేలేవు. నా దగ్గర మాత్రం ఒక కాపీ ఉంది. మరల యిన్ని సం॥లకు శ్రీ మోహన్ పబ్లికేషన్స్ వారి ప్రోత్సాహంతో **"వేమన"** మహాకవి పద్యాల పరిశీలన ఏర్పడింది. అంతా దైవయోగం. యీ పద్యాలన్నీ అతనివి కావని తెలిసినా అతని పేరుమీదుగా చెలామణి ఔతున్నాయి కదా! యేది యేమైనా సంఘంలో గల దురాచారాలను దుయ్యబట్టిన వేమన అందరకూ చిరస్మరణీయుడు. కుల, మత, భాషా, ప్రాంత దేశ భేదాలు లేని మనీషి వేమనార్యుడు.

వేమనకు ఆటవెలది (వేశ్య) మీద చాలా మక్కువ. సామాన్యంగా కవికి ఆటవెలది చాలా తేలిక. అంతేకాదు, వేమన ఆటా-మాటా-పాటా ఆటవెలదే. యింత భావస్ఫూర్తిగా, ఆటవెలదిని చెప్పినవారు తెలుగునాట, నాడూ, నేడూ, యేనాడూ లేరనే చెప్పాలి. అన్ని మతాలనూ దుయ్యబట్ట గలిగిన వాడొక్క వేమనే. యీతని పద్యాలు పామరులు కూడా హాయిగా పాడుకుంటారు.

అపార పారావారమైన ఆంధ్రభాషకు, అలంకారముగా ఆదర్శముగా, అభ్యుదయంగా, అందరిచేతా నిత్యం ఆరాధింపబడుగల ఏకైక మహాగ్రంథం వేమన పద్యాలు. ప్రతిమాటకూ బాటకు, సామెతగా, ఆమెతలుగా యీ వేదవాక్కులు అందరి నాలుకపై నాట్యం చేస్తాయి. యెంతైనా వ్రాయవచ్చు కాని అందరకూ తెలిసిన విషయాలకు వేరే వ్రాయవలసినదేముంటుంది? నాకీ అవకాశం కలిగించిన శ్రీ మోహన్ పబ్లికేషన్స్ వారి, చదువరులైన మీకూ, నాకూ హనుమద్బ్రహ్మ ఆశీస్సులు నిరంతరం కలుగుగాక!

**వేమనార్యువాక్కు వేదమై మోదమై**
**చదువువారి మదుల పొదలుచుండి**
**యోగి వేమనార్య యోగమ్ము సమకూర్చి**
**మోద జలధులందు మునిగితేల్చు ॥**


కవిమత్తేభ - శతాధిక గ్రంథకర్త
**విద్యారణ్యస్వామి**
20-15-10, తుమ్మలావ,
రాజమండ్రి - 4. ఫోన్ : (0883) 2470224

# నివేదన

**ప॥ శివ కవులకు, నవ కవులకు,**
**శివ భక్తికి, తత్త్వమునకు, చింతామణికిన్**
**శివలోక ప్రమథులకును,**
**శివనకు గురువునకు శరణు సేయర వేమా!**

**తా॥** శివకవులనీ, నవకవులనీ, శివభక్తిఅనీ, తత్త్వాన్నీ చింతామణినీ, శివలోకంలో నివసించే ప్రమథ గణాలనీ, శివుణ్ణి, గురువునీ శరణం వేడుకో వేమా!

**ప॥ శ్రీ కరంబగు వేమన జెప్పినట్టి**
**పద్యముల నెవ్వడేనియు పఠన సేయు**
**నట్టి పురుషుడు మనమున నిట్టిదనుచు**
**జెప్పరానట్టి వస్తువు జేరు వేమ!**

**తా॥** వేమన చెప్పిన పద్యాలు చాలా శుభప్రదమైనవి. అటువంటి పద్యాలని ఎవరైనా పఠిస్తే అట్టివారు “ఇది” అని చెప్పలేని ఉత్తమపదాన్ని చేరుతారు.

# శ్రీ వేమన
## పద్య సారామృతము

**వేమననగ యోగి వెలసె లోకములోన**
**పూజలిడుడు పుణ్యపురుషులార ।**
**పూజలిడినయంత భుక్తిముక్తుల నిచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **1**

**తా॥** ఓ పుణ్యాత్ములారా! లోకంలో వేమన అనే యోగి వెలసినాడు. అతన్ని పూజించండి. అట్టివారిని పూజించుట వలన మనుజులకు భుక్తిముక్తులు కలుగుచున్నవి. ఓ విశ్వదాభిరామ వేమా! వినుము.

**పలుకుమన్న నేల పలుకక యున్నావు?**
**పలుకుమయ్య నాతొ ప్రబలముగను**
**పలుకుమయ్య నీదు పలుకు నేనెరిగెద**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **2**

**తా॥** పలకమంటే పలకవేమయ్యా! నాతో విశేషంగా పలుకు. నువ్వు పలికితే కదా నేను తెలుసుకునేది అంచేత పలకవయ్యా!

**ఆత్మశుద్ధిలేని ఆచారమది యేల?**
**భాండశుద్ధిలేని పాకమేల?**
**చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **3**

**తా॥** పాత్రలను శుభ్రం చేయకుండా వంట వండటం ఎలాంటిదో, ఆత్మశుద్ధి లేకుండా ఆచారం చేయటం కూడా అట్లాంటిదే. చిత్తశుద్ధి లేనప్పుడు శివపూజ చేసినా ఏమీ ఫలితం ఉండదు.

**నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు**
**తళుకుబెళుకు రాళ్ళు తట్టెడేల?**
**చదువ పద్యమరయ జాలదా యొకటైన?**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **4**

**తా॥** తళతళలాడే తట్టెడు గాజు రాళ్ళకంటే జాతిరాయి అయిన నీలంపొడి ఒక్కటి చాలు. రసానుభూతిని కలిగించలేని పద్యాలు ఎన్ని చెబితే మాత్రం ఏం ప్రయోజనం? రసవంతమైన పద్యం ఒక్కటి చెబితే చాలును కదా!

**నిన్ను జూచెనేని తన్ను దా మరచును**
**తన్ను జూచెనేని నిన్ను మరచు**
**నే విధమున జనుడు నెరుగు నిన్నును దన్ను**
**విశ్వదాభిరామ వినుర వేమ ? 5**

**తా॥** నిన్ను దైవాన్ని చూస్తుంటే తనను తానే మరచిపోతున్నారు. తన్ను చూసుకుంటుంటే నిన్ను చూడ్డం మరిచిపోవడం జరుగుతోంది. నిన్నూ తననీ ఏకం చేసి జనుడు ఎలా చూడగల్గుతాడూ అని.

**మరియు వాడెవండు మురియని వాడెవడు ?**
**పాటుజేసిచూడ బట్టబయలు**
**సొరది జలఘటమున సూర్యుని చందంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 6**

**తా॥** నీటి కడవయందు సూర్యబింబమువలె మురిసే వాడెవడో, మురియని వాడెవరు? పాటు చేసి చూస్తే స్పష్టమౌతుంది.

**గాజుకుప్పెలోన కడగుచు దీపంబు**
**యెట్టులుండు జ్ఞానమట్టులుండు**
**తెలిసినట్టి వారి దేహంబు లందుల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 7**

**తా॥** గాజుకుప్పెలో దీపం ఎలా ప్రకాశమానంగా ఉంటుందో అలాగే దివ్య పురుషుల శరీరమందు జ్ఞానం ఉంటుంది.

**కల్లగురుడు గట్టు నెల్ల కర్మంబుల**
**మధ్యగురుడు గట్టు మంత్ర చయము**
**ఉత్తముండు గట్టు యోగ సామ్రాజ్యంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 8**

**తా॥** కపట గురువు అన్ని కర్మలయలందు ఉంటుంటాడు. మధ్యగురుడు మంత్ర తంత్రాదులందు మాత్రమే ఉంటాడు. ఉత్తమ గురువు నిజమైన యోగ సామ్రాజ్యాన్ని ఏలగలుగుతాడు.

**పెట్టిపొయ్యలేని వట్టిదేబెలు భూమి**
**పెట్టనేమి వారు గిట్టనేమి**
**పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 9**

**తా॥** ఈ భూమి మీద ఎన్నో చెదపురుగులు పుట్టలో పుట్టి అందులోనే చనిపోతుంటాయి. అలాగే భూమ్మీద పెట్టలేని పొయ్యలేని మానవులు ఎందరో పుడుతూ చనిపోతుంటారు. చావు పుట్టుకలు పెరగడం మాత్రమే తప్ప వారివల్ల ఏ ప్రయోజనం సిద్ధించింది లేదు అని తాత్పర్యం.

**తాము గన్నవారు దముగన్న వారును**
**చచ్చుటెల్ల తమకు సాక్షికాదె**
**బ్రతుకుటెల్ల తమకు బ్రహ్మకల్పంబులా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 10**

**తా॥** తన కళ్ళయెదుట ఎందరో చనిపోతుంటారు. తాము కూడా అట్లే వారి యెదుట చనిపోతారు. అది సాక్ష్యం కాదా? అలాంటివారి బ్రతుకు బ్రహ్మకల్పమా? అదేం కాదు.

**ఎరుకమాలువాడు యేమేమి చదివిన**
**చదివినంత సేపు సద్గుణియగు**
**కదసి తామరందు కప్ప గూర్చుండదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 11**

**తా॥** ఏది చదివినా అది చక్కగా జ్ఞాపకముంచుకోవాలి. లేకపోతే చదువు చున్నంత సేపే సద్గుణి అగును. తామర మీద కప్ప కూర్చున్నంత సేపే దాని విశేషము.

**కూటికి నెడబాసి కూర్చిన మనుజుడు**
**వెలదుల గనుగొన్న వెతల జిక్కును**
**చెలగియగ్ని చూచు శలభంబు చాద్పున**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 12**

**తా॥** కడుపునిండా తినడానికి లేనివాడు కూడా స్త్రీలను చూసి బాధల పాలగుచున్నాడు. అగ్గిని చూచి అందులో పడిన కీటకము వలె.

**కనువు బసికి జేసె గాలి ఫణికి జేసె**
**మన్నెరలకు జేసె మరువ కెట్లు ?**
**కుంభిని జనులకును కూడట్లు చేసెరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 13**

**తా॥** పశువుకి గడ్డి, పాముకి గాలి, ఎరలకు మన్నునీ ఆహారంగా కూర్చినట్లే మనుష్యులకు అన్నం ఏర్పరచబడింది.

**ఎవరి గుణములను యేమన్న మానవు**
**చక్క జేయరాదు కుక్కతోక**
**గడుసురాలు మగని గంప బెట్టమ్మురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 14**

**తా॥** ఎవరి గుణాల్ని గురించి ఎంత చెప్పినా వారా గుణాల్ని మానుకోరు. కుక్క తోకకి గల సహజమైన వంకరను సరిచేయడం అసంభవం. ఒక్కొక్క స్త్రీ అతి గడుసు తనతో మొగుణ్ణి గంపలో పెట్టి అమ్మేస్తుంది.

**వేరుపురుగు చేరి వృక్షంబు జెరుచును**
**చీడపురుగుచేరి చెట్టు జెరచు**
**కుత్సితుండుచేరి గుణవంతు జెరుచురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 15**

**తా॥** వేరుకి పట్టిన పురుగు వృక్షాన్ని పాడు చేస్తుంది. చీడ పురుగు చెట్టుని పట్టి పాడుచేసినట్లె దుర్మార్గుడు గుణవంతుణ్ణి చేరి అతన్ని పాడు చేస్తుంటాడు.

**ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు**
**చూడ జూడ రుచుల జాడవేరు**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 16**

**తా॥** ఉప్పు కర్పూరమూ ఒకే రంగులో కనబడుతుంటాయి. కాని వాటి రుచులు వేరు వేరుగా ఉంటాయి. అలాగే పురుషులలో పుణ్య పురుషులు వేరుగా ఉంటారు.

**జీవిపోకముందె జీవవస్తువు లిచ్చి**
**జీవి నిలుప వలయు జీవనముగ**
**జీవి తొలగు వెనక జీవవస్తువులేల**
**విశ్వదాభిరామ వినుర వేమ! 17**

**తా॥** ప్రాణం పోకముందే అతనికి మందిచ్చి జీవింపచేయాలి. ప్రాణం పోయిన తరువాత సంజీవిని వేస్తే మాత్రం ఏం లాభం?

**కల్ల నిజము రెండు కరకంఠు డెరుగును**
**నీరు పల్లమెరుగు నిజముగాను**
**తనయుని జననంబు తల్లి దా నెరుగును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 18**

**తా॥** నీరు పల్లమెరుగును. నిజము ఈశ్వరుడెరుగును. కుమారుని జననం తల్లికి మాత్రమే తెలియును.

**అంగమెల్ల వదలి అటు దంతములు నూడి**
**తనువు ముదిమిచేత తరచు పడక**
**ముప్పు తిప్పలబడి మోహంబు విడువడు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 19**

**తా॥** శరీరమంతా ఒడలిపోయి పళ్ళు ఊడిపోయి ముసలితనముతో ముప్పు తిప్పలవుతున్నా మోహాన్ని విడిచిపెట్టలేడు మానవుడు.

**ఆడువారిగన్న నర్థంబు పొడగన్న**
**సారమైన రుచుల చవులు గన్న**
**నయ్యగార్లకైన నాశలు బుట్టవా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 20**

**తా॥** స్త్రీలను చూసినా, ధనాన్ని చూసినా మధుర పదార్థాలు చూసినా అయ్యవార్లకి కూడా ఆశలు పుడుతూనే ఉంటాయి.

**అనువుగాని చోట నధికుల మనరాదు**
**కొంచె ముండుటెల్ల కొదువగాదు**
**కొండ యద్దమందు కొంచెమైయుండదా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 21**

**తా॥** అవకాశము లేని చోట గొప్పవారమనుకోరాదు. కొండ అద్దములో కొంచెంగా ఉన్నంత మాత్రాన వాస్తవంగా కొండ చిన్నది అవుతుందా?

**తనమది కపటము గలిగిన**
**తనవలెనే కపటముండు తగ జీవులకున్**
**తనమది కపటము విడచిన**
**తనకెవ్వరు కపటి లేడు ధరలో వేమా ! 22**

**తా॥** తన మనసులో కపటమున్నవానికి యితరులందరూ కపటులుగా భావిస్తాడు. తన మనస్సులో కపటం విడిచిపెడితే ఈ లోకంలో తనకెవ్వరూ కపటులే కానబడరు.

**చంపదగిన యట్టి శత్రువు తనచేత**
**జిక్కెనేని కీడు సేయరాదు**
**పొసగ మేలుచేసి పొమ్మనుటే చావు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 23**

**తా॥** చంపదగినంత శత్రువు కనక తనచేతికి దొరికినా శత్రువుకి ఏ విధమైన కీడు చేయకుండా విడిచిపెట్టాలి. అది ఆ శత్రువుకి చావుకంటే కూడా గొప్పయైన శిక్ష అవుతుంది.

**తామసించి సేయ తగదెట్టి కార్యంబు**
**వేగిరింప నదియు విషమమగును**
**పచ్చికాయదెచ్చి పడవేయ ఫలమౌనె ?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 24**

**తా॥** తామసబుద్ధితో ఏ పనీ చేయకూడదు. అలా తొందరపడి చేసినపని విషమే అవుతుంది. పచ్చి కాయను ముగ్గవేస్తే పండవుతుందా?

**నీళ్ళలోన పడవలు నిగిడి తిన్నగ బ్రాకు**
**బైట మూరెడైన బ్రాకలేదు**
**నెలవు తప్పుచోట నేర్పరి కొరగాడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 25**

**తా॥** నీటిలో పడవ బాగా ప్రయాణించగలదు. కాని అది గట్టుమీద మూరెడు కూడా ముందుకు సాగలేదు. తన తగని దగ్గర గొప్పవాడు కూడా పనికి రానివాడవుతాడు.

**నీటిలోన మొసలి నిగిడి యేనుగుబట్టు**
**బైట కుక్కచేత భంగపడును**
**స్థాన బలిమిగాని తనబల్మి కాదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 26**

**తా॥** నీటిలో ఉన్న మొసలి యేనుగును కూడా లోపలికి యీడ్చుకు పోగలుగుతుంది. అదే మొసలి నేల మీద ఉంటే కుక్కకి కూడా భయపడిపోతుంది. ఆలోచించి చూడగా అదంతా స్థానబలం అని తెలుస్తుంది.

**కులములో నొకండు గుణవంతు డుండిన**
**కులము వెలయు వానిగుణముచేత;**
**వెలయ వనములోన మలయజంబునట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 27**

**తా॥** వంశంలో గుణవంతుడెవడైనా ఉన్నాడా! ఆ వంశము అంతా కీర్తి కెక్కుతుంది. అదెలాగంటే వనంలో ఒక గంధవృక్షం ఉంటే ఆ వనం అంతా గంధపూరితమై కీర్తికెక్కుతుంది.

**పంది పిల్లలీను పదియు నైదింటిని**
**కుంజరంబు యీను కొదమ నొకటి**
**యుత్తమ పురుషుండు యొక్కడు జాలడా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 28**

**తా॥** పంది పదిహేను పిల్లన్ని కంటుంది. కాని యేనుగు ఒక్కపిల్లనే కంటుంది. అది చాలదా. ఎంతో మంది పనికిమాలిన వారిని కనడం కంటే మంచివాణ్ణి ఒక్కణ్ణి కంటే చాలు.

**ఎరుగువాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప**
**యేటివంక దీర్ప నెవ్వరితరమయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 29**

**తా॥** బుద్ధిమంతునికి బోధించడం చాలా సుళువు. ఏటికి ఒంకర తీర్చడం లాగే మందబుద్ధికి తెలపడం మహాకష్టం.

**అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బలుకు చల్లగాను**
**కంచుమ్రోగునట్లు కనకంబు మోగునా ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 30**

**తా॥** అల్పుడు మితిమీరిన ఆడంబరంతో మాట్లాడుతాడు. సత్పురుషుడు చల్లగా మాట్లాడుతాడు. ఎలాగంటే కంచు మ్రోగునట్లు బంగారం మ్రోగదు కదా.

**ఓగు నోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని**
**భావమిచ్చి మెచ్చు పరమ లుబ్ధు**
**పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 31**

**తా॥** మూఢుడు మూఢునే మెచ్చుకుంటాడు. అజ్ఞానిని పరమ లుబ్ధుడు కొనియాడుతాడు. పంది బురదని యిష్టపడుతుంది కానీ, పన్నీటిని మెచ్చునా?

**గంగ పారుచుండు కదలని గతితోడ**
**మురికికాల్వ పారు మ్రోత తోడ**
**దాత యోర్చిన ట్లధము డోర్వగ లేడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 32**

**తా॥** గంగ ప్రశాంతంగా ప్రవహించుతుంది. కుళ్ళు కాలువ గోల గోల చేస్తూ పరుగెడుతుంది. దాతకు గల ఓరిమి గుణం అధముడికి యెలా ఉంటుంది? అధముడు అధముడే, దాత దాతే.

**కానివాని చేత కాసు వీసము లిచ్చి**
**వెంట దిరుగుటెల్ల వెఱ్ఱితనము**
**పిల్లిబట్టకోడి పిలిచిన పలుకునా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 33**

**తా॥** దరిద్రుడికి ఉన్న కాస్తా అప్పు యిచ్చి దాన్ని రాబట్టుకోవడానికి వాణ్ణి వెదిబడించడం వెఱ్ఱితనం కాదా? పిల్లిని పట్టుకోవడానికి "బోబో" అని, కోడిని పిలిస్తే ఎలా ఉంటుంది? వ్యర్థ ప్రయాస.

**పిసినివాని యింట పీనుగు వెడలిన**
**కట్ట కోలలకును కాసులిచ్చి**
**వెచ్చమాయ నటంచు వెక్కి వెక్కేడ్చురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 34**

**తా॥** లోభి యింటివారు చనిపోతే దహన సంస్కారానికి కాసులిచ్చి ఖర్చయినందుకు వలవలా యేడుస్తాడు.

**కష్టలోభివాని కలిమికి నాశించి**
**బడుగువాడు దిరిగి పరిణమించు**
**తగరువెంట నక్క తగిలిన చందంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 35**

**తా॥** లోభివాడని తెలియక పేదవాడాతని వెంట తిరుగును. కానీ లాభం లేదు. గొర్రెని వెంబడించిన నక్క గతి యెట్లుండునో బడుగువాని పని కూడా అంతే!

**లోభివాని జంప లోకంబులోపల**
**మందు పలదు వేరు మతము గలదు**
**పైక మడిగినంత చాల భగ్గున పడిచచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 36**

**తా॥** లోభిని చంపడానికి లోకంలో మందేదీ వేరే అక్కర్లేదు. డబ్బడిగితే చాలు లోభి మండి పడి చస్తాడు.

**మాటలెల్ల కల్ల మనసెల్ల దొంగయౌ**
**నేటి ప్రాణమింక? నేటి బ్రతుకు?**
**మాట సత్యమైన మరి శతాయుస్యంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 37**

**తా॥** మాటలాడితే అన్నీ అబద్ధాలే. మనసయితే దొంగ బుద్ధే. అటువంటివాడు ఒక్క సత్యమైన పలుకు పలికితే అదే నూరేళ్ళు నిలుస్తుంది.

**కలిమినాడు నరుడు కానడు మదమున**
**లేమినాడు మొదలె లేదు పెట్ట**
**కలిమి లేమి లేని కాలంబు గలుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 38**

**తా॥** సంపద కలిగిన రోజుల్లో మదంతో సంచరిస్తాడు. ఆ రోజుల్లో ఎవరికైనా కాస్తంత పెట్టడం అనేదే ఉండదు. లేమిలోన యేమీ చేయలేడు యిక కలిమి లేములు లేని కాలం అంటూ ఉంటుందా?

**కనియు గానలేడు కదిలింపదానోరు**
**వినియు వినగలేడు విస్మయమున**
**సంపద గలవాని సన్నిపాతక మిది**
**విశ్వదాభిరామ వినుర వేమ! 39**

**తా॥** సమాజంలో భాగ్యవంతుని దశను వేమన చమత్కారంగా యిలా చెప్తున్నాడు.

భాగ్యవంతుడు ఏదైనా సన్నివేశాన్ని చూసి కూడా నోరు మెదపకుండా చూడనట్లే ఉంటాడు. యేదైనా విన్నా కూడా విననట్లే ఉంటాడు. ఇది భాగ్యవంతుని కుండే సన్నిపాత రోగం.

**తీర్ప నార్పలేని తీర్పరితన మేల?**
**కూర్ప విప్పలేని నేర్పరేల?**
**పెట్టి పొయ్యలేని వట్టి బీరములేల?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **40**

**తా॥** ఒక సమస్యను తీర్చడానికి ఆర్చడానికి గాని సమర్ధుడై ఉండాలి. తీర్పరంటే అట్టివాడు. ఒక చిక్కు వచ్చినప్పుడు దాన్ని విప్పడానికి కౌశల్యం ఉన్నవాడే నేర్పరి. పెట్టలేక పొయ్యలేక చెప్పే అసమర్ధుని మాటలే కోతలు.

**తాను గుడువ లేక తగవేది యాప్తుల**
**జేర నివ్వడట్టి చెనటి; గోవు**
**చేనిలోక బొమ్మజేసి కట్టిన యట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **41**

**తా॥** ఒక్కొక్కడు ఎంత కలిమి ఉన్నా తాను అనుభవంచడు. ఎవరికి పెట్టడు. ఇది ఎలా ఉందంటే ఆవు బొమ్మను చేసి చేలో కట్టినట్లుంది.

**పూర్వ జన్మమందు పుణ్యంబు సేయని**
**పాపి ధనము కాశపడుట యెల్ల**
**విత్తు మరచి గోయ వెదకిన చందంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **42**

**తా॥** గతం జన్మలో పుణ్యం చేయని పాపాత్ముడు ధనానికి ఆశపడటం ఎలా ఉందంటే విత్తుడం మరసిపోయి చేనుకోయడానికి వెళ్ళటం లాంటిది.

**చమురు గలుగు దివ్వె నరవితో మండును**
**చమురు లేని దివ్వె సమసిపోవు**
**తనువు తీరునేని తలపు తోడనె తీరు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **43**

**తా॥** దీపంలో చమురు ఉన్నంత వరకూ మంచి కాంతితో మెరుస్తూ ఉంటుంది. చమురు అయిపోయిన తరువాత ఆ దీపం ఆరిపోతుంది. మృతి చెందిన శవానికి యింక తలంపులేముంటాయి?

**భూపతి కృప నమ్మి భూమి జెరుచువాడు**
**ప్రజల యుసురు దాకి పడును పిదప**
**యెగరవేయు బంతి యెందాక నిల్చురా**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **44**

**తా॥** ప్రభువు దయను నమ్మి భూమిని పాడుచేసేవాడు ప్రజల ఉసురు తగిలి పతనమైపోతాడు. ఎగరేసిన బంతి పైన ఎంతసేపుండును? వెంటనే అది క్రిందికి పడిపోతుంది.

**పాప మనగ వేరె పరదేశమున లేదు**
**తనదు కర్మములను దగిలియుండు**
**కర్మతంత్రి గాక గనుకని యుంటొప్పు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 45**

**తా॥** పాపం అన్నది ఎక్కడో లేదు. అది తను చేసుకున్న కర్మననుసరించియే ఉంటుంది. కుత్సిత కర్మలు చేస్తూ సంబరపడడం కాక మంచి చెడుగులను చూసి మసలడం మంచిపని.

**నక్క వినయములను నైగారములు బల్కి**
**కుడవకెల్ల ధనము కూడబెట్టు**
**కుక్కబోను వాత కూడు చల్లిన రీతి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 46**

**తా॥** నక్క వినయాలను నటిస్తూ ఇచ్చకాలు పలుకుతూ డబ్బుని అనుభవించక అదేపనిగా కూడబెడుతుంటాడు. అది ఎలాంటిదంటే కుక్కబోను ముందు కూటిని జల్లడం లాంటిది.

**వెళ్ళివచ్చునాడు మళ్ళిపొయ్యేనాడు**
**వెంటరాదు ధనము కొంచ బోడు**
**తాను యేడబోవు? ధనమేడబోవునో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 47**

**తా॥** ఎవడూ ధనాన్ని తెచ్చుకుని లోకంలోకి రావడం లేదు. అలాగే వెళ్ళిపోయేటప్పుడు పట్టుకొని పోలేదు. మరణించిన తరువాత ధనం దారి ధనముది. తన దారి తనది.

**పుట్టుబిత్తలివలె పోవు బిత్తలివలె**
**తిరుగు బిత్తలివలె దేహి ధరణి**
**యున్నవాటికైన నుపకారి గాలేదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 48**

**తా॥** జనుడు దిగంబరంగా పుడుతున్నాడు. అట్లే మరణిస్తున్నాడు. వ్యామోహాదు లన్నింటినీ విడిచి వాడు ఓ మునిగా దిగంబరుడై భూమ్మీద సంచరిస్తున్నాడు.

**కాశి బోదు ననుచు కడ కట్టగానేల?**
**వాశి తీర్థములను వగవనేల?**
**దోసకారికెట్లు దొరకురా యా కాశి?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 49**

తా॥ కాశీకి వెడుతున్నానంటూ వట్టి డంబాలు కొడతారు కొందరు. చివరకా పుణ్య తీర్థాలను దర్శించలేక విచారిస్తూంటారు. దుష్ట బుద్ధులకు కాశీ సులభంగా లభించదు. పుణ్య ఉంటేనే కాశీ వెళ్ళగలరు.

**ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు**
**కాచి యతక నేర్చు కమ్మరీడు**
**మనసు విరిగెనేని మరి యంట నేర్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 50**

**తా॥** ఇనుపముక్క విరిగితే దాన్ని తీవ్రంగా కాల్చి రెండుసార్లయినా మూడు సార్లయినా అతకవచ్చు. మనస్సు విరిగితే మాత్రం అతకడం చాలా కష్టం.

**వరనారీ దూరగుడై,**
**పరధనముల కానపడక పరహితచారై,**
**పరులలిగిన తానలుగక**
**పరులెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా ! 51**

**తా॥** పర స్త్రీలకు దూరంగా ఉండి, యితరుల సొమ్ముకు ఆశపడక పరుల మంచిని కోరుతూ, పరులను కోపింపక పరులు ఒకవేళ తనపై అలిగినా తాను కోపం తెచ్చుకోక పరులచేత సెభాష్ అనిపించుకున్నవాడే బుద్ధిమంతుడు.

**అజ్ఞానము శూద్రత్వము,**
**సుజ్ఞానము బ్రహ్మమౌట శ్రుతులను వినరా**
**యజ్ఞాన ముడిగి వాల్మికి**
**సుజ్ఞానపు బ్రహ్మమొందె జూడర వేమా! 52**

**తా॥** జ్ఞానం లేనివాడే శూద్రుడనబడును. సుజ్ఞానం అనగా బ్రహ్మం. అది శ్రుతుల వినికిడి వల్ల లభ్యం అవుతుంది. కాబట్టి ఓ నరుడా! శ్రుతులను వింటూ వుంటాడు. అజ్ఞానం విడిచి వాల్మీకి మహర్షి సుజ్ఞానవంతుడై బ్రహ్మమును పొందినాడు కదా.

**నీళ్ళలోని చేప నెరి మాంస మాశకు**
**గాల మందు జిక్కి గూలినట్లు**
**యాశ బుట్టి మనుజు డారీతి జెడిపోవు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 53**

**తా॥** నీటిలో హాయిగా జీవిస్తున్న చేప మాంసమందున్న మక్కువ చేత ఎరను పట్టబోయి గాలానికి చిక్కుకుని చస్తుంది. అలాగే మనుజుడు దురాశతో చెడిపోతున్నాడు.

**బొంది యెవరి సొమ్ము పోషింప పలుమారు**
**ప్రాణ మెవరి సొమ్ము భక్తిసేయ**
**ధనము యెవరి సొమ్ము ధర్మమే తనసొమ్ము**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 54**

**తా॥** శరీరానికి ఎంత చేసినా చాలదు. ఇంతకీ ఆ శరీరం ఎవరిది? భక్తితో కాలక్షేపం చేసే ప్రాణం ఎవరి సొమ్ము? ఇటువంటప్పుడు ధనం దేని సొమ్ము? ఆలోచించగా ధనం కంటే ధర్మమే ప్రధానం.

**నమశివ యనవచ్చు నారాయణనవచ్చు**
**మేలు వారి నమ్మి మెచ్చవచ్చు**
**కొంగు కాసు విడిచి గొబ్బున నీలేదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 55**

**తా॥** నమశ్శివాయ అని పంచాక్షరిని జపించవచ్చు. నారాయణ మంత్రాన్ని ఉచ్ఛరించవచ్చు. పుణ్య చరిత్రుల జీవితాలను గురించి తెలుసుకొని, విశ్వసించి వారిని ఎంతగానో శ్లాఘించవచ్చు. ఇటువంటివి ఎన్ని చేసినా అవసర సమయాన చేతిలోంచి పైసా వెంటనే తీసి యివ్వడానికి మనస్కరించదు.

**మేడిపండు జూడ మేలిమై యుండును**
**పొట్టవిప్పి చూడ పురుగులుండు**
**బెరుకు వాని మదిని బింకె మీలాగురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 56**

**తా॥** చూడ్డానికి మేడిపండు ఎంతో బావుంటుంది. కాని దాన్ని విప్పి చూస్తే అన్నీ పురుగులే ఉంటాయి. ఒక్కొక్కప్పుడు ఎన్నో వీరాలాపాలు చేస్తాడు. కాని లోపల మాత్రం అంతా పిరికితనమే. అతడు కనబరిచే బింకం అంతా మేకపోతు గాంభీర్యమే.

**ఉసురులేని తిత్తి యినుమంత వూదిన**
**వంచ లోహములును భస్మమౌను**
**పెద్ద లుసురు మంటె పెనుమంట లెగయవా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 57**

**తా॥** ఇనుప కొలిమిని ఊదే తిత్తికి ఉసురులేదు. అది కొద్దిపాటి ఊదినా పంచలోహాలూ బూడిదైపోతాయి. పెద్దవారిని ఉసురు పెడితే కానరాని మంటలు తిత్తి ఊదగా కొలిమి నుండి బయలు వెడలిన పెనమంటలకంటె ఎన్నో రెట్లు మహాజ్వాలలు రేగును.

**మందు దిన బోటు మానును**
**మందు దినగజేయ పొలతి మహిలో వలచున్**
**మందు దిన కుదురు రోగము**
**మందు దినంగలదు పుష్టి మహిలో వేమ ! 58**

**తా॥** మందు వాడితే బాధ తగ్గును. వలపు పెరగడానికి కాంతకు మందురాస్తే ప్రేమిస్తుంది. ఇంకా ఔషధ సేవ వల్ల జబ్బు నయం అవుతుంది. మందు పుచ్చుకుంటే ఒంటికి కావలసిన పుష్టి చేకూరుతుంది.

**తలను పాగ పైని తగు పచ్చడము బొజ్జ**
**చెవుల పోగు లరసి జేరునర్థి;**
**శుద్ధ పశువు లౌట బుద్ధిలో నెరుగక**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 59**

తా॥ వేషభాషలు చూచి యాచకుడు వెంటపడతాడు. వాడు పశువు అని ఆలస్యంగా తెలుసుకుంటాడు పాపము.

**స్త్రీల సుఖము జూచి చిత్తంబు నిలుకడ**
**సేయని మనుజుండు చెడు నిజంబు;**
**యేటి గట్టు మానుకెప్పుడు చలనంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 60**

తా॥ మనసు నిలుపలేనివాడు పతనమౌతాడు. స్త్రీ సుఖం కోసం ప్రాకులాడే మనిషి ఏటిగట్టుదారి నున్నచెట్టులా చలనం పొందుతాడు.

**కూలి నాలి జేసి గుల్లాపు పనిజేసి,**
**తెచ్చిపెట్ట యాలు మెచ్చ నేర్చు;**
**లేమి జిక్క విభుని వేమారు దిట్టును**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 61**

తా॥ కూలినాలి చేసి ఏదో విధంగా నాలుగు డబ్బులు సంపాదిస్తుంటే భార్య ఎంతగానో మెచ్చుకుంటుంది. పేద తనంతో బాధపడే సమయంలో ఆ భార్యే భర్తని సూటిపోటి మాటలతో వెయ్యి విధాలుగా దూషిస్తుంది.

**ఇంద్రియ పరవశు దధముం**
**డింద్రియ పరవశుడు భక్తియెడ మధ్యముడౌ;**
**నింద్రియ జయు దుత్తముడు జి**
**తేంద్రియ సమ్మదుడు విన మహేశుడు వేమా ! 62**

తా॥ కేవల ఇంద్రియ సుఖాలనే కోరినవాడు అధముడు భక్తిభావనవల్ల ఇంద్రియ పరవశుడయితే అట్టి మధ్యముడు ఇంద్రియ సుఖాలనుండి విరక్తి పొందినవాడు ఉత్తముడు జితేంద్రియుడు సర్వదా శ్లాఘనీయుడవుచు, అట్టివాడు యోగులలో పరమయోగి అగువాడు మహేశ్వరుడు.

**తన గుణము తనకు నుండగ**
**నెనయంగా నొరుని గుణము నెరిచును మదిలో**
**తన గుణము తాను దెలియక;**
**బరు నిందంజేయువాడు భ్రష్టుడు వేమా! 63**

తా॥ తనలో తప్పు తెలుసుకోలేక విశేషంగా ఇతరుల తప్పు ఎన్ను తుంటాడు. తనలో గలలోపాలు గ్రహించుకోకుండా పరులను నిందించువాడుభ్రష్టుడు.

**వెఱ్ఱివానికైన వేషధారికి నైన;**
**రోగికైన పరమయోగి కైన,**
**స్త్రీల జూచినపుడు చిత్తంబు రంజిల్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 64**

**తా॥** పిచ్చివాడికైనా, వేషధారికైనా, రోగైనాసరే మహా యోగైనాసరే స్త్రీలనిచూస్తే మనస్సు సంతోషపడుతుంది.

**తా వసించు చోట తగ నల్జడాయేనా**
**సౌఖ్య భూమి కపుడు జరుగ వలయు;**
**కొలకు లింకెనేని కొంగ లందుండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 65**

**తా॥** తానున్నచోట యేదేనా దుర్ఘటన సంభవిస్తే అక్కణ్ణుంచి మంచి స్థలానికి వెళ్ళడం మంచిది. చెరువులింకిపోతే కొంగలు మరియొక చెరువుకు చేరుకుంటాయిగదా!

**భూమిలోన పుణ్యపురుషులే లేకున్న**
**జగము లేల నిల్చు పొగులుగాక**
**అంత బయలుగాదె యాడకాడకు జూడ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 66**

**తా॥** లోకంలో పుణ్యాత్ములు కొందరుంటారు. అటువంటి పుణ్యపురుషులు ఉండడంవల్లనే ఈ లోకం ఇలా నడుస్తోంది. కాని అటువంటి పుణ్యపురుషులు ఏ కొద్దిమందో ఉందురు.

**చిత్తశుద్ధి గల్గి చేసిన పుణ్యంబు,**
**కొంచెమైన నదియు కొదువ గారు;**
**విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 67**

**తా॥** మంచి మనసుతో చేసినది కొంచమైనా ఫలిస్తుంది, చాలా చిన్న మఱ్ఱివిత్తనము మహావృక్ష మగును కదా!

**చెడ్డవాని మిగుల జెరుచును దైవంబు;**
**అడ్డపడడు వాని కాపదై న**
**చెడిన చేను జూచి యొడయడు మెచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 68**

**తా॥** దైవము దుర్మార్గుడైన మనుజుని యింకా చెడిపోయేలా చేయును. ఎటువంటి కష్టాలు వచ్చినా అట్టి వానికి దైవం తోడ్పడదు. పాడయిపోయిన చేనుని జూచి రాజు మెచ్చుకోడుకదా !

**ఎక్కుడైన యాశ లినుమడి యుండగా**
**తిక్కబట్టి నరుడు తిరుగు చుండు;**
**కుక్కవంటి యాశ కూర్చుండ నివ్వదు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **69**

**తా॥** ఎన్నో ఆశలు పెట్టుకొన్న కొలదీ మనుష్యుడు తిక్కెత్తిపోయి తిరుగుతుంటాడు. ఆశ కుక్కలాంటిది. అది మనుజుని నిలకడగా ఒకచోట ఉండనియ్యదు.

**అరయ తరచు కల్లలాడెడు వారిండ్ల**
**వెడల కేల లక్ష్మి విశ్రమించు?**
**ఓటి కుండ నీరు పోసిన చందాన**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **70**

**తా॥** ఎప్పుడూ అబద్ధాలాడేవారి యిళ్ళల్లో లక్ష్మీదేవి నిలకడగా ఉండదు. ఓటికుండలో నీరెంతపోసినా ఆ నీరు కారిపోతుంది. కాని నిలువదు.

**గుణవతి గల గృహము గోమునొందించును**
**చీకటింట దివ్వె చెలగురీతి;**
**దేవియున్న యిల్లుదేవార్చన గృహంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **71**

**తా॥** ఉత్తమురాలయిన యువతియున్న యిల్లు సిరిసంపదలతో కళకళలాడును. చీకటింట్లో దీపంలా ప్రకాశిస్తూంటుంది. లక్ష్మీదేవి ఉన్న యిల్లు దేవాలయంలా కళకళలాడుతుంటుంది.

**ఇంటియాలు విడిచి యిల జారకాంతల**
**వెంట దిరుగువాడు వెర్రివాడు**
**పంటచేను విడిచి పరిగె యేరిన యట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **72**

**తా॥** ఇంట్లోవున్న యిల్లాలిని కాదని చెడిపోయిన వ్యభిచారుల వెంటబడి వారిని పొందేవాడు నిజంగా తెలివి లేనివాడు. ఇలాంటి పని యెలాంటిదంటే పంటతోఉన్న పొలాన్ని విడిచిపెట్టి పరిగ యేరిన విధంగా ఉందంటాడు వేమన.

**రాజవరుల కెపుడు రణరంగముల చింత;**
**పరమ మునులకెల్ల పరము చింత;**
**యల్పనడులకెల్ల నతివలపై చింత**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **73**

**తా॥** రాజులకు ఎల్లప్పుడూ యుద్ధాల గురించీ మహాయోగులు మోక్షాన్ని గురించి ఆలోచిస్తారు. తక్కువరకం మనుష్యులు ఎల్లప్పుడూ స్త్రీలను గురించే చింతిస్తూంటారు.

**తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమి? వాడు గిట్టనేమి?**
**పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 74**

**తా॥** తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారిని ప్రేమించి వారిసేవ చెయ్యాలి. అలా చెయ్యని కొడుకు పుట్టినా ఒక్కటే చచ్చినా ఒక్కటే. పుట్టలో పుట్టి పెరిగే చెదలు ఎంతో దుర్మార్గుడైన పుత్రుడు కూడా అంతే.

**ముందరి పోటులు మాన్పను**
**మందున్నదియెందునైన మహిలోపలనే;**
**నిందల మాటలు మాన్పెడు**
**మందెందునులేదు చూడ మహిలో వేమ ! 75**

**తా॥** శరీరమున వచ్చే ఏలాంటి బాధనైనా మాన్పడానికి ఈ లోకంలో ఎన్నోరకాల మందులు ఉన్నాయి. ఈ భూమిమీద ఎంతవెదకినా ఎక్కడ వెదికినా నిందల రోగాన్ని మాన్పేమందు మాత్రం కానరాదు.

**తత్వ మెరుగువాడు దైవంబు నెరుగును;**
**సర్వసారములను జంపజేయు;**
**కదళి మ్రింగువాడు గరళంబు మ్రింగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 76**

**తా॥** తత్త్వాన్ని తెలుసుకునేవాడు దైవాన్ని గురించి యెరిగిన వాడౌతాడు. అన్ని సారాలనీ చంపే అరిటిపండును మింగేవాడు గరళాన్ని మింగచూడడు.

**నీళ్ళమీద బుగ్గ నిలచిన యప్పుడు**
**తళ్లు వేగవచ్చి తాకు గాక;**
**విడెడు కుండ కింత విభ్రాంతి పడుదురు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 77**

**తా॥** నీటి బుడగలు నీటిలోనే పుడుతూంటాయి. దానికే తడులు తాళుతూంటాయి. ఆ బుడగలు అక్కడే నశించి పోతూంటాయి. ఇందులో వింతేమీ లేదు. కుండలున్నాయంటే అవి బ్రద్దలయ్యే స్వభావం గలవి, బ్రద్దలయిపోయిన కుండను చూసి ఒక్కసారి విస్తుపోతూంటారు.

**హేమకార విద్య నెరిగిన వారెల్ల**
**వెతల బడని యట్లు విద్యచేత**
**తత్త్వ మెరుగు వెనుక తనకు చింతేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 78**

**తా॥** బంగారం చేసే విద్యను కనుక తెలుసుకుంటే అలాంటివారికి ఎలాంటి కష్టాలూ ఉండవు. అలాగే చదువుకుని తత్త్వాన్ని తెలుసుకుంటే అలాంటి వారికి చింతలేముంటాయి?

**జీవభావ మెరుగ జెడదెన్నటికి మతి;**
**దైవమును నెరుంగ దనరు బుద్ధి;**
**తేజముదయమంద దిమిరంబు నిలువదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 79**

**తా॥** ప్రాణభావాన్ని తెలుసుకున్నందువల్ల మనస్సు ఎప్పటికీ చెడిపోదు, ఇంకా విశేషం ఏమంటే బుద్ధి దైవాన్ని గురించి తెలుసుకో గలుగుతుంది. కాంతి కనబడితే అక్కడ చీకటి ఉండదు.

**ఆశచేత మనుజు లాయువు గలవాళ్ళు**
**దిరుగుచుంద్రు భ్రమ ద్రిప్పలేక;**
**మురికి భాండమందు ముసరు నీగల భంగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 80**

**తా॥** చెత్తాచెదారం పారేసే కుండీల చుట్టూ ఈగలుగుంపు ముసురుతూన్న విధంగా మనుష్యులు తమలో పెచ్చుపెరుగుపోతున్న కోరికల్ని తీర్చుకోడానికి వాటిని అణచుకోలేక ఆ ఆశలచుట్టూ తిరుగుతుంటారు.

**పరసమినుము సోకి బంగారమైనట్లు;**
**కప్పురంబు జ్యోత గలసినట్లు;**
**పుష్పమందు తావి పొసగునట్లగు ముక్తి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 81**

**తా॥** పాదరసం యినుముని కలిసి బంగారం అయిన విధంగానూ, కర్పూరం జ్యోతిని కలిసినట్లుగానూ, పువ్వు నందు సువాసన అమరిన విధంగా జీవునియందు ముక్తి పరిణామం చెందుతుంది.

**కుండ పగిలెనేని క్రొత్తది గొనవచ్చు;**
**భూతలంబు నందు పొందుగాను**
**కూలబడిన నరుడు కుదురుట యరుదయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 82**

**తా॥** కుండ పగిలితే కొత్తకుండని కొనుక్కోవచ్చు. కాని ఈ లోకంలో మనుష్యుడు వ్యాధి మొదలైన వాటివల్ల కూలబడితే అలాంటివాడు కోలుకోవడం చాలా కష్టం.

**జపము బాహ్యపూజ జాలజేసియు పిదప**
**కపటము విడలేక కష్టనరులు**

**ముక్తి నొందలేక మునిగిరి తమమున**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 83**

**తా॥** కొందరు మనుష్యులు విగ్రహాలు పెట్టి ఆడంబరంగా పూజలు చేస్తుంటారు. దానివలన యితరులను పుణ్యాత్ములను చేయడమే కాని తాముమాత్రం కపటంలోనే మునిగి తేలుతూ ముక్తి పొందలేక అజ్ఞానులౌతారు.

**ఊర్ధ్వలోకమందు నుచిత క్రమంబున**
**రూపమేమి లేక రూఢి తోడ;**
**బరమయోగి చూచు పరమాత్ముడితడని**
**విశ్వదాభిరామ వినుర వేమ! 84**

**తా॥** రూపములేని పరమాత్మను పరిణితి చెందిన ఓ మహాయోగి మాత్రమే చూడగలుగుతాడు.

**సత్యమమరి యుండ జ్ఞాన మమరియుండు;**
**జ్ఞానమమరి యుండ సత్యముండు**
**జ్ఞాన సత్యములును సమమైన ద్విజుడగు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 85**

**తా॥** సత్యవంతుడే జ్ఞానము కలవాడు. జ్ఞానం గలవాడే ఉంటే సత్యవంతుడు. సత్యజ్ఞానాలు రెండూ సమపాళంగా ఉన్నవాడే బ్రాహ్మడు.

**దానమొసగు కన్న దేనంబు మరిహెచ్చు;**
**దేన మొసగు కన్న తెలివి హెచ్చు;**
**తెలివికన్న నాన దెగవేసినది హెచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 86**

**తా॥** దానంకన్నా ధ్యానం చాలా మంచిది. అంతకంటే విశేషమైనది తెలివికలిగి గొప్పది. అన్నిటికంటే మేలయినది ఆశని అదుపుచేయడం.

**దొంగమాటలాడక దొరుకునా మోక్షంబు ?**
**చేతగాని కూతచెల్లదెపుడు ?**
**గురువు పద్దుగాదు గుణహీనమది గాక**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 87**

**తా॥.** దొంగమాటలతో మోక్షంరాదు, చేతగాని మాటలన్నీ చెల్లేమాటలు కావు. గొప్పలు చెప్పుకున్నంతలో గురువు కాదు.

**గాలిలేని దీపకళిక చందంబున**
**నలలు నుళ్ళులేని జలధి రీతి;**
**నిశ్చలాత్మ యెన్న నిర్వికారంబున**
**నుండెనేని ముక్తి నుండు వేమ! 88**

అవతారిక

**ముక్తి అంటే ఏమిటో వేమన తన అభిప్రాయాన్ని యిలా చెప్తున్నాడు.**

**తా॥.** గాలిలేనిచోట దీపంవలే, కెరటాలూ, సుడులూ లేని సముద్రంవలే ప్రశాంతంగా ఏ వికారంలేకుండా ఉండేది నిశ్చలాత్మ, అదే యుక్తి.

**మంట లోహములను మాను చీలలయందు**
**బటము గోడలందు బరగ నిసుక**
**బెట్టనంటునట్ల బెనగు దేహము జీవి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 89**

అవతారిక

**దేహము వేరు అందుండు జీవి వేరు,దేహమందుజీవి ఎలా ఉంటుందో యిలా వేమన చెప్తున్నాడు :**

**తా॥** లోహల్లోమంట సరిగి యిమిడి ఉంటుంది. మ్రానిసీలలో గుడ్డపెట్టి కడితే అతుక్కుని ఉంటుంది. గోడలలో యిసకపెట్టి కడితే అతుక్కుని ఉంటుంది. అలాగే దేహంలో జీవి అతుక్కుని ఉంటుంది.

**కలుషమెల్ల (దెలియ) దలవంపులకు మూల**
**మరయ తత్వ మెల్ల నాత్మ బుట్టు;**
**తెలిసినందుకు మరి ధీరుండు గావలె!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 90**

**తా॥** కలుష భావాలు లేనివాడూ ఆత్మతత్త్వం ఎరిగినవాడూ ధీరుడవుతున్నాడు.

**అనగననగ రాగ మతిశయిల్లుచు నుండు**
**తినగతినగ వేము తీపి నుండు**
**సాధకమున బనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 91**

**తా॥** ఆలాపన చేస్తుంటే చివరికి అదే రాగమౌతుంది వేపాకు మొదట తినగా చేదుగా ఉంటుంది. వేపాకే తినడం అభ్యాసం చేస్తూంటే అదే తీయగా ఉంటుంది. ఏదైనా మొదటగా ఒకటి కష్టంగా ఉన్నా అభ్యాసం చేస్తుంటే అదే చక్కటి దార్లోకి వస్తుంది.

**స్థూలము కనుగ్రుడ్డు సూక్ష్మంబు కన్పాప**
**కంటిపాప నుండు కారణంబు**
**కారణమున బ్రహ్మకళ నెరుంగవలెను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 92**

**తా॥** కంటిలో గల గుడ్డు పెద్దదిగా ఉంటుంది. దానినిబట్టి చూస్తే చాలా చిన్నదిగా ఉంటుంది కనుపాప, కంటిపాపనుంటుంది. కారణం? బ్రహ్మకళను తెలుసుకోవడానికి కారణం కనుపాప.

**తేనె తెరల జాడ తేనెటీగ యెరుంగు**
**సుమ రసంబు జాడ భ్రమర మెరుగు;**
**పరమ యోగి జాడ భక్తుండెరుంగును**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 93**

**తా॥** తేనెపట్టులో ఉండే తేనె సంగతి తేనెటీగకి తెలుస్తోంది. పువ్వుల్లో ఉండే మకరందం విషయం తుమ్మెదకి తెలుస్తుంది. ముని అనుసరించే మార్గం ఒక్క భక్తుడికి మాత్రమే తెలుస్తుంది.

**అడవి దిరుగలేదు యాకసమునలేదు,**
**యవని దీర్ఘయాత్రలందు లేదు**
**ఒడలు శుద్ధిజేసి యొడయని జూడరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 94**

**తా॥** దైవమును పొందడానికి అడవుల్లో సంచరించనక్కర్లేదు. ఆకాశంలోనూ లేదు. ఆత్మశుద్ధి చేసుకున్నవాడు చేసుకున్నవాడు దేవుణ్ణి చూడగలుగుతున్నాడు.

**కప్పురంపు మనసు గాంక్షించు యోగికి**
**జ్ఞాన దీప శిఖయు దా నటించు;**
**కానవచ్చునాత్మ క్రమమాణమైనిచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 95**

**తా॥** కర్పూరం లాంటి మనస్సు గలయోగికి దీపంలాంటి ప్రకాశవంతమైన జ్ఞానం తానుగాని ఆత్మతత్త్వాన్ని అందిస్తుంది.

**నీవాడిన నేనాడుదు;**
**నీవుండిన నేను నుందు నిర్విణ్ణుడనై,**
**నీవు దలంచిన దలచెదు**
**నీవు నగిన నేను నలుగుదు! నిజముగ వేమా ! 96**

**తా॥** నువ్వు అడుతూంటే నేనూ ఆడుతున్నాను. నువ్వు ఎలా ఉంటే నేనూ అలా నిర్వికారంగా ఉందును. నువ్వు తలుస్తూంటే నేనూ తలుస్తూంటాను. నువ్వు నవ్వుతూంటే నేనూ నవ్వుతూంటాను. ఇది నిజం.

**నీరు కారమాయ కారంబు నీరాయె;**
**కారమైన నీరు కారమాయే**
**కారమందు నీరు కడు రమ్యమైయుండు.**
**విశ్వదాభిరామ వినుర వేమ! 97**

### అవతారిక

కారం క్షారశబ్దభవం నీటికీ కారానికీ గల సంబంధాన్ని చెపుతూ అది యెలా మనోహరమైందో కూడా చెప్తున్నాడు :-

**తా॥** నీదు కారం అవుతోంది. కారం మళ్ళా నీరవుతోంది. కారమై నీరుకూడా కారమే అవుతోంది. కారం అయినప్పుడు నీరు ఎంతో మనోహరంగా వుంటుంది.

**శివుని యనుభయంబు సృష్టిలోపల లేక**
**సంశయంబు చెడదు సాధకులకు**
**చెంగు దివ్వెలేక చీకటి వాయునా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 98**

**తా॥** సాధన చేసేవారికి అనేక సంశయాలు కలుగుతూంటాయి. అటువంటి చిక్కులు తొలగాలంటే ఈ సృష్టిలో శివుని గురించిన ఉపాసన ఎంతో అవసరం. చీకటి పోవాలంటే దీపం అవసరం కదా!

**ఇంద్రియములచేత నెగ్గొందు చుండెడు**
**వెర్రి మనుజు డేల వెదకు శివుని?**
**ఇంద్రియముల రోసి యీశుని జూడుడీ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 99**

**తా॥** ఇంద్రియ సుఖాలన్నింటినీ పరిత్యజించిన నాడే శివుని దర్శించు భాగ్యాన్ని పొందగలుగుతాడు.

**కడుపు నిండ సుధను గ్రమముతో ద్రావిన**
**పాల మీదనేల పారు మనసు?**
**తత్త్వమెరుగ వెనుక తత్త్వంబు లేటికో ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 100**

**తా॥** కడుపునిండా హాయిగా అమృతాన్ని త్రాగిన వానికి పాలమీదికి మనసు ఎలా పోతుంది? తత్త్వం తెలిసిన వాడికి తత్త్వాలతో పనేం ఉంటుంది గనుక?

**ఉత్తమోత్తముండు తత్వజ్ఞుడి (లమీద)**
**మహిమ జూపువాడు మధ్యముండు**
**వేషధారి యుదర పోషకు డధముండు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 101**

**తా॥** తత్త్వవేత్త్వ ఈ లోకంలో అత్యుత్తముడు. మహిమలు ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలని పొందేవాడు రెండోరకం. పొట్టపోసుకోవడం కోసం కాషాయ వస్త్రాలు ధరించేవాడు అధముడు.

**హృదయమందు నున్న యీశుని దెలియక**
**శిలలకెల్ల మ్రొక్కు జీవులార!**

**శిలలనేమి యుండు జీవులందే కాక?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **102**

**తా॥** హృదయంలో ఉన్న యీశ్వరుని తెలుసుకోదు దేవుని శిలలో ఉన్నాడు; అని శిలలకి మ్రొక్కే ఓ మూర్ఖ మానవులారా! బండరాళ్ళల్లో కాఠిన్యం తప్ప మరేమీలేదు. దేవుడు జీవులందే ఉంటున్నాడు. కనుక జీవులని ప్రేమించండి. సేవించండి.

**గంగ గోవు పాలు గరిటెడైనను జాలు;**
**కడివెడైననేమి ఖరముపాలు;**
**భక్తి గలుగు కూడు పట్టెడైనను జాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **103**

**తా॥** పుణ్యప్రదమైన గంగ గోవుపాలు గరిటెడైనా ఎంతో మంచివి. గాడిదపాలు కవడల కొలదీ ఉంటే మాత్రం ఏం ప్రయోజనం? నిరుపయోగమైనవి. భక్తితో పెట్టిన పట్టెడన్నమైనా చాలును.

**బండమీద చెలమ పాటించి తవ్విన,**
**నలయికెక్కుడౌను యాశలేదు;**
**గుంట పట్టు చెలమ కులముద్ధరించురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **104**

**తా॥** బండరాయిని ఎంత ప్రయత్నించినా త్రవ్వినా నీరూరదు. పల్లపుప్రాంతం ఎంచుకుని తవ్వితే ఆ కొలను ఉన్నంతకాలం కావలసినంత నీరుంటుంది.

**కాకి గూటిలోన కోకిల మన్నట్లు**
**భ్రమరమగుచు పురువు బ్రతికినట్లు**
**గురుని గొల్చు వెనక గురువు తానౌనయా**
**విశ్వదాభిరామ వినుర వేమా!** **105**

**తా॥** కోకిల తానుకన్న గుడ్డుని తీసుకెళ్ళి కాకిగూట్లో ఉంచుతుంది. కాకి తన గుడ్డుగా భావించి పిల్లను చేస్తుంది. అట్లే కందిరీగగా పురుగు రూపొందినట్లు గురువుని సేవించిన శిష్యుడే గురువౌతాడు.

**మాటదిద్ద వచ్చు మరియెగ్గు లేకుండ**
**దిద్దవచ్చు రాయి తిన్నగాను;**
**మనసు దిద్దరాదు మహినెంత వారికి**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **106**

**తా॥** మాటలో గల పొరపాటు సరిదిద్దవచ్చు. రాయిని కూడా ఏదో రకంగా సరిచేయవచ్చు. మనస్సుకి బాధ కలిగితే దాన్ని ఈ లోకంలో ఏవిధంగానూ సరిచేయడం కుదరదు.

**మనస్సునందు ముక్తి మలయుచు నుండంగ**
**మనసు నెరుగలేక మనుజులెల్ల**
**మనసు నంటులేక మాయమై పోదురు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 107**

**తా॥** తన మనసే మోక్షం నీయగలదు. అటువంటి మనస్సును తెలియక మాయలో మానవులు పడుచున్నారు.

**మనసు ముక్తి యనుచు మది నెరుంగగలేరు**
**మనసుచేత దగిలి మాయమైరి;**
**మనసు తానుయైన మర్మజ్ఞుడగుయోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 108**

**తా॥** మనసే మోక్షం. కాని ఆ మనస్సును తెలియలేకపోతున్నారు. ఆమర్మాన్ని తెలుసుకో గలుగుతున్నాడు మహాయోగి.

**మది నెరింగిన వాని మహిగాన మెందును**
**మదినెరుంగు నరుడు మహిని నరుదు;**
**వెదకి తనవులోన వేడ్కతో నినుజూచు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 109**

**తా॥** ఈ ప్రపంచంలో మనస్సుని తెలుసుకున్నవానిని మనం చూడ లేకపోతున్నాం. సాధన చేసికూడా మనస్సుని తెలుసుకున్న మనుష్యుడు ఉంటే చాలా అరుదుగాఉండవచ్చు. ఈశరీరంలో ప్రవేశించి రకరకాల మాయలు చేసే మనస్సుని తెలుసుకోడం మనుష్యుని లక్ష్యం కావాలి. అతడు మనుజుడు, అతడే యోగి.

**బ్రహ్మమును యెరుగుతాను భావమిందుండెనా**
**తనువు గుడిగజేసి తన్ను నిలిపి;**
**లోకబుద్ధి విడిచి లోజూపు జాడరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 110**

**తా॥** తన శరీరమే దేవాలయం కనుక తన ఆత్మే దేవుడులో చూచిన కానుపించెను.

**నిన్ను జూచుచుండ నిండును తత్త్వంబు**
**తన్ను జూచుచుండ తగులు మాయ**
**నిన్ను నెరిగినపుడె తన్ను దానెరుగును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 111**

అవతారిక

**తాను దర్శించిన ఆత్మతత్త్వాన్ని ఎలా తెలుసుకోవాలో తన మాటలలో వేమన యిలా చెప్తున్నాడు :-**

**తా॥** నిన్ను నువ్వు తెలుసుకుంటే తత్త్వం తెలుస్తుంది. దేవుని చూడాలన్న మాయ ముందుంటుంది. అందువలన నిన్ను నీవెరిగిన, దేవుని చూడగలవు.

**గాలిగాలి గలసె గగనంబు గగనంబు**
**మన్ను మన్ను గలసె మంట మంట**
**నీరు నీట గలసె నిర్మలంబై యుండె**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 112**

**తా॥** గాలిలో గాలి, ఆకాశంలో ఆకాశం; మన్నులో మన్ను నీరులో నీరు గలిసింది. ఆత్మ నిర్మలంగా ఉంది.

**వెదుక వెదుక దొరుకు వేదాంత వేద్యుండు;**
**వెదుకుదువని దాను వెదుకుచుండు;**
**వేదుకనేర్చినెట్టి వెరవర్లు గలరకో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 113**

**తా॥** వెదకగా వెదకగా చిట్టచివరికి దేవుడు దొరుకుతాడు. వెతికేవాడిని దేవుడూ వెతుకుతూనే ఉంటాడు. అందువలన వెదికినవాడే సమర్థుడు.

**తను వలచిన దా వలచును**
**తను వలవక యున్న దన్నుదా వలవడురా !**
**తనదు పటాటోపంబులు**
**తన మాయలు పనికిరావు (ధరలో వేమా!) 114**

**తా॥** తాను ఇతరులను ప్రేమతో చూస్తే ఆ యితరులు తనని కూడా అలా ప్రేమతో చూస్తారు. తానితరుల ప్రేమించకపోతే యితరులూ తనని ప్రేమించరు.

**స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే**
**సంశయంబు చెడదు సాధకునకు;**
**చిత్రదీపమునను జీకటి చెడనట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 115**

**తా॥** బొమ్మలో ఉన్నదీపం వల్ల నిజమైన చీకటి ఎలాపోదో అలాగే స్వానుభవం శాస్త్రాధ్యయనం అన్నవి లేకుండా సాధకునికి సంశయం విడిపోదు.

**శాంతమున సకల కార్యము**
**సంతోషంబునను బొందు సత్యము జయమౌ;**
**పంతము చెల్లును ధర్మజు**
**డెంతేసి ప్రయాసముల జయించెను వేమ ! 116**

**తా॥** ఎటువంటి పనులననైనా సంతోష హృదయముతో శాంత పరిస్థితిలో చక్కబరచుకోవాలి. సత్యమూ జయమూ తథ్యం. పంతాలకీ పట్టింపులకీ పోయి ధర్మరాజు ఎంతటి వ్యయ ప్రాయసలతో విజయం సాధించాడు.

**ఉర్విజనులు పరమ యోగీశ్వరుని జూచి**
**తెగడు వారుగాని తెలియలేరు**
**అమృతమాది రుచుల హస్తమే మెరుగును?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 117**

**తా॥** లోకంలో ఒక గొప్ప యోగిని జూచి తప్పుగా అర్థం చేసుకుని నోటికి వచ్చినట్లు మాట్లాడుతారు. ఆయనలోని ఘనత వారికేం తెలుసు? అమృతం రుచి హస్తాల కెలా తెలుస్తుంది?

**అంకెలెరిగి మాటలాడ నేర్చినపుడె**
**పిన్న పెద్ద తనము లెన్ననెల ?**
**పిన్న చేతి దివ్వె పెద్దగా వెలగదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 118**

**తా॥** పండితుడు కావటానికి లోకంలో ఎన్ని పద్ధతులున్నా పామరుడుగా ఉండి పుట్టింది మొదలుకొని పాపపు తలపుల్నే తలపోస్తుంటాడు. ఇది కుంటి కుక్క మాంసం తిన్నట్లుగా ఉంది.

**మొదట బోయు నీరు (మొగి) బీజములకెక్కి**
**మొదటి కురుక వేగ మొలకలెత్తు**
**మొలక పృథివి బెరిగి వెలయును వృక్షంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 119**

**తా॥** మొట్టమొదటగా పోసిన నీళ్లు విత్తనాల్లోకి ఎక్కగా అవి మొలకలెత్తుతున్నాయి. భూమిమీద మొలకెత్తిన ఆ మొలకలే పెద్ద చెట్లవుతున్నాయి.

**మగని కాలమందు మగువ కష్టించిన**
**సుతుల కాలమందు సుఖము బొందు**
**కలిమిలేమి రెండు గలవెంత వారికి**
**బలిమి పుత్రబలిమి బలిమి వేమ ! 120**

**తా॥** స్త్రీ భర్త ఉన్న సమయంలో (పురుడు మొ.) కష్టాలు పడినా కొడుకుల హయాంలో సుఖించగలుగుతుంది. ఎటువంటి వారికైనా కష్టసుఖాలు కలుగుతూంటాయి. పుత్రులున్న బలమే బలం.

**ఆరురుచులు వేరు సారంబు యొక్కటి;**
**నిత్యనిష్ట వేరు సత్యమొకటి**
**పరమ ఋషులు వేరు భావ్యుండుయొక్కడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 121**

**తా॥** రుచుల రకాలు ఆరేగాని వాటి సారం మాత్రం ఒక్కటే. సత్యమందలి ఆచరణ పద్ధతులు వేరైనా సత్యం ఒక్కటే. మహర్షులు చెప్పే తోవలు వేరైనా భావ్యుండు అంటే గమ్యం ఒక్కటే.

**తారకంబు జూచు దారి వేరే కద్దు;**
**సమముగాను జూడ జక్కబడును;**
**వెర్రిగాను జూడ వెలుగెల్ల పారురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 122**

**తా॥** తరుణోపాయానికి ఎన్నుకునే త్రోవ సరియైనదిగా ఉండాలి. వెర్రి మొర్రి తోవలు పడితే ఉన్న జ్ఞానంకూడా వృధాగా పోతుంది.

**సజ్జనముల చెలిమి జాలింపగా రాదు;**
**ప్రకృతి నెరుగకున్న భక్తిలేదు,**
**పలవలెట్టి రీతిభక్తి నిల్పుదురయా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 123**

**తా॥** ఎప్పుడూ మంచివారే స్నేహాన్ని విడనాడకూడదు. ప్రకృతిని అర్థం చేసుకోకుండా భక్తి కుదరదు. ప్రకృతిని అర్థం చేసుకున్న తీరునే భక్తి నిలుపుకోడం జరుగుతుంది.

**ఇట్టికనుల బ్రహ్మమెట్టు చూడగవచ్చు**
**జూచుకనులు వేరు చూపువేరు.**
**చూపులోన నుంచి చూడంగ వలవదా ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 124**

**తా॥** ఈ కళ్ళ చూపుతో బ్రహ్మపదార్థాన్ని చూడలేం. బ్రహ్మపదార్థాన్ని చూడ్డానికి కావలసిన దృష్టి వేరే ఉంది. ఆ చూపేమిటంటే లోపలను చూడటానికి తగిన చూపే ఆ దృష్టి అవుతోంది.

**దూలములను బోలు దురవస్థలను యెల్ల**
**రోసి యాసలన్ని గోసివేసి**
**వాసనను దెలసినవాడు పోబ్రహ్మంబు!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 125**

**తా॥** దూలాల్లాంటి దురవస్థలు గురించి బాగా ఆలోచించి ఇదంతా వ్యర్థం అని భావించి ఆ బంధనాలన్నింటినీ తెంచివేసి "అహం బ్రహ్మాస్మి" అని తెలుసుకున్నవాడే బ్రహ్మవేత్త.

**మన్నును దినుమంటె మండేరు జనులార**
**మంటిలోని మేలు మరువనేల ?**
**నీళ్ళలోని మేలు విఖిలమై యుండురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 126**

**తా॥** ఓ జనులారా! మట్టి తినమంటే మండిపడతారు. ఇలాంటి ప్రజలు మట్టిలోగల మేలు మరిచిపోతున్నారు. ప్రపంచక అంతా నిండి ఉంటోంది నీళ్ళలోని మంచీ.

**జీవమేడనుండు? భావమెక్కడ నుండు?**
**కాపురంబు యేడ గదిసి యుండు?**
**తనరుచున్న రెంటి స్థలమేల తెలియరు ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 127**

**తా॥** జీవమూ భావమూ దేహంలోనే ఉంటున్నాయి. ఈ రెండూ దేహం లోనే కలిసి ఉన్నా వాటికి గల సంబంధాన్ని చాలా మంది తెలుసుకోడం లేదు.

**ధనము గూడబెట్టి ధర్మంబు సేయక;**
**తాను దినక లెస్స దాచుగాక.**
**తేనెటీగ గూర్చి తెరవరి కియ్యదా ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 128**

**తా॥** దానధర్మాలకు వినియోగించి దానివల్ల వచ్చే కీర్తి ప్రతిష్ఠలను అనుభవించలేక Live to earn అన్నట్లుగా కూడబెట్టి దాన్ని విడవలేక చివరికి ఖర్చుచేసేవారికి అందజేస్తాడు. తేనెటీగ తేనెను కూడబెట్టి ఆఖరికి అది యితరులకి అందజేస్తుంది కదా!

**ఇచ్చేవారల సంపద**
**హెచ్చేదేకాని లేమి యేలా కలుగున్?**
**అచ్చెలను నీళ్ళు చల్లిన**
**విచ్చలవిడి నూరుచుండు వినరా వేమ ! 129**

**తా॥** దాతల సంపదలు ఇస్తూన్న కొలదీ పెరుగుతూంటాయే కాని తరిగిపోవు. చెలమలోని నీటిని తోడుతూన్నకొలదీ పెరుగుతుందే కాని తాత్కాలికంగా తగ్గినా మళ్ళా అది యధాస్థితికి వస్తుందికదా!

**పాలగలయు నీరు పాలెయై రాజిల్లు,**
**నదియు సాంబయోగ్యమైన యట్లు,**
**సాధు సజ్జనముల సాంగత్యముల చేత,**
**మూఢజనుడు ముక్తి మొనయు వేమ ! 130**

**తా॥** నీరు పాలని గలిపి అదే రంగూ రుచీ పొందుతోంది. మూఢుడు కూడా మంచి వారితో స్నేహం పొంది మంచివాడుగా మారుతాడు. అటువంటివాడు ముక్తిని కూడా పొందగలుగుతున్నాడు.

**చెడిన మానవులను చేపట్టి రక్షించి,**
**కడకు దేర్చినట్టి ఘనుడు తలప,**
**కడిగి పుణ్యమైన కడు శివు సన్నిధి,**
**నెడతెగకను యుందురెపుడు వేమ ! 131**

**తా॥** చెడిపోయిన మనుషుల్ని ఆదరించి కాపాడి ఒక దారికి చేర్చినవాడు ఘనుడని చెప్పదాగినవాడు. అటువంటి వాడు నిశ్చయముగా సర్వదా శివుని సన్నిధానంలో పుణ్యాల పంటలతో ఉంటాడు.

**ఒకరి నోరుగొట్టి యొకరు బక్షింతురు,**
**వారి నోరుమెత్తి వరుస గొట్టు;**
**చేప పిండునేల చేపలు చంపును ?**
**జనుడు చేప పిండు జంపు వేమ ! 132**

**తా॥** ఒకరి నోటికూడు పడగొట్టి ఇంకొకరు కడుపు నింపుకుంటాడు, ఉదాహరణకు చేపలు చేపపిల్లల గుంపును తిని పెద్దవవుతున్నాయి. అలా పెద్దనైన చేపల్ని జనులు చంపుకు తింటూంటారు.

**కనులు పోవువాడు కాళ్ళు పోయినవాడు**
**యుభయులరయ గూడి యుండినట్లు,**
**పేద పేక గూడి పెనగొని యుండును,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 133**

**తా॥** కళ్ళు పోయినవాడూ కాళ్ళుపోయినవాడు ఒకరికొకరు సాయం చేసుకుంటూంటారు. అలాగే పేదవాడు యింకొక పేదవాడితో కూడి అన్యోన్యంగా బ్రతుకుతూంటారు.

**పరగ రాతిగుండు పగల గొట్టగవచ్చు,**
**కొండలన్ని పిండి గొట్టవచ్చు,**
**కఠినచిత్తు మనసు కరిగింపగారాదు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 134**

**తా॥** పెద్దరాతి బండని పగలగొట్టవచ్చు, అలాగే కొండలన్నింటినీ గుండకొట్టచ్చు, గాని ఒక్క మూర్ఖుని మనసు కరిగించడం చాలా కష్టం.

**అంత కొరతదీరి యతిశయ కాముడై**
**నిన్ను నమ్మి చాల నిష్ఠతోడ,**
**నిన్ను గొల్వ ముక్తి నిశ్చయముగ గల్గు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 135**

**తా॥** ఏకాగ్ర మనస్సుతో నీయందు విశ్వాసం కలిగి ఉంటే మోక్షం తప్పక లభిస్తుంది.

**తత్త్వము తిరమైన తావుల వెదకుచు,**
**తాను తత్త్వమగును తత్వయోగి**
**తలపుల్ని యుడుగ తానె పో తత్త్వంబు!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 136**

**తా॥** తత్త్వాన్ని సరియైన చోట్ల వెతుకుతూంటే వాడే తత్త్వంగా మారుతాడు. యోగి ఆశలన్నింటినీ విడిచిననాడు తానే బ్రహ్మం అవుతున్నాడు.

**మాటలాడ వేరె మనసు కొలది వేరె,**
**యొడలి గుణము వేరె యోజ వేరె;**
**యెట్లు గల్గు ముక్తి యేలాగు తనలాగు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 137**

**తా॥** మాటలాడుతూన్న తీరువేరు. మనసులోచేసే ఆలోచనా పద్ధతి వేరు, శరేర గుణాలు వేరు, అసలు క్రమమే వేరు. మాయావులకి ముక్తి ఎలా లభిస్తుంది!

**వెలది చక్కదనము వెరవైన యీడును**
**విభుని కరుణలేక వితగనుండు;**
**నీదు కరుణలేక నేర్పులు కొరగావు!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 138**

**తా॥** ఆడదాని అందం, వయస్సూ, దేవుని అనుగ్రహం లేక రాణించవు. నీ దయలేనినాడు యే గొప్ప కూడా మెప్పు పొందవు.

**ఎంత కష్టముండు నంత పాపపు చింత;**
**చింత చేత మిగుల జీవుడు మనసు;**
**చింతలేక నున్న చెడని సంపదజూచు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 139**

**తా॥** కష్టాలు కొలదీ పాపపు తలపులు పెరిగిపోతూంటాయి. చింతుల విశేషం అవుతూన్న కొలదీ మనస్సు మంచి స్థితి నుంచి తప్పిపోతుంది. ఏ చీకూ చింతా లేకపోవడమే గొప్ప సంపద.

**ఎన్నాళ్ళను దానుండును?**
**యెన్నాళ్ళను దాను నేర్చి యెన్నిట వెలయున్?**
**కొన్నాళ్ళకు దా జన్మను**
**మన్నాయెను విద్యలెల్ల! (మహిలో) వేమ ! 140**

**తా॥** ఎన్నో చదువులు చదివి ఎంతో భక్తి కలిగి ఎంతేసి పనులు చేసినా అవన్నీ అతను వెళ్ళిన తరువాత పోషణలేక చూసేవారూ,చేసేవారు లేక అవన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి.

**ధనమెచ్చిన నుదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణంబు మానకనెచ్చున్;**
**ధనముడిగిన మదముగును;**
**మదముడిగిన దుర్గుణంబు మానును వేమ ! 141**

**తా॥** ధనం పెరిగిన మదం పెరుగుతుంది. మదం పెరిగిన దుర్గుణం పెరుగుతుంది. ఆ ధనం తగ్గితే దుర్గుణాలన్నీ తగ్గుతాయి.

**తరుచు చదువు చదువ తర్క వాదమె కాని,**
**దివ్య జ్ఞానమునకు తేటపడదు;**
**పిసిరి కాయ పురుగు పగిదిని చెడిపోవు,**
**విశ్వదాభిరామ వినుర వేమా! 142**

**తా॥** శాస్త్రాలు తర్క వితర్కాలతో వాద వివాదాలతో గలగలా మొరుగుతూంటాయి. వాటివల్ల ఏ ఆత్మజ్ఞానం కలగదు. పిసిరికాయలోని పురుగుకి దానిలోనే హాని కలుగుతుంది.

**యీ కపట నాటకంబును**
**యీ కపటపు చదువులన్ని యింపు దలిర్పన్**
**యే కపటాత్ముడు సేసెనొ ?**
**యా కపటాత్మునకు మ్రొక్కియలరుము వేమ ! 143**

**తా॥** లోకమంతా ఓ కపట నాటకం. విద్యలన్నీ కపటం. యివన్నీ ఏ కపటి సృష్టించాడో అతనికి ఒక్క నమస్కారం.

**ఎండవేళ చీకటేకమై యున్నట్లు**
**నిండుకుండ నీరు నిలిచినట్లు**
**దండిని బరమాత్మ తత్త్వంబు దెలియరో!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 144**

**తా॥** సూర్యకాంతిలోనే చీకటి కలిసిపోయి ఉంటోంది. నిండుకుండలో నీరు నిశ్చలంగా ఉన్నట్లు, పరమాత్మను దర్శించిన యోగి దేహాన్ని అంతర్లీనం చేసుకుని ఏ ఆశలూ లేక నిర్మలంగా ఉంటాడు.

**ఎండిన మానొకటడవిని**
**ఉండిన నందగ్ని పుట్టి యూడ్చును చెట్లన్;**
**దండి గల వంశమెల్లను**
**చండాలుండొకడు పుట్టి చదువురు వేమ ! 145**

**తా॥** ఎండిపోయిన చెట్టు ఒకటి అడవిలో ఉంటే దాని నుంచి నిప్పుపుట్టి అడవినంతనీ భస్మం చేస్తుంది. అలాగే చక్కని వంశంలో ఒక దుష్టుడు జన్మించి ఆ వంశ కీర్తి ప్రతిష్టలని నాశనం చేస్తాడు.

**శిష్య వర్గమునకు శివు జూప నేరక**
**కానిమతములోన గలుపు నట్టి**
**గురుని యెరుకనరయ గుడ్డెద్దుజొన్నరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 146**

**తా॥** శిష్య సమూహానికి శివుని చూపడం చాతకాక ఏవేవో తప్పుడు తోవలు చూపుతూ తప్పుడు సిద్ధాంతాలంటూ చెబుతూ గురువులు శిష్యుల్ని ఒంకర మార్గాన్ని పట్టిస్తారు. ఇలాంటి పని గుడ్డెద్దు జొన్నచేలో పడి నాశనం చేయడంలా ఉంటుంది.

**ఇంటిలోని ధనము "యిది నాది" యనుచును**
**మంటిలోన దాచు మంకుజీవి!**
**కొంచ బోదు వెంట గుల్ల కానును రాదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 147**

**తా॥** ఇంటిలో ఉన్న డబ్బునే "ఇది నాది ఇదినాదీ" అంటూ వాదులాడి తోటివారి నుండి ధనమును సేకరించి ఎవరికీ తెలియకుండా ఆ ధనాన్ని భూమిలో గప్పెడుతాడు. కాని ఆ ధనం తనతోరాదు అని గ్రహించలేని మూర్ఖుడు తన వెంట వచ్చేది ధర్మం ఒకటే అని గ్రహించలేడు.

**దేశ వేషములను తేట సేయక దేవు**
**డాత్మలోన నుండు ననగి పెనగి**
**వేస మరసిచూడ గ్రాసంబు కొరకయో!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 148**

**తా॥** దేవుడు ఏ వేషంలోనూ ఏ దేశంలోనూ తనని సాక్షాత్కరింపచేయక అంతరాత్మలోంచి మాత్రమే దర్శనమిస్తాడు. అయితే "ఇది దేవుడు" అంటూ వేషం వేయడం కేవలం ఉదరపోషణ కోసమేనని గ్రహించాలి.

**మిరపగింజ జూడ మీద నల్లగ నుండు;**
**కొరికి చూడ లోన చురుకు మనును;**
**సజ్జనులగు వారి సార మిట్టులనుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 149**

**తా॥** మిరపకాయని పైన నల్లగా ఉన్నా దాన్ని కొరికితే మాత్రం కారం చురుక్కుమనేలా బాధ పెడుతుంది. సజ్జనులు కూడా యిలాగే మండిపడుతూంటారు. కాని వారి సాంగత్యం ఎంతో క్షేమకరమైనది.

**పర్వత వనవాసి పరిణామ వర్తన**
**కూప వాసికెట్లు గురుతు పడును?**
**బ్రహ్మ విష్ణు వెంట ప్రాకృతుడరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 150**

**తా॥** పర్వతాల్లో అరణ్యాల్లో నివసించే ఓ మహాయోగిలో కానవచ్చే గొప్పతనం నూతిలో ఉండేవాడికెలా అర్థం అవుతుంది? బుద్ధిలేని వారికి అటువంటి మహాత్ముల జాడలు తెలియవు. అందుకే వారు మూర్ఖులు. ఎదురుగా బ్రహ్మ విష్ణువులు కపబడినా వారి వెంట బడడు. అందుకే బుద్ధిమంతుడు నుండి పామరుడు వేరౌతున్నాడు.

**కస్తూరి యట చూడ ఘనత నల్లగ నుండు;**
**పరిమళించు దాని పరిమళంబు;**
**గురువులైన వారి గుణములీలాగు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 151**

**తా॥** కస్తూరి నల్లగానే ఉంటుంది గాని సువాసన హృదయాహ్లాదకరముగా ఉంటుంది. అలాగే గురువులు పైకి నిరాడంబరంగా ఉంటారు. కాని వారిలో ఉండే ఉత్తమ గుణాలు ఎంతో పరోపకారకమైనవి.

**దొంగతనము రంకు దొరసియుండు జగతి;**
**రంకులాడి కింత శంక బుట్టు;**
**దొంగ (న్న)రే వేలుంగొప్పు కానట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 152**

**తా॥** లోకంలో దొంగతనం రంకుతనం యీ రెండింటికీ దగ్గర సంబంధం ఉంది. వ్యభిచారి స్త్రీకి శంకించడం అంటే నచ్చదు. దొంగకి రాత్రివేళ వెలుగు నచ్చదు.

**గురువులేక విద్య గురుతుగా దొరకదు,**
**నృపతి లేక భూమి తృప్తిగాదు;**
**గురువు విద్యలేక గురుతర ద్విజుడౌనె?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 153**

**తా॥** గురువు దగ్గర విద్యాభ్యాసం చేయకుండా విద్యరాదు. రాజులేకుండా దేశం అభివృద్ధి పొందదు. ఎంత బ్రాహ్మణుడైనా గురువువద్ద విద్యాభ్యాసం చేయకుండా ద్విజుడనిపించుకోడు.

**అల్ప సుఖములెల్ల నాశించి మనుజుండు,**
**బహుళ దుఃఖములను బాధపడును;**
**పర సుఖంబు నొంది బ్రతుకంగ నేరడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 154**

**తా॥** తేలిక సుఖాల్ని పొందజూసే మనుష్యుడు ఎక్కువ బాధల పొందుతున్నాడు. ఏ బాధలూ లేని ఉత్తమ సుఖాన్ని పొందడానికి మనుష్యుడు ప్రయత్నించలేక పోతున్నాడు.

**కాలవశము బట్టి కర్మజీవుల పిండు**
**మత్తులగుచును మదమత్తులైరి;**
**మత్తులైన జనుల మనసేటి మనునయా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 155**

**తా॥** కాలాన్నిబట్టి జీవులు మనుష్యులు మదంతో మత్తెక్కి ఉంటున్నారు. మదంతో మనస్సుని మత్తుపాల్చేసుకునే మనుష్యులూ ఓ మనుషులేనా?

**(కడగి) వట్టి యాన కడతేర నివ్వదు**
**యిడుములందు బెట్టి యీడ్చు గాని;**
**పుడమి జనుల భక్తి బొడమంగ నియ్యదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 156**

**తా॥** ఓ ఆశ పుడితే అది మనుష్యుని సుఖంగా ఉండనివ్వదు. ఆ ఆశ మనుష్యుణ్ణి నానాకష్టాల్లోకి యీడ్చుతుంది. ఆ ఆశకుపోయే మనుష్యుని మనస్సులో భక్తిని పాదుకోనివ్వదు.

**పాల లోన పులుసు లీలతో గలసిన;**
**విరిగి తునకలగును విరివిగాను;**
**తెలివి మనము లోన దివ్యతత్వము తేట**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 157**

**తా॥** పాలలో పులుపు కలిస్తేఆ పాలు ఎంతో గుణవంతంగా ఉంటాయి. అలాగే చక్కని మనస్సులో దివ్యతత్వం తేటగా ఉంటుంది.

**దేహము లెస్సగ నుండిన**
**ఊహణ తత్త్వంబులన్ని పొందుగ దెలియున్;**
**దేహము బడలిక బడినను,**
**ఊహణ తత్త్వములు (వచ్చి) పొందవు వేమ ! 158**

**తా॥** శరీరము చక్కగా ఉంటే తాత్త్విక విషయాలు తెలుస్తాయి. శరీర పటుత్వం సన్నగిల్లితే అప్పుడు తెలియవలసిన విషయాలు కూడా తెలియవు.

**అధికుడైన రాజు యల్పుని జేబట్ట,**
**వాని మాట చెల్లు వసుధలోన**
**గణకులొప్పి యున్న గవ్వలు చెల్లవా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 159**

**తా॥** లెక్కల ఉన్న గవ్వలు ఎలా ప్రాముఖ్యాన్ని పొందుతున్నాయో! అలాగే తక్కువవాడు కూడా గొప్పరాజు దగ్గరున్న ఆ అల్పుని మాటే చెలామణికి వస్తుంది.

**ధర్మమరసి పూని ధర్మరాజాదులు,**
**నిర్మలంపు ప్రౌఢి నిల్పుకొనిరి;**
**ధర్మమే నృపులకు తారక యోగంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 160**

**తా॥** ధర్మరాజు మొదలైనవారు ధర్మాచరణ చేసి తమ విలువలు కాపాడుకున్నారు. రాజులకి అధికారులకకు ధర్మాచరణం అన్ని విధాలు మేలయినది.

**దానముల సేయ ధర చేతులాడక**
**బహు ధనంబు గూర్చి పాతిపెట్టి,**
**తుదను దండుగనిడి మొదలుచెడు నరుడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 161**

**తా॥** దానం చేయడం చేతగాని వాడిధనం తనదారి తను చూసుకుంటుంది. దానితో నరుడు సమూలంగా నాశనమై పోతున్నాడు. అందుకే డబ్బుకి దానం సరైన పద్ధతి.

**నిత్యంబు కాని యొడలికి,**
**నిత్యము దుఃఖంబు బడును (నిరతము ధరలో)**
**నిత్యానందపు పదవికి**
**నిత్యంబును దుఃఖ పడగ నేరరు వేమ! 162**

**తా॥** అశాశ్వతమైన శరీరం కోసం ఎంతో కష్టాన్ని అనుభవిస్తుంటాడు మనిషి. నిత్యానందం గల పదవిని పొందలేక పోయినందుకు మాత్రం బాధపడడు.

**విను వివేకమనెడు వింత గొడ్డలిచేతగు**
**నలయ విద్య యనెడు నడవి నరికి,**
**తెలివి యనెడు గొప్ప దీపంబు చేపట్టి**
**ముక్తి జూడవచ్చు మొనసి వేమ! 163**

**తా॥** వివేకమును గొడ్డలి తీసుకుని విశ్రమించకుండా అజ్ఞానం అనే అడవిని నరికి తెలివి అనే దీపాన్న తీసుకుని ప్రయత్నించి ముక్తిని దర్శించవచ్చును.

**ఎక్కడి సుతు? లెక్కడి సతు?**
**లెక్కడి బంధువులు? సఖులు నెక్కడి భృత్యుల్?**
**డొక్కుబడి పోవు వేళల**
**చక్కటికిని యెవరురారు సహజము వేమ ! 164**

**తా॥** మనుష్యునికి కొడుకులు, భార్యలూ, చుట్టాలు,స్నేహితులు, ఆ సేవకులూ ఎవ్వరూరారు. పరలోకానికి పోయేవేళ సహాయపడేవారు ఎవరూలేరు. ఇది లోకయాత్ర వాస్తవం.

**పాల నీరు క్రమము పరమహంస యెరుంగ**
**నీరు పాల క్రమము నెమలికేల?**
**అజ్ఞుడైన వాడు నల శివు నెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 165**

**తా॥** పాలనుంచి నీటిని వేరుచేయగల శక్తి హంసకే ఉంది. నీరూపాలూ సంగతి పట్టించుకోవడం నెమలికి చేతకాని పని. అట్లే జ్ఞానంలేనివాడు శివుని గురించి ఎందుకు తెలుసు కోడానికి పూనుకుంటాడు? అజ్ఞుడి పనియింతే.

**కన్నులందు మదము గప్పి గానరుగాని,**
**నిరుడు ముందటేడు నిన్న మొన్న,**
**దగ్ధులైనవారు తమకంటె తక్కువా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 166**

**తా॥** కన్నుల్లో మదం ఉండడంచేత చచ్చిపోడం కనులారా చూస్తూకూడా అజ్ఞుడు యింతైనా పట్టించుకోడు. ఏడాది క్రితం చనిపోయారు నిన్నా మొన్నా కూడా మరనించారు అలా దహనం అయినవారు తనకంటె తక్కువ్వాళ్ళూ కారుగదా!

**దీపంబు లేని యింటను**
**రూపంబుల దెలియలేరు రూఢిగ తమలో**
**దీపమగు తెలివి గలిగియు,**
**పాపంబుల మరుగుత్రోవ బడుదురు వేమ ! 167**

**తా॥** చీకటింట్లో స్పష్టంగా ఆకారాల్ని తెలుసుకోలేరు. దీపం లాంటి తెలివి ఉన్నా పాపపు త్రోవలకే ఎగపడుతూంటారు ప్రజలు.

**ఏరు దాటి మెట్టకేగిన పురుషుండు.**
**పుట్టి సరకు గొనకు పోయినట్లు**
**యోగపురుషుడేల యొడలు బాటించురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 168**

**తా॥** నావ సాయంతో మనుష్యుడు నదిని దాటుతాడు అనంతరం ఆ నావ సంగతే పట్టించుకోడు. అలాగే ఆత్మ విషయాలపై మోజు కలిగిన యోగి శరీర విషయాలను లెక్కచెయ్యడు !

**మంటి కుండ వంటి మాయ శరీరంబు**
**చచ్చు నెన్నడైన జావదాత్మ !**
**ఘటము లెన్నియైన గగనంబె యొక్కటే**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 169**

**తా॥** శరీరం మట్టికుండలాంటిది. ఇది చిరకాలం మన్నేదికాదు. ఏనాడైనా చనిపోయేదే. చావనిది ఆత్మ మాత్రమే. కుండలు ఉండచ్చు పోవచ్చు; కాని ఆకాశం మాత్రమే నిలిచి ఉంటుంది.

**మాయను చెరసాల మనసను గొలుసౌను**
**భేదమనెడు బొండ బెరసి యుండు;**
**యిట్టి బద్ధజీవి కెన్నడు మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 170**

**తా॥** మాయ అనేదే జైలు. మనస్సు అనేది సంకెళ్ళు; భేదభావం అనేది ఒక బండ అయి ఉండగా అలా బంధనాల్లో చిక్కుకుని ఉన్న ప్రాణికి ముక్తి అనేది యెలా సాధ్యం ?

**ఎరుక కన్నము సుఖ యేలోకమున లేదు,**
**యెరుక నెరగ నెవని కెరుక లేదు;**
**యెరుక సాటి యెరుక యెరుకయే తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 171**

**తా॥** తెలివిని మించిన సుఖం యీ లోకంలో యింకేదీ లేదు. తెలివిని తెలిసికోవడం తెలివికి సాటి తెలివే. తెలివే తత్త్వం.

**కనియుండి కాన లేరట**
**వినియుండియు వినగలేరు విస్మయమేమో**
**కనుగుడ్డియు విని చెవుడం**
**చనునది నిజమయ్యె జగము నందున వేమ ! 172**

**తా॥** చూస్తూ ఉండి చూడలేరు, వింటూండి వినలేరు, ఇది ఆశ్చర్యకరమైన విషయం. చూస్తూ చూడలేదని వింటూ వినలేదని అంటూన్న యప్పట్టు వాస్తవాలౌతున్నాయి.

**ఊరకుంట దెలియ నుత్తమ యోగంబు**
**మానసంబు కలిమి మధ్యమంబు**
**నాసనాది విదులునథమ యోగంబురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ! 173**

**తా॥** ఏటినీ పట్టించుకోకుండా ఉండడం నిజంగా ఉత్తమయోగం. మానసికంగా తెలుసుకొని ఉండడం మధ్యమ యోగము. అన్ని విషయాలూ తెలుసుకోడం అన్నది అధమయోగం.

**మనసు బూని గెల్చి మనసులో సుఖియించి**
**కడకు మోక్ష పదము గనును వాడు**
**చెట్టు బెట్ట ఫలము చేకూర కుండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 174**

**తా॥** సాధన చేస్తూంటే మనస్సులో సుఖం లభిస్తుంది. చివరికి ఆ మోక్షపదాన్ని కూడా పొందుతారు. ఓ చెట్టును పెంచితే అది మెల్లిగా పెరిగి ఫలాన్ని యీయకుండా ఉండదు కదా!

**మాట లాడవచ్చు మనసు నిల్పగరాదు**
**తెలుపవచ్చు దన్ను దెలియరాదు**
**సురియ బట్టవచ్చు శూరుడు గారాదు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 175**

**తా॥** ఎన్నో మాటలాడవచ్చు. కాని గొప్పవాడు కాడు తనను గురించి ఏవిటో తెలియదు,న కత్తి పట్టినంతలోనే శూరుడవుతాడా? ఏదైనా చేసి చూపాలి.

**చూపు వెలయ జేసి సూక్ష్మంపు ప్రత్తిచే**
**పాపమనెడు తిమిర మేపార బాపని**
**చిత్తమనెడు దివ్వెచెన్ను పరచి**
**పాపజాతి గురుడు పశువు వేమ ! 176**

**తా॥** సూక్ష్మమైన వత్తివంటి దృష్టిని వికసింపజేసి “చిత్తం” అనే దీపాన్ని చక్కగా వెలిగించి తనలో గల “పాపం” అనే చీకటిని పారద్రోలడానికి ప్రయత్నించని గురువు పాపజాతిలో సంభవించిన పశువువంటివాడు.

**గురువు చిల్లగింజ కుంభమీ దేహంబు**
**ఆత్మ కలుష పంక మడుగు బట్ట**
**తెలిసి విరచెనేని దివ్యామృతము తేరు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 177**

**తా॥** గురువు అనగా ఇండుపకాయగింజ వంటివాడు. ఈ శరీరం ఓ కుండ వంటిది. ఆత్మలోగల కలుషం అనే బురద నీటిని వడగట్టిన వాడు ముక్తి అనే అమృతం స్వచ్ఛమైనది తేటపడుతుంది.

**గురు శిష్యులనుగ కొమ్మలు**
**గురువును గానంగ వేరుగురువరుడెంతో**
**పరముడంచి యుండునిత్యము**
**ధరలోపల మనుజులెల్ల తలపరు వేమ ! 178**

**తా॥** వృక్షానికి ప్రధానమైనది మొదలు. దాని నాధారంగా చేసుకుని ఎన్నో కొమ్మలు పెరుగుతాయి. ఎంత శాఖోపశాఖలుగా పెరిగినా చెట్టుకి మొదలెలా ప్రధానం అవుతోందో అలాగే శిష్యులందరికీ గురువు ప్రధానుడు. సదుపదేశం కోసం గురువుని ఆశ్రయించాలి.

**గురుడనగా పరమాత్ముడు**
**పరగంగా శిష్యుడనంగ పటు జీవుడగున్;**
**గురు శిష్య జీవ సంపద**
**గురుతరముగ గూర్చు నతడు గురువగు వేమ ! 179**

**తా॥** గురువే పరమాత్మ. శిష్యుడు జీవి. ఈ గురు శిష్య సంబంధమే జీవాత్మ పరమాత్మ ఐక్యం. అదే మోక్షం. అది పొందడానికి గురువుని ఆశ్రయించాలి.

**లోకములకు గురువు లోకులకును గురువు**
**ఆదియు దెలసి మోక్షమందరోరి**
**గురిని గనక నరక కూపయము బొందిరి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 180**

**తా॥** "గు" అనగా చీకటి. "రు" అనగా దానిని పారద్రోలడం, రెండు కలపితే గురువు. లోకాలన్నింటికీ గురువు. లోకులందరికీ గురువు. ఆయన జ్ఞానదాత మహేశ్వరుడు, గురువుని ఆరాధించి మోక్షం పొందండి. ప్రజలారా గురువుని ఆరాధించక తప్పుడు దోవలు తొక్కి నరకాల పాలవుతూంటారు మానవాధములు. ప్రజలారా! అట్లు కాకండి.

**జీవిలోన నుండు స్థిరమును గానక**
**తిరుగు నస్థిరంబు వరుస నమ్మి**
**స్థిరము నస్థిరమును దెలియ జీవికి ముక్తి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 181**

**తా॥** జీవిలో ఉండే స్థిరమును (బ్రహ్మమును) తెలుసుకోలేక లేనిదాన్ని చూసి నమ్ముతాడు. అస్థిరాన్నుంచి స్థిరాన్ని తెలుసుకున్న వాడికే ముక్తి కలుగుతుంది.

**గతము జూతమంటె కలగన్న యర్థంబు**
**నడుచు కాలమేమి నమ్మరాదు**
**క్షణములోన బ్రతుకు సంసార విభ్రాంతి**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **182**

**తా॥** గతించిన కాలమంతా కలలాంటిది. ఇక ప్రస్తుత కాలాన్నీ నమ్మరాదు. భ్రాంతి మూలకమైన సంసారమంతా క్షణభంగురమయినది.

**తాననంగ నెవరు? తనవార లెవ్వరు?**
**తెలసి తెలియ లేరు తిక్క నరులు!**
**అరిది పిసిని కాయ పురుగు పద్ధతి గాగ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **183**

**తా॥** నరుడు సంసారాన్ని అంతా పెంచి చివరికి తానెవరు? తనవారెవరు? అన్న విషయం అర్థంకాక తిక్కెత్తి పోతున్నాడు. అంటే నాశనమౌతున్నాడు.

కాయలో పుట్టిన పురుగు అందులోనే పెరిగి పెద్దదై ఆఖరికి అందులోనే నావనమౌతుందవ కదా!

**భయము సుమీ యజ్ఞానము**
**భయ ముడిగిన నిశ్చయంబు పరమార్థంబౌ**
**లయము సుమీ యీ దేహము**
**జయము సుమీ జీవుడనుచు జాటర వేమ!** **184**

**తా॥** అజ్ఞానం భయంకరమైనది. అటువంటి భయంపోతే అప్పుడు నిశ్చయంగా పరమార్థం గోచరిస్తుంది. అప్పుడు దేహం నాశనం అవుతుంది. అప్పుడే సంసార సాగరంలోంచి బయటపడ్డ జీవి జయం పొందుతాడు.

**చచ్చె చచ్చె ననుచు చావుకు వగచెడు**
**దీన నరుల వెర్రి దెలుపరాదు**
**ప్రాణమునకు మృత్యుబంధంబు లుండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **185**

**తా॥** అజ్ఞానులైనవారు చచ్చిపోయిన వాళ్ళను గురించి "చచ్చె" "చచ్చె అంటూ దుఃఖిస్తూంటారు. వాళ్ళవెర్రి చాలా హాస్యాస్పదమైనది. ప్రాణానికీ మరణానికి సంబంధం లేదని వారికి తెలియదు.

**జనన మరణములకు నర్వి స్వతంత్రుడు గాడు**
**మొదల కరగాడు తుదనుగాడు**
**నడమ కర్తననుట నగుబాటు కాదకో**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **186**

**తా॥** జనన మరణాల్లో మనిషికి స్వతంత్రం లేదు. జనన మరణాల మధ్యలో "ఇది నేను" "ఇది నాది" అని దేవులాడ్డం చేతకానితనం. అదే అజ్ఞానం.

**బ్రహ్మమేడ దనుచు పలుమారు నాడేరు;**
**వెర్రి మూర్ఖ జనుల విధము జూడ;**
**బ్రహ్మమన్నిటందు పరిపూర్ణమై యుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 187**

**అవ:** ఈ పద్యంలో వేమన చేస్తున్న విమర్శనిబట్టి చూస్తే మూర్ఖ జనులనగా హేతువాదులని అనుకోవచ్చు.

**తా॥** "బ్రహ్మం" ఎక్కడుంది? అంటూ చాలా సార్లు ఆడిపోస్తూంటారు. వెర్రి మూర్ఖులు ఈ లోకమును అర్థం చేసుకుంటే అంతా నిండి కనబడుతుంది.

**పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ**
**పుష్పజాతి వేరు పూజ యొకటి;**
**దర్శనంబు వేరు దైవంబు యొక్కటి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 188**

**తా॥** ఆవులు ఎన్నిరంగుల్లో ఉన్నా వాటి పాలరంగుమాత్రం ఒకటే. ఎన్ని రకాల పూలతో ఆరాధించినా పూజ ఒకటే. అట్లే సాక్షాత్కరించే దైవం ఒకటే.

**పని తొడవులు వేరు బంగార మొక్కటి**
**పరగ ఘటలు వేరు ప్రాణ మొకటి**
**యరయ తిండు వేరు యాకలి యొక్కటి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 189**

**తా॥** రకరకాల పనులు వేరైనా బంగారం ఒకటే దేహాలు వేరైనా ప్రాణం ఒకటే. ఆలోచించగా తినే ఆహారపదార్థాలు వేరైనా అందరి ఆకలి ఒకటే.

**కానలేడు నుదురు కర్ణముల్ వీపును**
**నెరులు గానలేడు నెత్తిమీద,**
**తన్ను గానలేడు తత్త్వ మేమెరుగును?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 190**

**తా॥** తన ముఖమూ, చెవులూ, వీపూ, తలా,తలమీదనున్న రోమాలు మనిషి చూడలేడు. తనను తానే చూసుకోలేడు, అలాంటప్పుడు తనలో తత్త్వాన్ని ఎలా తెలుసుకోగలుగుతాడు?

**తిరిగి తిరిగి నరుడు మరలు కొనుటెగాక**
**నందువలన నేమి యానలేదు;**
**అంతరాత్మ నిల్పునతడె పో బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 191**

**తా॥** మనస్సు నిలపాలనీ ఎంత తిరిగినా మనస్సుకి నచ్చేది ఏమీలేదు. తన మనసును కట్టి ఆత్మను గురించి యోచించినప్పుడే బ్రహ్మ సాక్షాత్కరం కలుగుతుంది.

**చిత్తమనెడు వేరు శిథిల మైనప్పుడె**
**ప్రకృతి యనెడు చెట్టు పడును పిదప,**
**కోర్కెలనెడు పెద్ద కొమ్మలెండును గదా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 192**

**తా॥** చిత్తం అనే వేళ్ళు పోయినప్పుడు ప్రకృతి అనే చెట్టు పడిపోతుంది. కోరికలనే పెద్దపెద్ద కొమ్మలన్నీ యెండిపోతాయి.

**తిట్టి కొట్టి రేని తిరిగి మారాడాక**
**నూరకున్న జూడ నుర్వి మీద,**
**వాడగు పరమాత్మ వర్ణింప శక్యమా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 193**

**తా॥** తనను తిట్టినా కొట్టినా, తనను గురించి మనుచున్నా పట్టించుకోక నిశ్చలంగా పరమాత్మయందు దృష్టిని నిలిపినవాడే తత్త్వయోగి అగును.

**కల్మషంబు పోక కనుపించ దెందును,**
**రూపమెవ్వరికిని రూఢి తోడ;**
**తామసం బుడిగిన దగ గల్గు జ్ఞానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 194**

**తా॥** కల్మష మనస్సువారికి భగవంతుడు కానుపించాడు. మనస్సుకి తామసం తగ్గితే అప్పుడు జ్ఞానోదయం అవుతుంది.

**నీటిలోని వ్రాత నిలువక యున్నట్లు**
**పాటి జగతి లేదు పరము లేదు;**
**మాట మాట కెల్ల మనసు గోరుచునుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 195**

**తా॥** నీటిమీద వ్రాత యెలా నిలువదో అలాగే పరమూలేదు, ఇహమూలేదు.

**దొంగతెలివి చేత దొరుకునా మోక్షంబు?**
**చేతగాని పనులు జేయరాదు?**
**గురుడనంగ వలదు గుణహీనుడనవలె**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 196**

**తా॥** మోక్షం దొంగ తెలివి తేటలవల్ల లభ్యం అయేది కాదు. లోకాన్ని వంచించే పనులు చెయ్యటం మంచిది కాదు. ఇటువంటి పనులు చేసేవాణ్ణి గురువు అని పిలవడం కంటే గురుహీనుడనడం మంచిది.

**ఆశలదెగ గోసి యనలంబు చల్లార్చి**
**గోచి బిగియబెట్టి కోపమడచి;**
**గుట్టుమీరువాడు గురువుకు గురువురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **197**

**తా॥** ఆశాపాశలత లన్నింటినీ పూర్తిగా విసర్జించి ఆశలన్నీ విడిచి, కోపం విడిచి, మానాభిమానాలు లెక్కచేయక గోచీ పెట్టుకుని జీవించువాడు గురువులకు గురువు.

**ఆశలనెడు త్రాళ్ళ నమర గోయగ జేసి**
**పారవైన గాని పరము లేదు**
**కొక్కుతిండి నక్కచిక్కి చచ్చిన యట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **198**

**తా॥** ఆశలను త్రాణ్ణి కోసేసి, దూరంగా వర్జించిన తరువాతే పరం సంగతి. మనిషి ఆశలనే బోనులో చిక్కి పందికొక్కు తిండిమీద ఉన్న కోరికతో వెళ్ళి బోనులో చిక్కుకుని చచ్చిన విధంగా నాశనం అవుతున్నాడు.

**చెవులు గోరును మంచి జిలిబిలిపాటల,**
**తియ్యని మాటల తెరగు వినగ**
**చర్మము గోరును నరవి తోడుత శీత**
**మృదుల సంస్పర్శ సంపదల నెపుడు**
**కన్నులు గోరును కమనీయ వర్ణంబు**
**లైనట్టి రూపంబుల నువు తోడ**
**నాలుక గోరును నయము తోడుత తీపి**
**యొగురు కారమ్ము చేదుప్పు పులుసు,**
**ముక్కు గోరును సద్గంధములను జెలగి,**
**చెవులు చర్మంబు కన్నులు జిహ్వ ముక్కు,**
**నిన్నియును గూడినటువంటి యిల్లు రోసి**
**తన్ను గనుగొని సుఖియింప దగును వేమ !** **199**

**తా॥** మంచి సంగీతాన్ని వినాలని చెవులు కోరుతాయి. చర్మానికి కావలసినవి చక్కని మెత్తనైన స్పర్శసుఖాలు ఇంకా చల్లనైన అంగసుఖాలూను; హృదయాహ్లాద కరమైన వర్ణ రూపాలని కన్నులు చూడగోరుతాయి; జిహ్వ కోరుకునేవి తీపి, వగరు,కారం,చేదూ,ఉప్పూ, పులుపూనూ, నాసిక కోరేది సువాసలనలని శరీరం అనగా చెవులు, చర్మము,కన్నులు, నాలుకా, ముక్కూ వీటితో కూడిన యిల్లు ఇటువంటి దాన్ని అసహ్యపడి ఆత్మపదార్థాన్ని తెలుసుకుని నిత్యానంద స్వరూప యెరిగి సుఖించాలి, అదీ సుఖం.

**ఎన్నగ మనసే కారణ**
**మన్నిటికిని చూడ జూడ నాత్మడు తానౌ**
**యున్నంత కాలమెచ్చట**
**నున్నను యిది నిజము తెలియ నొప్పుగ వేమ ! 200**

**తా॥** అన్ని బంధనాలకీ చిక్కులకీ మనసే కారణం అవుతోంది. ఆత్మ వికాసం చెందితే ఏ విధమైన మానసిక సంక్షోభాలూ లేకుంటుంది. ఎక్కడ ఎలా ఉన్నా యిది నిజం.

**సర్వము దానని తెలిసిన**
**నిర్వాణికి గాక ముక్తి నిలుపగ వశమా?**
**యుర్వెల్ల దాను తిరిగిన**
**పర్వత బిల జలధులందు బడినను వేమ ! 201**

**తా॥** "నేనే సర్వం; సర్వశ్వమూ నేనే" అని ఎవడైతే తెలిసి యింద్రియ సుఖాల్నుంచి విరమించుకున్న విరాగికి కాక కొండలెక్కినా బిలాల్లో ప్రవేశించినా సముద్రాల్లోకి వెళ్ళినా మొత్తం భూమంతనీ చుట్టి వచ్చినా ముక్తి మరెవ్వరికి లభించదు.

**చదువులు జదివే టయ్యలు**
**పదవిని బొందంగ లేరు; పరమార్థముగా**
**పెదవులు గదలప కుండిన**
**మదిలోనిది రాజయోగ మహిమము వేమ ! 202**

**తా॥** అయ్యలు ఎన్నో చదువులు చదివి నోటినిండా మాటలు గుప్పించినా బ్రహ్మవేత్త పదవిని పొందజాలరు. పెదవులు కదల్చక పోయినా రాజయోగ మహిమము అబ్బాలంటే అది ఆత్మలోంచి పుట్టుకురావాలి.

**తలపగ మూలదుంప పర**
**తత్వముదెల్పగ వల్లగాదు; లో**
**బలిమిని యాత్మ గుట్టు మది**
**భావన నెంచగ బ్రహ్మకల్పమున్**
**కలుగును ముక్తి జీవులకు**
**కావుననాత్మ నిధాన దృశ్యమీ**
**నలలిత శక్తి రూపమని**
**సన్నుతి వేమన జేసె కల్పమున్ 203**

**తా॥** మూల తత్త్వాన్ని తెల్పడం అంత తేలిక పని కాదు. ఎంతో కాలం ఆత్మ తత్త్వమును కూలంకషంగా తెలుసుకున్నప్పుడే ముక్తి కలుగుతుంది. కాబట్టే అదే రీతిలో మనోహరంగా భావించి ఆ దృశ్యాన్ని దర్శించి వేమన కృతార్థుడయ్యాడు.

**ఆకు చాటునుండు నన్ని లోకంబులు**
**కొమ్మ గానరాదు బహ్మకైన**
**కొమ్మ గానబడిన కొనియాడ వచ్చురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 204**

**తా॥** ఆకుచాటుగానే అన్ని లోకాలూ ఉంటున్నాయి. ఆకులున్న కొమ్మని బ్రహ్మదేవుడు కూడా చూడలేడు. నిజంగా ఆ కొమ్మే కనబడితే అది ఎంతో శ్లాఘనీయం.

**పిలిచిన బల్కకుండు మరి పిల్చిన**
**వేకనకూరకుండుతన్**
**దలచిన యెవ్వ రేమనిన**
**దన్నును గాదని నవ్వుచుండు నా**
**త్మల దలపోయుచుండు పర**
**తత్త్వము నిత్యము దానయై సదా**
**తెలిసిన యోగి వేమన గతిన్**
**శివరూపుడు నెల్ల తావులన్ 205**

**తా॥** అద్వైత సిద్ధి పొందిన ఒక మహాయోగి పిలిచినా పలకడు. మళ్ళా మళ్ళా పిల్చినా ఎంత మాత్రం తనను కానట్టే ఉంటాడు. ఎవరైనా తలచినా ఏమేనా అన్నా తనను కానట్టే నవ్వి ఊరుకుంటాడు. ఇంకా ఆ యోగి పుంగవుడు ఆత్మ పరతత్త్వమును సర్వదా వేమనలా శివ స్వరూపుడై సర్వం తెలిసిన వాడై సర్వం తానే అయి ఉంటాడు.

**ఒక్కడు రోగి యాయె; మరి**
**యొక్కడు దిక్కుల ద్యాగి యాయె; వే**
**రొక్కడు భోగి యాయె; నటు**
**యొక్కడు చక్కని యోగి యాయె; దా**
**నొక్కడు రాగి యాయె; నిను**
**బోలు మహాత్ముని గాన మెచ్చుటన్**
**నిక్కము యిన్ని రూపములు**
**నీకును జెల్లును యన్న వేమనా. 206**

**తా॥** ఒకడు రోగి; ఒకడు దిగంత విశ్రాంత త్యాగి. ఒకడు భోగి, అలాగే మరొక్కడు చక్కని యోగి కావచ్చు. ఇంకొకడు రాగి (రక్తుడు) ఔతుంటాడు. కాని వేమనలాంటి మానవోత్తముడు ఈ లోకంలో అన్ని సద్రూపాల్లోనూ గోచరిస్తాడు. అలాంటి ఘనత అతనికే చెల్లింది.

**విషయముల దెరలి పొలుపుగ**
**విషయము లంటక మహాత్మ విధమున ధరలో**

**విష సంసారము లనియును**
**విషయము లన్నియును గెల్వ వేమన నేర్చున్! 207**

**తా॥** ఇంద్రియ సుఖాల్ని చక్కగా పొందుతూ వాటిదానికి లోనుకాకుండా ఒక నిజమైన మహాత్ముడిగా విష సంసారంలో దూకకుండా ఇంద్రియ నిగ్రహం చూపినవాడు వేమన.

**కాదని యెవ్వరితోడను**
**వాదాడవక తిరుగుచుండు వానింబలెనే**
**భేదాభేధము లడచిన**
**వేదాంత రహస్యమెల్ల వేమన నేర్చెన్! 208**

**తా॥** ఎవ్వరితోనూ వాదోపవాదాలకు దిగక "ఇది నాది", ఇది నీది" అను భేదభావాలను విడిచి, వేదాంత తత్త్వమును చక్కగా వేమన అకళించుకొన్నాడు.

**దాన మమర జేసి దరిజేరు నొకవంక**
**మనసు నమ్మెనేని మాయ గల్గు**
**జ్ఞాన కళిక నమ్మి జంపును వైరుల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 209**

**తా॥** మనస్సు చేసే మాయలకు లొంగక త్యాగం చేసి సర్వస్వాన్నీ జ్ఞాన దీపాన్ని నమ్మితే శత్రువుల్లాంటి యింద్రియాలను జయించి ముక్తి పొందగలడు.

**ఇందు నెరుకవాని కిహ పరములు లేవు**
**ప్రాణహానిలేదు ప్రళయమునకు**
**ప్రళయ కాలమైన పరమాత్మ గలయరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 210**

**తా॥** ఈ లోకానికి సంబంధించిన తెలివి ఎంత ఉన్నా అది సరిపడనిదే. ఇటువంటి తెలివి ఇహ పరాలకి ఉపయోగించేది కాదు. ప్రళయానికి ప్రాణహాని అంటూ ఉండదు. ప్రళయ కాలానికైనా పరమాత్మ జ్ఞానం పొంది ముక్తుడవగుము.

**దేవుడనగ వేరె దేశమందున్నాడె ?**
**దేహి తోడ నెపుడు దేహమందె**
**వాహనముల నెక్కి పడి దోలుచున్నాడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 211**

**తా॥** దేవడనే వాడు యింకో దేశమందు లేడు. దేహం ఏర్పడగానే దేవుడందుండి చోదకుడు వాహనాన్ని నడిపిన విధంగా దేహాన్ని (మరణం దాకా) నడుపుతుంటాడు.

**సొమ్ము దొరుకు దనుక జ్యోతి యంతియె కాక**
**సొమ్ము దొరుకు వెనుక జ్యోతి యేల?**

**దేవుడైన వెనుక దేహంబు యది యేల?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 212**

**తా॥** చీకటిలో ఉన్న సరుకుని వెతకడానికి జ్యోతి అవసరం అవుతోంది. సరుకు దొరికిన తర్వాత యిక జ్యోతితో పనేం ఉంటుంది. అలాగే దేవుడైన వాడికి దేహంతో పనినే ఉండదు.

**గురు చరణము బట్ట కుక్కలు గరుచునా?**
**గురు చరణము విడువ కుక్క గరుచు**
**కుక్కకున్న గుణము గురునకు లేదురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 213**

**తా॥** గురువు పాదాలకి మ్రొక్కేవాణ్ణి కుక్కలు కరవవు. గురువు పాదాలతో లెక్కలేదని విర్రవీగేవాణ్ణి కుక్కలు కరుస్తాయి. వాసనలను యెరిగిన కుక్కకున్న విశేష గుణం గురువుకి లేకపోవడం శోచనీయం.

**ఆత్మబుద్ధి వలన నఖిలంబు తానయ్యె**
**జీవబుద్ధి వలన జీవుడయ్యె**
**మోహబుద్ధి లయము ముందర గనుగొను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 214**

**తా॥** ఆత్మబుద్ధి గలవాడే సమస్తమునూ తానుగానే భావిస్తున్నాడు. జీవబుద్ధి వల్ల జీవుడౌతున్నాడు. ఇదంతా విడిచి స్త్రీ వ్యామోహానికి ప్రాముఖ్యం యిచ్చినవాడు అజ్ఞానిగా ఉంటున్నాడు.

**ఈ దేహ మెన్ని భంగుల**
**బ్రోదియు నొనరించ నేల పోవుట కాదే**
**మీదెరిగి మురికి గడుగుచు**
**భేదంబులు మాన ముక్తి బెరయుర వేమ ! 215**

**తా॥** శరీరాన్ని ఎలా పోషించినా మట్టిలో కలిసిపోయేదే. పరమాత్ముని తలుస్తూ భేదబుద్ధిని వర్జించి హృదయమును పవిత్రం చేస్తేనే ముక్తి లభిస్తుంది.

**పిల్లియెలుక బట్ట ప్రియమున నుండక**
**నదియ కోడి బట్ట ననుగమించు**
**మమత విడువకున్న మానునా మోహంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 216**

**తా॥** పిల్లి ఎలుకను పట్టుకొని దానితో తృప్తి చెందక కోడి కనపడితే దాన్ని పట్టుకోవడానికి ప్రవర్తిస్తుంది. మనిషి ముందు విడవవలసింది మమకారం. అది పోతే గాని మోహం తగ్గదు.

**ఏకబ్రహ్మము నిత్యము**
**వైకల్పికమైన యట్టి వస్తువు లెల్లన్**
**యేకత్వంబని యెరిగిన**
**శోకములే కల్ల ముక్తి సులభము వేమ ! 217**

**తా॥** "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అని తెలుసుకుంటే శోకం ఉండదు సరికదా ముక్తి కూడా లభిస్తుంది.

**మరి యుదధిని ఘృతము మానులం దనలంబు**
**చారు సుమము లందు సౌరభంబు**
**తిలల తైలమట్ల తేజరిల్లు జిదాత్మ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 219**

**తా॥** సముద్రమందు అమృతం, చెట్లలో అగ్ని, పూలయందు సువాసనలూ, నువ్వుల్లో నూనెలాగే లోకంలో బ్రహ్మం భాసిస్తోంది.

**తరువ తరువ బుట్టు తరువున ననలంబు**
**తరువ తరువ బుట్టు దధిని ఘృతము**
**తలప తలప బుట్టు తనువున తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 220**

**తా॥** తరచగా తరచగా పుడుతోంది చెట్లనుంచి నిప్పు. చిలకగా చిలకగా పెరుగు నుంచి నెయ్యి వస్తుంది. తలచగా తలచగా తన శరీరంలోనే కనబడుతోంది తత్త్వం.

**జీవుని దెలసిన దనుకను**
**దేవుని భ్రమ బొదలు నరుడు; దేవుడు దలపన్**
**జీవుండని వివరించిన**
**భావింపగ ముక్తి బట్టబయలుర వేమ ! 221**

**తా॥** జీవుడు తానెవరో తెలిసికున్నట్లయిన అనంతరం దేవుని మనుష్యుడు సాక్షాత్తు దేవుడవుతున్నాడు. జీవుడే దేవుడు. దేవుడే జీవుడు అన్న భావం కలిగిన నాడు ముక్తి అనేది వేరేలేదు.

**ఇంతకాలముండి యెరుక మాలిన జీవి**
**చచ్చి పుట్టు చుండు సహజ మనుచు**
**యెరుక మరచు చోటు నెరుగుట బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 222**

**తా॥** ఎంతకాలంగా బ్రతుకుచున్నా చావు పుట్టుకలను పట్టించుకోకుండా జీవిస్తాడు. ఎప్పుడైతే ఈ విషయాన్ని తెలుసుకోగలుగుతాడో అట్టివాడు "బ్రహ్మాస్మి" అనే అనుభూతిని పొంది ముక్తుడౌతున్నాడు.

ద్రూను లోన నగ్ని మరి యుండగావచ్చు
నగ్ని నుండ ద్రూను కలవిగాదు
ద్రూనులోని యగ్ని మర్యాద సంసారి
విశ్వదాభిరామ వినుర వేమ ! **223**

**తా॥** అగ్ని వృక్షంలో అగ్ని ఉండచ్చుగాని అగ్నిలో వృక్షం ఉండడం మంచిది కాదు. కనుక సంసారి అనగా వృక్షంలో అగ్నిలాంటివాడు.

మేఘ మడ్డమైన మిహిరుని జెరుచును
చిత్త మడ్డమైన స్థిరము జెరుచు
మరపు లడ్డమైన మరి ముక్తి జెరుచును
విశ్వదాభిరామ వినుర వేమ ! **224**

**తా॥** మేఘం అడ్డం రావడం వల్ల ఏకాగ్రత చెడుతోంది. ఏకాగ్రత చెడిన కారణంగా మరుపు ఏర్పడుతోంది. అది ముక్తిని చెరుస్తోంది.

దోస ముల్లు వంటి తుర్యమం దాత్మలు
జూచి యానల నటు గోసివేసి
వాసనను దెలసిన వాడె పో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినుర వేమ ! **225**

**తా॥** ఈ లోకంలో మిక్కిలి చిన్నదైన దోసముల్లు లాంటి ఆత్మను దర్శించి ఆశలన్నింటినీ నశింప జేసుకొని ఆధ్యాత్మికమైన జాడలను తెలుసుకున్నవాడే బ్రహ్మవేత్త.

వెదకి కానలేడు వేదాంత వేద్యుని
తత్త్వవేత్త లేడు ధరణిలోన
కలిగె నేని యతడు కనబోడు మరి వేరె
విశ్వదాభిరామ వినుర వేమ ! **226**

**తా॥** అజ్ఞానంతో నున్నవాడు ఆత్మను కనుక్కోలేడు. వేదాంత మార్గం అవలంభించిన తత్త్వవేత్త బ్రహ్మను తప్ప వేరుగా దేనినీ చూడలేడు.

విషయముల బొరలి రోయక
విషమంటిన గతిని జూచు విధమున ధరలో
విషసమ మాయాసుఖముల
విషయములన్ గూడకుండ్రు వేత్తలు వేమ ! **227**

**తా॥** ఈ లోకంలో విషయ సుఖాలకోసం ప్రాకులాడటం మంచిపని కాదు. ఇంద్రియ సుఖాలను విషం అంటుకున్న వాటివలె చూస్తూ వాటి జోలికి పోకుండా ఉంటారు బ్రహ్మవేత్తలు.

**వాక్కు యందు గుర్వు వాక్తత్వమును గుర్వు**
**చీకటిలో గుర్వు చిక్కియుండు**
**నఖిలమునకు గురువు యాధారమై యుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 228**

**తా॥** మాటలు నేర్పడానికి గురువు, వారత్త్వాన్ని అభ్యసించడానికి చీకటి లాంటి అజ్ఞానమును పోగొట్టడానికి సమస్త లోకాలకీ గురువే ఆధార భూతుడగుచున్నాడు.

**కర్మాఽకర్మము లొక్కటి**
**కర్మ వినోదునకు దత్త్వ ఘనునకు దెలియన్**
**ధర్మాఽధర్మము లేర్పడ**
**నిర్మల మతి దెలుప వలయు నిజముగ వేమా! 229**

**తా॥** కర్మ వినోదులు కర్మలు చేయడం మంచిదంటారు. అకర్మ మంచి దంటాడు. ఈ రెండింటిలోనూ ఏది అధర్మమో తేల్చాలంటే నిశ్చల మతితో ఆలోచిస్తే తెలుస్తుంది.

**ఈషణ త్రయంబు నెడపండ నేరక**
**మోహ రాసి లోన మునిగి యుండు**
**జనుల కెట్లు మోక్ష సౌఖ్యంబు గలుగురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 230**

**తా॥** ధనేషణ, ధారేషణ మరియు పుత్రేషణ అనే ఈ షణ త్రయాన్ని విడువక సర్వదా స్త్రీ లోలురై ఉండే మానవులకి మోక్షం సౌఖ్యం ఎలా తెలుస్తుంది?

**ఎరుకుమాలు జీవి యెంత కాలంబుండి**
**చచ్చి పుట్టుచుండు సహజముగను**
**యెరుక మరచుచోటు నెరుగుట బ్రహ్మంబువి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 231**

**తా॥** కొందరు అజ్ఞానులై పుట్టుచావులను కాల ప్రవాహంలో ఛస్తూ పుడుతూంటారు. అది వారికి సహజం. వారా అజ్ఞానంలోంచి బయటపడిన నాడే బ్రహ్మాన్ని చూడగలుగుతారు.

**సద్గురుకృప జ్ఞానంబున**
**సద్గతి దీపింపుచున్న చాలా చదువుల్**
**సద్గతి గలుగగ జేయును**
**సద్గురువే దైవమనుచు జాటర వేమ ! 232**

**తా॥** వేదాంత తత్త్వాన్ని విపులంగా చెప్పడానికి లోకంలో ఎన్నో మంచి శాస్త్రాలున్నాయి. అవన్నీ తెలియాలంటే మంచి గురు కటాక్షం వల్ల లభ్యమవుతోంది. కనుక మంచి గురువు దైవం లాంటివాడు.

సిగ్గు విడువకున్న శివసౌఖ్యమును లేదు
తగ్గి మొగ్గకున్న సిగ్గు విడదు
సిగ్గు విడుచునాడు చిరకాల జీవిరా
విశ్వదాభిరామ వినుర వేమ ! **233**

**తా॥** సిగ్గు కూడా అజ్ఞానమే. అటువంటి సిగ్గు విడిచినవాడే శివసౌఖ్యాన్ని పొందగలుగుతున్నాడు. అలాంటివాడు చాలా కాలం జీవిస్తున్నాడు.

అమ్మ సుమీ యాలనగా
నమ్మనగా నాలు సుమ్మి యా యిద్దరినిన్
ఇమ్మహిలో పరమాత్ముని
నెమ్మదిలో తెలియ దానె నేర్పరి వేమ ! **234**

**తా॥** సంసారంలో సంబంధాలు విచిత్రంగా ఏర్పడుతూంటాయి. స్త్రీ ఒకనికి అమ్మ, ఇంకొకనికి ఆలుగా, ఆలు అయి అమ్మ అవుతోంది. పరమాత్మ దృష్టిలో ఈ సంబంధాలు నిరాధారాలు నిరర్థకాలు అవుతున్నాయి. వాస్తవం ఆ పరమాత్మునికే ఎరుక.

ఆశ విడక కాని పాశ ముక్తుడు గాడు
ముక్తుడైన గాని మునియు గాడు
మునికి గాని సర్వ మోహంబు లూడవు
విశ్వదాభిరామ వినుర వేమ ! **235**

**తా॥** ఆశలు విడిచినవాడే బంధాలనుంచి విడువబడు తున్నాడు. అతడే ముక్తుడవుతున్నాడు. అనంతరం మునిగా మారి అన్నిరకాల మోహాలనుంచీ బయటపడుతున్నాడు.

ఆత్మలోని నాదు మాలించి యాలించి
యాశలందు జిక్క దాదియోగి
యాత్మలోని కళల నంటిన తత్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ ! **236**

**తా॥** ఆత్మలోంచి వచ్చి ఓంకారనాదం వింటూన్న మహాయోగి తత్త్వనాద మందు లీనమై ఉంటున్నాడు.

మానసంబు మంచి మల్లెసాల చవికె
భావి తోట జేసి బారుగూడి
భోగి నయ్యెద ననబోయె బోకాలంబు
విశ్వదాభిరామ వినుర వేమ ! **237**

**తా॥** యువకభోగికి తోటలోగల బావి ప్రక్కన మల్లిపందిరి కింద ఓ తరుణితో సరదాగా ఉండాలనీ, అలాంటి తలంపులతో కాలం గడచిపోతూంటుంది. తలపులతో కాక ప్రయత్నాలతో పాటుపడితేనే ముక్తి లభిస్తుంది.

**సొమ్ము లున్నచోట శోధింప గలుగును**
**సొమ్ము లేనిచోట శోధయేల ?**
**నంజనంబు లేక నా సొమ్ము తెలియదో**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **238**

**తా॥** భూమిలో ఏ సొమ్ములున్నాయో తెలుసుకోడానికి వెదకవలసి యుండును. విలువయిన సొమ్ములు లేనీచోట వెదకడం వృథా, కాటుకతో విలువైన సొమ్ముల ఉనికిని తెలుసుకోగలుగుతున్నాడు. అలాగే తత్త్వ జ్ఞానంతో తెలుసుకుని ఆనందింపవచ్చును.

**నిజము యేల నెరిగి నిత్యుండు గాడాయె?**
**పలుకులోని బిందు పదిలపరచి**
**వేడుకైన బిందు వెదబెట్ట కుందురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **239**

**తా॥** నిజాన్ని తెలుసుకుని నిత్యుడు కావడం మంచిది మాటలలోని మధురిమను భద్రపరచుకుంటూ శాశ్వత పదార్థబోధకవాక్యాలను మనస్సులో నింపుకుని ఉండడం శ్రేష్ఠం కదా!

**అగ్ని శిఖల యందు నమరంగ మమకార**
**మభవు మీద ధ్యాస మలర నునిచి**
**యాహుతియగు వెనుక హరున కర్పితమౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **240**

**తా॥** ఈశ్వరుని మీద మనస్సును నిలిపి నిలకడగా ఉంచి సుజ్ఞానం అనే అగ్నిలో మమకారాన్ని హోమంచేస్తే అది ఈశ్వతార్పణం అవుతుంది.

**మాకున ననలము బుట్టును**
**మా కెరుగునె ననల మునికి? మనుజులలోనన్**
**మాకున ననలము క్రియ జీ**
**కా కుడిగిన యోగి నెవరు గానరు వేమ !** **241**

**తా॥** చెట్లలోంచి పుడుతోంది నిప్పు. అలాగని అగ్ని నుంచితే చెట్టు పెరుగదు. చెట్టు అగ్నిహోత్రంలా యోగి చీకాకులు విడిచినవాడు అతన్ని లోకం నిజమైన యోగిగా గుర్తిస్తుంది.

**అండములో నాకాశం**
**బుండంగా చూడ జూడ నొనరగ తీపై**
**యుండును యన్నియు దెలసిన**
**మెండుగ నెటు జూచి చన్న మేలగు వేమ !** **242**

**తా॥** గ్రుడ్డులో ఆకాశం ఉంటుంది. దాన్ని ఉపయోగించగా ఉపయోగించగా అదే తీపిగా ఉంటుంది. అలానే అన్ని తెలుసుకున్న తరువాత అందులో మంచి తోవనుబట్టి సాగితే అదే మేలు.

**బమ్మగుడ్డు యనెడు పట్నంబు లోపల**
**బమ్మ నెరుగలేని బాపడేల ?**
**తన మనంబు దెలియ దానె పో బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 243**

**తా॥** బ్రహ్మాండం అనే పట్టణంలో ఉన్న బ్రాహ్మణుడికి బ్రహ్మాన్ని గురించి తెలియకపోతే అతడు యింక బ్రాహ్మణుడేమిటి? తనను తాను తెలుసుకోవడమే బ్రహ్మ.

**గురువు చెప్పు విద్య గురునకు దెలుయును;**
**గురువు చెప్పువిద్య గురువు యెరుగు;**
**గురువు మహిమ పరమ గురునకు దెలియును**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 244**

**తా॥** గురువు బోధించే చదువు గురువుకి తెలుసును, అటువంటి గురువు యొక్క గొప్పతనం పరమశివునకు తెలుసు.

**మనసులోనె తెలసి మనసు లోనె కలసి**
**మనసు లోని వాని మరల దిగిచి**
**మనసు నిల్పువాడు మర్మజ్ఞుడగు యోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 245**

**తా॥** మనస్సు చరించే గతులను తెలుసుకుని మనస్సును తెలిసి అప్పుడు మనస్సులో కలిగే ఆశలను దిగమింగుకుని మనస్సున ఏకాగ్రతను సాధించినవాడే మర్మజ్ఞుడైన యోగి అవుతున్నాడు.

**తానె తత్త్వమనుచు దన్నెరుంగగ లేక**
**మాయ మనుచు మరుగుచుండు**
**ధర్మకర్మములను తగరోయ తత్త్వమౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 246**

**తా॥** తత్త్వమును తెలుసుకోడానికి కష్టపడలేక తత్త్వం అన్నదో మాయ అని తప్పించుకుంటుంటాడు. మంచి మనస్సుతో ధర్మకర్మలాచరించి చివరికి యదార్థం తెలుసుకుని వాటిని విడవడమే తత్త్వం.

**నిరతం బెడతెగకుండన్**
**బరిపూర్ణ బ్రహ్మ మాత్మ పదమున నుంచవ్**
**నిరవద్యమైన పదవిని**
**జరియించును జగ మెరుంగ సత్యము వేమ ! 247**

**తా॥** మానవుడు పరిపూర్ణంగా బ్రహ్మ పదార్థాన్ని తెలుసుకునే దాన్నే మననం చేసేవాడు సర్వదా లోకం దృష్టిలో ఉత్తమ మానవుడుగా ప్రసిద్ధి కెక్కుచున్నాడు. అదే ఉత్తమ పదమును పొందుచున్నాడు.

**తరుచు చీకటి విడి తరితోడ దను మర్చి**
**పరమ నందు మనసు బదిల పరచి**
**గరిమ నున్న యెట్టి ఘనుడెందు తేడురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 248**

**తా॥** ఎప్పుడూ సర్వదా మనస్సును బ్రహ్మమందు విలీనం చేసి దృఢ చిత్తంతో ఉన్న మహానుభావుడు ఉండడం అరుదు.

**త్రాడు పాము యనుచు దా జూచి భయపడి**
**తెలిసి త్రాడటన్న తీరు భయము**
**భయము దీరినపుడె బ్రహ్మంబు నంటురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 249**

**తా॥** మనుజుడు తాడును చూసి పాము అని భయపడి అది త్రాడుగా తెలిసినచో భ్రాంతి తొలగి తరువాత సంసారము నుంచి విడివడి యోగి అవుతున్నాడు.

**చూచు వారికెల్ల జూడ వేరైయుండు**
**చూపు జూచి తెలియ జూచువారు**
**చూచి తాము చూపుచూపు తా మగుదురు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 250**

**తా॥** చూచేవారందరికీ వేరుగా గోచరించును. పరమాత్ముని చూడ్డానికి ప్రయత్నించి చూస్తారు వారు చూపుతారు. చూచేవారు కూడా మరల చూపగలిగిన వారౌతూంటారు.

**దేహియు జ్ఞానానలమున**
**దాహంబై దేహమెల్ల తల్లడ పడ నా**
**దేహములో పొర్లాడుచు**
**మోహ మడచి శివుని జూడ ముక్తిర వేమ ! 251**

**తా॥** జ్ఞానాగ్ని ఉడికిపోతూ ఒడలంతా తల్లడ పడుతూంటే ఆ దేహంలో సంచరిస్తూ స్త్రీ యందలి ఆసక్తి మొదలైన వ్యాకుల చింతల్ని విడనాడి ఈశ్వరుని దర్శిస్తే ముక్తి కలుగుతుంది.

**ధ్యాని వలెనె యుండు మౌని వలెనె యుండు**
**భోగి వలెనె యుండు రోగి వలెను**
**నకలము దసినదె సర్వజ్ఞుడై యుండు**
**పరమ యోగి వలెనె పరగ వేమ ! 252**

**తా॥** ధ్యానం చేస్తున్న వానిలాగా, మునీశ్వరుడిలాగా భోగాలనుభవించే వాడిలాగా, రోగి వాడిలాగా పరమేశ్వరుడిలాగా మొత్తంమీద సర్వం తెలిసిన మహేశ్వరుడే అగుచున్నాడు.

**ఉండడె సుఖశీలి యుండును కొన్నాళ్ళు**
**యుండి యుండి యుండి యుండలేక**
**నుండ వెరవు దెలసి గండు దొంగను బట్టి**
**చెండి చెండి తావు జేవ వేమ ! 253**

**తా॥** ఎన్నో సుఖాలనుభవించి, అనుభవించి ఇంకాలోకం పోకడలను ఆకళించుకుని అసలు గమ్యానికి మార్గం తెలుసుకుని ఆ దారిలో దొరికిన అజ్ఞాని అనే దొంగను పట్టుకుని వాణ్ణి శిక్షించి చివరికి గమ్యంచేరి సుఖిస్తారు.

**తను వనేటి యింట తన శత్రు మిత్రుల**
**దెలియ లేనివాని తెలివదేమి?**
**తెలిసిన మనుజుడు దివ్యామృతంబురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 254**

**తా॥** శరీరం అనే యింట్లో మిత్రులూ శత్రులూ యిద్దరూ ఉంటుండగా అందులో మిత్రుడెవరో తెలుసుకోలేని వాడు అజ్ఞాని. అలా తెలుసుకొన్నవాడు దివ్యామృత పానసుఖాన్ని అనుభవించగలవాడు.

**నది నుదకంబును జను క్రియ**
**మది నొదవెడు తత్త్వ బుద్ధి మగ్నత లెల్లన్**
**తుద పదవి గలయ ఘనుడగు**
**నుదధి బ్రవేసించు గంగ యొప్పున వేమ ! 255**

**తా॥** నదిలోని నున్న నీటివంటి తత్త్వబుద్ధి. గంగానది సముద్రంలో ప్రవేశించి ఒప్పారినట్లు మనుష్యుడు తత్వమును సాధించి శాంతచిత్తుడౌతున్నాడు.

**మనసు బారవిడచి మనసు దా మగుడించి**
**మనసు లోన గలుగు మర్మ మెరిగి**
**మనసు దాను నిల్ప మరియు దా బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 256**

**తా॥** విషయాలతో విచ్చల విడిగా ఉన్న మనసుని మళ్ళించి మనస్సును నిలకడగా ఉంచి తత్త్వవిచారణ చేయువాడు బ్రహ్మం అవుతున్నాడు.

**దేహాభిమాన ముండగ**
**మోహాదులు జనన వార్థి ముంచును కలగా**
**నీహారి విషయ భావన**
**కూహాదులు బోలు మేలుకొన్నను వేమ ! 257**

**తా॥** సాంసారిక వ్యామోహంలో ఉన్నంత కాలం జన్మమృత్యు ప్రవాహంలో తిరుగుతూంటాడు. తత్త్వవేత్త కాగానే ఆయనకి సంసారిక భావనలు ఊహారూపాల్లాగా స్వప్న ప్రాయంగా కనబడుతుంటాయి.

**మర్మమంత గొనక మనసు యేకము గాక**
**పరరహస్య మంత బైలపడదు**
**పడిన మాన మొన్న బైల బడిన రీతి.**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 258**

**తా॥** మనుజులలోని రహస్యాలను తెలుసుకోకుండా మనస్సు ఏకాగ్రతా లక్ష్యంలో ఉంచకుండా, తత్త్వ రహస్యం అంత సులువుగా బోధపడదు.

**ఈ తనువునకదు జూచిన**
**యే తనువుల కింతె యనుచు నెదురుం దన్ను**
**జాతుర గాలోజూపున**
**యాతురమున తపనులెల్ల నమరగ వేమ ! 259**

**తా॥** తన శరీరమందు ఏధర్మాలుంటాయో అవే ధర్మాలు యితర శరీరాల్లోనూ కనబడుతుంటాయని అంతర్దృష్టిలో వాస్తవాన్ని యోగులు గ్రహించి అంతటనూ బ్రహ్మపదార్థానే చూస్తూంటారు.

**గురువు పరమ గురుని గురుతుగా దెలియక**
**గురువు తాను నుండు గ్రుడ్డి రీతి**
**గురువునకు గురువైన గురువు ప్రాణేశుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 260**

**తా॥** మోసం గురువుల మోక్ష వచనాలు పలుకుతూంటారు. సద్గురువుని ఆశ్రయించి మోక్ష ధర్మాలను తెలుసుకోవాలి. మోక్షప్రదాత అయిన భగవంతుని కంటె మించిన గురువులేదు.

**నియమాది సంగుడై నిలచిన తత్త్వంబు**
**తామసం బగు నిద్ర దలగ జేయు;**
**నిద్ర తలంగిన నిర్భీతి నొందించు**
**శమమున నానంద సమితి పుట్టు;**
**నానందమున విశ్వమంతయు దా నగు**
**తాను విశ్వంబైన తత్త్వ మగును;**
**తత్త్వ మింద్రియ పంచకత్వంబునకు నిల్చు**
**తత్త్వంబు నిలచిన దానె యగును;**
**రాజయోగీంద్రు డాతడై తేజరిల్లు**
**వెలయ జగముల విహరించు విశ్రుతముగ**
**బాలుని విధంబునను,వృద్ధు పగది సోకు**
**కరణి వెంగలి క్రియ జూడ ఘనత వేమ ! 261**

**తా॥** నియమాదులతో నిద్రవంటి తమస్సును విడిచిన తత్వం అవగత మౌతుంది. అజ్ఞానం అనే నిద్రనుంచి బైటపడితే నిర్భయంగా ఉంటాడు. శాంతించిన బుద్ధిలో ఆనందోదయం అవుతుంది. ఆనందం తానుంటే లోకమందంతటనూ బ్రహ్మను చూస్తు తానే బ్రహ్మం అవుతున్నాడు. పంచేంద్రియాల తత్త్వం బోధపడితే తానే తత్త్వం అవుతున్నాడు. అటువంటి వాడు రాజర్షి. అతను లోకంలో ఒక్కొక్కసారి ఒకోవిధంగా అంటే బాలునిలాగా ముసలివానిలాగా పిచ్చివానిలాగా ఉంటూ లోకపూజ్యుడౌతున్నాడు.

**మనసున నెరుకను మరుపును**
**గని విని చూడంగ లేరు కదిసిన పిదపన్**
**పెనగొని పట్టేమంటే**
**మనుచోటను మాయ మాయ మహిలో వేమ ! 262**

**తా॥** మనసులో గల జ్ఞానాన్ని గాని అజ్ఞానాన్ని గాని చూడజాలరు మరియు వినజాలరు. అలా ఎవరైనా ప్రయత్నించి చూశాం విన్నాం అన్నట్లయితే అది కేవలం లోకంలో ఓ వంచన.

**మాయ నరక మనుచు మాయ రోయక సాటి**
**సమము గనరు దేవ సభల యందు**
**యందరు ఘనులైన హరునకు తావేది?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 263**

**తా॥** మాయంటే నరకం. కైలాసం స్వచ్ఛమైందని భావించ అందరూ అంతటనూ సమత్వాన్ని పాటించి కైలాసానికి చేరితే అక్కడ శివునికే జాగా కరువై పోతుంది.

**బ్రతుకుటెల్ల మాయ భవబంధములు మాయ**
**తెలివి మాయ తన్ను దెలియ మాయ**
**మాయ దెలియువాడు మర్మజ్ఞుడగు యోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 264**

**తా॥** జీవించడం మాయ, సంసార బంధాలూ మాయ తెలివిమాయ, తన్ను తాను తెలుసుకోవడమూ మాయే, మాయని తెలుసుకున్నవాడు అనగా విశ్వరహస్యం తెలిసినవాడు పరమయోగి.

**మాయలోకమన్న మర్మంబు దెలియక**
**మాయ జిక్కి యంత మాయబడిరి**
**మాయ దెలియ దివ్యమాయరా జన్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 265**

**తా॥** మాయలో చిక్కుకుని మాయలోపడియుండి లోకమంతా మాయ అన్నది పరతత్త్వం తెలియనివారి వాదం. మాయ తెలుసుకోవడమంటే అసలు పుట్టుకే ఒక దివ్యమైన మాయ.

**సతులు సుతులు మాయ సంసారములు మాయ**
**ధనము ఘనము మాయ తనవు మాయ**
**మాయ గెల్చువాడు మర్మజ్ఞుడగు యోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 266**

**తా॥** భార్యాపుత్రులు మాయ. సంసారం మాయ. ధనం గినం అన్నీ మాయే. శరీరమూ మాయే. అటువంటి మాయని జయించినవాడే మహాయోగి.

**మాయలోనబుట్టి మాయలోన బెరిగి**
**మాయ దెలియలేని మనుజుడేల**
**మాయ దెలియువాడు మహిమీద ధన్యుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 267**

**తా॥** మాయలో పుట్టి మాయలో పెరిగి మాయ తెలుసుకోలేని మనుష్యుని బ్రతుకు ఓ బ్రతుకా! భూమిమీద మాయను తెలుసుకున్నవాడే మహాత్ముడు.

**మాయల సంసారమునకు**
**మాయలనే తిరుగుచుండు మనుజుడు లోనై**
**మాయల దెలసిన యంతట**
**మాయలనే ముక్తి కలుగు మహిలో వేమ ! 268**

**తా॥** మాయలలో తిరుగుతూ మానవుడు మాయల సంసారమునకు లొంగిపోతున్నాడు. మాయలను తెలుసుకుంటే ఆ మాయలోనే ముక్తి కలుగుతుంది.

**సుప్తి జాగరముల సొలుపుల తా నుండి**
**కప్పుకొన్న మాయ గానలేక**
**దబ్బర నిజములను దాను లెస్స గనక**
**గొబ్బున జెడిపోవు గుణము వేమ ! 269**

**తా॥** నిద్రపోతూ జాగరంగా ఉంటూన్న సుఖాలఅనుభవంలో కల మాయని మనుష్యుడు తెలుసుకోలేక పోతున్నాడు. అందుచేత ఇందులోగల సత్యాలను తెలుసుకొనలేక ముక్త పథంవైపు మరల చెడిపోతున్నాడు.

**మాయ రూపుమాపు మాయగా జేసియు**
**మాయ రూపుల బెను మాయ జేసి**
**మాయలోని బూయ మహి నెరుంగు నరుడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 270**

**తా॥** మాయను రూపుగానూ, రూపును మాయగానూ చూస్తారు. ఈరూపు మాయలలోనే పెద్దమాయ ఇమిడిఉంది. లోకంలోనే మాయలోనే మాయ ఉంది. ఆ సంగతిని మనుష్యుడు గ్రహించాలి.

మురికి కొంపలోన నిరికించి జీవుని
కర్మ పాశమునకు గట్టి వేసె
నిట్టి కర్మజీవి కెట్లొ కో మోక్షంబు?
విశ్వదాభిరామ వినుర వేమ ! 271

**తా॥** దేహం అనేది ఓ మురికియిల్లు. ఇందులో జీవుడు కర్మపాశాల్లో బంధింపబడి ఉంటాడు. ఇలా పని సాగించుకుపోతూన్న జీవికి యిక మోక్షం అనేది లేదు.

విత్తులేని యట్టి వృక్ష మొక్కటి బుట్టె
ఫలము పువ్వు మొగడ పత్రిలేదు
స్వాదులేదు చూడ సాపాటుకును లెస్స
దీపి భావమేమి తెల్పు వేమ ! 272

**తా॥** విత్తనం లేని చెట్టు ఒకటి పుట్టింది. దానికి పండూ,పువ్వు, మొగ్గా ఆకూ లేవు. రుచిలేదు. కానీ భోజనానికి మాత్రం తగిఉంది.

మోదమునకు గురుని ముఖ్య కరుణచేత
తొమ్మిది స్థలముల దొడ్డు బాయ
సర్వజీవుడాయె సర్వము దా నాయె
విశ్వదాభిరామ వినుర వేమ ! 273

**తా॥** ఉత్తమ గురువును సంతోషంతో చేరి ఆయన దయవల్ల తొమ్మిది రంధ్రాలతో కూడిన శరీరమందలి స్వార్థాన్ని, విడచి సర్వజీవమయుని తెలుసుకుంటే తానే సర్వం అవుతాడు.

పగ యుడుగు కోపయుడిగిన
పగ యుడుగన్ గోర్కు లుడుగు పరిజన్మంబుల్
తగు లుడుగు భేద ముడిగిన
త్రిగుణము లుడుగంగ ముక్తి స్థిరమగు వేమ ! 274

**తా॥** కోపం తగ్గితే పగతగ్గుతుంది. పగపోతే కోరికలు తగ్గుముఖం పడతాయి. వాంఛలు తగ్గితే భేదబుద్ధి తగ్గుతుంది. భేదబుద్ధి నశిస్తే త్రిగుణాల ప్రభావం ఉండదు, అప్పుడు మోక్షము సులభంగా ఉండును.

ప్రణవ మెరుగనోడు భక్తుడెప్పుడు గాడు;
జ్యోతి యెరుగనోడు యోగి గాడు;
నిత్య మెరుగనోడు నిర్వాణిగాడయా,
విశ్వదాభిరామ వినుర వేమ ! 275

**తా॥** ఓంకారాన్ని తెలియనివాడు భక్తుడు కాడు. జ్యోతిని దర్శించలేనివాడు యోగికాడు, శాశ్వతుని తెలుసుకో లేనివాడు మోక్ష మార్గగామికాడు.

**పగలు రేయు జూడ భావంబు లోపల**
**దాను నేను యనెడు తలపు మరచి**
**యున్న యట్టి యతడు యుత్తమయోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 276**

**తా॥** హృదయంలో పగలూ రాత్రి దానూ నేనూఅనే భావనలు పోయినవాడే గొప్ప యోగిగా ఎన్నబడుతూంటాడు.

**తన్ను వెదకి చూడ దానె పో జీవుండు**
**తత్త్వ మరసి చూడ దానె యాత్మ**
**మన్ను మిన్ను లేదు మాయ తాలేదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 277**

**తా॥** తనను వెదుకుతూంటే జీవుడే ఆత్మగా తత్త్వమును అర్థం చేసుకుంటే అదీ ఆత్మ, ఆత్మను తెలుసుకుంటే మన్నూ మిన్నూ మాయో ఏమీలేదు. అంతా బ్రహ్మమే.

**మూల చక్రమట్టు మొనసి గట్టిగ బట్టి**
**శోదజేసి శక్తి చొరవ దెలసి**
**భేదపరచి మనసు వాదించి మోక్షము**
**సాధ్యమైన యోగ సరణి వేమ ! 278**

**తా॥** మూలాధారాన్ని ప్రయత్నంలో తెలుసుకొని దానిని బాగా యోచించి మోక్షజ్ఞానానికి పనికిరాని మానసిక పరిణామాలను వేరుచేసి ఉన్నవాడే యోగి, ఆయన నడచినదే యోగమార్గం.

**నేమమునను యుండ నిచ్చును చిత్తంబు**
**తామసమున నుండు తలగిపోవు**
**విలువైన చిత్తము నిర్భీతి నొందించు**
**నిర్భీతి సఖ్యంబు నీరసించు**
**సఖ్యదూర గుణంబు శమమును బొందించు**
**శమగుణమున జూడ సమత బుట్ట**
**నట్టి సమత విశ్వమంతయు దానగు**
**తానె విశ్వంబైన తత్త్వమగును**
**తత్త్వ మింద్రియముల దరిచూచి గెలుచును**
**తత్త్వవేత్తయైన తానె యనుచు**
**రాజయోగి యగుచు తేజంబుచేతను**
**వెలసియుండు జగతి వినర వేమ ! 279**

**తా॥** తామసమైన బుద్ధిని విడువాలంటే నియమంలో ఉంచాలి చిత్తాన్ని. అలాంటి చిత్తం నిర్భయంగా ఉంటుంది. నిర్భయంగా ఉంటే బంధాల నుంచి వేరు

చేసిన శాంతి చేకూరుతుంది. శాంతి సమతను కలిగించుతుంది. అప్పుడు తానే విశ్వం. విశ్వమే తాను అనే తత్త్వం కుదురుతుంది. తత్వం తెలిస్తే ఇంద్రియాలు వశంలో ఉంటాయి. ఇంద్రియ జయం చూసినవాడే తత్త్వవేత్త. అతడే తేజోవంతుడైన రాజయోగిగా ప్రసిద్ధుడౌతున్నాడు.

**మాట చెరుపు మూట మర్మము కర్మము**
**యానలు కడకట్లు యప్పు ముప్పు**
**బాస దోస మెన్న పలుకులు ములుకులు**
**లేశమైన తెలియలేదు వేమ !** **280**

**తా॥** మాటలు చెరిచే మూటలు. కర్మ అంటే అది మర్మం. ముప్పు తెచ్చేది అప్పు. భాష దోషం అయినది. ములుకులు బాణాల్లాంటివి. తత్వం తెలిస్తే ఏ విధమైన బాధాలేనిది. కానీ ఆ విషయాన్నీ వినరు కూడా పట్టించుకోరు.

**తొమ్మిది కంతల తిత్తికి**
**నిమ్మగు సొమ్ములును కులము నేటికి జెపుమా?**
**నమ్మకు దేహము నాదని**
**బమ్మము నేననుచు దెలసి బలుకర వేమ !** **281**

**తా॥** ఈ శరీరం తొమ్మిది రంధ్రాలతో చేయబడిన తోలుతిత్తి. దీని ఉనికి నమ్మదగినది కాదు. అలాంటప్పుడు శరీరమునకు పెట్టిన పెట్టుబడి అంతా వృధా. ఈ దేహమునకు గొప్ప దుస్తులూ ఆభరణములూ పెట్టడం ఓ కులాన్ని ఏర్పరచటం వ్యర్థం. శరీరంలో గల ఆత్మను తెలుసుకో.

**అరిషడ్వర్గంబులచే**
**నరులెల్లను జొక్కి చిక్కి నయగతి యనుచున్**
**యరుగుదురు గాక తత్త్వము**
**నరయగ గనలేరు యించుకైనను వేమ !** **282**

**తా॥** కామ క్రోధాధులచే ప్రభావితులై ఆయా గుణాలను అనుసరించుతూచిక్కి శల్యాలౌతున్నారే కానీ కొద్దిపాటి కూడా తత్త్వమును ఆకళించుకోడానికి నరులు అర్హులుకారు.

**మ్రాను కాలవేసి మహి మీద నొక జాణ**
**పూని తిరుగు చుండు బొందుగాను**
**కాల వ్రేయు మ్రాను కడు రమ్యముగ నుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **283**

**తా॥** ఓ బుద్ధిశాలి కాలికి ఒక చెట్టు మొదలు లాంటి సంసారమును తగిలించుకు తిరుగుతున్నాడు. కాలికి వేసుకున్న మ్రాను అంటే సంసారం చాలా అందమైనది.

**బయలున బంధము గప్పును**
**బయలున బరమాత్మునకు బంధము మెలగున్**
**బయలున బంధము లూడిన**
**నయ వర్త్మము ముక్తిగాచు నరుడటు వేమ ! 284**

**తా॥** జీవి బయట పడడంతో బంధం యేర్పడుతోంది. పరమాత్మకు కూడా బాహ్య జీవితంలోకి రాగానే బంధాలు యేర్పడుతున్నాయి. బాహ్య బంధాలన్నింటినీ విడుచుకుని ఉత్తమ మార్గాన నడిచే నరునకు మోక్షం లభ్యం అవుతుంది.

**ఎప్పుడు జూచినన్ యితర**
**మేమియు జూడక ముక్తి యందు కన్**
**రెప్పల మూసి మాయ కనురేయు**
**బగల్ యొక రీతి నుండగా**
**తప్పుల నొంద జేయు యమ**
**ధర్మని పాలికి నొంగ నేర్చునే**
**చెప్పగ నేమి వేమనకు జెల్లును**
**ముక్తి విధాన మంతయున్. 285**

**తా॥** ఎల్లప్పుడూ మోక్షం కోసం తపస్సుచూస్తూ ఏకరీతిగా ఉంటే అది తప్పుగా అయినను రాజు దగ్గిరకు పోవలసిన అగత్యం ఏం ఉంటుంది? ముక్తికి సంబంధించిన విషయాలు వేమనకు తెలుసు.

**మాట లుడుగకున్న మంత్రంబు దొరకదు**
**మంత్ర ముడుగకున్న మనసు నిలదు**
**మనసు నిల్పకున్న మరి ముక్తి లేదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 286**

**తా॥** మాటలు తక్కువగా ఉండాలి. అప్పుడే మంత్రం కుదురుతుంది. మంత్రం కంటేనూ మనస్సంయనం యింకా అవసరం. మనస్సుకి ఏకాగ్రత లభించినప్పుడే ముక్తి గలుగుతుంది.

**ఎండ చీకటులకు నిమ్మయి యుండెడు**
**నిండు కుండలోన నిద్రమరచి**
**దండియైన పరమ తత్త్వంబు దెలియరు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 287**

**తా॥** తెలివికీ అజ్ఞానాంధకారానికీ గృహంలా ఉన్నదే శరీరం. దాని సౌఖ్యానుభూతులనే నిద్ర విడిచి నిష్ట కలిగి ఉంటే పరతత్త్వం బోధపడుతుంది.

**కడగి సంకల్పముల నెల్ల గట్టిపెట్టి**
**చిత్తమున నేమి దల్పక చిత్రరూపు**

**కైవడిచి యున్న యాతడు ఘనుడు తలప**
**నడవి యందైన పట్టణమందు వేమ ! 288**

**తా॥** మనస్సును నిలిపి అన్నీ విడిచి జీవిగా ఉంటే ఆలోచిస్తే అప్పుడు పరతత్త్వం సులువుగా అర్థం అవుతుంది. అది పట్నంబౌగాక అడవిబౌగాక.

**రెప్పలు మూసియూ మూయక**
**దప్పక దన మనము నందు తత్త్వము గూడన్**
**యెప్పుడు జూచెడు వానికి**
**జొప్పడు నెచ్చోట ముక్తి సులభము వేమ ! 289**

**తా॥** ఏ విధమైన బాహ్య బంధాలు లేకుండా మనస్సుని ఏకాగ్రతలో నిల్పి సర్వదా పరతత్వాన్ని మననం చేసేవానికి ముక్తి సులభసాధ్యం.

**తలచిన తత్త్వం బగునా?**
**తలపక తా నూరకున్న తత్త్వం బగునా?**
**తలపును దలపమి రెండును**
**తలపమితో నుండెనేని తత్త్వము వేమ ! 290**

**తా॥** మనస్సులో తెలిస్తే తత్త్వచింత అవుతుందా? తలవకపోతే తత్త్వచింత అవుతుందా? అంటే మనసు తలుపుల జోలికి పోకుండా ఉంటేనే తత్త్వం లభ్యం అవుతుంది.

**అన్నిమతములకన్న నధికమైన మతము**
**లింగమతముకన్న లేదు జగతి**
**లింగధారికన్నా దొంగలు లేరురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 291**

**తా॥** అన్ని మతాలకంటె గొప్ప మతము లింగమతము. లింగమతమును మించిన మతము లోకమందు ఇంకొకటి లేదు. లింగధారిని మించిన దొంగలు లేరు.

**సమము నైనదృష్టి సమముగా మదినిల్పి**
**బయలు రుచులు మాని భద్రముగను**
**వరగజూడ బట్టబయలగు బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 292**

**తా॥** అంతటనూ సమానమైన దృష్టిని కలిగియుండి బాహ్య సుఖాలను దరిచేరనీక ఇంద్రియాల ప్రభావమునుకులోను కానీయక ఉన్నట్టి వాని బ్రహ్మం అంటే ఏమిటో అర్థం అవుతుంది.

**వివర నవక మెల్ల వెలి మూసి వాయువుల్**
**మనసుతోన గూర్చి మర్మ మెరిగి**
**యాత్మలింగ పూజ నంటిన ముక్తిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 293**

**తా॥** నవరంధ్రాల్లో సంతరించే గాలిని మనస్సుతో సంబంధింపజేసి, తరువాత రహస్యాన్ని తెలుసుకుని ఆత్మలింగాన్ని అర్పిస్తే ముక్తి లభ్యం అవుతుంది.

**నాసికంబు నడుమ నలిజూచు యోగికి**
**వాసి వన్నెలేదు వసుధలోన**
**కాశినాథు నైన గనగలడా యోగి?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 294**

**తా॥** ముక్కు మధ్యభాగమందు క్రమం తప్పకచూసే యోగికి అందచందాలు లేకపోయినా అలాంటి యోగి కాశీ ప్రభువును కూడా చూడగలుగుతున్నాడు.

**సూచికాగ్రదృష్టి సొరది భ్రూ మధ్యము**
**జూచి చూచి మరియు జూచెనేని**
**యాత్మ రాకపోక లప్పుడె తెలుసురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 295**

**తా॥** అతి నిశితమైన దృష్టిని కనుబొమ్మల మధ్యగా చూస్తూ చూస్తూ తదేకి ధ్యానంతో యింకా చూస్తున్నట్లయితే ఆత్మసంచార రహస్యాలు అప్పుడే విశదం కాగలవు.

**నిద్రలోని నిద్ర నిజముగా దెలసిన**
**భద్రమైన నిద్ర బ్రహ్మ విద్య**
**నిద్ర దెలియువాడు నిర్మల యోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 296**

**తా॥** మనస్సును నిలిపి ఉంచడం నిద్రలో నిద్ర. ఆ నిద్రలోంచి చూసేదే బ్రహ్మవిద్య. అటువంటి విద్యాభ్యాసం వల్ల నైర్మలం పొందితే అంతకంటె గొప్పయోగి యెవరు?

**ముక్కు తుదను దృష్టి ముదము తోడుత నిల్పి**
**హృదయమందు జూచి యొసగు ముక్తి**
**పదవి తెరువుగన్న బరమాత్మ యోగియౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 297**

**తా॥** ముక్కు చివర చూపును వాడిగా నిలకడగా ఉంచి హృదయం దర్శించితే అదే ముక్తి పదవి, అదే పరమాత్మను చేరటానికి ముక్తిమార్గం.

**బయలులోని బయలు పరికించి చూడక**
**బయలు రూపు జూచి వలచె గాక**
**మురికి యందు మదిని మోహము విడదాయె**
**విశ్వదాభిరామ వినుర వేమ! 298**

**తా॥** ఆ ఆకాశ తత్త్వాన్ని తన దేహంలో యిమిడి ఉండడాన్ని గ్రహించుకోలేక దేహాన్ని మటుక్కే చూస్తున్నాడు అంతేకాదు ఆ నీచ దేహంలో ఎన్నో వ్యామోహాలూ సుఖాలూ పొందజూస్తున్నాడు.

**తలచినను శూన్యతత్వము**
**తలచక నుండినను శూన్యతత్త్వం బదియౌ**
**తలచిన తలపీడేరును**
**తలచక నుండినను తానె తత్త్వము వేమ! 299**

**తా॥** తలచడంమీద తలపకపోవడం మీద తత్త్వం ఆధారపడి ఉండలేదు. అది ఊహాతీతం.

**అంతరంగమందు నభవు నుద్దేశించి**
**నిల్చి చూడ జూడ నిలుచుగాక**
**బాహ్యమందు శివుని భావింప నిల్చునా ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 300**

**తా॥** అంతానిండిన సర్వేశ్వరుని సాక్షాత్కరం పొందాలని నిశ్చయించుకుని అనుకూలంగా అంతరాత్మను భావించితే తత్త్వం అర్ధంకాదు. పూజలాంటిది సాదాగా చేసే శివధ్యానం మాత్రమే.

**ఆరుగురిని జంపి హరు మీది ధ్యానంబు**
**నిలిపి నిశ్చలముగ నెగడి యాత్మ**
**నతని యొకని సేయునాతడే యోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 301**

**తా॥** కామక్రోధాదులనే ఆరుగురు శత్రువుల్ని అణచివేసి నిర్మలమైన మనస్సును నిలకడగా ఈశ్వరుని మీద నిలిపి సగుణ నిర్గుణర్వముల యేక ధర్మమును తెలుసుకున్నవాడే యోగి.

**తాను నేననియెడు తప్పులో బెడిదంబు**
**మాని కడు వివేక మహిమ దనరి**
**యూరకున్న వాడు యుత్తమోత్తముడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 302**

**తా॥** తానూ నేనూ అనేవి వాస్తవం తెలియక చేసిన తప్పుభావనలలో భేదాన్ని పరిశీలించి భేదాభేదజ్ఞానం కలిగి విరమించుకున్నవాడే గొప్పయోగి.

**తా నొకటి దెలసి నేనును**
**తా నన్న లేక నెల్ల తావులు తానై**
**తా నెరిగి పరిణమించిన**
**మానవునకు ముక్తి గలదు మహిలో వేమ ! 303**

**తా॥** తాను అనగా ఎవరో తెలుసుకుని నేను అనగా ఎవరో తెలుసుకొని తాను నేనూ అనే రెండింటియందూ కలది ఆత్మపదార్థము. అదే లోకమంతనూ వ్యాపించి ఉంది. నిశ్చయబుద్ధి గలవాడే లోకంలో మేలైన యోగి.

**బైలున బంధము గలపక**
**వాలెను పరమాత్మునకును వాంఛిత మొప్పన్**
**బైలున బంధము గలపిన**
**కైలాసము జేరి ముక్తి గాంచుర వేమ ! 304**

**తా॥** లౌకిక బంధాలు పెంచుకున్నవాడు పతితుడయి పోతున్నాడు. పరమాత్మను నమ్మి ఆయనను ధ్యానించుతూ సాంసారిక బంధనాల నుంచి విడివడినవాడు మానవుడు కైలాసం చేరి ముక్తుడౌతున్నాడు.

**లోను బయలు జేసి లోకంబు దెగటార్చి**
**కులము గాలబెట్టి గుణము వదలి**
**చింతలోని చింత జేరిన యోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 305**

**తా॥** తనలో ఉన్న ఆత్మను తెలుసుకుని లౌకిక వాసనలను విడిచి కులమును లెక్కచేయక గుణమును ఎంచక సమాధిలో తత్త్వమును తలచువాడే యోగి.

**రోయవచ్చు బరము రూఢిగా దలసిన**
**కానవచ్చు గ్రుడ్లు కదలకున్న**
**రెప్పలార్పకున్న రెంటి సందున నుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 306**

**తా॥** మోహము లేక నేత్రాలను చలనం లేకుండా చేసి రెప్పవాల్చకుండా తదేక దృష్టితో పరతత్త్వమును చూస్తే ఐహిక బంధనాలను విడుచుకోవచ్చు.

**కొంపలోన నున్న కోర్కెలు చేధించి**
**పరగ హృదయ మట్టె పదిల పరచి**
**గృహము నిల్చువాడు బహుతత్త్వవేదిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 307**

**తా॥** శరీరం యిల్లులాంటిది. అందులో పుట్టె కోర్కెలను నాశనం చెయ్యాలి కానీ శరీరమును నాశనం చేయరాదు. కోర్కెల్ని పారద్రోలి శరీరమును పరిణతి వరకూ కాపాడువాడే ఉత్తమయోగి.

**దర్శనంబు లందు ధర షణ్మతములందు**
**వర్ణకాశ్రమముల వదల కెపుడు**
**తిరుగుచుండువాడు ధరలోన నంధుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 308**

**తా॥** ఆరు శాస్త్రాలనీ, ఆరు మతాలనీ, వర్ణాశ్రమ ధర్మాల్నీ విడవక పాటిస్తూ సంచరించువాడు గ్రుడ్డివాడు గాక జ్ఞానికాడు.

**అక్షరపుటడవి బొరలక**
**నక్షరమగు మహిమగాన నవనిం దొలుతౌ**
**యక్షరమును జపియించిన**
**నక్షయమగు నదియు చాలు నరయగ వేమ ! 309**

**తా॥** అక్షరారణ్యాలలోకి పోక శాశ్వతమైన మంచి మహిమగల ఓంకారమును జపిస్తే నాశరహితమైన అనంత ఫలమును యిస్తుంది.

**బ్రహ్మమనగ వేరె పరదేశమున లేదు**
**బ్రహ్మ మనగ తానె బట్టబయలు**
**తన్ను దా నెరిగిన తానె పో బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 310**

**తా॥** బ్రహ్మమనేది ఎక్కడో లేదు. బ్రహ్మముతానే. అంటే తనను గురించి బాగా ఆలోచించి తెలుసుకుంటే తానే బ్రహ్మము. తనని బ్రహ్మ పదార్థంగా తెలుసుకొనడమే బ్రహ్మము.

**అణువులోన నుండు నఖిల జగంబులు**
**నణువు తనదు లోన నడగియుండు**
**మనసు నిల్పు నరుడు మరి ముక్తి జేరురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 311**

**తా॥** సర్వ జగము అణువులలోనే ఉంది. అణువుకూడ అణువులోనే ఉంది. ఈ సృష్టి రహస్యం తెలుసుకుని మనస్సును తత్త్వం మీద నిల్పినవాడు అతడు ముక్తుడౌతున్నాడు.

**వెన్న చేతబట్టి వివరంబు దెలియక**
**ఘృతము గోరునట్టి యతని భంగి**
**తాను దైవమయ్యు దైవంబు దలచును,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 312**

**తా॥** వెన్న చేత్తో పట్టుకుని నెయ్యి కావాలని కోరే వాడిలాగ తనలో దైవం ఉండగా అది తెలుసుకొనలేక దైవం ఎక్కడో ఉందని తలుస్తున్నాడు మానవుడు.

**ఆది జూచుచుండ నన్నిట తానుండు**
**నాది జూప నొకరి కలవిగాదు**
**యాది ముక్తి తెరువు యాత్మనే యుండురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 313**

**తా॥** తత్త్వం అన్నింటా నిండి ఆదినుండి నేటిదాకా కనబడుతూనే ఉంది. మాయ అనే పూతతో ఉంది. ఆదితత్త్వం అని తెలుసుకున్నవాడే ముక్తుడు.

**తన్నెరుగని వాడు తానె తానై యుండు**
**దన్నెరుంగువాడు తానెతాను**
**తనువు లేనివాడు తానె తానౌనయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **314**

**తా॥** తనను తాను తెలుసుకోలేనివాడు తానుగానే ఉండును. తాను తనను గురించి తెలుసుకుంటే శరీరం లేని ఆత్మస్వరూపుడు తానే అవుతాడు.

**తాను సమస్తంబు మనము**
**లోనను వెలయంగ దెలసి లోనను వెలియున్**
**దానై వెలగగ నేర్చిన**
**మానవునకు ముక్తిగలుగు మహిలో వేమ !** **315**

**తా॥** కనబడే ప్రపంచమంతా తానే అని తనలోపల గదికూడా తన ఆత్మ స్వరూపమే అని తెలుసుకున్నవాడు ముక్తుడౌతున్నాడు.

**బయలను సర్వము పుట్టును**
**బయలందే లీనమగును బ్రహ్మం బనగా**
**బయలని మదిలో దెలసిన**
**బలయలందే ముక్తి బట్టబయలగు వేమ !** **316**

**తా॥** సమస్తమూ బయలే, కనుపించినదంతా బ్రహ్మమని తెలుసుకున్న వానికి ముక్తి సాధ్యము.

**బయలు రూపు రూపు బయలునుగా జేసి**
**బయలు రూపు బట్టబయలు జేసి**
**బయలులోని బయలు భావింప తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **317**

**తా॥** ప్రపంచం యొక్క ఆకారం ఆకారంగా మారిన ప్రపంచ ఏకమే అని తెలుసుకుంటే ప్రకృతి రహస్యం అర్థమైతే బ్రహ్మంలో ఉన్నదంతా బ్రహ్మమని భావించితే అదే తత్త్వం.

**కంటిలోనివాని కరకంటు దెరుగును**
**కంటిలోనివాని మింట జూడు**
**కన్నుమిన్న హృదయఖంబాయె నెంచంగ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **318**

**తా॥** కనులలోనే ఈశ్వరుడు ఉంటున్నాడు. దృష్టిలో గోచరించే దాన్ని ఆకాశంలోనూ చూడవచ్చు. ఈ రెండింటినీ హృదయాకాశంలో చూడవచ్చు.

**నిజము వరస నెరిగి నిత్యుండు గావలె**
**పలుకులోని పలుకు పదిలముగను**

**పలుకు జూడ నెవరొ బరికించి చూడరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 319**

**తా॥** ఓంకారం నుంచి మాటలు పుడుతున్నాయి. నాదరూపమైన ఓంకారము బ్రహ్మ స్వరూపం అనే నిజాన్ని తెలుసుకున్నవాడు ముక్తుడౌతున్నాడు.

**పంచవర్ణి నెరుగ పరము నెరుంగును**
**వరము నెరిగి నిచ్చ ప్రజ్వరిల్లు**
**ప్రజ్వరిల్లువాడు పరము తా నౌనయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 320**

**తా॥** పరమ పవిత్రమైన "నమశ్శివాయ" అను పంచాక్షరీ మంత్రము తెలుసుకొన్నవాడు తత్త్వమును తెలుసుకోగలుగుతున్నాడు. దాని వలననే పరతత్త్వాన్ని తెలుసుకునే జ్ఞానం కుదురుతుంది. అటువంటి జ్ఞానం కలవాడు తానే బ్రహ్మం అవుతున్నాడు.

**ఇహము విడువ ఫలము యింపుగ గలదని**
**మహిని బలుకువారి మతము కల్ల**
**ఇహములోన బరము నెనగుట గానరో,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 321**

**తా॥** మనిషి ఈలోకంలో చేసేది యేంలేదు, అంతా పరలోకంలోనే ఉంది. అనే సిద్ధాంతం తొందరపాటుతో కూడినది. ఈ లోకంలో పరతత్త్వాన్ని సాధించి ఆనందించవచ్చు, కాబట్టి ఈ జగత్తుననే పరితత్త్వచింత చేయండి.

**లింగమందు జూడ లీనమై యుండెనా**
**యంగమందు జూడ నమరి యుండు**
**లింగభావ మెరిగి లీనమై యుండరు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 322**

**తా॥** ప్రకృతి యందు లింగము ప్రధానకారణం, లింగభావం తెలియనంత వరకూ దానియందు వ్యాపకంగా ఉంటారు. లింగభావం పూర్తిగా ఆకళించుకుంటే దానియందు వ్యామోహం విడుస్తారు.

**మూడు లోకములను మొనసి యొక్కటి జేసి**
**యారు లోకములను యంట గూర్చి**
**స్థిరముగాను నుండు శివమూర్తి గురుడయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 323**

**తా॥** మూడులోకాలను ఒక్కటిగా చేసుకొని ఆరు అంగాలనూ సమూలంగా ఎరిగి మనస్సున స్థిరభావాన్ని ఏర్పరచుకొన్నవాడే శివస్వరూపుడైన గురువు.

**ఆసనం బెరుగక నా మర్మకర్మంబు**
**గురువుచేత దెలసి గూర్చుకున్న**
**మనసు నిల్పుకున్న మరి ద్విజుడెట్లగు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 324**

**తా॥** గురువును ఆశ్రయించి ఆసనం మొదలుగా కావలసిన వేదాంత రహస్యములను తెలుసుకొని ఆ లక్ష్యాల ప్రకారం మనస్సును సమాధజలోకి తేకపోతే అతను ఎలాంటి బ్రాహ్మణుడు?

**బమ్మగుడ్డు మేను ప్రాణ మన్నదిగాలి**
**కనులు చంద్ర రవులు గారవింప**
**యింతకంటె బ్రహ్మ మెక్కడనున్నది?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 325**

**తా॥** దేహము కలవానికి బ్రహ్మాండం అంతా శరీరము, అతని ప్రాణం గాలి, అతని నేత్ర ద్వయం సూర్యచంద్రులు, ఇదంతానే బ్రహ్మము.

**వాయువందె పుట్టి వాయువందె పెరిగి**
**వాయువందు మేలు వరుస దెలియు**
**వాయునందు ప్రాణవాయువు తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 326**

**తా॥** గాలిలో పుట్టి గాలిలో పెరిగి గాలియందే మంచి క్రమం తెలుస్తుంది. వాయువుల్లో ప్రాణవాయువు తత్త్వం అవుతోంది.

**దానములను యన్నదానము దొడ్డది**
**గానములను సామగాన మెచ్చు**
**ధ్యానములను శివుని ధ్యానము శ్రేష్ఠము**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 327**

**తా॥** దానాల్లో అన్నదానం, గానములలో సామగానం హెచ్చైనది. ధ్యానాలన్నింటిలోను ఈశ్వర ధ్యానం సర్వశ్రేష్టం.

**తలపులోన తలపు దలపోసి తెలియరా**
**తలపులెల్ల విడిచి తగిన భంగి**
**తలపులోని తలపు తత్త్వంబు యాత్మరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 328**

**తా॥** నిలకడైన మనస్సుతో ధ్యానించి తెలుసుకోవాలి. పరమాత్మకి సంబంధించిన తలంపులు తప్ప వేరు తలపు లేకుండా తలచితే తత్త్వం తెలుస్తుంది.

**తాను సకలమైన తనలోన సకలంబు**
**తనరు లోని వెలుగు దా నెరింగి**

**యున్న మానవునకు నొనరంగ ముక్తిరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 329**

**తా॥** తానే సమస్తబమగుచున్నాడు. సర్వమూతానే అవుతున్నాడు. ఆత్మ జ్యోతియొక్క ప్రకాశను తెలుసుకున్న మనుష్యునిక ముక్తి సులభం.

**సర్వమొకటి జూడ సమకూడును ధ్రువంబు**
**రెప్ప వేయబోక రేయి బగలు**
**పగలు లోని పగలు పరమాత్మ జూడరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 330**

**తా॥** జ్ఞాన నేత్రంతో సర్వ ప్రపంచాన్నీ నిలకడగా ఉన్న మనస్సుతో రాత్రింబవళ్లు ధ్యానించి చూస్తే పగలు లోనే జ్యోతిరూపంలో పరమాత్మని జూడవచ్చును.

**రూపడగక జీవరూపంబు గనరాదు**
**యట్టి రూప మడగ నలవిగాదు**
**బ్రహ్మమడగకున్న బ్రహ్మంబు గనరాదు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 331**

**తా॥** తన ఆత్మ కోరినప్పుడే జీవరూపం కనబడుతోంది. ప్రధానమైన మానవ జన్మలో జీవరూపం ఉండగానే బ్రహ్మ పదార్థాల్ని తెలుసుకోవాలి. అయితే బ్రహ్మాన్ని తెలుసుకోడానికి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టక్కర్లేదు.

**భయమంతా దేహముదే**
**భయ ముడిగిన నిశ్చయంబు పరమాత్మునిదే**
**లయమంతా దేహముదే**
**జయమంతా జీవు దనుచు జాటర వేమ ! 332**

**తా॥** జీవికి భయం కలదు. పరమాత్మను తెలుసుకుంటే ఆ భయం పటాపంచలై పోతోంది. చివరికి దేహం లయం పొందుతుంది. జీవుడు జయం పొందుతాడు.

**ఏకమైన పర్ణ మెరిగిన యోగికి**
**పరము నెరిగి చూడ భావ మొందు**
**యాకృతులను మరియు నన్నిట తానౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 333**

**తా॥** ఓంకారమును తెలుసుకున్న యోగి పరతత్త్వమందు గల భావాన్ని తెలుసుకోగలుగుతాడు.

**తావు దప్పకుండ తన మనంబును నిల్పి**
**తావు జేరునట్లు తంత్రపరచి**
**తాను తావుజేరి తావు దా నేకమై**
**తాను యను యగుచు దనర వేమ ! 334**

**తా॥** ఇంద్రియ సుఖాలమీద విహరించుతున్న మనస్సుని మరలించి శాస్త్ర జ్ఞానంతో తత్త్వంతో జత పరచిచూస్తె తానే తత్త్వం తత్త్వమే తాను, సర్వం తను అన్న సంగతి తెలియును.

**పూజ బూజ సేయ పూజారి తా నాయె**
**పూజ వస్తువెన్న భువిని తాను**
**యేడ పూజసేయ నెల్లదిక్కుల తానె**
**తానె నేను నేనె తాను వేమ !** **335**

**తా॥** పూజ చేసేవాడు పూజారి, పూజింపబడేవాడు దేవుడు. దేవునికి చేయునది పూజ. పూజకి కావలసినవి పువ్వులు మొదలైనది. పూజారీ బ్రహ్మమే. పూజా వస్తువులూ బ్రహ్మమే. దేవుడూ బ్రహ్మమే. అన్నీ బ్రహ్మ పదార్థం కాగా అన్ని దిక్కులా బ్రహ్మమే అయి ఉండగా ఏది పూజ ? ఎవరు పూజారి? ఎవరు దేవుడు? "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని కదా!

**భూమిలోన బుట్టు భూభార మెల్లను**
**తనువులోన బుట్టు తత్త్వమెల్ల**
**శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **336**

**తా॥** అసలు వస్తువులన్నీ భూమి మీదే పుడుతున్నాయి. తత్త్వం శరీరం నుంచి జన్మిస్తోంది. క్రమపరిణామం చెందుతూండే దానియందు తత్త్వం నిండిఉంది.

**కాయము దగగూడి కడగి యోగై యున్న**
**కాయము విడి కాని ఘనుడుగాడు**
**కాయమునను ముక్తిగతి కేగవలెనయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **337**

**తా॥** యోగ విద్యాభ్యాసం చేసిన యోగి అవుతున్నాడు. శరీరం విడిచితేగాని ఘనుడు కాడు, అయితే శరీరం ఉండగానే ముక్తిమార్గం తెలుసుకోవాలి.

**ఆది నొకటి దెలసి యాదిని మదినిల్పి**
**యాది బాయకున్న నభవుడౌను**
**యాదిబాయువాడు యంధకు రీతిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **338**

**తా॥** మొదటినుంచీ ఉన్న బ్రహ్మము, మనసారా సిద్ధి పొందేదాకా బ్రహ్మమునే భావించువాడు బ్రహ్మమును విడిచితే మాత్రం అలాంటివాడు అంధునివంటివాడే.

**అందు నిందు ననగ నన్నిట బరికింప**
**విష్ణు వరయుచుండు విదితముగను**
**చక్రి తిరుగు భూమి చక్రంబు లోపల**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **339**

**తా॥** విష్ణువు అనగా సర్వ వ్యాపకుడని అర్థం, ఇక్కడ అక్కడా అనికాక సర్వ ప్రపంచ మందూ విష్ణువును చూస్తుంటాడు. భూవలయ మందంతటనూ విష్ణువు సంచరిస్తూంటాడు.

**ఆకృతి నరయగ నిరాకృతియు దగు ని**
**రాకృతి నొగిదగును యాకృతిట్లు**
**యనియు రెండులేక నవరూపమైయుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 340**

**తా॥** ఆకారాలను నిరాకార బ్రహ్మము బాపించును. ఇది నిరాకార రూపమైన బ్రహ్మము అని ఆలోచిస్తూంటే అందు నుంచి బ్రహ్మము ఆకారరూపంలోనికి మారడం కనిపిస్తుంది. మొత్తంమీద ఈ రెండు రూపాల్లోకి ఎటునుంచి ఎటు మారినా అందు బ్రహ్మమే అపురూపంగా బాసించుతుంది.

**లోను జూడ జూడ లోకాభిరామంబు**
**బయలు జూడ జూడ బంధనంబు**
**తన్ను జూడ జూడ తారక బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 341**

**తా॥** మనస్సులో చూస్తూంటే అది ఎంతో మనోహరమైనది. బయట చూస్తే బంధనాలతో ఉంటుంది. తనను తెలుసుకుంటే అదే తారకబ్రహ్మము.

**తలపు చేత గల్గుతారక బ్రహ్మంబు**
**తలచి చూడ దానె తత్త్వమగును**
**తలపులోని తలపు తానె తానెరిగిన**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 342**

**తా॥** తలచినంత దర్శనమిస్తుంది తారక బ్రహ్మము. దానినే మననం చేసిన కొలదీ తత్త్వంగా గోచరిస్తుంది. ద్యానబుద్ధితో గమనిస్తే తాను అనబడే బ్రహ్మతత్త్వమే.

**కమల భవా దంబెల్లను**
**వినులవు సుజ్ఞాను లెల్ల వీక్షింతురయా!**
**వినులంబౌ మనముండగ**
**సమ హిత పిండాండ మెపుదు జూడర వేమ ! 343**

**తా॥** మంచి జ్ఞానులు మాత్రమే బ్రహ్మాండాన్ని మంచిగా చూడగలవారు. శాంత మనస్సుతో విశాల ప్రపంచమును సమహితంగా చూడండి.

**నర కులమున దా బుట్టియు**
**నర కులమున దాను బెరిగి నరుడయ్యును దా**
**నర కు మును జీ చీ యని**
**హర కులమున దిరిగినేని హరుడగు వేమ ! 344**

**తా॥** నరులో పుట్టి నర సంఘంలో పెరిగి,తానునరుడయ నరకులానికి చెడుపుతెచ్చే స్వార్థనరులను విడిచి ఈశ్వర కులంలో సంచరించువాడు శంకరుడే అవుతున్నాడు.

**ఎండ యనక తిరుగు నీరు వెరింగిన యోగి**
**యుండు నెల్లకాల మూర్విలోన**
**తిండిపోతు వశమె తెలియంగ జ్ఞానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 345**

**తా॥** ఎండవాన అనక సంచరించు యోగి బ్రహ్మము నెరిగినవాడై చిరకాలం భూమి మీద ఉంటూంటాడు. "Live to eat" అన్న సిద్ధాంతాన్ని అనుసరించే తిండిపోతులు బుద్ధి లేనివారై బ్రహ్మము నన్వేషింప జాలకున్నారు.

**తను సంరక్షణ కొరకై**
**మనమున కార్యములు మానుమను తత్త్వముచే**
**దినదినము తిరిగి తిరిగియు**
**తనువున గనుకొన్న నాత్మ తథ్యము వేమ ! 346**

**తా॥** మనస్సున మంచి తత్త్వ భావాన్ని పొంది విరక్తుడై పరిభ్రమించియైనా తనలోనే ఆత్మను అన్వేషించితే బ్రహ్మము దొరుకుట తథ్యం.

**ఒక్క ఘటములోన బెక్కు రూపులు నిల్చు**
**యెన్ని యెన్ని రూపు లెసగుచుండు**
**నదియు దొలగెనేని యన్నియు బయలౌను**
**యాత్మతత్త్వ మిట్టు లవుం వేమ ! 347**

**తా॥** యీ సృష్టిలో ఎన్నెన్నో రూపాలు పుట్టడం పెరగడం కనబడవచ్చు. జ్ఞానము వలన ఆ రూపాల రహస్యం విదితమౌతుంది. ఆత్మ తత్త్వం యిలా ఉంటుంది.

**హంగు మీరగాను యతుల జన్మంబుల**
**వరచి చెప్ప నెంత వారికైన**
**యాడకాడ కనువు యతిశయమై వచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 348**

**తా॥** జనన మరణ ప్రవాహంలో ఎన్ని జన్మలు గడిచాయో ఎలా గడిచాయో తెలుసుకోడం సాధ్యపడదు. అది అసాధ్యం కావడంతో ప్రస్తుతానందానికి గల తావే అతిశయిస్తోంది.

**తనువు దా ననుకొను తను వాసన దగిలి**
**జనన మరణములను జిక్కి చిక్కి**
**పొలుపు నొందెరుగక పొర్లాడు చుండెడు**
**భ్రాంతి జీవి కేటిపరము వేమ ? 349**

**తా॥** శరీరంలో జీవి ప్రవేశించగానే దాని ప్రభావానికిలోనై ఆ శరీరం తానే అనుకుంటూ చావు పుట్టుకలకు లోబడి ఆత్మ తత్త్వాన్ని తలచను కూడ చేత కాకుండా పోయిన మూఢులకు ముక్తిలేదు. భ్రాంతి జీవులకు వరం లేదు.

**చిత్తము బుద్ధిని మరిచియు**
**హత్తుకహంకారములను యాత్మకు లోగా**
**మొత్తముగ జేయనేరని**
**మత్తులకును లేదు ముక్తి మహిలో వేమ ! 350**

**తా॥** మనస్సు అహంకార మమకారలకు లోనై తామసగుణాలను అలవరుచుకొన్న మత్తులకు మోక్షం అసంభవం.

**తాను తనువు యనుచు త్రయమనియెడు చెడు**
**మోహవారి రాశి మునిగి యున్న**
**జనులకెట్లు మోక్ష సంగతి సిద్ధించు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 351**

**తా॥** తన శరీరము తనే అని భావించుకుంటూ సత్త్వరజస్తమో గుణాల ప్రభావానికి లొంగి మహా మోహ సముద్రంలో మునిగి తేలుతూన్న మనుష్యులకు విముక్తి సిద్ధించదు.

**నిఖిలాకారుం డాతడు**
**నిఖిలాత్ముడు సర్వసాక్షి నిజముగ తానై**
**నిఖిలంబునందు జూడగ**
**నిఖిలంబనునుండు నిచ్చు నిజముగ వేమ ! 352**

**తా॥** ఎన్నో రూపాలూ ఆకారాలుగా కన్పించును. అన్నింటా కాననగును. ఎక్కడపడితే అక్కడ కనిపించే బ్రహ్మం వాస్తవంగా బ్రహ్మం ఈ జగత్తుగా అల్లుకుపోయి వ్యాపించి ఉంది.

**విన్నవానికన్న కన్నవా దధికుండు;**
**కన్నవాని కంటె కలయువాడు;**
**యున్న తోన్నతుడయి యుర్విలోపలనుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 353**

**తా॥** దేవుని గుణరూపాదులు వినేవాడు యోగ్యుడు. అలావిన్నవాడికంటె దర్శించినవాడు అధికుడు. ఇంకా చెప్పాలంటే వీరికన్న అతనిలో లీనమైనవాడు సర్వ శ్రేష్ఠుడు అంటే ఉన్నతోన్నతుడన్నమాట.

**బ్రహ్మమును దెలసెడు భావమందుగ నిల్పి**
**తనువు గుడిని జేసి తన్ను నిలిపి**
**లోకమందు నిలచి లోచూపు జూడరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 354**

**తా॥** మనస్సుని ఉపనిషత్పురుషుని తెలుసుకొనే తలంపులోకి తెచ్చి "దేహో దేవాలయః ప్రోక్తః జేవూదేవస్సపనాతనః" అన్నట్లు శరీరమును దేవాలయంగా అనుకొని అందలి జీవుణ్ణి అంటే దేవుణ్ణిగా భావించి అనగా తానయి ఆవిధంగా అంతర్గతమును దర్శించాలి.

**జీవ సంజ్ఞ గలుగు జీవుని తత్త్వంబు**
**జీవపరుని గురుని జెందజేసి**
**తనువు నిల్పువాడు తానె తానైయుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 355**

**తా॥** జీవతత్త్వము బ్రహ్మ స్వరూపమై ఉన్నది. ఈ లోకంలో శరీరమును రాగద్వేషాదులకు లోనుచేసి వృధాచేయక ఆత్మజ్ఞానియై శరీరధారణ చేసినవాడే ముక్తుడు.

**తనలోనే సకలంబును**
**తనువుం దానగుట యెరిగి తారక మాత్మన్**
**తను యనుచు పరిణమించిన**
**మనుజునకు ముక్తిగలదు మహిలోవేమా! 356**

**తా॥** తనలో ఏదైతే ఉందో అదే అంతటనూ ఉన్నది. తనువులలో ఉండేది ఆత్మ. తారకమే తనువుగా మారినది అని తెలుసుకున్న మనుష్యుడు లోకంలో ముక్తుడే అవుతున్నాడు.

**తాను తానుయైన తత్వాల లోపల**
**నన్య మొందకుండు నబ్బుతోడు**
**తాను తానుయైన తల్లడంబేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 357**

**తా॥** తత్త్వం కంటే భిన్నమైనది వేరేదీ లేదు. తాదే తత్త్వం అని తెలుసుకోవడానికి కలవరం దేనికి?

**తానే నేర్పరియైతే**
**తానకముగ తానె తన్ను దప్పించుకొనున్**
**తా నెన్ని విధములను మరి**
**తానే పరమాత్మ యనుచు దలుచుర వేమ! 358**

**తా॥** ప్రపంచం ఏమిటి? తానెవరు? అన్న విషయాలను తెలుసుకుని ప్రాపంచిక బంధనాల నుంచి తనను తెలివిగా తప్పించుకున్నవాడే తానే పరమాత్మ స్వరూపం కాగలుగుతాడు.

**తా నౌట యరిగి సర్వము**
**దా నౌటయు దెలసి యెల్ల తత్త్వము తానై**

**తా నెరిగి పరిణమించిన**
**మానవునకు ముక్తిలేదు మహిలో వేమ! 359**

**తా॥** తానెవరు? ఈ చరాచర జగత్తు ఏమిటి? ఆత్మ తత్త్వం ఒక్కటే అని తెలిసి మళ్ళా ప్రాపంచిక పరిణామాలలో ఉద్యమించే వాడికి ముక్తి లభించదు.

**ఇది నాకు వలవ దనుచును**
**వదలక మదిలోన నైన వస్తువు భ్రమలో**
**కదిసి విడనాడ కుండిన**
**నగుగో సంసార బీజమందురు వేమా! 360**

**తా॥** ఇది నాకు సరిపోదు అంటూ ఆశలమీద మితిమీరిన ప్రయత్నాలు విడవకుండా సరుకులు యింకా కావాలి; సరిపోవు అని ఆశాపాశాలతో చిక్కుకుపోవడమే సంసార కారణం.

**రూపు పేరు రెండు రూఢితో గలిగిన**
**పేరు రూపు క్రియను పెనసి యుండు**
**నామ రూపములును నాశ మొందుట మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 361**

**తా॥** రూపంతో పేరు ఏర్పడుతుంది. పేరు రూపానికి ఏర్పడుతోంది. రూపం పేరూ, పేరూ రూపం అనేవి అన్యోన్యాశ్రయం అయి ఉన్నాయి. ఇటు రూపంగాని అటు పోరుగాని రెండూ మిథ్యయే. కాబట్టి ఈ రెండూ నాశనం అవడమే మంచిది. అదే ముక్తి.

**దేహ గుణములెల్ల దెలసిన శివయోగి**
**మోహమందు జిక్కి మోసపోడు**
**యింద్రజాలకుండు యెందుకు జిక్కురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 362**

**తా॥** ఆధ్యాత్మిక జ్ఞానసంపద కల శివయోగి శరీరం యొక్క సహజ గుణాలని తెలుసుకుని వాటివల్ల కలిగే వ్యామోహాలకు గురికాడు. ఇంద్రజాలకుడు తాను సృష్టించిన మాయాజాలంలో అతను చిక్కుకోడుకదా. దాని రహస్యం అతనికి తెలుసు. అదంతా మాయ అని.

**చేతస్సకంకల్పంబుల**
**నీతిన్ వర్జించి నపుడె నిర్మలపదవుల్**
**ప్రీతిన్ బొందు నటందురు**
**భూతలమున పరమ యోగపురుషులు వేమ! 363**

**తా॥** లోకంలో ఉత్తములైన మానవుల మనస్సులలో బయులుదేరే సంకల్పవికల్పాదులకు దాసులు కాక తమ విధులను నిర్వహించువారు ఉత్తములు అవుతూంటారు.

**సుఖసుఖాన దాను సుగుణుడై యుండంగ**
**ప్రకృతి బెండ్లిజేసి పరము జెరిచి**
**విధులు బుట్టజేయు విధిని దా గనలేడు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 364**

**తా॥** సుగుణాలతో ఉండి పెండ్లి కావడంతో పరతత్త్వానికి దూరమౌతున్నాడు. అటువంటివాడు సకలాన్నీ పుట్టింపజేసి బ్రహ్మన్నే మరచి పోతున్నాడు.

**పడుచు పక్వమెన్న పసివా డెరుంగునా**
**యెరుగు దివ్యయోగి యెరుగుగాక**
**లోహగుణ మెరింగి లోహంబు విడనాడు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 365**

**తా॥** స్త్రీ యౌవనం బాలకుడికి యేం తెలుస్తుంది? కాని ఉత్తమ యోగి లోహగుణాన్ని కఠినమైనదని గ్రహించి దాన్ని విడుస్తున్నాడు.

**రూపు మాయ జూపు రూఢైయై వెలుగొందు**
**కాపు మాయ మాను కల్పతరువు**
**చూపు గ్రుంగజేసి చూచుట సుఖమురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 366**

**తా॥** రూపం మాయని సృష్టించి మాయలోనే తిప్పుతుంది. రక్షణలేక పోయిన తర్వాత మనస్సు వాంఛల సమూహము. దానినుంచి విముక్తి అంతర్దృష్టితో చూచిననాడు ఆత్మ సుఖం ఆక్షీణంగా ఉంటుంది.

**సిగ్గు యేడ దాగు? జీక టేడను దాగు?**
**నాకలేడ దాగు? నాత్మలోన**
**దాగియున్న నిద్ర దాగుట దెలియుడీ**
**విశ్వదాభిరామ వినుర వేమ! 367**

**తా॥** ఆత్మలో నిగూఢంగా ఉన్న నిద్ర అంటే అజ్ఞానం దాన్ని మట్టుపెడితే సిగ్గు, చీకటి, ఆకలి అన్నీ పోతాయి. ఆ స్థితే బ్రహ్మానందరూపం.

**శత్రువరుల నరసి సరగున ఖండించి**
**మిత్రవర్గమునకు మేలుచేసి**
**దండి వెలుగు జూచి పిండ మధ్యంబున**
**నర్థి నిల్చువాడు హరుడు వేమ! 368**

**తా॥** తనలో ఉన్న ఆరు శత్రువుల్నీ అణచివేసి ఆత్మకి సుఖాన్ని కల్పించి ఆనంద జ్యోతిని దర్శించినవాడు సాక్షాత్తూ ఈశ్వరుడే.

**దేహసంకటమును తెగి తేరకాంద్రకు**
**మోహదృష్టి విడిచి మూల మెరిగి**

**యూహ యొకటి బన్ని యుల్లంబు సంధించి**
**స్నేహమెరుగ యోగి సిద్ధి వేమ!** **369**

**తా॥** శరీరానికి గల సుఖాల్ని బాధల్ని విడిచి కోరికలను అదుపుచేసుకుని, అసలు కారణం తెలుసుకొని కట్టుదిట్టంగా యోచించి మనస్సును ఆత్మతో అనుసంధించి చక్కని హృదయం కలవాడు సిద్ధిపొందిన యోగి.

**విషయము లొరసిన నొరయడు**
**విషమేంద్రియ వరదళంబు వెలయగ మరి దా**
**విషమరిషట్కమును దు**
**ర్విషములనుం బొందకుండ వేమన నేర్చున్.** **370**

**తా॥** ఇంద్రియాలు సుఖాల వైపుకి ఎంతగా రమ్మని పిలిచినా వెళ్ళక, ఆ యింద్రియాల నుంచి ఏర్పడ్డ మంచి జ్ఞానం సహాయం వల్ల తేడాపాడాలతో ఉండే ఆరు హృదయదౌర్బల్య శత్రువులను స్వేచ్ఛా సంచారానికి వదలని వాడే యోగి.

**తన నిజరూపము జూడను**
**తన మాయను సిద్ధులైన తపసుల మాయన్**
**తను యెంత ఘనుడె యైనను,**
**తనిసినవాడైన జూడ దరమా వేమా!** **371**

**తా॥** లోకంలో అనేక రూపాలు మాయగా ఉంటుంది దానిని తెలిసినవారు మహాయోగులు. వారామాయను తెలుసుకున్నామంటూ మళ్ళీ అందులోనే సంచరిస్తూంటే వారు తత్త్వదర్శనం పొందలేరు.

**తాను బుట్టు చోటు దను జూచి పల్కెనా**
**తాను బుద్ధి దిరుగు ధరణిలోన**
**తాను బుట్టుచోటు తత్త్వంబు దలపోయ**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **372**

**తా॥** బుద్ధివికాసం కలిగిన తరువాత ఎలా తెలుసుకున్నా తనపుట్టుక, దానితో తనకుగల సంబంధం ఎలాంటిదీ తన ఉద్దేశ్యాల పోకడలను తన పుట్టు చోటును మరీ మరీ తలిస్తే తత్త్వం అర్థమవుతుంది.

**అనలంబున జనియించిన**
**యనలంబున నఖిలమగును యాకాశమునన్**
**గనిపించి పుట్టు దానే**
**జనకుడు లేనట్టి మాయ చరితము వేమా!** **373**

**తా॥** నిప్పులో పుట్టి, నిప్పులో నీరయి, ఆకాశంలో పుడుతూంటుంది. అది తత్పదార్థం. దానికి జనకుడుగా గల చరిత్ర అంటూ ఏంలేదు.

**తమ తలంపులలోన తత్త్వశిఖామణి**
**దలచినవారెల్ల తత్త్వవిధులు;**
**ఘనమైన నిబిడాంధకారంబులో జ్యోతి;**
**ననువుతో జూచిన యతడె యోగి**
**శివునిలో జీవుని జీవునిలో శివు**
**నొనర దెల్సినవాడు యోగదృక్కు;**
**సాంఖ్యయోగంబున సర్వంబు శివుడని**
**నిశ్చయించినవాడు నిర్మలుండు;**
**యట్టి జూడగాక యందరైనను నేమి**
**గుట్టుగాగ శివుని బట్టగలర?**
**పొట్ట జీవుబాసి పోయి తా నుబ్బునా**
**విశ్వదాభిరామ వినురవేమ! 374**

**తా॥** తమ మనస్సుల యందు తత్త్వఘనుని గురించి యోచించిన తత్త్వవేత్తలు అజ్ఞానాంధకారంలో తత్త్వదృష్టితో జ్ఞానజ్యోతిని చూచినవాడే యోగి అవుతున్నాడు. శివుని జీవునిగా జీవుని చూచినవాడే యోగి అవుతున్నాడు. శివుని జీవునిగా జీవుని శివునిగా గ్రహించిన వాడే యోగద్రష్ట! సాంఖ్యశాస్త్ర సిద్ధాంతానుసారంగా శివుణ్ణి సర్వజగన్మూర్తిగా యెరిగిన వాడే నిజమైన యోగి. ఇదీ ఏర్పడిన తత్త్వ మార్గం. ఇది ఏర్పడిన తత్వమార్గం. ఇదికాదని వేరే విధానం వల్లగాని శివుని జూడగలరా? ఈ జీవం ఉండగా ఇది సాధించలేకపోతే శిశ్నోదర పరాయణులేం చెయ్యగలరు?

**కర్మగుణములన్ని కడబెట్టి నడువక**
**తత్త్వమేల తనకు తగులుకొనును?**
**నూనెలేని దివ్వె నువ్వుల మండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 375**

**తా॥** వేదాంత ప్రవచనం వల్లా తత్త్వం అర్థం అవుతుంది. కానికర్మలను చేయడంవల్లా గుణాలని గణాలని పొందడంవల్లా తత్త్వం అర్థంకాదు. నూనె మూలంగా దీపం వెలుగుతుంది. కాని నువ్వుల్ని పోస్తే దీపం వెలగదుకదా?

**విత్తును నుముకయు దమలో**
**పొత్తున జనియించి పొట్టుబోయిన భంగిన్**
**తత్త్వజ్ఞానిని కర్మం**
**బత్తెరగున విడిచిపోవు నవురా వేమా! 376**

**తా॥** మొదటగింజ పొట్టు కలసే ఉంటాయి. వాడుకునే సమయానికి గింజ నుంచి పొట్టు తొలగిపోయినట్టుగా తత్త్వజ్ఞానంవల్ల అంతవరకూ అంటి ఉన్న కర్మబంధనాలను అన్నీ వాటంతటనే తొలగి పోతాయి.

**కర్మము జ్ఞానికి దవ్వగు**
**కర్మమునకు జ్ఞాని దవ్వు కలియుగమందున్;**
**కర్మజ్ఞానములను విడు**
**నిర్మలునకు గలుగు ముక్తి నిజముగ వేమా! 377**

**తా॥** జ్ఞానికి కర్మలు దూరంగా ఉండును, కర్మలు దూరం అవుతాయి జ్ఞానికి, "సర్వం బ్రహ్మ" అనేవాడికే ముక్తి.

**కర్మమయుడుగాక ధర్మంబు దెలియడు**
**కర్మజీవి మేలు గానలేడు**
**నీరు జొరక లోతు నీయాన తెలియదు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 378**

**తా॥** ముందుగా కర్మాచరణం చెయ్యాలి. అందువల్ల తెలియవలసిన అనేక ధర్మాలు తెలుస్తాయి. అల్లా అని కర్మం ధర్మం అని కూర్చుంటే అట్టివాడు జ్ఞాని కాలేడు. నీటిలో దూకితే కాని దాని లోతు తెలియదు కదా!

**కర్మఫలములన్ని కపటంబుగా జూచి**
**ధర్మఫలములందు దగిలియుండు**
**ధర్మకర్మములను దాటుట ముక్తిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 379**

**తా॥** కర్మవల్ల వచ్చే ఫలం విడిచిపెట్టాలి. కర్మలవల్ల లభించిన ధర్మంనూ విడవాలి. అప్పుడే ముక్తి సాధ్యం.

**చెట్టునందు బుట్టి చెలరేగు కాయలు**
**దనరు కాంతితోడ దవిలి పండు**
**పండు దినుచు కాయ వర్ణంబు దెలియుడీ!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 380**

**తా॥** కాయలు చెట్టుకి పుట్టి అభివృద్ధి చెందుతున్నాయి. సూర్యకిరణాలువల్ల రంగులు మారుతూ పండవుతున్నాయి. ఆ పండును తింటూ ఒక్కసారి వెనుదిరిగి కాయనాటి రంగును గమనిస్తే నిజం అర్థం అవుతుంది.

**హంస మానసోడ మంటక దిరిగిన**
**యట్లు గర్మచయము నంటకుండు**
**యాగి తిరుగు సకల భోగంబుతోడను**
**విశ్వదాభిరామ వినుర వేమ! 381**

**తా॥** హంస మానస సరస్సులో సంచరిస్తూన్నా అందులోని నీటిని అంటకుండానే తిరుగుతుంది. అట్లే యోగి కర్మబంధనాలలో ఉంటూన్నా వాటి ఫలఫలాలకి సంబంధించకుండానే ఉంటాడు.

**తనువు శోధజేసి దైవము మొనజేసి**
**ముందు కర్మములను మూలద్రోసి**
**మనసు నిజముజేసి మమతలన్నియు రోసి**
**మొరసి నిల్చువాడు మోక్షి వేమ! 382**

**తా॥** మనస్సును స్వాధీనంలో ఉంచుకుని "ఇదినాది వీరునావారు" అనే మమకార బుద్ధిని ఏవగించుకుని ఉన్నవాడే ముక్తిత్రోవకి అర్హుడు.

**అన్నమునకు యంటుయైన నాత్మకు నంటు**
**యాత్మలో పెనగొన్న అన్నమంటు**
**యాత్మశుద్ధి యన్న మన్న శుద్ధియు నాత్మ**
**మిన్న మన్ను మాట్కి మెరయు వేమ! 383**

**తా॥** అన్నం అంటుదైతే ఆత్మకూడా అంటుఅవాలి. ఆత్మలోనిదే అన్నం. అప్పుడు అన్నం కూడా శుద్ధమైనదే. మిన్నూ మన్నూ యెలాగో అన్నం ఆత్మ రెండు శుద్ధమైనవే.

**హరి విధి సుర ముని లాదిగ**
**మెరసియు జన్మించి పిదప మేలుల కెడగా**
**జరయందు మరణ మందున**
**పరునన్ వర్తలిరి మాయ వాసన వేమా! 384**

**తా॥** బ్రహ్మవిష్ణువు దేవతలు మహామునులు మొదలుగా గలవారందరూ అవసరమునుబట్టి జన్మలెత్తి ఆయా ప్రకారంగా జరామరణాలతో భ్రమణంలోకే దిగి మాయా మోహితులయ్యారు.

**మూల మెవ్వరనుచు ముగ్గురిలోపల**
**మూల మెరుగలేని మూఢజనులు**
**మూలము ముగ్గురికి ముఖ్యమై యుండురా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 385**

**తా॥** బ్రహ్మ విష్ణువూ మహేశ్వరులు అను ముగ్గురిలో గొప్పవాడెవరు? అసలు వీరిలో మూలమెవరా? అని ప్రశ్నించుచుతూంటారు మూఢులైనవారు ఆలోచిస్తే ఈ ముగ్గురికీ మూలమెవరని అందుకు ఒక ముఖ్య కారణం ఉందని సాదా ప్రజలు గ్రహించుకోలేరు.

**ముగురు నెరుగునట్టి మూలంబు నెరిగియు**
**ముగురుమీద నొకటి మునుపు దెలసి**
**పరగ జిహ్వచేత బ్రస్తుతి సేయరా!**
**విశ్వదాభిరామ వినుర వేమత! 386**

**తా॥** ముగ్గురి సృష్టికీ ప్రధానమైన మూలకారణాన్ని తెలుసుకుని మొదటగా ఆ ప్రధాన బ్రహ్మన్ని రచనా చాతుర్యంతో కీర్తించుము.

**విధికృతములందు రన్నియు**
**విధికిని విధి లెస్సయయ్యె విష్ణుని జంపెన్**
**విధి యభవు రూపమడచెను**
**విధి బ్రహ్మము మమ్మతలప వినరా వేమా! 387**

**తా॥** అన్నీ విధికృతా లంటూంటారు. విధికి కూడా దిక్కు విధియే. విధే విష్ణుని చంపింది, విధియే ఈశ్వరుణ్ణి కూడా అణచింది. ఆ విధియే బ్రహ్మ స్వరూపం.

**కుండ కుంభ మండ్రు కొండ పర్వత మండ్రు**
**యుప్పు లవణమండ్రు యొకటి గాదె**
**భాష లింతె వేరు పరతత్త్వ మొక్కటే**
**విశ్వదాభిరామ వినుర వేమ! 388**

**తా॥** కుండ అన్నా కుంభం అన్నా, కొండ అన్నా గిరి అన్నా, ఉప్పు అన్నా లవణం అన్నా అన్నీ భాషాభేదరూపాలే వాటిలో పరతత్త్వం ఒక్కటే.

**ఆకు గానవచ్చు హరిహరాదులకట్ల**
**కొమ్మ గానరాదు గోరిచూడ**
**కొమ్మ గానారాగ కొనియాడకుందురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 389**

**తా॥** బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు కూడా శాఖోపశాఖలుగా వర్థిల్లిన ప్రపంచం అనే వృక్షం తాలూకు ఆకులు మాత్రమే కనబడుతున్నాయి. దాని మూలం వారు కూడా దర్శింపలేకున్నాడు. అదే తెలిస్తే దాని సంస్తుతించకుంటారా?

**వాడు వాడు వాడు వానిలోపలనుండు**
**వాడు వాడు వాడు వాడుగాడు**
**వారివాని గూర్పు వాడె పో బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 390**

**తా॥** వాడు వాడు అనుకుంటూన్న విషయం. ఇదంతా వాడనేవాడు జీవుడు. వానివానిలో ఏకత్వమును అంటే నిత్యమైన బ్రహ్మాన్ని గమనించాలి.

**ఐదు యక్షరముల యంగంబు, దెలిసిన**
**నైదు యందు ముక్తి నమరి యుండు**
**నైదు లోన నున్న యతడె పో తెలియంగ**
**విశ్వదాభిరామ వినుర వేమ! 391**

**తా॥** "నమశ్శివాయ" అను అయిదక్షరాలూ తెలిస్తే ఆ పంచాక్షరియందే ముక్తి ఉంది. ఆ అయిదక్షరాల బోధమానుడైన ఈశ్వరుడే బ్రహ్మము.

**బ్రహ్మ జంపి విష్ణు భాగంబులో గల్పి**
**విష్ణు జంపి శివుని వెలయ గల్పి**

**శివుని జంపి తాను శివయోగి గావలె**
**విశ్వదాభిరామ వినుర వేమ! 392**

**తా॥** ముందుగా బ్రహ్మను జపిస్తూ, క్రమంగా విష్ణువులోకి కలపాలి. విష్ణువుని జపిస్తూ క్రమంగా శివుని లోనికి తీసుకువెళ్ళి శివుని నుంచి తానే శివైక్యం పొందుతూ శివయోగి కావాలి.

**ఇంత వగువనేల ఏకాంత బుద్ధిని?**
**హరిహరాదులందు నాశలుడిగి**
**శాంతబుద్ధినుండ సమకూడును సుఖంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 393**

**తా॥** నిలకడైన బుద్ధితో బ్రహ్మ విష్ణు మహేశ్వరులందు ఆశలు పెట్టుకోక శాంతచిత్తంతో ఉంటే సుఖం అనగా ఆత్మ తత్త్వం అలవడుతుంది.

**బ్రహ్మ ఘటము మేను ప్రాణంబు తన గాలి**
**మిత్ర చంద్ర వహ్ని నేత్రచయము**
**మరయ బ్రహ్మమనగ మహిమీదలేదురా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 394**

**తా॥** మనుష్యుని దేహమే బ్రహ్మము. అందరిప్రాణమే గాలి, సూర్యుడూ, చంద్రుడు, అగ్ని, అనునవి కన్నులు. ఈవిధంగా పురుషుడూ బ్రహ్మము ఒకటే. బ్రహ్మం అనేది ఇంకోచోట లేదు.

**పంచ శత్రుల దెగి పంచ బాణుని గెల్చి**
**పంచ వర్గములను పతనజేసి**
**పంచ ముఖములుగల భవ సంజ్ఞ గలవాని**
**పంచ జేరువాడు పరగ వేమ! 395**

**తా॥** అయిదు యింద్రియాల ప్రభావానికి లోనుకాక, మన్మథుని అణచివేసి, నమశ్శివాయ అంటూ జపిస్తే అయిదు ముఖాలుగల ఈశ్వరుని ప్రసాదించే ముక్తి కలుగును.

**అచర చర సమూహ మంగముల్ లింగముల్**
**సరణి దెలియనట్టి శైలవ మేల**
**నష్ట తనువు లమరు హరుడౌట నెరుగరో,**
**విశ్వదాభిరామ వినుర వేమ! 396**

**తా॥** శైవము అచరలింగము, చరలింగము అని శాఖలుగా, చెప్పుకోడం వ్యర్థం. అసలు శివుడు అష్టమూర్తి, ఆయన అంతటా వ్యాపించువాడు అని తెలుసుకోవాలి.

**ఈశ్వరుని దలంప నేడు పాళ్ళుగ జేసి**
**తనదు మూర్తినెల్ల ధారబోసి**
**నిత్యకర్మమునను నిల్చురా నెరయోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 397**

**తా॥** ఈశ్వరుని ఎనిమిది భాగాలనూ ఎడు వంతులుగా భావించి తనను ఎనిమిదో భాగంగా గ్రహించి తన శరీరాన్ని ఈశ్వరార్పణచేసి నిత్యజీవిత విధానాన్ని నడుపువాడే శివయోగి.

**ఐదు యక్షరముల యానంద మొందిన**
**నందు నిందు ముక్తి యలరుచుండు**
**యందు నిందు దెలియ నదియ పో బ్రహ్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 398**

**తా॥** నమశ్శివాయ అను పంచాక్షరిలోని ఆనందాన్ని తెలుసుకుంటే అదే సర్వమూ, అదే మోక్షము, అదే ఆనందం

**ఎసగువేత్త యనుచు నెరుగరు యీ నరుల్**
**వేయు మార్గంములను వేలుపజుడు**
**నవని సృష్టికర్త యంతకు గురుడెన్న**
**నతనికి తలయేది యరయ వేమ! 399**

**తా॥** లోకంలో వేత్త అని తెలుసుకుంటున్నారు ప్రజలు. అతడు సృష్టికర్త వేయి మార్గాలను వేసినవాడు చిత్రమేమంటే అంతటి గురువుకే తలలేదు

**వేమన జెప్పిన మాటలు**
**సామంబున సకల వేదసారంబు గదా**
**సామెత పంచాక్షరిలో**
**నీ మహిమల దెలియకున్న నింపా వేమా! 400**

**తా॥** వేమన చెప్పిందే వేదం అన్న సామెత నిజం. వేమన చెప్పిన మాటలు సకల వేదసారమై ఉంటున్నాయి. అవి పంచాక్షరీ మంత్రంలా పవిత్రమైనవి.

**ప్రణవ మంత్ర మహిమ భావింప లింగంబు;**
**మూడు మూర్తులందు మొనసి యుండు**
**నతని నెరిగి కొలువ నన్యుల శక్యమా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 401**

**తా॥** ప్రణవమనగా ఓంకారం. అది లింగస్వరూపమైనది. అది యింకా త్రిమూర్త్యాత్మకం. దానిని తెలుసుకునే భాగ్యం జ్ఞానులకు మాత్రమే సాధ్యం. సామాన్యులకు అసంభవం.

**అక్షర పుట మిట్టి యండంబులో గూర్చి**
**యమరనొక్కరణము నసుభవించు**

**యతని కెన్న ముక్తి యక్షయమైయుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **402**

**తా॥** బీజాక్షరాలనే రథములో కూర్చుని ఆలకించినచో ఓంకార నాదము వినబడును. అది విన్నవారికి ముక్తి సర్వదా అక్షయంగా ఉండును.

**అక్షర పుటముల జొర వే**
**లక్షల జదువంగనేల? లాలితముగ బ్ర**
**త్యక్షముగను శివ యను రెం**
**దక్షరములు మదికి సిద్ధి యగురా వేమా** **403**

**తా॥** అక్షర సమూహాలలో ప్రవేశించి లక్షల పద్యములు చదివినందువల్ల ఏ ప్రయోజనం చేకూరును. సుళువుగా ఎట్ట ఎదుట ఉండి మనసారా "శివ" అనే రెండు అక్షరాలు ఉచ్ఛరిస్తే చాలు ఆత్మశుద్ధి పొందుతుంది.

**లోను బదిల పరచి లోని వికారముల్**
**తలచి మెట్టువారు తెలియవారు**
**యాకసమున వేడ్క నరయంగ నుందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **404**

**తా॥** మనసు బ్రహ్మములో చేర్చువారు ముక్తిని పొందుతున్నారు.

**సూక్ష్మమధ్యమునను సొరది జీవుండుండు**
**స్థూలమధ్యమునను సూర్యుడుండు**
**నాద బిందు కళల నా బ్రహ్మముండురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **405**

**తా॥** సూక్ష్మమందూ మధ్యమందూ జీవుడు ఉంటున్నాడు. స్థూల మధ్యములందు సూర్యుడుంటున్నాడు. ఓంకార మందూ బిందువునందూ కళలలోనూ బ్రహ్మము ఉండును.

**చూపులోని చూపు సూక్ష్మమౌ తెలియంగ**
**చూపులోని చూపు శుభ్రమాయ**
**చూపులోని చూపు సురవరు తుల్యము**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **406**

**తా॥** చూపులో జ్ఞానం ప్రకాశించును. అదే మాయా రహితమైనది. కాన పరిశుద్ధమైన లోర్దృష్టియే బ్రహ్మము.

**ప్రణవ మరయలేక భక్తుండు గాలేడు**
**జ్యోతి నరయలేక చొప్పులేదు**
**నిత్య మరయలేక నిర్వాణి గాడయా**
**విశ్వదాభిరామ వినుర వేమా!** **407**

**తా॥** సర్వ వేదాంత సారమే ఓంకారం. దాని యందలి సాక్షాత్కారమును పొందనివాడు భక్తుడు కాజాలడు. జ్ఞాన ప్రకాశమును చూడలేనివాడు జ్ఞానికాదు. బ్రహ్మ పదార్థాన్ని తెలుసుకోలేనివాడు ముక్తుడు కాడు.

**ఆత్మలోన జ్యోతి యమరుట లింగంబు**
**తెలసి చూడగాను తేటపడును**
**యదియు గురువులేక నబ్బునా తెలియంగ?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 408**

**తా॥** ప్రతివానికీ ఆత్మ జ్యోతి ఉంటుంది. దానిని ప్రతివాడు దర్శించలేడు. దానిని సాక్షాత్కరించుకుంటే అదే జ్ఞానాకారమైన లింగము. దాన్ని చూస్తేనే తేటపడుతుంది. అందుకు మార్గం చూపగలవాడు గురువు. గురువు నాశ్రయించి జ్ఞానోపదేశం పొందాలి.

**ఘంటారావము మదిలో**
**వింటూ నేకంటికంటి విమలపు కాంతిన్**
**యంటాడగ బ్రహ్మములో**
**గంటిని పగ గాదు నన్ను గనుగొను వేమా 409**

**తా॥** ఓంకార నాదమును మనస్సులో వింటూ ఏ విధమైన సంసార మాయ లేని జ్ఞానంతో శుద్ధ బుద్ధ స్వరూపమైన బ్రహ్మమును ఆత్మయందు కనుగొనవచ్చును.

**మొదలు జూచి చూచి తుది జూడకుండెనా**
**చూపు దప్పినపుడె సొరగవలెను**
**సొరగకున్న వాని చులకగా జూతురు**
**విశ్వదాభిరామ వినుర వేమా! 410**

**తా॥** మూలమును చూచుటకు ఆరంభించి అంత్యం వరకూ కొనసాగ వలయును. బ్రహ్మము నెరుగు ప్రయత్నం సఫలమయ్యేనా అతన్ని లోకం మెచ్చుకుంటుంది. సిద్ధి పొందలేని వానిని లోకం తేలికగా చూస్తుంది.

**జ్ఞానముద్రచేత గానవచ్చెను తళ్కు**
**యరిది మదిని శ్రేష్ఠమనుచు మునులు**
**పలికి రదియు తెలియ పరమార్థమగునయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 411**

**తా॥** జ్ఞాన సముపార్జన చేత ఒక అపురూపమైన తేజస్సును పొందుతున్నాడు. అటువంటి సాధన చేయడం మంచి మార్గమని మునులు అభిప్రాయపడుతున్నారు. అందుచేత బ్రహ్మమును జ్ఞానం ద్వారా సాధించితే పరమార్థం ఉంది.

**నాద బిందు కళల నయమొంది యాత్మ యం**
**దంటి చపలచిత్త మమర నిన్పి**

**బ్రహ్మ రంధ్రమునను ప్రబలిన యోగిరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 412**

**తా॥** నాదబిందు కళలను చక్కగా అభ్యసించి చిత్తం యొక్క చాపల్యమును నిరోధించి దానిని బ్రహ్మరంధ్రం వరకూ పోనిచ్చి యుంచినవాడే యోగి.

**మనసు వాక్కు కర్మ మరి యేమిలేకను**
**రాక పోక గాని రాజవీథి**
**పరగ హాని గాదె పరతత్త్వయోగికి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 413**

**తా॥** రాకపోకలు లేని రాజవీధిలా మనోవాక్కర్మల సంచారం లేకుండా చేసినవాడు ఆధ్యాత్మిక తత్త్వవేత్తకి ఏ విధంగానూ హాని కలుగదు.

**సూక్ష్మ రూప మెరిగి సుఖ మొందగాలేక**
**బహుళమగును జదువ బడుచు నరుడు**
**చావు చేటేరుగని చదువేల చదువడో?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 414**

**తా॥** మనుష్యుడు ఏవేవో పెద్దగా చదువబడుతున్నాడు. అసలు చదువు అనగా అమృతత్వాన్ని సాధించలేని చదువులు చదివి యేం ప్రయోజనం?

**ఉత్తముని కడుపున నోగు జన్మించిన**
**వాడు చెరుచు వాని వంశమెల్ల**
**చెరుకు వెన్నుపుట్టి చెరచదా తీపెల్ల**
**విశ్వదాభిరామ వినుర వేమ! 415**

**తా॥** వెన్ను పుట్టడంతో చెరుకుకు తీపంతా యెలా పోతుందో అట్లే మంచి వంశంలో ఓ దుర్మార్గుడు పుట్టి ఆ వంశ ప్రతిష్ఠనంతనూ పాడుచేస్తాడు.

**తనువు యెవరి సొమ్ము తనదని పోషింప?**
**ధనము యెవరి సొమ్ము దాచుకొనగ?**
**ప్రాణమెవరి సొమ్ము పాయకుండగ నిల్ప?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 416**

**తా॥** ఎంతగా పోషిస్తున్న శరీరంలోంచి ప్రాణం పోతే ఆ శరీరం ఎవరిది? డబ్బును దాచుకోవడానికి అది ఎవరి సొమ్ము? ప్రాణం పోకుండా నిల్పడం ఎవరికేనా శక్యమా? నరుడు వ్యర్థంగా పై వాటిని నిల్పుకోవడానికి ప్రయత్నించడమే కానీ అవి నిల్చేవికావు.

**జీవు జంపుటెల్ల శివభక్తి దప్పుట**
**జీవునరసిచూడ శివుడు గాదె?**

**జీవుడు శివుడనుచు సిద్ధతంబు తెలియరో!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 417**

**తా॥** జీవహింస చేయకుండా ఉండడమే శివభక్తికి మార్గం. సర్వజీవుల యందూ శివుడున్నాడు. జీవుడే శివుడు. శివుడే జీవుడు అన్న సత్యం గ్రహించాలి.

**పరగ చెట్ట బట్టి పాలింప కుండెనా**
**వెలుగు దాటి వీడు వెళ్ళబారు**
**ఆడువారి చిత్తమటువలె నుండురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 418**

**తా॥** ఆలనా పాలనా చేస్తూ ఆడదాన్ని స్వాధీనంలో ఉంచుకోవాలి. అలా కాకపోతే అతడు ఆమెకు దూరమైపోతాడు. ఆడవారి మనస్సు అలాంటిది.

**కొంకణంబు బోవ కుక్క సింహము గాదు**
**కాశి బోవ పంది గజము గాదు**
**వేరేజాతివాడు విప్రుడు గాడయా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 419**

**తా॥** కొంకణదేశం వెళ్ళినా కుక్క సింహం అవదు. అలాగే పంది కాశీకి వెళ్ళినా యేనుగు కాదు. అవి ఎలా అసంభవాలో అట్లనే బ్రహ్మత్వం పొందనిదే బ్రాహ్మణుడవడు.

**ఇచ్చువాని వద్ద నీనివాడుండిన**
**చచ్చుగాని యీవి సాగనీడు**
**కల్పతరువుకింద గచ్చ చెట్టున్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 420**

**తా॥** గొప్పదానగుణం ఉన్నవాని ప్రక్కనే లోభి ఉంటే దానం మాత్రం చెయ్యనీయడు. ఇది కల్పవృక్షం ప్రక్కని గచ్చ చెట్టుండడం లాంటిది.

**అల్ప బుద్ధివాని కధికార మిచ్చిన**
**దొడ్డవారి నెల్ల దొలగగొట్టు**
**చెప్పు దిన్నకుక్క చెరుకు తీపెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 421**

**తా॥** తక్కువ వాడికి అధికారం కట్టబెడితే గొప్పవారినందర్నీ దూరంగా ఉంచుతాడు. ఇదెలా ఉంటుందంటే చెప్పులను తినే కుక్కకి చెరుకు తీపి యేం తెలుస్తుంది కనుక!

**ఆపదందు జూడు మారయ బంధుల;**
**భయమువేళ జూడు బంటు గుణము;**
**పేద పడ్డ వెనుక పెండ్లాము గతిజూడు;**
**విశ్వదాభిరామ వినుర వేమ! 422**

**తా॥** కష్టాలలో ఉన్నప్పుడే చుట్టాల్ని చూడాలి. భయం వేసినప్పుడే బంటుగుణం చూడాలి. లేమిలో పెళ్ళాం సంగతి చూడాలి.

**మగడు మదనుడైన మంచి కాపురమైన**
**సహజమేల మాను జారకాంత?**
**పాలు ద్రావు కుక్క బడిబడి పోవదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 423**

**తా॥** భర్త మన్మధుడిలా ఎంత అందంగా ఉన్నా కాపురం ఎంత బావున్నా వ్యభిచార స్త్రీ తన గుణాన్ని మార్చుకోలేదు. పాలు తాగే కుక్క కనపడితే అలవాటు చప్పున అశుద్ధాన్ని కూడా తింటుంది.

**పురుషు డెరుగ జంపు భూపతి వినజేటు**
**అఖిల నింద కెల్ల నాలయంబు**
**పర పురుష గమనము ప్రత్యక్ష నరకంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 424**

**తా॥** భార్య జారకాంత అని తెలిస్తే చంపేస్తాడు భర్త. రాజు విన్నాడా స్త్రీ తప్పిదాన్ని అతడు శిక్షిస్తాడు. స్త్రీకి పర పురుషునితో సాంగత్యం ప్రత్యక్ష నరకం. పైగా నిందలకి ఆలయం.

**ఆలి వంచలేక యధమత్వమున నుండి**
**వెనక వంతు ననుట వెఱ్ఱితనము**
**చెట్టు ముదరనిచ్చి చిదిమిన బోవునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 425**

**తా॥** ఇల్లాలి ప్రవర్తనను సరిదిద్దలేక వెనకబడున్నాననుకోవడం అమాయకత్వం. ఆదిలోనే ఆలి అగడాన్ని అరికట్టడం మంచిది. ముదిరిన చెట్టు వంగునా?

**యెలుగు గొడ్డు తోలునెందాక నుతికిన**
**నలుపు గాక నేల తెలుపు గల్గు?**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టితే గుణియౌనె?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 426**

**తా॥** ఎలుగుబంటి తోలు తీసుకొచ్చి యెంత ఉతికినా నల్లగానే ఉంటుంది గాని అది ఎప్పట్టికీ తెల్లబడదు. కొయ్య బొమ్మను యెంత కొట్టినా గుణవంతమైనది ఔతుందా?

**కుక్కతోక దెచ్చి గొట్టంబు జేర్చిన**
**క్రోవి చెంత నుండు కొంత దడవు**
**యెంత జెప్ప చెడుగు పంతంబు మానునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 427**

**తా॥** కుక్క తోకను తీసుకుని గొట్టంలో పెట్టి ఉంచితే కొంతసేపు ఒంకర లేక ఉంటుంది. దుర్మార్గురాలిని తీసుకువచ్చి యెన్ని బుద్ధులు చెప్పినా చివరదాని చెడు పంతం విడువదు.

**ఆలు మగని మాట కడ్డంబు వచ్చెనా?**
**యాలు గాదది మరగాలు గాని**
**యట్టి యాలి విడిచి యడవి నుండుట మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 428**

**తా॥** భర్త మాటకి అడ్డం చెప్పే భార్య అది భార్య కాదు మరి దాన్ని మరమనిషి అనాలి. అలాంటి భార్యతో ఉండటం కంటే అడవిలో ఉండటం మేలు.

**మాట వినని యాలు మగనికి మృతియౌను;**
**యోర పడగ సర్పమొంటి గ్రహము;**
**తనకుగాని యాలు దానవురాలయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 429**

**తా॥** మాట వినని భార్య భర్తకో మృత్యుదేవత. ఇంకా అలాంటి గయ్యాళిగంప భార్య ఓ సర్పమో లేక ఒంటి గ్రహం లాంటిదో అయి ఉంటుంది. అది అతనికి భార్య కాదు. అతని పాలిట ఘోర రాక్షసి.

**ఓజ మాలు పొలతి యోలి మాడల చేటు**
**పోటు కెడగు బంటు కూటి చేటు;**
**పనికి మాలు తొత్తు బత్తెంబు చేటురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 430**

**తా॥** ఓ చక్కని క్రమం ఎరగని స్త్రీ ఓలి డబ్బులు దండుగ. పనిపాట్లు చేయని బంటుకి పెట్టిన తిండి దండుగ. ఎందుకూ పనికిరాని లంజకిచ్చిన బత్తెం డబ్బులు వృధా.

**తప్పులెన్నువారు తండోపతండము**
**లుర్వీజనుల కెల్ల నుండు తప్పు**
**తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 431**

**తా॥** తప్పు లెన్నేవారు చాలామంది ఉన్నారు. అయితే లోకంలో ప్రతి మనిషికీ ఏదో తప్పు ఉండకపోదు. తమ తప్పుల సంగతి ఏమిటి అన్న ప్రశ్న చేసుకోరు.

**ముచ్చు తీర్థమేగి ముల్లె విడుచును గాని**
**మ్రొక్క పొద్దు లేదు మొనసి యెపుడు**
**కుక్క యిల్లు జొచ్చి కుండలు వెదకదా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 432**

**తా॥** దొంగ తీర్థానికి వెళ్ళి దొంగతనం చెయ్యడానికే చూస్తాడు గానీ దేవుడి మీద దృష్టి నిలిపిన వాడుకాడు. కుక్క యింట్లో జొరబడి కుండుల వెదుకునే గాని మరేం చూడదు.

**కల్లవాడు వాని గ్రామకర్త యెరుంగు**
**సత్యమాడు వాని సామి యెరుగు**
**పెక్కు తిండిపోతు పెండ్లామెరుంగురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 433**

**తా॥** అబద్ధాలాడేవాడెవడో గ్రామ పెద్దకి తెలుస్తుంది. నిజం చెప్పేవాడు యజమానికి తెలుస్తుంది. ఎవడెంత తింటాడో భార్యకి తెలుస్తుంది.

**పాపగ పచ్చడంబు పైకి కూసంబును**
**పోగు లుంగరములు బొజ్జ కడుపు**
**గలిగినట్టి వాని గందురు చుట్టాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 434**

**తా॥** తలపాగ, మంచిపంచ, పై కండువా, చెవులకు ఆభరణాలూ ఉంగరం పెద్ద కడుపూ ఉన్నవాణ్ణి డబ్బున్నవాడని చుట్టాలట్టివాణ్ణి ఆదరిస్తారు.

**ఈత కంటె లోతు నెంచగ పనిలేదు;**
**చావుకంటె కీడు జగతి లేదు;**
**గోచిపాత కంటె కొంచెంబు మరిలేదు;**
**విశ్వదాభిరామ వినుర వేమ! 435**

**తా॥** ఈదేవాడు లోతును గురించి ఆలోచించవలసిన పనిలేదు. మరణాన్ని మించిన దుర్గతి యీ లోకంలో వేరేమీ లేదు. గోచీపాత బిదించడం కంటే దరిద్రంలేదు.

**జాణలైన యట్టి చపలాయతాక్షుల**
**వలపు లరసి చూచి భ్రమయ నేల?**
**బయలి రూపులెల్లబరికింపగానేల?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 436**

**తా॥** అందంగా ఉండే చతురికలైన యువతుల వాల్చూపులకి లోబడిపోకు. కనిపించే సౌందర్యం అంతా పరికించేదేమిటి?

**ఇంతి జూచెనేని నింతింత యనరాదు**
**కాల వహ్ని లక్క గరగినట్లు**
**వట్టి మోహమిట్లు రట్టుల జేసెరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 437**

**తా॥** ఆడది కమ్మని చూపు చూపిందంటే మనస్సంతా వలపుల గజిబిజై పోతుంది. భగభగ మండే నిప్పుకి లక్క కరిగినట్టు మనస్సు కరిగిపోతుంది. ఇది కేవలం వ్యామోహం పురుషుణ్ణి కలతపాలు చేస్తుంది.

**కలిమి గలిగెనేని కాముగా జూతురు;**
**లేమి చేత జిక్కి లేవలేని**
**మదను వంటి వాని మాలగా జూతురు;**
**విశ్వదాభిరామ వినుర వేమ! 438**

**తా॥** సంపదలు గల పురుషుణ్ణి కమ్మని వలపు చూపులతో ప్రియునిగా చూస్తారు. డబ్బు లేకపోతే మన్మధునిలాంటి మగవాణ్ణి కూడా మాలగా స్త్రీలు చూస్తారు.

**కలిగిన మనుజుండు కాముడు సోముడు**
**మిగుల తేజమునను మెరయుచుండు**
**విత్త హీనుడెంత రిత్తయై పోవును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 439**

**తా॥** మనుష్యుడు డబ్బున్నవాడైతే అందగాడూ సోగ్గాడులా మిలమిల మెరిసిపోతుంటాడు. అలాంటివాడే సంపద లేకపోతే ఎందుకూ పనికిరాని వ్యర్థుడు.

**విటుల కనుల కెంత విభ్రమమై యుండు**
**సాటి లేని పొలతి చక్కదనము;**
**కంటిలోని పాప కుంటెన గాదయా;**
**విశ్వదాభిరామ వినుర వేమ! 440**

**తా॥** అందమైన ఆడవారి ఒయ్యారాల ఒంపు సొంపులు చూస్తుంటే మనస్సంతా మరులెత్తిపోతుంది. అలాంటప్పుడు కంటిలోని గుడ్డే తార్పుడు పని చేస్తుంది.

**గురువునకును పుచ్చ కూరైన నివ్వరు**
**అరయ వేశ్య కిత్తు రర్థ మెల్ల**
**గురుడు వేశ్యకన్న కులహీను డేమొకో?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 441**

**తా॥** బాల్యంలో కష్టపడి నాలుగు మాటలు నేర్పారు గురువుగారు పోనీ యీ కాస్త పుచ్చుకూరైనా యిద్దామని అనిపించదు. అదే వేశ్య యువతి ఐతే బోలెడంత సొమ్ము యిచ్చేస్తారు. వేశ్యల జాతి గొప్పది. గురువుల జాతి కుల హీనమైనది నన్నమాట!

**తీపి లోన తీపి తెలియంగ ప్రాణంబు**
**ప్రాణ వితతి కన్న పసిడి తీపి**
**పసిడి కన్న మిగుల పడతి మాటలు తీపి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 442**

**తా॥** మనిషి ప్రాణం అంటే తీపి కంటే మించిన తీపైనది. ప్రాణం కంటే తీపైనది బంగారం. బంగారం కంటే మరీ తీపైనది కాంతల మాటలు.

**పనస తొనల కన్న పంచదారల కన్న**
**జుంటి తేనె కన్న జున్ను కన్న**
**చెరుకు రసముకన్న చెలి మాట తీపిరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 443**

**తా॥** పనస తొనలకంటే తీపి, పంచదార కన్నా తీపి, జుంటి తేనె, అంతకన్నా జున్ను, జున్ను కన్నా మధురమైంది చెరుకురసం. అంతకన్నా మధురతి మధురమైంది ప్రియురాలి పలుకు.

**కొమ్మ దిమ్మరైన దిమ్మరుల నెవల్చు**
**నరస విటుల కేల సమ్మతించు?**
**పేడ దిన్న పురుగు బెల్ల మే మెరుగురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 444**

**తా॥** ఆడది పరపురుషులను మరిగి అలాంటివారినే వెతుకుతుంది. భర్త వల్ల సుఖమును పొందడానికి యిష్టపడదు. పేడ తినే పురుక్కి బెల్లం రుచేం తెలుస్తుంది.

**ఆలి వంక వార లాత్మబంధువులైరి**
**తల్లి వంకవారు తగినపాటి**
**తండ్రి వంకవారు దాయాదులౌనురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 445**

**తా॥** భార్య తరపుచుట్టాలు ఆత్మ బంధువులే. తల్లి వంక చుట్టాలు సాదా బంధువులు. ఇక తండ్రి తరపు వారు దాయాది వర్గం వారవుతున్నారు. అనగా విరోధులు.

**కుక్క యేమి యెరుగు గురులింగ జంగంబు?**
**పిక్క యొడసి పట్టి పీకు గాక**
**సంత పాక తొత్తు సన్యాసి నెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 446**

**తా॥** ఈశ్వరారాధన చేసే జంగం దేవర ఘనత కుక్కకేం తెలుస్తుంది. జంగం కనబడితే మొరిగి పిక్క పట్టుకుని పీకడం తెలుసు కుక్కకి. సంత పాకల్లో తిరిగే తొత్తుముండకేం తెలుస్తుంది సన్యాసి ఘనత?

**తొత్తు తోటి పొందు తొర్రి పెసల మూట**
**ముచ్చు తోటి పొందు వచ్చు నింద**
**తలవరింతి పొందు తలతోటి దీరురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 447**

**తా॥** తొర్రి పెసల మూటలాంటిది. తొత్తుతో పొందు. దొంగతో పొందువల్ల నింద కలుగుతుంది. తలవరి భార్యతో పొందుకోరితే ప్రాణహానితో పూర్తి అవుతోంది.

**తనదు నృపతి తోడ తన యాయుధము తోడ**
**నగ్ని తోడ పరుల యాలి తోడ**
**హాస్యమాడు టెల్ల ప్రాణాంతమౌ సుమ్ము**
**విశ్వదాభిరామ వినుర వేమ! 448**

**తా॥** తన రాజుతోనూ, తాను ధరించు ఆయుధంతోనూ నిప్పుతోనూ పరాయివాడి భార్యతోనూ నవ్వులాటకు పోతే ప్రాణాంతక మౌతుంది.

**మంచి రుచుల గోరు మంచి స్త్రీలను గోరు**
**మనుజు డెంత చెడ్డ మనను జూడ**
**యించు కంతయైన నేలని విడువడు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 449**

**తా॥** మనుష్యుని మనస్సు చాలా పెద్దది. ఎంచేతంటే మనుజుడు మంచి రుచులు చూస్తేగాని అందమైన ఆడవాళ్ళు కనబడితే గాని ఆయా సౌఖ్యాలను కోరుతూనే ఉంటాడు. ఎందుకొచ్చిందని వాటి జోలికి పోకుండా ఉండజాలడు. అందుకే అలాంటివాడు పతనమౌతున్నాడు.

**తరుణి సొగసు గన్న తనయల గన్నను**
**మరుని కళల మించి మనము బారు**
**పాప జాతి మనము పట్టంగ రాదయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 450**

**తా॥** మంచి వయసులో ఉన్న ఆడదానికి అందమైనవాడు అఖరికి కొడుకైనా సరే కనబడితే మనస్సు మన్మథ బాధతో పరుగులెడుతుంది. పాపపు తలంపులు ఉండే మనసుని పట్టడం ఎంతో కష్టం.

**తేనె పంచదార తియ్యమామిడి పండు**
**తిన్నగాని తీపి తెలియరాదు**
**కన్ననింపు బుట్టు గామిని యధరంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 451**

**తా॥** తేనె, పంచదార, తియ్యమామిడి పండూ తిన్నా కూడా తీపి తెలియదు. కాంత యొక్క పెదవుల్ని చూడగానే తీపి కలుగుతుంది. అనగా వెంటనే నోరూరునని భావం.

**ఎద్దుకన్న దున్న యేలాగు తక్కువ?**
**యెరుపు లేక పోయి తరిగె విలువ;**
**నేర్పెరుగని వాని నెర యోగి యందురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 452**

**తా॥** ఎద్దుకన్నా ఎందులోనూ దున్న తీసిపోదు. ఈ రెండింటిలోనూ చక్కని రంగు ఉండటం వల్ల ఎద్దుకే విలువ ఎక్కువ అవుతుంది. రంగులేని కారణంగా

దున్న విలువ తక్కువైంది. నేర్పు ఉన్నవాణ్ణి నిండు యోగి అంటారు కానీ నేర్పులేని వాణ్ణి నెరయోగి అనరు.

**పదుగురాడు మాట పాటియై ధర జెల్లు**
**నొక్కడాడు మాట యొక్క దెందు**
**నూర కుండువాని కూరెల్ల నోపదో**
**విశ్వదాభిరామ వినుర వేమ! 453**

**తా॥** లోకంలో పదిమందీ కలసి అన్నమాటకే ప్రాముఖ్యత ఉంటుంది. వాస్తవమైన మాటను ఒక్కడంటే దాన్ని లోకం తిరస్కరిస్తుంది. ఊరికే ఆడిపోసుకునే వాడి మాటలకి ఊరంతా ఊరుకోదు.

**గుణవంతునకు మేలు దెరంత జేసిన**
**కొండయౌను వాని గుణముచేత**
**కొండకొద్ది మేలు గుణహీను దెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 454**

**తా॥** గుణవంతునికి కొద్దిపాటి ఉపకారం చేసినా గుణవంతుడు దాన్ని గొప్పదిగా భావిస్తాడు. గుణహీనునికి చేసిన కొండంత మేలుని కూడా కొద్దిపాటిగా కూడా భావించడు సరికదా మేలును మరుస్తాడు.

**పతిని విడువరాదు పదివేలకైనను**
**పెట్టి చెప్పరాదు పేదకైన**
**పతిని దిట్టరాదు నతి రూపవతియైన**
**విశ్వదాభిరామ వినుర వేమ! 455**

**తా॥** భర్తను విడవడం భార్యకు మంచిది కాదు. పేదకైనా పెట్టి చెప్పుకోవడం మంచిది కాదు. భార్య భర్తను తాను అందంగా ఉన్నంత మాత్రాన తిట్టడం సరికాదు.

**సుతులు సతులు మాయ సుఖదుఃఖములు మాయః**
**సంసృతియును మాయ జాలి మాయ**
**మాయ బ్రతుకు కింత మాయ గప్పిస్తివి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 456**

**తా॥** కొడుకులూ భార్యలూ యింకా సుఖదుఃఖాలు మాయే. అసలు సంసారమే ఓ పెద్ద మాయ. జాలి అనేదీ మాయే. అసలు సంసారమే ఓ పెద్ద మాయ. జాలి అనేది మాయే. ఆలోచిస్తే బ్రతుకే మాయ. ఇంకా ఇంకా ఆలోచిస్తే మాయే మాయ.

**మాట నిలుప లేని మనుజుండు చండాలు**
**డాజ్ఞ లేని రాజు యాడు ముండ**
**మహిమ లేని వేల్పు మంట జేసిన జులి**
**విశ్వదాభిరామ వినుర వేమ! 457**

**తా॥** ఆడిన మాట నిలబెట్టలేని మనుష్యుడు చండాలునితో సమానుడు. ఆజ్ఞను పాటించజేయలేని రాజు ఆడముండతో సమానం. పూజించినా మహిమ చూపలేకపోయిన దేవుడు మట్టితో చేసిన పులిలాంటివాడు.

**సిగ్గువారలమని సృష్టిలోపలి వారు**
**వెఱ్ఱి వేమని గని వెరగు పడిరి**
**తనకు కలుగు సిగ్గు దైవ మెరుంగురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 458**

**తా॥** సాంఘికాచారాలను పాటించేవారు మేం సిగ్గు ఉన్నవారం అనుకుంటూ వేమనను చూసి సిగ్గులేని పిచ్చివాడని పరిహసించారు. సిగ్గు అనేది ఆత్మగుణం, అది అంతరంగానికి తెలుస్తుంది. సిగ్గు ఉందనుకున్నంత మాత్రంలో అబ్బేది కాదు.

**విడువ ముడువ లేక కుడువ కట్టగ లేక**
**వెరవు లేక విద్య నొరయ లేక**
**వెడల లేని వాని నడు పీనుగందురో!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 459**

**తా॥** ఇతరులకి పెట్టలేనివారు, అర్జించలేనివారు, అనుభవించలేనివారు, ధరించలేనివారు, లోకాపవాదానికి భయపడక చదువును సంపాదించలేక చావలేక బ్రతికి ఉన్నవాణ్ణి జీవచ్ఛవం అంటారు.

**లేని కాలమునకు లేని మనము నొందు**
**యీనిన పులి రీతి నెరుగకుండు**
**కఠినబుద్ధి కిట్లు కలిమేమి గల్గురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 460**

**తా॥** దరిద్ర దశ అనుభవించ వలసిన సమయం వచ్చినప్పుడు బుద్ధులు కూడా దరిద్రంగానే ఉంటాయి. ఈనిన సమయంలో పులి తను కన్న పసికందులనే తింటుంది. దుర్బుద్ధి కలవాడికి సిరిసంపదలెలా కలుగుతాయి.

**ఇంచుకంత బోన మీశ్వరార్పణమన్న**
**పుణ్యలోకమునకు బోవు నతడు**
**అన్నదానమునకు నధిక దానములేదు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 461**

**తా॥** ఏ కొద్దిపాటి అన్నాన్ని అయినా ఈశ్వరార్పణం చేస్తే అటువంటివాడు పుణ్యలోకాలకి పోగలడు. అన్నదానానికి మించిన దానం ఈ లోకంలో ఇంకొకటి లేదు.

**ప్రియములేని విందు; పిండి వంటల చేటు;**
**భక్తిలేని పూజ పత్రి చేటు**

**పాత్ర మెరుగలేని బంగారు చేటురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 462**

**తా॥** ప్రేమ లేకుండా చేసిన విందుకి పిండివంటలు చేయటం దండుగ. భక్తి లేకుండా చేసిన పూజ పత్రి దండుగ. పాత్రాపాత్రం యెరక్కుండా చేసిన దానం బంగారం దండుగ.

**తన్ను తానెరుగడు తానెవ్వరికి నేర్పు?**
**పాలుమాలి తిరుగు పశువు కొడుకు**
**కాసుల కొరకైతె కర్మముల్ గట్టురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 463**

**తా॥** తానెందుకు బ్రతుకుతున్నాడో తనకే తెలియదు. అటువంటివాడు యితరులకి బోధించ గలిగిందేమిటి? డబ్బుల కోసం కర్మబంధాలు పెంచడం కాక యిలాంటివారి బోధనల వల్ల యే ప్రభావం కలుగదు. మూర్ఖుల సిద్ధాంతాలు మూణ్ణాల ముచ్చటే.

**సుతుల చేత పుణ్య సుఖము బొందుదమని**
**మనుజుడుండు కర్మ మతము దగిలి**
**యేనుగు పడియున్న నెత్తునా మశకంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 464**

**తా॥** పుత్రుల వల్ల ఉత్తమ లోకాలు పొందగలనని భావించే వారున్నారు. ఇది సరికాదు. ఏనుగులాంటి వంశ వృక్షమును ఓ చిన్నపుత్రుడు ఉద్ధరిస్తాడన్నది యెలా ఉందంటే దోమపడి ఉన్న యేనుగుని యెత్తుతూందనడంలా అసంగతమైన మాట.

**ఎంత చదువు జదివి నెన్ని నీతులు విన్న**
**హీను డవగుణంబు మానలేడు**
**బొగ్గు పాల గడుగ బోవునా మలినంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 465**

**తా॥** నల్లటి బొగ్గుని తెల్లటి పాలతో కడిగినా బొగ్గు నల్లగానే ఉంటుంది. కానీ తెల్లబడదు. అలాగే బుద్ధిహీనుడు ఎంత చదువు చదివినా వాడి సహజమైన దుర్గుణాలను మానజాలడు.

**మొదల తన మతము వదలక**
**తుది నెవ్వరి మతము నైన దూషింపకయున్**
**బదిలుడయి కోర్కి గోరక**
**ముదమున జరియించు వాడె ముఖ్యుడు వేమ! 466**

**తా॥** సరియైన జ్ఞానం కలవాడు జీవితంలో కనబడే మతాల్ని చేస్తూ మొదటగా తన మతాన్ని విడవడు. అలా అని యితర మతాల్ని దుయ్యబట్టక యోగ్యుడుగా

ఉండును. ఏ నీచ కోరికలూ కోరక సంతోషంగా లోకంలో తన పాత్రను చక్కగా పోషించుకుంటాడు. అలాంటివాడు ముఖ్యుడు అనగా మార్గదర్శి అన్నమాట.

**తిర్రి వాని మిగుల దీవించగా రాదు**
**వెర్రి వాని మాట వినగ రాదు**
**వెర్రి కుక్క బట్టి వేటాడ వచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 467**

**తా॥** దుష్టుడ్ని విశేషంగా శ్లాఘించడం గాని దీవించడం గానీ చేయతగదు. వెర్రివాడి మాటల్ని లక్ష్యపెట్టక్కర్లేదు. అలా చేస్తే వెర్రికుక్కను పట్టుకు వేళ్ళాడ్డంలా ఉంటుంది.

**ఆలు బిడ్డలు ధనమరయ తల్లియు దండ్రి**
**కై మనుజుడు మిగుల కష్టపడును**
**తనకు నెవరు లేరు తాను బ్రహ్మముగన్న**
**విశ్వదాభిరామ వినుర వేమ! 468**

**తా॥** భార్యాపుత్రుల కోసం తల్లిదండ్రులకోసం ధనం సంపాదనకూ మనుష్యుడు పడరానిపాట్లు పడి అబద్ధమాడో మబద్ధమాడో తాపత్రయపడతాడు. ఇదంతా తానెవరు? బ్రహ్మం అనగా ఎవరు? అని తెలుసుకుంటే ఏం లేదు.

**పూస పోగులైన పుట్టంబు విడియంబు**
**కాయ పుష్టి మిగుల గలిగియున్న**
**హీన జాతి నైన నిందు రమ్మందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 469**

**తా॥** బంగారు ఆభరణాలు విలువైన వస్త్రాలు ధరించి అంగసౌష్ఠవంగల తక్కువ కులంవాణ్ణి కూడా డబ్బుని బట్టి ఇలారా అని పిలుస్తారు.

**మాసిన పని తోడ మలిన వస్త్రము తోడ**
**యొడల జిడ్డు తోడ నుండెనేని**
**యగ్రజన్ముడైన నట్టె పొమ్మందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 470**

**తా॥** మాసిపోయిన బట్ట ధరించి ఉన్నా ఒళ్ళు జిడ్డు ఓడుతున్నట్లున్నా అలాంటివాడు బ్రాహ్మణుడే ఔగాక. అతన్ని కూడా పొమ్మంటారు.

**కొండె గాడు జావ కొంప దనుక బోవు**
**వంతు కింతె కాని వగపు లేదు**
**కొంకినక్క జావ గొర్రెలేమిటి కేడ్చు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 471**

**తా॥** మాయగాడు చచ్చిపోతే వాడి శవం యిల్లుదాటే దాకా వెంటపోతారు. కొంటెనక్క ఛస్తే గొర్రెకి బాధయేమిటి? అది ఎందుకు విచారం వెల్లుబుచ్చుతుంది? ఏ సానుభూతీ ఉండదు.

**వాడకురికి తిట్టు వలదన్న మొర బెట్టు**
**ముందు మగని దిట్టు ముసుగు బెట్టు**
**గడుసురాలు మగని గంపబెట్టమ్మురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 472**

**తా॥** గయ్యాళి వీదెక్కి గడబిడ చేస్తుంది. కాదంటే లబోలబోమని ముందుగా ఏడవడం మొదలు పెడుతుంది. ఆ తరువాత భర్తను దుయ్యబడుతుంది. చివరికి ముసుగుపెట్టి పడుకుంటుంది. గయ్యాళిగంప మగవాణ్ణి గంపలో కూర్చోబెట్టి అమ్మజూపుతుంది.

**అనగ పాప జాతి యన్నిటి కంటెను**
**ఆస చేత యతులు మోస పోరె?**
**చూచి విడుచు వారు శుద్ధాత్మ లెందును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 473**

**తా॥** ఆశ అనేది కోరికల జాతిలో అన్నింటా చాలా తక్కువ రకమైంది. యతీశ్వరులు కూడా ఆశలకు పోయి ఎందరో పతనమైపోతారు. ఆశ యిలాంటిదని తెలుసుకుని దాన్ని దూరంగా వర్జించువారే మహాత్ములు.

**నిజములాడు వాని నిందించు జగమెల్ల**
**నిజము లాడరాదు నీచుతోను**
**నిజ మహాత్ము గూడి నిజమాడ వలయురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 474**

**తా॥** లోకం నిజం పలికేవాణ్ణి నిందిస్తుంది. కాబట్టి నీచులతో నిజాలు మాట్లాడరాదు. సత్యభామలతోనే సత్యాలు పలకాలి కాని అసత్యవచనులతో సత్యాలు పలుకరాదు.

**వెరుగ వలె పాపమునకును**
**వెరువగ వలె మరణమునకు విశ్వము లోనన్**
**నురువగ వలె నంగమమ్ముల**
**మరి మరువగ వలదు మేలు మహిలో వేమ! 475**

**తా॥** పాపాలు చెయ్యడానికి భయపడాలి. అలాగే మరణానికి భయపడాలి. బంధనాల్ని కూడా మరవవచ్చు గాని ఈ లోకంలో చేసిన మేలు మాత్రం మరవ దగినది కాదు.

**ఇచ్చకము భువి నవశ్యము**
**కుచ్చితమీ లోకనింద కోవిదునకు నీ**

**తుచ్ఛమున హానివచ్చును**
**మచ్చరమే తన్ను జెరుచు మహిలో వేమ!** **476**

**తా॥** ఇచ్చకాలు పలకటం, కుత్సితంగా వ్యవహరించడం నిందావచనాలు పలకడం లాంటివి పండితులకైనా కష్టమును కలిగిస్తాయి. మత్సరభావం కలవాడు తప్పక చెడిపోతాడు.

**కోతి బట్టి తెచ్చి కొత్తపుట్టము గట్టి**
**కొండముచ్చు లెల్ల గొలిచినట్లు**
**నీతి హీనులొద్ద నిర్భాగ్యు లుందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **477**

**తా॥** కోతిని పట్టుకొని తీసుకొచ్చి కొత్త దుస్తులు వేసి కొండముచ్చులన్నీ దాని చుట్టూ చేరి దాన్ని సేవించినట్లు నీతి లేనివారి వద్ద నిర్భాగ్యులందరూ చేరి ఉంటారు.

**గాడ్దె మేను నిండ గంధంబు బూసిన**
**యేమి యెరుగ లేక యెగసి తన్ను**
**నీడు కాని దాని కిష్ట మీలాగురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **478**

**తా॥** ఈడూ జోడూ చూసి యే పనైనా చేయాలి. ఈడు కాని యిష్టం లేని పని చేస్తే అంతా విషమంగానే ఉంటుంది. గాడిదకి ఒళ్ళంతా గంధం పూస్తే చివరికి అది యెగిరి తన్నుతుంది.

**విడువ వలయు నూరు విశ్రాంతి గాకున్న**
**విడువ వలయు నాలి విధము దెలసి**
**విడువ వలయు రాజు వితరిణి గాకున్న**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **479**

**తా॥** శాంతినీయని ఊరును, సంసార జీవనమునకు పనికిరాని భార్యనూ, దానగుణం లేని రాజునూ వెంటనే విడిచి పెట్టవలెను.

**అప్పు చేయ రోత హరిహరాదుల కైన**
**మొప్పె తోడ మైత్రి మొదలె రోత**
**తప్పు బలుక రోత తాకట్టిడిన రోత**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **480**

**తా॥** అప్పు చెయ్యడం అంటే చాలా బాధాకరమైన విషయం. హరిహరాదులకు కూడా అటువంటి సమయం రాకుండాలి. దుష్టులతో స్నేహం, తాకట్టు పెట్టడం, తప్పు మాట్లాడ్డం లాంటి హృదయమునకు బాధ కలిగిస్తాయి. జీవితానికి కీడు చేస్తాయి.

**యెద్దె దెలుపవచ్చు నేడాదికైనను**
**మౌని దెలుపవచ్చు మాసమందు**
**మొప్పె దెలుపరాదు ముప్పదేండ్లకునైన**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **481**

**తా॥** జ్ఞానం లేనివానికి ఏడాదికైనా నేర్పవచ్చును. ఒక నెలకైనా నేర్పవచ్చు మూగవానికి కానీ మూఢునికి మూప్పై యేళ్ళకైనా నేర్పడం సాధ్యం కాదు.

**చూలు వలన బుట్టు సుఖదుఃఖములు రెండు**
**పతికి సతికి బుట్టు పరిగ సుతుడు**
**సతికి సుతుని వలన సౌఖ్యంబు గలుగును**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **482**

**తా॥** చూలింతవల్ల కలుగుతున్నాయి సుఖదుఃఖాలు పతికీ సతికీ కలిసే పుడుతున్నాడు కుమారుడు. కుమారుని వల్ల తల్లికి సుఖం కలుగుతోంది.

**నీళ్ళ మీద జూడు నెరయ నోడల పర్వు**
**బయిలు మీద జూడు పక్షి పర్వు**
**నాడువారి గమన మాలాగునుండురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **483**

**తా॥** నీళ్ళ మీద ఓడల పరుగు చూడముచ్చటగా ఉంటుంది. బయటపక్షుల గమనం అందగిస్తుంది. అలాగే ఆడువారు నడుస్తున్న అందంగా ఉంటారు.

**ఆలు రంభయైన నతి శీలవతియైన,**
**జారపురుషు డే జాడ మాను ?**
**మాల వాడ కుక్క మరగిన చందంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **484**

**తా॥** భార్య అందవతిగా ఉన్నా, పతివ్రతాశీలగాఉన్నా వ్యభిచారుడు ఆమె జాడను విడవలేడు. మాలవాడలో మాంసం తినమరిగిన కుక్క ఆ వాడను విడవచూడదు.

**చాకి వాడు కోక చీకాకు పడజేసి,**
**మయిల బుచ్చి మంచి మడుపు జేయ,**
**బుద్ధి జెప్పువాడు గుద్దిన నేమయా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!** **485**

**తా॥** చాకలివాడు కోకను తీసుకుని దాన్ని బండమీద బాది బాది మైల పోగొడుతున్నాడు. అట్లే బుద్ధి చెప్పడానికి కొట్టో బాదో దార్లోకి తెస్తున్నాం, అది తప్పు కాదు.

**కలిమినాడు మగని కామిని సూచును,**
**లేమి జిక్కు నాడు లేవకుండు**
**మనిన మగనినైన మడియంగ జూచును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 486**

**తా॥** డబ్బున్న రోజుల్లో యువతి మగణ్ణి మక్కువగా చూస్తుంది. దరిద్రం దాపురించినప్పుడు మగణ్ణి చూడదు సరికదా అలాంటివాడు చచ్చినా బాగుండునని భార్య తలపోయును.

**పాలు పంచదార పాపర పండ్లలో**
**చాల బోసి పండ చవికి రావు**
**కుటిల మానవునకు గుణమేల కలుగురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 487**

**తా॥** పాపర పళ్ళలో అంటే చేదు పళ్ళెంలో ఎంత పాలూ పంచదారా పోసి పాకం రప్పిద్దామని ప్రయత్నించినా తీపిరాదు, అట్లే కుటిలబుద్ధి వాడికి ఎన్ని బుద్ధులు మప్పినావాడు మంచిదారికి రావడం సాధ్యపడదు.

**భూమి నాది యన్న భూమి పక్కున నవ్వు**
**దాన హీను జూచి ధనము నవ్వు**
**కదన భీతు జూచి కాలుండు నవ్వును**
**విశ్వదాభిరామ వినుర వేమ! 488**

**తా॥** భూమికి "స్థిర" అని పేరు. అటువంటి భూమిని నాది అని భావించే అల్పవయస్కుడైన నరుణి చూసి భూమి నవ్వుతుంది. దానం చేయజాలని లోభిని చూసి ధనం నవ్వుతుంది. ఆఖరిగా ప్రాణభయంతో యుద్ధంనుంచి పారిపోయే సరికి వారిని చూసి యముడు నవ్వుకుంటాడు.

**తనదు భ్రాతలెల్ల దానంబు సేయంగ**
**తనకు గలదటంచు మనగరాదు**
**తనదు కాలుగోయ తన తమ్ముడేడ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 489**

**తా॥** తన సోదరులు దానధర్మాలు చేస్తూండడం చూసి తానొకడు గొప్పలు పోతూ మురిసిపోవడం తగనిపని, తనకూ తన సోదరుల దానధర్మాలకీ ఏం సంబంధంలేదు. తనకాలు కోస్తె తన తమ్ముడు బాధపడతాడా?

**పంకజాక్షి గన్న బంగారు పొడగన్న**
**దిమ్ము బట్టి యుండు తెలివికెల్ల**
**మనుజులకును తత్త్వ మహిమెట్లు గల్గురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 490**

**తా॥** కాంతను చూస్తున్నా, బంగారాన్ని చూస్తున్నా మతిపోతుంది. అలాంటి గట్టి అజ్ఞాన పశువులకు తత్త్వ మహిమలు ఎలా అర్థం అవుతాయి?

**దాతగాని వాని తరుచుగా వేడిన**
**వాడు దాత యగునె వసుధలోన?**
**అవురు దర్భయౌనె యబ్ధిలో ముంచిన?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 491**

**తా॥** దాతకానివాడ్ని ఎన్ని విధాలుగా యాచించినా వాడు దాతకాజాలడు. సముద్రంలో ముంచినా అవురుగడ్డి దర్భఅవదుకదా!

**మొండివానికేల ముంజేతి కడియాలు?**
**తొర్రివాని కేల కర్రపండ్లు**
**గాడిదెలకునేల గడ్డముల్ మీసముల్?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 492**

**తా॥** మొండివాని చేతికడియాలూ, తొర్రి పెదవులు ఉన్నవానికి కర్రపళ్ళు కట్టించుకోడం గాడిదల్లాంటి మనుష్యులకి గడ్డాలూ మీసాలూ ఏం ఉపయోగాన్నీ యీయవు.

**దొడ్డవాండ్లమనుచు దోవ డొంకలు కట్టి**
**యడ్డమైన జనుల నంట గట్టి**
**దోచుకొన్ననట్టి దోష మెక్కడ బోవు?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 493**

**తా॥** మేం గొప్పవాళ్ళమని చెప్పుకుంటూనే అడ్డమైన ప్రజలని దారి దోపిడులు చేస్తూ ఆ ప్రజలను పలు హింసల పాలు చేసిన మహాపాపం అనుభవించక తప్పదు.

**పట్టనేర్పు పాము పడగ యోరగ జేయు**
**చెరుప జూచువాడు చెలిమి జేయు**
**చంప దలచురాజు చనువిచ్చుచుండురా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 494**

**తా॥** పాములవాడు పామును పట్టడానికి పడగ ఓరగా చేస్తాడు, అవతలవార్ని చెడపడానికి చూసేవాడు స్నేహం చేస్తాడు. చంపదలచుకొన్నరాజు చనువుగా ఉంటాడు.

**ఎంత సేవ జేసి యేపాటు బడినను**
**రాచమూక నమ్మరాదు రన్న**
**పాము తోటిపొందు పదివేలకైనను**
**విశ్వదాభిరామ వినుర వేమ! 495**

**తా॥** రాజులకు ఎంతసేవ చేసినా ప్రయోజనం సున్న రాచవార్ని నమ్మకూడదు. వారితో చెలిమి పదివేలకైనా పాముతో చేసిన స్నేహంలా ప్రమాదమైనదే.

**మొదల క్రియను దప్పి మోసంబు జేసుక,**
**పొట్ట కొరకు మనసు బొందు పరచి**
**బీద కుక్క రీతి పెరుగును మనుజుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 496**

**తా॥** మనుష్యులు మొదలుగా ముఖాల్ని సోషపెట్టి ఉదరపోషణకోసం మనస్సును సమాధానపరచుకుంటూ బీద కుక్కల్లా బ్రతుకుతూంటాడు.

**కడు విచిత్ర మరయ కాముని యంత్రంబు**
**పువ్వు బోడి చుక్క బొట్టు గన్న**
**కాంచి బెళుకు గన్న కడుసొక్కు పుట్టురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ! 497**

**తా॥** చుక్క బొట్టు పెట్టుకున్న ఆడదాన్ని చూపినా దాని తళుకు బెళుకులు చూసినా మనస్సు పరవశమైపోతుంది.

**చక్కెర గలుపుక తింటే**
**ముక్కిన తవుడైన లెస్స; మోహము గలచో**
**పెక్కురు బానిసె యైనన్**
**మక్కువతో దివ్యభామ మహిమలో వేమ! 498**

**తా॥** పంచదార కలుపుకు తింటే ముక్కిపోయిన తవుడు కూడా రుచిగానే ఉంటుంది. అలాగే వ్యభిచారి కూడా మక్కువ గలవాడికి అదే ఒక దేవతా స్త్రీలా కనపడుతుంది.

**ఎట్టి వానికైన బుట్టును మోహంబు,**
**పుట్టు మోహమెల్ల పూడ ద్రొక్కి,**
**గట్టిచేప చూడ గన్పించు బ్రహ్మంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ! 499**

**తా॥** స్త్రీని చూడగానే మోహం పుడుతుంది. ఎలాంటి యువకుడికైనా, కానీ అలా పుట్టిన మోహాన్ని అణగద్రొక్కి ఆదారిని మళ్ళించి ఆధ్యాత్మికంగా చూస్తే బ్రహ్మం దర్శనమిస్తుంది.

**పట్టు గొమ్మలేక బలు పాటు బడువారు**
**పెట్టి పొయ్య లేక తిట్టువారు,**
**ముట్టి శివుని పూజ మొదలె సేయరువారు**
**విశ్వదాభిరామ వినుర వేమ! 500**

**తా॥** ఏ ఆధారం లేక పలుపాట్లు పడుతూ ఇతరులకు పెట్టలేక త్రావడానికి యివ్వలేక పైగా వార్నీ వీర్నీ దూషిస్తూ కనీసం శివుని స్పృశించి శివపూజ కూడా మొదటి నుంచీ చేసే అలవాటు లేక బ్రతికేవారు ఉంటున్నారు.

**ఆత్మలోన శివుని ననువుగా శోధించి,**
**నిశ్చలముగ భక్తి నిలపెనేని,**
**సర్వ ముక్తుడౌను సర్వంబు తానౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ! 501**

**తా॥** పవిత్రమైన ఆత్మలో మహాదేవుని స్వాధీనుడుగా జేసుకుని నిశ్చలమైన భక్తితో నిలకడగా ధ్యానిస్తె సర్వ సంసార సంకట బంధనాలనుంచి ముక్తుడై సర్వమూ తానే అగుచున్నాడు.

**ఎరిగిన శివ పూజ యెన్నడు చెడిపోదు,**
**మొదల బట్టు పట్టు వదలరాదు,**
**మొదల విడిచి గోడ తుది బెట్ట గల్గునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 502**

**తా॥** నిశ్చలమైన భక్తితో ఎరిగిచేసిన శివపూజ వృధాగాదు. ఆదినుంచీ పట్టు దొరకాలి. ఆ దొరికిన పట్టును అవిశ్వాసాలతో దుష్ట చర్చలు విన్న ఫలితంగానో పట్టినపట్టు చెడకుండా సాధన చెయ్యాలి. గోడ కట్టాలంటే పునాదినుంచీ ప్రారంభించాలి కానీ చివరగా కడదామంటే అసాధ్యం అది.

**చేటు వచ్చెనేని చెడనాడు దైవాన్ని,**
**మేలు వచ్చెనేని మెచ్చు దన్ను;**
**చెట్టుటు మేలు తలప జేసిన కర్మముల్,**
**విశ్వదాభిరామ వినుర వేమ! 503**

**తా॥** చేసిన ప్రయత్నంలో చెడ్డ సంభవిస్తె దైవాన్ని తిడతారు. అదే మంచి జరిగితే అది తమ గొప్పగా చాటుకుంటారు. ఇంతకీ తన కర్మమే అసలు మూలమైనది.

**కడుపు చిచ్చుచేత కామానలము చేత,**
**క్రోధ వహ్నిచేత కుటిల పడక**
**నొక్క మనసు తోడనుండి నప్పుడె ముక్తి,**
**విశ్వదాభిరామ వినుర వేమ! 504**

**తా॥** ఆకలి మంటల చేతగాని ఆడవారిమీద కలిగిన అతిమోహం వల్లగానీ, తీవ్రమైన పడబెట్టుకుని గానీ మనసుని వ్యాకులం చెందనియ్యక ఏకాగ్ర మనస్సుతో ఉన్నప్పుడు ముక్తి నిశ్చయంగా సాధ్యపడును.

**ఏవంక మనసు కలిగిన**
**నా వంకకు నింద్రియంబులన్నియు నేగున్**

**నీవంక మనసు గలిగిన**
**నేవంకకు నింద్రియంబులేగవు వేమ! 505**

**తా॥** మనస్సు ఎటుపోతే యింద్రియాలన్నీ ఆవైపుగానే తిరుగును. ఆ మనస్సు కనక తత్త్వాన్వేషణ వైపుగా ఉంటే యింద్రియాలకు వికాసం లేక విరమిత కృత్యంగా ఉంటాయి.

**పాలు పెరుగు వెన్న పాయసాన్నము నెయ్యి**
**జున్ను నెన్నియైన జూడ పాలు**
**పాలవంటి కులము బ్రహ్మంబు గానరో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 506**

**తా॥** పాలూ పెరుగూ వెన్నా, పాయసాన్నామూ, నెయ్యి, జున్నూ ఎన్నింటిని చూసినా ఇవన్నీ పాలలో పుట్టినవే. అంటే పాలయొక్క మార్పే పై స్వరూపాలన్నీ, బ్రహ్మను ఉపాసించే కులము పాలవంటిది అని తెలియండి.

**చదువులందు, రాజ్యపదవులందును, పాడి**
**మొదవులందు, స్త్రీల పెదవులందు,**
**నాశగలుగుగట్టి యయ్యలు ముక్తులు**
**విశ్వదాభిరామ వినురవేమ ! 507**

**తా॥** కూటికోసం కోటివిద్యలందూ, రాజ్యపదవుల యందూ, స్త్రీల పెదవుల యందు ఎలాంటి వాంఛలూ లేని అయ్యవార్లు ముక్తులు.

**కడుపుకేల మరులు కళవళ పడియెదు?**
**కడుపుకేడ తృప్తి కలుగుచుండు?**
**కడుపు రాతిలోని కప్పకు గలుగదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ! 508**

**తా॥** ఓ మనసా! ఉదరబాధకు ఎందుకింత తహతహ పడతావు? రకరకాలయిన రుచులు పెట కడుపును తృప్తి పరచగలమా? రాతి కడుపులో ఉన్న కప్పకు ఆహారం పెట్టేది ఎవరు? దానికి ఆహారం సమకూరడంలేదా?

**శూద్రతనము పోయె శూద్రుడు గానని,**
**ద్విజడనుకొనుటెల్ల తెలివి లేమి**
**ఇత్తడెచట పసిడికీడన వచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 509**

**తా॥** శిఖారుద్రాక్ష భస్మాదులు ధరించి నాకు శూద్రత్వము పోయింది. ఇకనే శూద్రుడను గాను; నేను ద్విజుడను (ఉపనయన సంస్కారం వల్ల ద్విజుడగును) అనుకోవడం తెలివిమాలిన పని. ఇత్తడి ప్రకాశించినంత మాత్రంచేత దాన్ని బంగారంతో సమానం అనవచ్చునా?

**అధికమైన యజ్ఞ మల్పుండు తా జేసి,**
**మొనసి శాస్త్రము విడి మురువు దక్కు**
**దొబ్బ నేర్చుకుక్క దుత్తలు మోయునా**
**విశ్వదాభిరామ వినుర వేమ! 510**

**తా॥** అల్పుడు గొప్ప యాగాన్ని తలపెట్టి జరపవచ్చు కానీ యజ్ఞంవల్ల రాదగిన పుణ్యం మాట అలావుంచి జంతుహింసవల్ల కలిగే పాపం పొందకుంటాడా? కుక్క కుండలోని అన్నాన్ని తినగలదు గాని కుండను మోయగలదా?

**శాంత మానసమున జల్లనై శీతల**
**భాతినున్నవాడు పరమ యోగి**
**యట్టివాడు ముక్తి నతివేగ గైకొను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 511**

**తా॥** శాంత మనస్సుతో చల్లగా ఉన్నయోగి శీఘ్రంగా ముక్తిని పొందగలుగును.

**కనకమెడల మంచి కాంతల యెడలను**
**వలచి యుందురెంత వారలైన**
**తోయజాక్షి బాయు దొరలెవ్వరును లేరు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 512**

**తా॥** కాంతాకనకాలలో కనకాన్ని దూరంగా ఉంచినా, ఎంతటి వారైనా కాంతను ప్రేమిస్తూంటారు. వనితను ప్రేమించక దూరంగా ఉంటే దొరలెవరుంటారు?

**మధురసంబుగోరి మక్షికంబులు చేరి**
**చొచ్చి వెడలలేక జొక్కినట్లు,**
**మునిగి వెడలలేడు మోహంబు రాశిలో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 513**

**తా॥** తేనెలను త్రాగడంకోసం తేనెటీగలు పట్టులో చొరబడి త్రాగడం పరవశంలో పడిపోయి మత్తిల్లి బయటకు రాజాలవు. అట్లే మనుష్యుడు మోహ సముద్రంలో మునిగి సంసారంలో మాయామధువును గ్రోలుతూ బయట పడలేకున్నారు.

**ఒడలు బెంచు లంజ యుబ్బసంబున నైన,**
**వేగ విటుని మీద విరిగిపడును**
**పందికొక్కుమీద బండిచక్రములట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 514**

**తా॥** ఉబ్బసంతో బాధపడుతూ ఒళ్ళు పెంచుకున్న లంజకామవేగంతో విటుడిమీద పందికొక్కు మీద బండిచక్రం పడ్డట్లుగా పడుతుంది.

**వెలయాలి వలన కూరిమి**
**కలుగదు; మరి కలిగెనేని కడతేరదురా!**

**పలుగురు నడిచెడి తెరువున**
**పులు మొలవదు మొలిచెనేని పొదలదు వేమ !** **515**

**తా॥** భోగపు స్త్రీల ప్రేమలు ప్రేమలు కావు. అలాంటి వారికి ప్రేమలుండవు, నలుగురు నడిచే దార్లో గడ్డిమొలవదు. మొలచినా అది పెరగదు.

**తొత్తు తోటి పొందు దోషంబు దోషంబు**
**లంజ తోటి పొందు లజ్జ చెడును;**
**జార తోటి పొందు చావుకు మూలమౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **516**

**తా॥** లంజ అనగా కులట తొత్తు అనగా బహుపురుష వ్యసనపరురాలు తొత్తులపొందు కోరడం తప్పు పాపం, ఇక లంజతో పొందు సిగ్గుచేటు, మొత్తంమీద వ్యభిచారిణులతో పొందు చావులవరకూ పోయే విషయం.

**బ్రహ్మమున్న నొట్లు పరగంగ దెలియక**
**యెందు వెదుక బ్రహ్మమేల కలుగు?**
**నంజనంబు లేక నాసొమ్ము దొరకదు?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **517**

**తా॥** బ్రహ్మస్వరూపం ఎలా ఉంటుంది? ఎలా తెలుసుకునేది? అన్న ప్రయత్నం లేకుండా వెదకడం మొదలెడితే బ్రహ్మం ఎందుకు కనబడుతుంది?

**వెర్రి మొద్దుకేల వేదశాస్త్రంబులు,**
**ముద్దులాడికేల ముసలి మగడు**
**సద్ది మిగుల నింట సంసారమేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **518**

**తా॥** వెర్రివానికి వేదశాస్త్రాలతో ఏం పని? వలపుల సొగసులొలికించే వగలాడికి ముసలి మొగుడివల్ల ఏం కాలక్షేపం? చద్దివణాలు కొట్టేసరికి సంసారాలెందుకు ? పూజా పునస్కారాలుంటేకదా?

**సాధుచరితయైన సతి సత్ప్రవర్తన,**
**జార యేమెరుంగు? సాధువైన**
**బ్రహ్మనిష్ఠ యెరుగు బ్రాకృతు డెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **519**

**తా॥** యిల్లాలి నడవడిక తీరుతెన్నులు తొత్తుముండకేం అర్థమౌతుంది?నిష్టగా ఉండే గొప్ప పద్ధతులు సామాన్యునికేమి తెలుస్తుంది?

**హీనుడెన్ని విద్యలిలను నభ్యసించినయైన**
**ఘనుడుగాడు హీన జనుడె కాని;**

**పరిమళముల గర్ధభము మోయ ఘనమౌనె?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 520**

**తా॥** నీచుడు ఎన్ని విద్యలు అభ్యసించినా వాడు హీనుడుగానే ఉంటాడు. కానీ ఘనమైన బుద్ధులతో గొప్పవాడు కాజాలడు. సువాసన ద్రవ్యాల్ని మోస్తున్నంత మాత్రం చేత గాడిద గొప్పది కాజాలదు కదా?

**చక్కదనములేల? సంపత్కరములేల?**
**విద్యలేల? భూమి విరివి యేల?**
**పుత్ర పదవి కన్న పుట్టునా పదవులు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 521**

**తా॥** సౌందర్యం, సిరి సంపదలూ, చదువులూ, కావలసినంత భూమి కలిగి ఉండడం కంటె మంచి పుత్రుడుండడమే మంచి సంపద.

**భాగ్యవంతురాలు పరుల యాకలిదప్పి**
**దెలిసి పెట్టనేర్చు దీర్చు పేద!**
**తనదు దుష్ట భార్యతన యాకలిని గాని**
**పరుల యాకలెరుగ దరయ వేమ ! 522**

**తా॥** మంచి యిల్లాలు పరుల ఆకలి దప్పులను అర్థం చేసుకుని అన్నం పెట్టి ఆకలినీ మంచినీరిచ్చి సమయానికి దాహాన్ని తీర్చును. పనికిమాలిన భార్య తన భర్త ఆకలిగాని, పరుల ఆకలిగాని ఎరుగదు. పూనుకోదు.

**మనసులోన నున్న మమతలన్నియి గోసి,**
**దృఢముజేసి మనసు దేట పరచి,**
**ఘటము నిల్పువాడు ఘనతర యోగిరా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 523**

**తా॥** మనస్సులో పెరిగిన మమకారాలన్నింటినీ తెంచుకుని, దృఢమైన మనస్సుతో శరీరధారణ చేస్తూన్న వాడే ఉత్తమయోగి.

**పచ్చ విల్తుచేత గ్రచ్చర జనులెల్ల**
**తచ్చనాడ బడిరి ధరణిలోన,**
**కులజుడెవ్వడిందు? గుణహీనుడెవ్వడు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 524**

**తా॥** మన్మధుని ప్రభావానికి గురైన ప్రజలు కామానికి ప్రాధాన్యత నిచ్చి చిత్తం వచ్చినట్లు స్త్రీలతో ప్రవర్తిస్తూంటే వీరిలో ఉత్తమ కులం వాడెవడో అధమకులం వాడెవడో ఏం తెలుస్తుంది?

**కాగల పనులెల్ల గాకెటు బోవును?**
**కానిపనులు కానె కావు భువిని;**

**మహిమ వేరె యుండ మనతోడ నున్నదా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 525**

**తా॥** జరగవలసిన పనులు జరగకుండా యెలా ఉంటాయి? కావలసిన పనులు ఆగవు. కాని పనులు ఎంత ప్రయత్నించినా కావు. మనవల్ల ఆయేది యేదీ లేదు. దైవం తలచిన తీరుగానే జరుగును.

**శత్రువులను ద్రుంచి శాంతంబు వహియించి,**
**కృత్యములను నడపు నిత్యునెరిగి,**
**సత్యమణగకుండ సాధించినటువంటి**
**పురుషుడౌను పుణ్యపరుడు వేమ ! 526**

**తా॥** కామక్రోధాదులను జయించి శాంతచిత్తంతో సంసారచక్రాన్ని తిప్పే సారధిగా సర్వేశ్వరుని నమ్మి సత్యమార్గాలన్ని అవలంబించి విజయం సాధించిన పురుషుడే పుణ్య వరుడగు చున్నాడు.

**తనదు దేహమందు తనకున్న పరివార**
**మందరి బిలిపించి హర్ష మొసగ**
**నెల్ల చావు దెలసి యిందందు నెరిగియు**
**నడువ నేర్చు నాతడరుదు వేమ ! 527**

**తా॥** తన శరీరంలోగల ఇంద్రియాలన్నింటినీ తెలుసుకుని ఆత్మానందంతోఉండి, ఆయా స్థానలయందు గల విశేషాలు నెరిగి తత్త్వ దృక్పధంతో జీవయాత్ర సాగించువారు చాలా అరుదుగా ఉంటారు.

**మొదట నానబెట్టి తుద లేదు పొమ్మన**
**పరమ లోభులైన పాపులకును;**
**వారి యుసురు దాకి వగచెడి పోవరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 528**

**తా॥** ఆపేక్షించి వచ్చిన వార్ని చివరికి లేదు పొమ్మనమని నిరాశపరచి పంపే పాపాత్ములైన లోభులు వారి యుసురు కొట్టి చెడిపోకుండా ఉంటారా? తప్పక చెడిపోవుదురు.

**బడుగు నెరుగలేని ప్రాభవంబది యేల?**
**ప్రోది యిడని బందుభూతి యేల?**
**వ్యాధి దెలియలేని వైద్యుడు మరియేల?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 529**

**తా॥** బాధితులను తెలుసుకోలేని వానివల్ల ప్రయోజనం?అలాగే సమయం వచ్చినప్పుడు సహాయపడలేని చుట్టరికాలవల్ల ఏం ప్రయోజనం? వ్యాధిని కనుగొనలేని వైద్యుని వల్లఏం ప్రయోజనం?

**తుంట వింటివాని తూపుల ఘాతకు**
**మింట మంట నడుమ మిడుక దరమె?**
**యింట యాలు విడిచి యెట్లుండ వచ్చురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 530**

**తా॥** భూమ్యాకాశాల మధ్య పురుషు డెదురుకోవలసిన అతి కఠినమైన సమస్య భార్యా సుఖం. మన్మథ బాణాల తాకిడికి మగవాడు తట్టుకోలేక క్షణ క్షణం భార్యాలోలుడై ఉండకుండా ఉండగలడా?

**పాము కన్న లేదు పాపిష్టి జీవము**
**యట్టి పాము జెప్పినట్లు వినును?**
**యింక మోహి దెల్పనెవ్వరి వశమయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 531**

**తా॥** పాపజాతిలో మొదటిది పాము. పాము అతి ప్రమాదకరమైన జీవి. అటువంటి పామే పాములవాడి చెప్పుచేతల్లో ఉంటుంది. సంసార మోహంతో ఉన్నావాడు ఎవరి చెప్పుచేతుల్లోనూ ఉండడు.

**ఎవ్వరెరుగకుండ నెప్పుడు పోవునో?**
**పోవు జీవమట్ల బొంది విడిచి,**
**యంతమాత్రమునకు నపకీర్తి నెరుగక**
**విరగ బడును నరుడు వెఱ్ఱి వేమ ! 532**

**తా॥** శరీరంలోంచి జీవం ఎప్పుడు ఎగిరిపోతుందో తెలియదు. ఈ ఉన్న కాలంలో ఎన్నో అపకీర్తుల్ని మూటకట్టుకుని మనుష్యుడు గర్వంతో విర్రవీగుతాడు.

**తనువు విడిచి తాను తర్లిపోయెడు వేళ**
**తనదు భార్య సుతులు తగిన వార**
**లొక్కరైన నేగ రుసురు మాత్రమె కాని,**
**తనదు మంచి తోడు తనకు వేమ ! 533**

**తా॥** పోయేటప్పుడు తన భార్యా, పుత్రులూ యింకా తన పరివారంగానీ ఒక్కరూ తనతో రాలేరు రాజాలరు. ఇక తనతోపాటు తాను బ్రతికి ఉండగా యితరులను బాధపెట్టినందువల్ల తనకి తగిలిన ఉసురుమాత్రం ఒస్తుంది. అట్లే తను జీవించి ఉండగా యితరులకు చేసిన మేలుకి ఫలితం దానధర్మాదులవల్ల కలిగినది అది మాత్రం తను మరణించిన తరువాత తనను వెంటాడుతుంది.

**పూర్వ వాసన గల పుణ్యాత్ము కలిమెప్డు**
**యూట చెలమ రీతి నూరు నెప్డు**
**డెందరికినా నంగనెప్పటి యట్లుండు**
**విశ్వదాభిరామ వినుర వేమా! 534**

**తా॥** పూర్వజన్మ వాసనగల పుణ్యమనుష్యునికి ఊటబావిలో తియ్యటి నీరు ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్లు తాను బ్రతికి ఉండగా చేసుకున్న పుణ్యాల పంటలు తనకి విశేషముగా ఉపకరిస్తూండడం వల్ల తన జీవితం యెప్పటిలాగే హాయిగా ఉంటుంది.

**ఆడి తప్పు వార లభిమానహీనులు**
**గోడెరుగని వాడు కొద్దికాడు**
**కూడి కీడు సేయ క్రూరుండు దలపోయు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 535**

**తా॥** ఆడినమాటను నిలుపుకోలేని దుర్మార్గులతో కూడి అనవసరంగానే యితరులకి కీడు చేసేవారు కొందరు ఉన్నారు. వారి బ్రతుకులెందుకు?

**వాన రాకడ మరి ప్రాణంబు పోకడ**
**కానబడదు ఘనునకైనగాని**
**కానబడిన మీద కలి యిట్లు నడుచునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 536**

**తా॥** వాన రావడం కాని, ప్రాణం పోవడంకాని ఎంతటి గొప్పవాడికీ తెలియదు. అదే జరిగితే కలిగమనం యిలాగే ఉంటుందా?

**తగిన కులజుడైన తల యెత్తు ధనమైన**
**భాగ్యపురుషుడేల పట్టనెంచు**
**పరమ సాధ్వి చూడ పరుల నంటదు సుమీ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 537**

**తా॥** ఉత్తమ వంశంలో జన్మించినవాడైనా, భాగ్యవంతుడయినా మంచిగుణం కల యిల్లాలు, ఎట్టి పరిస్థితిలోనూ పరాయి మగవాణ్ణి దురుద్దేశంతో చూడ్డానికి కూడా ఒప్పుకోదు.

**పరుల దత్తమునకు పాలన జేసిన**
**నిల స్వదత్తమునకు నినుమడించు**
**నవని పరుల దత్త మపహరించిన స్వద**
**త్తంబు నిష్ఫలంబు ధరణి వేమ ! 538**

**తా॥** పరులు యిచ్చిన ధనాన్ని సక్రమంగా వినియోగిస్తే అతని సంపద రెట్టింపుగా పెరుగుతుంది. అటువంటి ధనాన్ని అపహరిస్తే అదీ తనడబ్బు కూడా నిరర్థకం అవుతాయి.

**తనదు దాన మవని తన కూతురి సమంబు**
**తండ్రి దానమెల్ల దనకు తోడు**
**అన్యులిచ్చు దానమది తల్లివంటిది**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 539**

**తా॥** తాను చేసిన దాన్ని తన సంతానంతో సమమైనది. తన తండ్రి చేసిన దానం అంతా తనతో పుట్టినవారితో సాటి అవుతుంది. పరులు తనకిచ్చేది తల్లి లాంటిది.

**గతము చేసినట్టి కర్మబంధములన్ని**
**పరిసిపోవు సత్యగురుని వలన**
**కుమ్మరి కొకయేడు గుదియకు నొకనాడు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **540**

**తా॥** గతంలో చేసిన దుష్టకర్మల బంధనాలన్నీ తొలగిపోవాలంటే తను గురువుని ఆశ్రయించితే సమస్త పాపాలూ పోతాయి. అదెట్లనగా కుమ్మరి ఎంతో కాలంగా కష్టపడి చేసిన కుండ ఒక్క దెబ్బతో బ్రద్దలయి పోయిన విధంగ ఉంటుంది.

**జాతులందు మిగులజాతి యేదెక్కువో!**
**యెరుకలేక తిరుగనేమి ఫలమొ ?**
**యెరుక గలగువాడె హెచ్చైన కులజుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **541**

**తా॥** జాతుల్లో ఏది గొప్పదీ? ఏది తక్కువదీ? అని తెలుసుకోడానికి దేశం అంతా తిరిగినందువల్ల ఏం ప్రయోజనం ? జ్ఞానం గలవాడే ఉత్తమ జాతికి చెందినవాడు.

**కూటికి గతిలేక కూర్చున్న వారికి,**
**నాడుదాని మీది యాస గలదె?**
**యన్నమదము చేత నన్ని మదంబులౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **542**

**తా॥** అన్నం లేనివాడికి నీరసం మాత్రమే. నీరసంతో నిండిన శరీరికి ప్రేమరసం ఎక్కడిది? అటువంటప్పుడు ఆడదాని మీద కోరిక ఉండదు. అన్నమదం ఉంటే అన్ని మదాలూ ఉంటాయి.

**అన్ని జాదలుడిగి యానంద కాముడై**
**నిన్ను నమ్మజాలు నిష్ట తోడ,**
**నిన్ను నమ్మ ముక్తి నిక్కంబు నీయాన**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **543**

**తా॥** అన్ని బలాలూ పోయంతరవాతనైనా ఆనందమందు యిచ్ఛ జనిస్తే సర్వసాక్షియైన భగవంతుని నిష్టతో నమ్మితేచాలు, సర్వేశ్వరుని యందు విశ్వాసం ఉంటే ముక్తి నీ యానగా నిజంగా లభిస్తుంది.

**ఒడ్డు పొడుగు గలిగి గడ్డంబు పొడుగైన**
**దానగుణము లేక దాత యగునె?**

**యెనుము గొప్పదైన యేనుగు బోలునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **544**

**తా॥** ఒడ్డూ పొడుగూ ఉండి పెద్దగెడ్డం పెంచేస్తే దానగుణం లేనివాడు దాత ఔతాడా? ఎంత బలిసి ఉన్నా దున్నబోతు యేనాటికైనా యేనుగౌతుందా!

**సతుల జూచి నరుడు సౌఖ్యంబు గోరును,**
**గతులు గానలేడు కర్మమందు**
**గతులు సతలు వలన గానంగ లేరయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **545**

**తా॥** స్త్రీలను చూసి మనుష్యుడు సుఖాల్ని పొందగోరును. భార్యలేనివాడు చేసిన కర్మఫలితాన్ని యియ్యదన్న ఉద్దేశంతో సతులని చేరతీస్తాడు మానవుడు. కర్మలవల్ల గాని సతులవల్లగాని గతులు పొందజాలడు.

**ఆలి మాటలు విని యన్నదమ్ముల బాసి,**
**వేరు బడెడువాడు వెఱ్రివాడు,**
**కుక్కతోక బట్టి గోదావరీదునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **546**

**తా॥** భార్యమాటల్ని విని అన్నదమ్ములతో దెబ్బలాడి వేరుపడేవాడు వట్టి వెఱ్రివాడు. అట్లాంటి పని యెలా ఉంటుందంటే కుక్కతోక పట్టుకుని గోదావరి యీదడం లాంటిది.

**స్త్రీలు గల్గుచోట చెల్లాటములు గల్గు,**
**స్త్రీలులేని చోటు చిన్నబోవు,**
**స్త్రీలచేత నరులు చిక్కుచున్నారయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **547**

**తా॥** స్త్రీలున్నచోట్ల తగువులూ, గొడవలూ ఒస్తుంటాయి, అట్లని స్త్రీలని దూరంచేస్తే ఆ చోట్లు చిన్నబోయినట్లు స్త్రీల కారణంగా మనుష్యులు చీకాకుల పాలవుతున్నారు.

**మాల మాలగాడు మహి మీదనే ప్రొద్దు,**
**మాట తిరుగువాడు మాల గాక,**
**వాని మాల యన్నవాడె వాడెరామాలౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **548**

**తా॥** మాలవాడు మాలాడు అంటూంటారు. అసలు మాలవాడంటే మాట తప్పిపోయినవాడే మాల సంఘంలో దురాచారానికి మాలవాణ్ణి ఎత్తిచూసేవాడే పెద్దమాలాడు అంటున్నాడు వేమన.

**చిప్పలోను బడ్డ చినుకు ముత్యంబాయె**
**నీళ్ళ బడ్డ చినుకు నీళ్ళ గలిసె**
**ప్రాప్తముగల చోట ఫలమేల తప్పునో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 549**

**తా॥** స్వాతీనక్షత్రములో పడిన వానచినుకులు ముత్యాలయ్యాయి. నీళ్లలో పడ్డ చినుకులు నీళ్ళయ్యాయి. అలాగే పొందవలసినది తప్పక పొందును.

**కులము గలుగువారు గోత్రంబు గలవారు**
**విద్యచేత విర్రవీగు వారు,**
**పసిడి గల్గు వాని బానిసె కొడుకులు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 550**

**తా॥** ఇదిగో నే గొప్పకులంవాణ్ణి; నా గోత్రం చాలా ప్రసిద్ధమైంది; నే మహావిద్యావంతుణ్ణి వీరందరూ బంగారానికి దాసులన్నమాట.

**కాని వాని తోటి కలసి వర్తించెనా**
**హాని వచ్చు నెంతవానికైన**
**తాటి క్రింద పాలు త్రాగిన చందమౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 551**

**తా॥** తనవారితో ఎంత కలిసి మెలిసి ఉన్నా ఏం పరవాలేదు. వేరేవారితో కలిసి ఉండడం ఎలాగైనా ఎప్పుడో అప్పుడు హాని కాకమానదు.

**కరగ కరగ బుట్టు కనకంబునకు వన్నె,**
**పెనగ పెనగ బుట్టు ప్రేమసతికి,**
**ముదియ ముదియ బుట్టు మోహంబు లోభంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 552**

**తా॥** కరగ్గా కరగ్గా బంగారానికి మంచి రంగు ఒస్తుంది. గొడవలు విపరీతంగా పెరిగిన తరువాత ప్రేమపుడుతుంది. యిల్లాలికి భర్తమీద వయస్సు ముదిమిలోనికి పోతూన్నకొద్దీ మోహం లోభంకూడా పెరుగుతాయి మనిషికి.

**ఎరుకలేని దొరల నెన్నాళ్ళు గొలిచిన**
**బ్రతుకులేదు వట్టి భ్రాంతి గాని**
**గొడ్డుటావు పాలు గోరితే చేపునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 553**

**తా॥** చెడ్డ ప్రభువుల్ని ఎంతకాలం సేవించినా జీవితానికి సుఖశాంతు లుండవు.గొడ్డుటావు దగ్గిరికి పాలు పితకడానికి వెడితే అది చేపుతుందా? తన్నుతుంది.

**కులము లేనివాడు కలిమిచే వెలయును,**
**కలిమిలేనివాని కులము దిగును,**

**కులముకన్న మిగుల కలిమి ప్రధానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 554**

**తా॥** సంపదలుంటే కులం లేకపోయినా గుర్తింపు ఉంటుంది. డబ్బులేనివాడు ఎంత కులవంతుడైనా అలాంటి వానికి లోకంలో ఏ గుర్తింపు ఉండవు. కులం గొప్పదా అని ఆలోచిస్తే సంపన్నుడికే ప్రాముఖ్యం ఉంటుంది.

**నెయ్యి లేని కూడు నీయాన కనువది**
**కూర లేని తిండి కుక్కతిండి**
**ప్రియములేని కూడు పిండపు కూడురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 555**

**తా॥** నెయ్యిలేకుండా భోంచెయ్యడం గడ్డితిండం లాంటిది. కూరలేకుండా భోంచెయ్యడం అది కుక్కతిండి. ఇక అయిష్టంగా పెట్టిన భోజనం పిండాకూడుతో సమానం.

**నోటి పుప్పి కెల్ల నొప్పి లేకుండగా**
**నాకు పోక సున్న మౌషధంబు**
**పెట్టకుండె నేని పెనురోత వేనురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 556**

**తా॥** దంతబాధ నోటిబాధ లేకుండాలంటే తమలపాకులూ వక్కలూ సున్నం వాడాలి.అదే ముఖబాధకి మంచి మందు. తాంబూలం దర్పణం చెయ్యకపోతే పెదవులూ నోరూ అంతా రోతేమరి.

**అన్న మదము వలన నతివలు నరులట్టు**
**లేవు రేగి మదసు దేచెనందు**
**రన్నముడుగు వెనుక నతడెందుబోయెరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 557**

**తా॥** అన్నం తినడంవల్ల స్త్రీలకు మమకారం తయారవుతుంది. ఆ అన్నం తగ్గినప్పుడు ఆ ఏపు ఎక్కడిది? ఆ మన్మధుడు ఎక్కడికి పోయినట్లు?

**ఎఱ్ఱనాడుదాని నేపార జూచిన,**
**వేకి బుట్టి చాల వెఱ్ఱి బట్టు,**
**పల్లు దెరచి నగిన బట్టు పెన్భూతంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 558**

**తా॥** ఎఱ్ఱని ఆడదాన్ని ఎక్కువగా చూడ్డంవల్ల దానిమీద వ్యామోహం మితిమీరిపోతుంది. ఆ స్త్రీయే పళ్ళుకనబడేలా నవ్విందా మగాడికి పెద్ద కామ పిశాచమే పట్టుకుంటుంది.

**హీన జాతి వాని నిలుజేర నిచ్చెనా**
**హాని వచ్చునెంత వానికైన**

**యీగ కడుపు జొచ్చి యిలుట్టు జేయదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 559**

**తా॥** తక్కువ కులంవాణ్ణి దగ్గిరగా చేరనీయడంవల్ల ఎలాంటివారికైనా ప్రమాదం జరుగుతుంది. అది ఎలాగంటే కడుపులోకి ఈగ జొరబడడం లాంటిది.

**తలప వశము గాదు తత్త్వంబు బ్రహ్మంబు**
**తెలియలేడు బ్రహ్మ దేవుడైన;**
**యిసుక భావి ద్రవ్వ యెవ్వరి వశమయా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 560**

**తా॥** ఇసుకలో బావి తవ్వడం ఎలా సాధ్యం కాని పనో అలాగే తత్త్వాన్ని కాని బ్రహ్మమును కాని తెలుసుకోవడం కూడా అంత కష్టమైన పనే. బ్రహ్మదేవుడు కూడా తత్త్వాన్ని తెలుసుకోడు.

**ఎట్టి స్త్రీల గనిన నింతంత యనరాదు**
**కాల వహ్ని లక్క గరిగినట్లు**
**నట్టి గాధ మోహమెంతైన జేయురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 561**

**తా॥** యువతుల్ని చూస్తే పురుషులు తీవ్రమైన నిప్పు సెగలకి లక్క కరిగినట్లు మోహంతో కరిగిపోతారు. అటువంటి ఆకర్షణ స్త్రీ వ్యామోహం ఎంతటి పనైనా పురుషుల చేత చేయిస్తుంది.

**కాంత కుంకయైన కాని కులంబైన**
**బాయ లేక విటుడు భ్రమసి యుండు**
**మరగి గుడ్డి కుక్క మాంసంబు గన్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 562**

**తా॥** కులశీలాలు లేని యువతి ప్రేమలో చిక్కుకున్న విటుడు మాంసం తిన మరిగిన గుడ్డి కుక్క మాంసం ముక్కని విడవ జాలనట్లే ఆ స్త్రీని విడువజాలడు. అలాంటి దాని మీద యెక్కువగా ఉంటుంది.

**పప్పులేని కూడు పరుల కసహ్యమౌ**
**అప్పులేని వాడె యధిక సంపన్నుండు**
**ముప్పులేని వాడు మొదల సుజ్ఞానుండు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 563**

**తా॥** పప్పులేని తిండి ఎంతో అసహ్యంగా ఉంటుంది. అప్పులేని వాడు అధిక ధనవంతుడు. సాంసారిక వ్యామోహం లేనివాడు బుద్ధిమంతుడు.

**పేదరికమంత దోషం**
**బేదో యీ జగతిలోన నీశ్వరుడెరుగున్**

**పేదను పొడగను వాడున్**
**కాదని శవమనుచు జూచు గదరా వేమ !** **564**

**తా॥** పేదరిక మంత తప్పిదం యీ లోకంలో ఇంకోటి ఏదీ లేదు. ఆ బాధ ఈశ్వరుడికే తెలుస్తుంది. మనుష్యుడా బాధను తెలుసుకోలేడు. పేద మనుష్యుణ్ణి చూస్తే ఓ శవంలా కానవస్తాడు.

**ధార్మికునకు గాని ధర్మంబు గనరాదు**
**కష్టజీవి కెట్లు గానబడును?**
**నీరు జొరక లోతు నిజముగా దెలియదు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **565**

**తా॥** కష్టజీవికి ఎలా కనబడుతుంది ధర్మం. అది ధార్మికునకు కనబడుతుంది. నీటియొక్క నిజమైన లోతు తెలియాలంటే ఆ నీటిలో దిగితే గాని తెలియదు.

**మొగము జూచినపుడు, మోహంబు ఘనమౌను**
**ధనము జూచి నపుడె తగులు మనసు**
**కూలినప్పుడరయ కుసులెల్ల విరుగును**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **566**

**తా॥** స్త్రీ యొక్క ముఖం చూసేసరికి ఆమెయందు మోహం కలుగుతుంది. డబ్బును చూడగానే దాని మీద కోరిక జనిస్తుంది. గృహిదులు కూలి పడిపోయినప్పుడే కుసులు విరిగిపోతాయి.

**ఎన్ని మతములైన నేమంత్రమైనను,**
**సత్యమింతలేక జాడ విడదు**
**సత్యము గలిగున్న జగతిలో ద్విజుడయ్యె**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **567**

**తా॥** సత్యమును మించిన మతం లేదు. లోకంలో సత్యాన్ని పాటించినవాడే బ్రాహ్మణుడవుతాడు.

**పరుల మోసపుచ్చి ధర ధనమార్జించి**
**కడుపు నింపుకొనుట కాని పద్దు**
**ఋణము సేయు మనుజుడెక్కువకెక్కునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **568**

**తా॥** ఇతరులను మాయచేసో, అబద్ధాలాడో డబ్బు సంపాదించడం తగని పని, ఋణాల పాలయిన మనుష్యునికి ఘనత యెలా చేకూరుతుంది.

**స్థిరము గాని క్షుద్ర పర కూటముల జేసి**
**హెచ్చు తగ్గు నొంది హీన మతులు**
**గాడ్దె పిల్లలగుచు గ్రక్కున జెడుదురు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **569**

**తా॥** కొందరు మానవులు క్షుద్ర దేవతారాధనలతో స్వార్ధబుద్ధితో, హేతువుకు నిలవని హీన మత శాఖలను అవలంభించి సంఘంలో హెచ్చు తగ్గులను సృష్టిస్తున్నారు. ఇటువంటి భక్తులలో బాబాలో చివరికి గాడిద పిల్లల్లా తయారయి చెడి నామ రూపాలు లేకుండా పోతారు.

**ధర్మమన్న వినరు తము నమ్మి భూనరుల్**
**యమునివారు వచ్చి యడలు నించి**
**చొచ్చికొట్ట తమరు చొర బాద గలరకో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 570**

**తా॥** కేవలం కనబడిన దాన్నే తను నమ్మి ధర్మం అన్న సంగతిని ఆచరించక ఉండేవారీ లోకంలో ఉన్నారు. వారు చనిపోయిన తరువాత తమ పాప ఫలాన్ని అనుభవించ వలసినప్పుడు యమభటులు పెట్టే కష్టాల నుంచి తప్పించుకోగలరా? ఎక్కడికి పోగలరు?

**దానమడుగు వాడు ధరలోన నధముండు**
**దానమడుగడేని దైవసముడు**
**దానమీని వాడు ధన్యుండు కాడయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 571**

**తా॥** దానం అడక్కుండా ఉండడం చాలా మంచిది. అలాంటివాడు దైవసముడు. యాచకుడు దానం అడిగిన తరువాత యివ్వలేనివాడు మరీ అధముడు అట్టివాని జీవితం ధన్యం కానిది.

**తనకు ప్రాప్తిలేక దాతలివ్వరటంచు**
**దోష బుద్ధిచేత దూరుటెల్ల**
**ముక్కు వంక జూచి ముకురంబు దూరుట**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 572**

**తా॥** తనకు రావలసిన యోగం లేనందువల్ల దాతలివ్వడం లేదు. అనాలి. అంతేకాని దాతల్ని తిట్టకూడదు. ముక్కువంక చూస్తూ అద్దాన్ని ఆడిపోసుకుంటే ఏం ప్రయోజనం ఉంది.

**పెక్కు జనుల జంపి పేదల వధియించి**
**డొక్క కొరకు నూళ్ళు దొంగిలించి**
**యెక్కడికిని బోవనెరిగి యముడు జంపు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 573**

**తా॥** చాలామంది పేదవార్ని చంపేసి ఊళ్ళమీద పడి దొంగతనాలు చేస్తూ ప్రజాకంటకులు ఇక్కడ తప్పించుకున్నా యమధర్మరాజు బారి నుండి తప్పించుకోలేరు.

**తండ్రి కన్న సుగుణి తనయుడు గల్గినా**
**పిన్న పెద్దతనము లెన్న దగదు**
**వాసుదేవు నెన్ని వసుదేవువిడువరో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 574**

**తా॥** తండ్రిని మించిన కొడుకు కలగడం కంటె సంతోషింప దగిన దేముండును? తండ్రిని మించిన మంచి కొడుకులు చెప్పినా గ్రహింపవలయును. వాసుదేవుడు లేకుండా వసుదేవునికి ఘనత యెక్కడిది?

**పాలనీడిగింట గ్రోలుచు నుండెనా**
**మనుజు లెల్ల గూడి మద్యమండ్రు**
**నిలుప దగని చోట నిలువ నిందలువచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 575**

**తా॥** ఈడిగాళ్ళ యింటజేరి అక్కడ పాలు త్రాగినా పదిమంది మనుష్యులూ మద్యం త్రాగాడంటారు. తగని చోటుకి వెడితే నిందలు రాక మానవు.

**కన్న పుత్రునాస కనకంబు మీదాస**
**స్త్రీల మీది యాస చిత్తమెడలి**
**భ్రమలు విడువకున్న బ్రహ్మంబు గానరో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 576**

**తా॥** కన్న కొడుకుల మీదా, బంగారం మీదా, స్త్రీల మీదా ఆశలు విడిచిపెడితే గాని, బ్రహ్మమును చూడజాలరు.

**చెట్టు చేమ గొట్టి చుట్టు గోడల బెట్టి**
**యిట్టునట్టు పెద్ద యిల్లు గట్టి,**
**మిట్టి పడును నరుడు మీది చేటెరుగక,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 577**

**తా॥** చెట్టూ చేమలూ కొట్టించి కలవని జతపెట్టి చుట్టూ గోడలు పెట్టి గొప్పగా పెద్ద భవంతి కట్టుకుని దగ్గిర్లో ఉన్న మృత్యువును కానుకోక మురిసిపోతూంటాడు.

**వచ్చేదిని పొయ్యేదివి**
**చచ్చేదిని గానక లేక సహజము లనుచున్;**
**విచ్చలవిడిగా దిరుగుట**
**చిచ్చున బడినట్టి మిడుత చెలువము వేమ ! 578**

**తా॥** ప్రకృతిలో వచ్చేవీ పోయేవీ అలాగే చావడం లాంటివి మామూలే. మానవ సహజాలే అంటూ ఎవరంతట వారు స్వేచ్ఛగా సంచరించడం నిప్పులో పడే మిడత లాంటిదే అవుతుంది.

**ఒక్కతోలు దెచ్చి యెరపు బొమ్మను జేసి,**
**యాడునట్లు జేసి యట్టె వేసె;**
**తన్ను దిప్పువాని దానేల కావడో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 579**

**తా॥** చక్కని రంగుగల ఓ తోలుతెచ్చి దానితో అందమైన ఓ బొమ్మను చేసి ఆడించుతాడు. దీన్ని చూసి సంతోష పడుతున్నాడేగాని, తనను ఆడించు ఆ దేవుని తెలుసుకోడానికి ప్రయత్నించడు.

**పర బలంబు జూచి ప్రాణ రక్షణమున**
**కురికి పారిపోవు పిరికి నరుడు,**
**యముడు కుపితుడైన నడ్డమెవ్వండయా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 580**

**తా॥** శత్రువుల గొప్పబలాలను చూసి ప్రాణభీతితో పిరికిపంద ఎటోఅటు పారిపోవాలని చూస్తాడు. యముడే కోపోద్రిక్తుడై ప్రాణభీతి పలాయనునికి అడ్డంవస్తే ఇక రక్షించేవాడు ఎవడు?

**తల్లి దండ్రి చావ తనయుడు తానేడ్చు,**
**మగడు చావ నాలు వగచుచుండు,**
**కార్య వశమె కాని కలుగదు మోహంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 581**

**తా॥** తల్లితండ్రులు మరణిస్తే కుమారులూ, భర్తకాలం చేస్తె భార్యాదుఃఖిస్తారు. ఆ యేడ్పులు కార్యవశం వల్లనే గాని వాస్తవంగా వచ్చే దుఃఖం కాదు.

**మనసులోని ముక్తి మరియొక్క చోటను**
**వెదుక బోవు వాడు వెర్రివాడు**
**గొర్రె జంక బెట్టి గొల్లడా వెదుకడా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 582**

**తా॥** గొల్లవాడు గొర్రెను చంకలో పెట్టుకుని ఊరంతా వెతికినట్లు మనస్సులో ఉన్న ముక్తిని పైనెక్కడో ఉందని వెదకడం వెర్రితనం కదా!

**ఆశకన్న దుఃఖమతిశయంబుగ లేదు,**
**చూపు నిలువకున్న సుఖము లేదు,**
**మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 583**

**తా॥** ఆశకంటే మించిన దుఃఖం ఏదీలేదు. దృష్టిని నిలకడగా ఉంచకపోతే సుఖంలేదు. మనస్సును నిలవలేకపోతే ముక్తిలేదు.

**తత్త్వహీనులుంద్రు తరుచుగా భువిలోన**
**తత్త్వ మెరుగు వారు తరుచులేరు**
**కలిగిరేని వారు కల్పింప రారయా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 584**

**తా॥** తత్త్వాన్ని గురించి తెలుసుకోడానికి ప్రయత్నించే వారు ఈ లోకంలో చాలా తక్కువ. తత్త్వవేత్తలు చాలా తక్కువగా ఉంటారు. ఉన్నవారు కనిపించరు. ఆ కొద్దిమందీ కూడా తత్త్వహీనుల జనాభాలో బయట పడడానికి యిష్టపడరు.

**తాను నింద్రియముల దనర జయించిన,**
**తత్త్వ మరసి చూడ దాన యగును**
**రాజయోగి యిట్లు దేజరిల్లుచు నుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 585**

**తా॥** యింద్రియాలను జయించి తత్త్వాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించితే ఆత్మజ్ఞానం అలవడుతుంది. అటువంటి జ్ఞానియే రాజయోగి.

**స్త్రీల మాయచేత జిక్కి తా గొన్నాళ్ళు**
**తగులు గోరునట్లు దగిలిపోవు,**
**తనిసి సొలిసి తాను దైవంబు చే జెడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 586**

**తా॥** స్త్రీలు చేసే మాయలలో చిక్కుకుని అవే ఏవో గొప్ప అనుభూతులూ సంతోషాలూ అనుకుంటూ మురిసిపోతూ అలిసిపోతూ కాలంచేస్తాడు. చివరికి నిజమైన దైవచింతలేక దైవానికి దూరుడై పతనమైపోతాడు.

**చెప్పులోని రాయి చెవులోని జోరీగ;**
**కంటిలోని నలుసు కాలిముల్లు,**
**నింటిలోని పోరు నింతంత గాదయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 587**

**తా॥** చెప్పులోనిరాయి చెవులో జోరీగమోత, కంట్లోపడ్డ నలుసూ, కాలిలో గుచ్చుకున్న ముల్లూ, యింట్లో యిల్లాలు పెట్టేపోరూ వీటివల్ల కలిగే విసుగు యింతా అంతాకాదు.

**వార కాంతలెల్ల వలచి యేతెంతురా?**
**పొందుచేసి ధనము పుచ్చుకొనక;**
**మారకమ్మ జొచ్చి మరి యిల్లు వెళ్ళునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 588**

**తా॥** భోగపు స్త్రీలు ఎవర్నీ ప్రేమించి దరికిరారు. కామ ప్రవృత్తిలో వచ్చి విత్తంకోసం ప్రేమ నటిస్తారు. అలాంటి స్త్రీ యింట్లో ప్రవేశిస్తే అది బయటకు వెడుతుందా?

**గుణము గూడు జేసి గుణము వత్తిగజేసి,**
**సరవి కర్మ సమితి జమురు జేసి,**
**మూల నొక్కజ్యోతి ముట్టించి చూడరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 589**

**తా॥** మనస్సును ప్రమిదగాచేసి గుణాన్ని పత్తిగా చేసి కర్మసమూహాన్ని తైలంగాచేసి ఆత్మలో జ్ఞాన జ్యోతిని వెలిగించి బ్రహ్మమును చూడు.

**ఎన్ని యెన్ని పూజలెన్ని జేసిననేమి?**
**భక్తిలేని పూజ ఫలము లేదు!**
**భక్తిగల్గు పూజ బహుళ కారణమురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 590**

**తా॥** భక్తిలేకుండా ఎన్ని పూజలు చేసిన నిష్ఫలం, కొద్దిపాటి పూజైనా భక్తి హృదయంతో చేస్తే అది ఎంతో గొప్పది.

**శివు గుడిని దీపమిడినను**
**శివు మందిరమెల్ల వెలుగ జేయుట యరుదా?**
**శివ యోగిజ్ఞాన దీపము**
**భువనంబుల వెలుగ జేయు పొలుపుగ వేమ ! 591**

**తా॥** ఈశ్వరుని గుళ్లో దీపం పెడితే అది శివుని మందిరాన్నంతన్నీ ప్రకాశింపజేస్తుంది. శివయోగి మనస్సులో వెలిగిన జ్ఞాన జ్యోతి లోకాన్నంతనీ ప్రకాశింపచేస్తుంది.

**ఆప గాలి వెంట నడుపుల వెంటను,**
**కొండరాళ్ళ వెంట గొడవనేల?**
**నుల్లమందె శివుడటుండుట దెలియరు!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 592**

**తా॥** నిలకడ లేకుండా కోరికలతో అడవుల వెంటా, కొండరాళ్ళ వెంటా సంచరించినందువల్ల శివుణ్ణి దర్శించలేము. శివుణ్ణి హృదయంలో వెతికి తెలుసుకోవాలి.

**లలిత శివ తత్త్వ పథమున**
**గలసిన శివయోగి యేల గలియును జనులన్?**
**జల బిందువు ముత్తియమై**
**కలుసునె తొల్లింటి నీట గనరా వేమ ! 593**

**తా॥** నిజమగు శివయోగి సామాన్య జనులతో కలియడానికి ఇచ్ఛగించడు, ముత్యంలోపడి ముత్యం కావలసిన జలం ఉప్పునీటిని కలవదు కదా?

**గాడ్దె యేమెరుంగు గంధంబు వాసన?**
**కుక్క యేమెరుంగు గొప్పకొద్ది?**
**యల్పుడేమెరుంగు హరుని గొల్చు విరక్తి ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 594**

**తా॥** గంధపు వాసన గాడిదకు తెలియనట్లె, కుక్కకు ఉచ్చనీచాలు తెలియనట్లే శివుని సేవించే విరాగి భావం అల్పుడికేం తెలుస్తుంది?

**మూడు వేళలందు ముదముతో శివునాత్మ**
**పూజ సేయు వాడు పుణ్యమూర్తి!**
**పూజలేక మోక్షభోగంబు దొరుకునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 595**

**తా॥** మూడు సంధ్యల యందూ శివుని మనస్సులో పూజించువాడు పుణ్యపురుషుడు, శివధ్యానం లేకుండగా మోక్షసుఖం ప్రాప్తించదు.

**రుద్ర రూపుదాల్చి రుద్రుని నిందించి,**
**భ్రష్టు త్రోవ దిరుగు భ్రష్టజనులు,**
**రంకు కుదిరి గేటి రమణుల వలె నుంద్రు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 596**

**తా॥** రుద్రునిరూపం ధరించి రుద్రుణ్ణి నిందిస్తూంటారు. తప్పుడుదార్లలో తిరిగే భ్రష్టు జనులు, రమణులు రంకుకి పోతూ దాన్ని నిందించినట్లుంది.

**యొడలు బడలజేసి యోగుల మనువారు**
**మనసు కల్మషంబు మాన్పలేరు**
**పుట్టమీద గొట్ట భుజగంబు చచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 597**

**తా॥** శరీరాన్ని శుష్కింప జేసుకున్నంత మాత్రంచేత మనస్సులో పాపం తొలగిపోదు, పుట్టమీద కొట్టినంత మాత్రాన పాము చావదు కదా?

**మాల వానిజూచి యేల నిందింపంగ?**
**పాటి లేని మాట పలుకు టొకటె,**
**వానిలోన బల్కు వాని కులంజెందేది?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 598**

**తా॥** మాలవాణ్ణి చూసి నిందించడం దేనికి? చెడ్డమాటలని పలకడం దేనికి? ప్రతినిమిషం చవట మాటలు పేలేవారికి అసలు కులం అంటూ ఉందా?

**కుక్క యేకతంబు కొక్కెర ధ్యానంబు,**
**గాడ్దె రాగమెన్న గప్ప ముసుగు,**
**ఆత్మ నెరుగు భావ మదియేల జేయరో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 599**

**తా॥** కుక్క యేకాంతాన్ని పాటిస్తుంది. కొంగధ్యానం చేస్తుంది. గాడిద రాగం ఆలపిస్తుంది; కప్పమునక వేస్తుంది. ఇవన్నీ నిజమైన అభిప్రాయంతో జరుపబడేవి. ఆత్మలో తత్త్వం కోసం తలంపు చేస్తె అది బ్రహ్మానందాన్నిస్తుంది.

**సకల శాస్త్రములను జదివియు వ్రాసియు**
**తెలియగలరు చావు దెలియలేరు,**
**చావు దెలియలేని చదువులవేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 600**

**తా॥** అన్ని శాస్త్రాలను బాగా చదివి వ్రాసి అనేక విషయాలను తెలుసుకోగలుగుతారు, ఎన్ని శాస్త్రాలయినా చావు వరకేగానీ చావును గురించి తెలియచెప్పలేని చదువువల్ల ఏం ప్రయోజనం?

**కొండ రాళ్ళుదెచ్చి కోరిక గట్టిన**
**గుళ్ళలోన దిరిగి క్రుళ్ళనేల?**
**పాయరాని శివుడు ప్రాణియై యుండంగ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 601**

**తా॥** పెద్దపెద్ద బండరాళ్ళను తెచ్చి కోరికలతో ఆలయం నిర్మించి పూజోపావాసాదులతో శ్రమపడి ఏం లాభం? శివుడి కోసమేనా? ప్రాణిరూపంలో శివుడు సాక్షాత్కరిస్తూన్న చూసి తెలుసుకోలేక పోతున్నాడు?

**కులము వలన గొంత, బలము వలన గొంత,**
**కలిమి వలన గొంత, గర్వమునను,**
**రంకు చదువు జదివి రంకున బడుదురు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 602**

**తా॥** కులం గొప్పకోసమో, బలం పెంచుకోడానికో, సిరిసంపదలను పెంచుకోడానికో, అహంకారం కొలదీ పాడు చదువుల్ని చదివి మరింత పాడవుతున్నారు.

**విశ్వమంత నడిపి విశ్వేశ్వరుండుండు,**
**బ్రహ్మలకును నేల పాటి దక్కె?**
**వనములోని కోతి వసుమతి నడుపునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 603**

**తా॥** ప్రపంచాన్నంతటినీ నడిపేవాడు విశ్వేశ్వరుడై యున్నాడు. ఆ విశ్వేశ్వరుణ్ణి మేం నడుపుతామని బ్రాహ్మణులు భావించడం ఎలా వుందంటే వనంలో ఉండే కోతి ప్రపంచాన్ని యేలగల దనుకోవచ్చా?

**చదువు వానికన్న చాకలి తా మేలు,**
**గురము వేల్పుకన్న కుక్క మేలు,**

**సర్వ సురలకన్న సర్వేశ్వరుడు మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 604**

**తా॥** వివేకంలేని చదువరి కంటె చాకలి మేలు, ఎంచేతనంటే వాడు ఎవరి బట్టలేవో గుర్తుపట్టకలడు. కోరిక నెరవేర్చలేని దేవత కంటె కుక్కనయం. చిల్లరిమల్లరి దేవుళ్ళందరికంటేనూ సర్వేశ్వరుడు మేలైనవాడు.

**బూది పూతలెన్నొ భుజముల పొంకాలు,**
**వ్రాలు లింగములును వరుస మతము**
**లిక్కడ దగు గాక నక్కడ దగదెట్టు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 605**

**తా॥** శరీరం మీద వీభూది పూసుకోడం, భుజాలపై ముద్రలు వేసుకొనడం, కంఠమునకు లింగాలు తగిలించుకొనడం లాంటి డాంభిక వేషాలు యిక్కడ చెల్లును.నిజమైన దేవుణ్ణి తెలుసుకొనడానికివేమీ ఉపయోగించవు.

**అడుగదగు వారి నడిగిన,**
**నిడిన యెడన్ కొసర కొసర నీలేననగా,**
**గడుసు పడి యాసచే తా**
**నడిగిన దుర్మార్గ వృత్తులగురా వేమ ! 606**

**తా॥** ఈయగలవారినే అడగాలి. ఇచ్చేటప్పుడు కొసరక చక్కగా యివ్వాలి. ఇవ్వలేనంటూన్నా దురాశతో మరీ మరీ పీక్కు తినడం యెందుకు?

**అదనెరిగిన మగువ యనువెర్గు, చనువెర్గు,**
**ముదము తోడ మగని మోహమెరుగు,**
**విభుని శ్రేష్ఠగుణము వేశ్య తానెర్గునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 607**

**తా॥** భర్తయందు ప్రేమగల ఉత్తమ యిల్లాలు అతని అనువునీ, చనువునీ, సంతోషాన్నీ భర్తమోహాన్ని తెలుసుకుని వర్తించును. అదే వేశ్య కపట ప్రేమను నటించునే కానీ మనసెరిగి నడుచుకోదు.

**ఆకటికి దొలంగు నాచార విదులెల్ల?**
**చీకటికి దొలంగు చిత్తశుద్ధి!**
**వేకటికి దొలంగు వెనకటి బిగువెల్ల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 608**

**తా॥** పురుడు వచ్చిన స్త్రీకి వెనుకటి శరీర పాటవం ఉండదు. వేషధారి ఆకలి వేసినప్పుడు ఆచారం సంగతి విడిచేస్తాడు. మగవాడు చీకటి పడగానే స్త్రీకి లోకువైపోతాడు.

**త్రాసును పడిసే లంజయు**
**భాసుర గతి నొక్కరూపు పరికింపంగా,**
**వీసంబధికంబై నను,**
**వాసరమున నొక్క వంక వాలుర వేమ ! 609**

**తా॥** తక్కిడతో బతికే ఓలంజ కొద్దిపాటి లాభం కనబడితే చాలు రోజులో ఏదో రకంగా ఎక్కడో అక్కడ ప్రియుడి మీద వాలుతుంది.

**నిరు పేదల రక్షించే**
**సరసుడు నెరదాత గాక సంపన్నుల దా**
**భరియించు వాడు దాతయె?**
**మెర మెచ్చుల దాత యతడు మేదిని వేమ ! 610**

**తా॥** దరిద్ర జనులను కాపాడే దాతయే నిజమైనన దాత. డబ్బుగలవారికి మాత్రమే దానంచేసే దాతలు కూడా ఉన్నారు. ఇలా సంపన్నులను పోషించే దాతలు ఆడంబరాలకు పోయేకుత్సిత దాతలు మాత్రమే వారు.

**తన్ను చూచి యొరులు దగ మెచ్చవలెనని,**
**సొమ్ము లెలమి బెట్టు, నెమ్మె మీర,**
**నొరుల కొరకు దాన యుబ్బుచు నుండును,**
**తన్ను దెలియలేడు ధరణి వేమ ! 611**

**తా॥** ఇతరులు చూసి మెచ్చుకోవాలని ఎన్నో విలువైన ఆభరణాలు పెట్టుకుంటారు. వారిని చూసి యితరులు మెచ్చుకోకపోయినా పలుమార్లు వారిని వారే మెచ్చుకుని మురిసి పోతూంటారు.

**ధనము లేకయున్న ధైర్యంబు నిలువదు;**
**ధైర్య మొదవదేని ధనము లేదు;**
**ధనము ధైర్యమరయ దగు భూమి పతులకు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 612**

**తా॥** ధనములేక ధైర్యం ఉండదు. ధైర్యం లేకపోతే ధనం ఉండదు. ధనం ధైర్యం రెండూ ఉండాలి రాజులకు.

**ఇచ్చి పుచ్చుకొన్న హితమైన మనుజులు**
**తగ్గు లేక నర్లు తామర వలె;**
**కాచి పూచి పండు కడు రమ్యమైయుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 613**

**తా॥** సంబంధ బాంధవ్యాలు సన్నిహితంగా కలుపుకుంటూండడంవల్ల తామరతీగలా పూచి కాచి అభివృద్ధి చెందుతూ ఎంతో మనోహరంగా ఉండును.

**సతికి పతికినైన సంపద సంపదే?**
**పుత్ర సంపదలును భువిని మేలు,**

**సరిగ ముదిసి బ్రతుకు సంపద సంపద**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 614**

**తా॥** భార్యకు భర్త, భర్తకు భార్య అనేది చక్కని సంపద, పుత్రులు కలిగి ఉండడం మంచి సంపద, వృద్ధులయినా భార్యాభర్తలు సంపద కలిగిహాయిగా కాలం గడపడము అసలైన సంపద.

**కడగ నింద్రియముల గట్టివేయగలేక,**
**చావు వచ్చునపుడు సన్యసించు**
**నాత్మ దిటము లేక నందునా మోక్షము?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 615**

**తా॥** యింద్రియాలను అదుపు చేయలేక తప్పనిసరిగా మరణ సమయం వస్తూంటే అప్పుడు సన్యసిస్తాడు. ఆత్మ సంయమనం లేకుండా సన్యసించినందువల్ల మోక్షం ఎలా లభిస్తుంది?

**అధిక సూక్ష్మమైన యానందమెరుగక,**
**మతియు లేక చదివి మగ్నుడయ్యె;**
**నతి రహస్య మెల్లనా జనుడెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 616**

**తా॥** ఆనందాన్ని తెలుసుకోలేక ఓ గమ్యమైన మనస్సు లేక చదువులో నిమగ్నం అయ్యాడే కానీ భార్యయొక్క హృదయం ఏమిటో అర్థం చేసుకోగలడా?

**కడక నఖిలమునకు నడి నాళమందున్న,**
**వేగుచుక్క వంటి వెలుగు దిక్కు**
**వెల్గు కన్న దిక్కు వేరెవ్వరున్నారు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 617**

**తా॥** సర్వ ప్రకృతికీ ఆధారభూతుడై బ్రహ్మనాళమును ఆధారం చేసుకుని దేవుడుంటున్నాడు. ఆయన వేగుజుక్కలా ప్రకాశిస్తున్నాడు అటువంటి నిత్యసత్య ప్రకాశమానుడి కంటె గొప్ప దిక్కెవరుండును?

**రామ నామ పఠనచే మహి వాల్మీకి,**
**పరగ బోయ యయ్యు బాపడయ్యె**
**కులము ఘనము గాదు గుణము ఘనంబురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 618**

**తా॥** రామాయణం రచించిన వాల్మీకి మహర్షి రామనామస్మరణ చేస్తూ బ్రాహ్మణు డనిపించుకున్నాడంటే కులమడ్డురాక గుణం గొప్పదై అటువంటి ఘనత నిచ్చింది.

**కలిమి గల్గనేమి కరుణ లేకుండెనా,**
**కలిమి యేల నిలుచు కర్ములకును?**

**తేనె గూర్చి యీగ తెరువున బోవదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 619**

**తా॥** ఎంత సిరిసంపదలతో తులతూగుతున్నా, మనిషికి జాలిగుండె అవసరం. జాలిలేనివాడి దగ్గర ఎంతపాటు పడేవాడైనా అట్టివాని వద్ద లక్ష్మి నిలవదు. తేనెటీగ తేనెను పట్టులో ఉంచి తనదారిని పోయినట్టుగా అవుతుంది.

**చన్ను గవరీతి సంపద,**
**కొన్నాళ్ళకు ప్రేగు జూపి గొబ్బున వ్రాలున్**
**వెన్నెల చీకటి సరియగు**
**నన్నా శివలింగ మాయలన్నియు వేమ ! 620**

**తా॥** స్త్రీ స్తనాలు బరువుగా వృద్ధి పొంది పొంది మెల్లగా వ్రాలిపోతాయి. అట్లే సంపదలు వృద్ధి పొంది పొంది తగ్గిపోతాయి.

**ఆలు పతి సౌఖ్యములకు (ల)**
**నాలాయంబైన దాని యాలన వచ్చున్**
**ఆలాగున గాకుండిన,**
**కాలుని పెను దూత గదర కదియగ వేమ ! 621**

**తా॥** భర్తకు అనుగుణంగా ఉండి సౌఖ్యాలను చేకూర్చే దాన్ని భార్యఅనాలి. అలానేయని భార్యను యముని పెద్ద దూతగా అనుకోవాలి.

**తుమ్మ చెట్ల ముండ్లు తోడనె పుట్టును;**
**విత్తు లోననుండి వెడలినట్లు,**
**మూర్ఖునకును బుద్ధి ముందుగా బుట్టనొ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 622**

**తా॥** పుట్టువునుండీ తుమ్మకి ముళ్ళు పుట్టుకొస్తాయి. అలాగే మూర్ఖుడికి పుట్టుకతోనే దుర్గుణాలు ఆరంభం అవుతాయి.

**"కామిగాని వాడు కవిగాడు రవిగాడు"**
**కామి గాక మోక్ష కామి గాడు;**
**కామియైన వాడు కవియగు రవి యగు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 623**

**తా॥** మోహంతో తిరుగువాడే కవిగాని, రవిగాని అవుతాడు. కామి అయి కోరికలను విపరీతంగా అనుభవించి చివరికి మోక్షార్థి అవుతాడు. కామి అయినవాడే కవీ రవీ అవుతున్నాడు.

**కుక్క గోవు గాదు కుందేలు పులిగాదు**
**దోమ గజము గాదు దొడ్డదైన,**

**లోభి దాత గాడు లోకంబు లోపల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 624**

**తా॥** కుక్క ఆవు కానేరదు. కుందేలు పులికాదు, ఎంత గొప్పదైనా దోమ యేనుగు కానేరదు. అలాగే లోభి దాత కాడు.

**కూడు గుడిచి లెస్స కూర్చున్న వాడైన**
**నాడుదాని గన్న నట్టె తగులు,**
**నన్న రసమ యొడలి కతి మదంబగు సుమీ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 625**

**తా॥** అన్నం తిని హాయిగా అరుగుమీద కూర్చున్న వాడికైనా ఆడదాన్ని చూసేసరికి వెంటనే మోహ ప్రవృత్తి కలిగి పోతుంది. అదంతా అన్నం మదము.

**దేవ పూజ సేయ దివ్య భోగము గల్గు**
**తత్త్వ మెరిగెనేని దైవసముడె**
**యేమి లేని నరునకేగతి లేదుర**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 626**

**తా॥** దేవుడ్ని గురించి పూజలు చేస్తే దివ్యభోగాలు సమకూరుతాయి. తత్త్వం తెలుసుకున్నాడా అతను దైవతుల్యుడవుతున్నాడు. ఈ చెప్పిన పద్ధతులు లేనివాడు ఎందుకూ పనికిరానివాడు.

**వానను దడియని వారును,**
**పూనుక వేమన్న సేత బొరయని వారున్**
**న్నా న్నాదిక్కుల వెదకిన**
**గానము వానెంత వాని గానము వేమా! 627**

**తా॥** వానల్లో తడియని వారినీ, వేమన్న చేతలలోకి రానివారినీ, అన్ని దిక్కులా వెదకినా అటువంటి వార్ని చూడము.

**బ్రహ్మవేత్తలమని పౌరుషమాడేరు**
**బ్రహ్మమనగ దాని భావమేమి?**
**తెలుప నలుప యెరుప తెలసిన బలుకుడీ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 628**

**తా॥** బ్రహ్మవేత్తలమని పౌరుషంతో చెప్పుకుంటున్నారు. అసలు బ్రహ్మం అంటే ఏమిటో మొదటగా చెప్పండి అది తెలుపా, నలుపా లేక యెరుపా తెలుస్తే చెప్పండి.

**ఎట్టివాడొ తాను యెరుగడు తొలిపుట్టు**
**నీచు బ్రతుకు కింత నీమమేల?**

**నెరుగ డీ జగంబు నీశ్వర మయమని**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 629**

**తా॥** గత జన్మలో ఎవరో ఎలాంటివాడో తెలుసా? తెలియదు. మొత్తంమీద ఈ బ్రతుకు నీచమైంది. దీనికి నియమాలెందుకు? నిజంగా ఆలోచిస్తే ఈ జగత్తంతా ఈశ్వరమయం.

**కూళ కూళ మెచ్చు గుణవంతు విడనాడి**
**యెట్టివారు మెతు రట్టివారి;**
**మ్రాను దూలములకు జ్ఞానంబు దెల్పునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 630**

**తా॥** దుష్టుడు దుర్మార్గుడ్ని మెచ్చుకుంటాడు. ఎలాంటివారు అలాంటివార్ని మెచ్చుకుంటారు. ఇదెలా ఉందంటే మాన్లు దూలాలకి తెలివి నేర్పడంలా ఉంది. మూర్ఖుడు మూర్ఖుడికి నేర్పే జ్ఞానం యింకెలా ఉంటుంది?

**శివమతమునకైన వివరింపంగా గుర్వు,**
**హరిమతమునకైన నరయ గుర్వు,**
**గురువు నెరుగలేని గుణహీను డేమెర్గు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 631**

**తా॥** శివమతానికి, హరిమతానికి గురువుండాలి. అంతా నేనే ఎరుగుదును. నాకంటే మించిన గురువెవడున్నాడు? అనేవాడికంటే బుద్ధి తక్కువ్వా డుండడు.

**ముని జనములు కలగ మునిగి వెళ్ళిన భావి,**
**బ్రహ్మకు దలయెత్త రాని భావి,**
**మొలల బంటిగాను ముంచు నెవ్వరినైన**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 632**

**తా॥** మునీశ్వరులెందరో సంసారాలు పెట్టి దీని మాయా పరిణామాలకి లోనై అలాగే సాగిపోయారు. అంతే కాకుండా బ్రహ్మాది దేవతలు కూడా మొలలబంటిగా మునకలు వేసినారు. ఎవరైనా మాయా సంసార బావిలో పడ్డవారు మరి లేవలేరు.

**అమృత సాధనమౌట నందరు బలుతురు,**
**యమృత మెంచి చూడనండలేరు,**
**అమృతము విషమాయె నదియేమి చిత్రమో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 633**

**తా॥** అమృతం త్రాగితే అందరూ బలుస్తారు. కానీ దాన్ని పొందడం చాలాకష్టం. చిత్రమైన సంగతి యేమిటంటే ఆ అమృతమే ఒక్కొక్కసారి విషమైపోతుంది.

**కొండరేడు మామ కొండ కూతురు యాలు**
**కొండ యిల్లు పసిడి కొండ విల్లు**
**కొండ వంటి దొరవు కుంటెన నడుతురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 634**

**తా॥** హిమగిరి మామగారు, కొండ రాజు కూతురు నీభార్య, నీ చేతి ఆయుధం అనగా ధనుస్సు మెరుపు, నీ నివాసం వెండి కొండమీద, కొండలాంటి ప్రభువు నువ్వు. నీ దగ్గిర చెడు పనులకు తావుంటుందా? నీ జీవితం వెండి బంగారుమయం.

**వెలయ పరమ తత్త్వ విభవంబు దెలియక,**
**బాహ్య విద్యచేత బరగు టెల్ల,**
**పూరికెన్నగ హరిపోయిన చందంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 635**

**తా॥** విద్య అనగా బ్రహ్మ విద్య మాత్రమే. మిగతావన్నీ కూటికోసం కోటివిద్యలు. ఇలాంటి విద్యలు పటాలోపమును కనబరుస్తాయి. పరతత్త్వం యొక్క గొప్పతనం తెలియక ప్రజలు పొట్టకూటి విద్యలవైపు పోతున్నారు. ఇదెట్లుందనగా పూరికోసం హరి వెళ్ళినట్లుగా ఉంది.

**ఒల్లనన్న బోదు యొలెనన్న గారాదు;**
**తొల్లి జేయు నట్టి ధూర్తఫలము**
**యుల్ల మంచు వగవకుండుట యోగంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 636**

**తా॥** గతంలో చేసిన పాపఫలం నాకు కుదరదు అంటే పోదు. సరే అంటే నడవదు. కనుక మనస్సులో అలాంటి వాట్ని మాటిమాటికీ తల్చుకుని బాధపడడం మంచిది కాదు. ఊరుకోడం ఉత్తమం.

**కంటి మంట చేత కాముని దహియించి**
**కామమునను కడ్క గౌరి గూడ**
**నట్టి శివుని తేజమంటి నంతనె చూడ**
**పూర్వ ఖర్మ ఫలము బోవు వేమ ! 637**

**తా॥** ఈశ్వరుడు మూడో నేత్రంతో మన్మథుని మసిచేసాడు. అనంతరం కామంతో గౌరీదేవిని కూడా మసి చేసాడా శివుడు? అలాంటి శివుని తేజం అంటడంతో గతంలో చేసిన కర్మఫలం అంతా పోయింది. ఈశ్వరుడు కూడా కర్మ ఫలానికి బాధ్యుడే.

**స్త్రీ నెత్తిని రుద్రునకును**
**స్త్రీ నోటను బ్రహ్మ కెపుడు సిరి గుల్కంగా**

**స్త్రీ నెరి రొమ్మున హరికిని**
**స్త్రీ నెడపగ గురుడ నీవు దేవర వేమా!** **638**

**తా॥** ఈశ్వరుడు తలమీద బ్రహ్మ నోటియందు శ్రీహరి గుండెలమీద స్త్రీలను హత్తుకుని హాయిగా ఉన్నారు. ఈ త్రిమూర్తుల్లా స్త్రీని దగ్గరికి చేరనీయక గురుస్థానంలో ఉన్నాడు వేమన.

**ఎరుగక బుట్టును తనువులు**
**మురికిని మునిగున్న తనువు మోనుట గాదా?**
**యెరుక గల తనువు నోందిన**
**మరియును జన్మించుటెట్లు మహిలో వేమ ?** **639**

**తా॥** శరీరాలు జ్ఞానం లేకుండా పుడుతాయి. జ్ఞానం లేకుండా శరీరం వెరగడం అంటే ఆత్మ మురికిని మోస్తూన్నట్లే. మురికి లేనిది జ్ఞాన శరీరం. ఆ జ్ఞాన శరీరాన్ని పొందితే తిరిగి శరీరమును ధరించ నక్కర్లేదు కదా! జ్ఞానం కలిగితే పునర్జన్మ ఉండదని తాత్పర్యం.

**సతుల బడయరాదు సుతుల బడయరాదు**
**వెతల బడిన వాడు వెర్రివాడు,**
**నేల నున్న రాయి నెత్తి కెత్తిన యట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **640**

**తా॥** ఆడవార్ని చేరదీయడం, వారివల్ల సంతాన్ని పొందడం, ఆ సతీసుతులకోసం పడరాని పాట్లు పడడం అది అంతా ఓ వెర్రితోచేసే పని, నేలమీద ఉన్నరాయిని నెత్తిమీద ఎక్కించుకోడం లాంటిది.

**ద్వార బంధనంబు తనయులు సంపద;**
**బంధు వర్గ మెల్ల ప్రహరిగోడ**
**మూఢులైన నరులు మొక్కలి కాంద్రయా**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **641**

**తా॥** ఇంటికి తలుపులూ గుమ్మాలూ లాంటివారు కొడుకులూ సంపదానూ, చుట్టాలందరూ ప్రాకారపు గోడలాంటివారు, మూర్ఖులైన మనుష్యులు అందు నివసించేవారు.

**కాళ్ల ముందరేరు కడతేర నీదక,**
**ముగ్గురు ముగుద్రాళ్ళ మునిగినారు;**
**నరుడు యీదె ననగ నగుబాటు గాదయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **642**

**తా॥** తుదమొదలూ లేని యీ సంసార ప్రవాహాన్ని యీదడం ముగ్గురు పెద్దలు అనగా బ్రహ్మ విష్ణు, మహేశ్వరులకే శక్యం కాలేదు. పోతే నరుడు సంసారాన్ని యీదడంటే అనగుబాటు మాత్రమే.

**జీవి జీవి జంపి జీవికి వేయగా,**
**జీవి వలన నేమి జిక్కి యుండె**
**జీవ హింసకులకు జిక్కునా మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 643**

**తా॥** ప్రాణిని చంపి యింకో ప్రాణికి పెడితే ఆ ప్రాణి వల్ల చిక్కడం ఎలా జరుగుతుంది? అలాంటి స్వేచ్ఛాజీవులకు మోక్షం ఎలా సంభవిస్తుంది?

**తంత్ర వాదులైతే తరచుగా నుందురు**
**మంత్రవాదులైతే మహిని లేరు**
**జంత్రగాని బొమ్మ చందంబులాయెరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 644**

**తా॥** తంత్రవాదులే లోకంలో ఎక్కువగా ఉంటారు. మంత్రవాదులు అనగా మంత్ర ద్రష్టలు తక్కువ. లోకప్రజ గారడీవాడి చేతిలో బొమ్మల్లా ఉంటారు.

**కల్లు నీళ్లు ద్రాగి కడు పెద్దవారిలో**
**చీర విడిచి తిరుగు సిద్ధురాలు**
**పనులు దీరు వెనుక పాతలు గట్టురా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 645**

**తా॥** పెద్దవారితో కూడి అహంకారంతో మంచి బట్టలు కట్టి తిరుగుతుంది సిద్ధురాలు. పనులు అయిపోయింతరువాత అంటే అహంకారం తగ్గింతరువాత పాతబట్టలే కట్టుకుంటుంది.

**కుక్క దిన్న వాడు గురులింగ జంగంబు**
**పంది తిన్న వాడు పరమ యోగి**
**యేన్గు దిన్నవాడు యెంత సుజ్ఞానిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 646**

**తా॥** కుక్కను తినేవాడు గురులింగ జంగందేవర అయితే, పందిని తినేవాడు యోగిగానూ యింకా యింకా పెద్ద జంతువును అంటే యేనుగుని తినేవాడు ఎంతో సుజ్ఞాని అన్నమాట. మనుష్యుల చిత్తవ్యాపారాలు చిత్ర విచిత్రాలుగా ఉంటుంటాయి.

**ముండ మోపి తోటి మునుగుచు తేలుచు**
**నుండగానె మోహముండె గాక**
**నండబాయు వెనుక నాయాశలే లేవు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 647**

**తా॥** ముండతోడి మోహంతో ఆ సరదాల్లో మునిగి తేలుతూన్నంతసేపూ యింకా యింకా ఆ భోగాలు ఎక్కువగా అనుభవించాలనే ఉంటుంది. ఆ స్త్రీ కాస్త దూరం అయితే తరువాత ఆ పెద్దమనిషి సుజ్ఞాని.

**పజలెరుంగ బ్రతుకు బట్టభద్రుడుగాడు**
**పైకిరీటముండ బ్రహ్మగాడు**
**యోగు దెలసి పలుకు యోగీశ్వరుడు గాడు**
**యట్టివాని దెలియ నగును వేమ ! 648**

**తా॥** ప్రజల దృష్టిలో బ్రతికేవాడు అంతమాత్రం చేత బ్రహ్మదేవుడూ కాడు. చెడును తెలుసుకుని మంచిని బోధించువాడే మహాముని. అట్టివానిని తెలుసుకోవాలి.

**బూతు లేని లంజ భూతంబు కూతురు**
**ప్రీతి లేని పాటు రాతిచేటు**
**దాత లేని యూరు దయ్యాల పేటిరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 649**

**తా॥** సరసుల కామతృష్ణకి ఒప్పుకోని స్త్రీ పిశాచి సంతానం, ప్రేమ లేకుండా పాటుపడ్డం వ్యర్థం. దాతలేని పేట దెయ్యాల పేట.

**లంజ లంజ కాని లాగెల్ల గొనియాడు**
**లంజ తల్లి వాని లజ్జ గడుగు**
**తల్లి గలుగు లంజ తగులాట దోషంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 650**

**తా॥** లంజయైన స్త్రీ ప్రియుడ్ని ఎంతగానో మెచ్చుకుంటుంది. ఆ లంజయొక్క తల్లి వాడికి గల డబ్బు నంతనీ కడిగేస్తుంది. తల్లి ఉన్న లంజతో చాలా గొడవ ఉంటుంది.

**రతి లేక ముదియు నంగన**
**రతి కలిగిన ముదియు నశ్వరత్నము ధరలో**
**సతతము భ్రాంతిని జేసెడు**
**తతరతిచే ముదియు నరుడు తథ్యము వేమ ! 651**

**తా॥** స్త్రీ మగని సాంగత్యం లేనందువల్ల త్వరగా ముదిమిని పొందుతోంది. మంచి గుర్రం రతి సలపడం వల్ల ముదిమిని పొందుతోంది. అస్తమానం రతి సల్పడం వలన పురుషుడు తొందరగా వృద్ధుడయిపోతున్నాడు.

**దొమ్మరీని లంజతోగూడ దోసంబు**
**పాపియైన మనసు పట్టరాదు**
**వీడు గదిలి పోతె వెళ్ళుదురెట్లనో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 652**

**తా॥** దొమ్మరివాడి లంజతో కూడ్డం తప్పుపని, దాన్ని పట్టడం చాలా కష్టం. వయస్సు మళ్ళిపోయింతర్వాత ఎలా ఎక్కడికి కళ్ళడం? ఏమీ ఉండదు.

**లంజదాని యక్క లాలించి ముద్దాడు**
**మిండ దరయ లంజ మీది ప్రేమ**
**నాడుదాని వంక నందరు చుట్టముల్**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 653**

**తా॥** విటుడు లంజమీది ప్రేమతో దానింటికి వెడితే దాని అక్క కూడ లాలించి ముద్దాడుతుంది. ఆడుదానివైపు వారందరూ చుట్టాలే అవుతూంటారు.

**యోని యందె పుట్టి యోనికి రుచిజేసి**
**చన్ను గుడిచి పెరిగి చన్ను బట్టి**
**సృష్టిలోన నడగు సిగ్గెరుంగని జీవి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 654**

**తా॥** మనుష్యుడు యోని నుండి పుడుతున్నాడు. మళ్ళా ఆ యోని మీద మక్కువ చూపించుతున్నాడు. అల్లాగే బాల్యములో చనులు త్రావి కడుపు నింపుకొని పెద్దయ్యాక ఆ స్తనాల బిగువు మీద కసితీర ప్రవర్తిస్తున్నాడు. సృష్టి పద్ధతిని యెరుగని నరుడు సిగ్గు విడిచి ప్రవర్తించి పతనం దారి వైపుగానే సాగిపోతున్నాడు.

**మొలక చనులనాడు మూడు కోటుల జేయు**
**కులుకు చనులనాడు కోటి జేయు**
**తడికి చనులనాడు దమ్మిడీ సేయదో !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 655**

**తా॥** స్త్రీకి అందంగా మొసలు తేలిన స్తనాలున్న వయస్సు అప్పుడు ఆ విలువ అంతులేనిది. అలాగే గుబ్బచనుల సమయంలో కూడా ఆ విలువ చాలా గొప్పది. మెత్తపడిపోయి వాలు చనుల విలువ పైసా కూడా అంటే దమ్మిడీ కూడా చేయదు.

**ఇంచుకైన యోని కీగెడు జనములు**
**కంచము కడ పిల్లి గాచినట్లు**
**పంచబాణునింటి బానిసె కొడుకులు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 656**

**తా॥** చాలా చిన్నదైన స్త్రీ రహస్యావయవం వల్ల వచ్చే సుఖం కోసం పురుషలోకం అంతా చాలా పరుషంగా కంచం దగ్గిర తిండికోసం పిల్లి పడికాపులు కాసి పడిఉన్న తీరుగా ఉంటుంది.

**బండుచేత బుట్టె పరగ ప్రపంచంబు**
**బండుచేత బుట్టె పరగ నిహము**
**బండు కాస పడిరి బ్రహ్మాది సురలెల్ల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 657**

**తా॥** యోని కారణంగా ఈ ప్రపంచం అంతా పుడుతోంది. ఇహమంతా యోనిచేత పుడుతోంది. బ్రహ్మాది దేవతలందరూ యోనికాశించినవారే.

**తగులు నతిని గూడి బిగువుగా రమియింప**
**కదు బలుండు బుట్టు గట్టిగాను;**
**పురుషు డబలుడైన బుత్రుల బలులురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 658**

**తా॥** స్త్రీతో పురుషుడు మంచి బలంగా రమించడం వల్ల బలం గల కుమారులు పుడతారు. మగాడు స్త్రీతో బలహీనంగా రమించడం వల్ల పుత్రులు కూడా అబలులు అయి పుడుతున్నారు.

**కాంత మేను జూచి కళవళ పడుదురు**
**కడుపులోని రోత గానలేరు**
**యింత రోత బ్రతుకు యీ దేహమేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 659**

**తా॥** ఆడదాని శరీరం మొదలైనవి చూసి మురిసి మురిసి లొట్టలు వేసుకుని మరిచిపోతారు. కానీ కడుపులో ఉన్న రోతను కానుకోలేక పోతున్నారు.

**మురికిలోన బుట్టి మురికిలోన పెరిగి**
**మురికి తనువు కింత మురిపె మేల?**
**మురికి తెలసి మనుజు డిరుకున బుట్టునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 660**

**తా॥** దేహం మురికి మూలమై ఉంటుంది. ఇటువంటి కళేబరానికి ఎన్నో అలంకరణలూ సుగంధాలూ ఏర్పరచి మురిసిపోవడం అజ్ఞానం. మురికి పుట్టువును కోరడం మంచిదా ముక్తి కోరడం మంచిదా?

**చన్నులు పరసతి కొప్పిన**
**చన్నులపై పాపదృఢత జనకటు మునుపే**
**చన్నులవగ దా గుడిచియు**
**చన్నులకై తలపు వలదు సత్యము వేమ ! 661**

**తా॥** స్త్రీ యొక్క స్తనాలు చూడ్డానికి చాలా ప్రీతికరమైనవి. వక్షఃస్థలం మీద చిగురించిన ఒత్తైన పర స్త్రీ యొక్క స్తనలపై మోజుపడటం మంచిది కాదు. అది పాపం. చిన్నప్పుడా స్తనాలను పిండి పాలు త్రాగిన కారణంగా వాటి మీద మళ్ళా దురుద్దేశ్యంతో అనుభవింప కోరరాదు.

**చెట్టందు విత్తు బుట్టెను**
**చెట్టును విత్తందె బుట్టె చెలిమి తలిర్పన్;**
**చెట్టును విత్తును రెండును**
**బుట్టిన విధి దెలియ వలయు భువిలో వేమ ! 662**

**తా॥** చెట్టు నుండి విత్తనం, విత్తనం నుండి చెట్టు, చెట్టు విత్తనం రెండూ కూడా పుట్టిన విధం తెలుసుకోవాలి.

**తల్లి గర్భమందు దా బుట్టినప్పుడు**
**మొదల బట్టలేదు తుదను లేదు;**
**నడుమ బట్టగట్ట నగుబాటు గాదటో!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 663**

**తా॥** శిశువుకు పుట్టినప్పుడూ గుడ్డలేదు. చనిపోయిం తరువాత గుడ్డలేదు. మధ్యలో బట్టెందుకు?

**తవుటి కరయబోవ తండులంబుల గంప**
**శ్వానమాక్రమించు సౌమ్యమునను**
**కోమటోని సొమ్ము క్రూరుల పాలౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 664**

**తా॥** తవుడుకు బయలుదేరి పొరిగింటికి వెళ్ళి వచ్చే అంతలో ఇంట్లో గల బియ్యాన్ని కుక్కల పాలైనట్లే కోమట్ల కూడబెట్టిన సొమ్ము దొంగల పాలగును.

**బాప డెముకకూడు భక్షింపు చుండును**
**పేరటంబు బోవు పెండ్లి మగువ**
**కులము మానము విడి కోర్కులు మెండాయె**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 665**

**తా॥** బ్రాహ్మణుడు ఎముకల కూడ తింటూంటాడు. పుణ్య స్త్రీ కావడంతో పేరంటంకి వెళుతుంది. కులగోత్రాల మర్యాదలూ మానాభిమానాలు విడిచి సరదాగా పై పనులకి దిగుతారు.

**మద్య మాంస రుచిని మాదిగె దైవాల**
**యెంగిలి దినువారి దెట్టి కులము?**
**భక్తిని హరుగొల్చి భవ్యులు గారైరి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 666**

**తా॥** భక్తితో సేవించడానికి శ్రీహరి ఉండగా కొందరు మానవులు మద్య మాంసాలను రుచి మరిగి వాటిని తనగోరి దైవాలను కొలుస్తూ ఆ ఎంగిళ్ళను తినేవారి కులం ఏదైె ఉంటుంది?

**ప్రళయకాలమందు బ్రమధులచేతను**
**నష్టమైరి గాని నాటి జనులు**
**తెలియనేర రైరి దేవుని ద్విజులెల్ల**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 667**

**తా॥** ప్రసయ కాలమున ప్రమథ గణాలు ప్రజలను వధించి పారేస్తారు. అలాంటి జనబాహుళ్య మరణాలను బ్రాహ్మణులు గుర్తు తెచ్చుకొని సర్వేశ్వరుని మహిమను కానలేకున్నారు.

**వైష్ణవులను వట్టి వార్త మాత్రమె కాని**
**భ్రష్టులంతకన్న బరులు లేరు**
**కష్టనరుల కెల్ల కలుగునా మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 668**

**తా॥** వైష్ణవులనే పేరుతో బ్రతుకే నరులు చాలా భ్రష్టులు. అంతటి భ్రష్టజనులు లోకంలో యితరులు యింకొకరు లేరు. అలాంటి మాయావులకు మోక్షం అంటే ఆ విష్ణువు దయ గలుగునా?

**బ్రహ్మ యెవని కొడుకు పరికింపగా భువి?**
**విష్ణువెవని కొడుకు వెలయజూడ?**
**శివుడు యెవని కొడుకు సిగ్గెరుగరు జనుల్?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 669**

**తా॥** బ్రహ్మ మెవని కొడుకు? విష్ణువు ఎవని కొడుకు? అలాగే శివుడి యింటి పేరు ఎవరికి తెలుసు? వాని కులగోత్రాల్ని గురించి ఆలోచించలేని జనులు సిగ్గుపడాలి.

**సోమయాజి బట్టి సొడ్ల ద్రేసెను రంభ,**
**యొందె సోమాయాజి నొంగబెట్టి**
**క్రతువు జేయు ఫలము కల్గెరా చేజేత**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 670**

**తా॥** సోమపానం చేసినవాడు సోమయాజి సోమయాజులు గారు స్వర్గానికి వెడితే అక్కడ రంభ ఆయన్ని ఒంగోపెట్టి రమిస్తుంది. ఓ హో హో సెబాస్ సోమయాజులం గారూ! యాగఫలం దక్కింది కదా! అద్భుతం ఇది సోమయాజులు గారిది.

**మునిగి బ్రాహ్మణుండు ముందు గానకబోయె**
**తిరిగి తిరిగి యతడు దిమ్మరాయె**
**కూసి కూసి తుదకు కుక్కయై పోయెరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 671**

**తా॥** బ్రాహ్మణుడు నదులు పవిత్రమైనవంటూ అందులో స్నానాలాచరిస్తూ తత్త్వచింత చేయలేకపోయాడు. తీర్థాలు చేసి చేసి దేశ దిమ్మరిగా పేరు పడ్డాడు. నీవేవో కూన కూసి అవాకులూ చవాకులూ కుక్క అయిపోయాడు. ఏ పరమార్థాన్నీ గుర్తెరగలేక పోయాడు.

**చచ్చువారి జూచి చావని పుట్టని**
**తత్త్వమెల్ల నాత్మ దలపు జేసి**
**యరసి చూచి నట్టి యతనికి మోక్షంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 672**

**తా॥** తత్త్వం చచ్చేవార్ని బట్టి చావదు. పుట్టేవార్ని బట్టి పుట్టదు. అన్ని విషయమును మనస్సులో బాగా అర్థం చేసుకొని ఆ ఆలోచన గలవానికి ముక్తి కలుగుతుంది.

**కప్పయ పామును బొడగన**
**కప్పను నా పాము మింగె కడు వేడుకతో**
**కప్పను వెడలం దిగిచెడు**
**విప్పనునీవిధము దెలియు వినురా వేమ ! 673**

**తా॥** కప్ప పామూ తారసపడినప్పుడు పాము కప్పను రునకరంగా మింగేస్తుంది. పాము ఆ కప్పను ఎలా జీర్ణం చేసుకుంటుందో ఆ విషయం వేమనకి తెలుసు.

**మన్ను మిన్ను నంటి మహి మీద నొక కోడి**
**కొమ్మ లమరి యుండు కొనలు సాగి**
**దివ్వ లేని వెలుగు తేజరిల్లుచు నుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 674**

**తా॥** భూమి ఆకాశాల మధ్య వ్యాపించి ఉంటుంది. ఒత్తివత్తీ జ్యోతీ అక్కర్లేకుండా ఉండే వెలుగు విశ్వమంతా నిండి ఉంటుంది.

**మొదల మాను యగును తుద పక్షియును గాదు**
**నోరు లేదు పండ్లు యారు గలుగు**
**జీవి యొకటి లేదు జీవుల జంపురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 675**

**తా॥** మాను అంటే శరీరం. చివరికి ఎగిరిపోతుంది అది పక్షికాదు. నోర్లేదు కాని ఆరు పళ్ళతో పీక్కు తింటుంది. దానికీ జీవిలేదు. జీవుల్ని చంపేది. అది మరణం.

**కాలు చెయ్యలేదు కంచుకంబు గలదు**
**కొమ్ము లేదు యురికి చిమ్ము వేగ,**
**గరిడి లేక జంతువు గడు పెద్ద చోద్యమో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 676**

**తా॥** కాళ్ళూ చేతులూ లేవు అదే మాయమీదకి ఉరికి శరీరం అంతా వ్యాపించి చివరికి మృతి బయటపడుతుంది. అదే ఆశ్చర్యం.

**బ్రహ్మ గుఱ్ఱమాయె భవుడు పల్లంబాయె**
**నాది విష్ణు వెన్నునంకె మాయె**
**నందు మీదివాడు యాడదో మొగదవాడొ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 677**

**తా॥** బ్రహ్మ గుఱ్రం అవుతున్నాడు. శివుడు పల్లము అవుతున్నాడు. ఇక శ్రీహరి అంకె అవుతున్నాడు. అధిరోహించినది స్త్రీయో పురుషుడో?

**రమణి నగుచు నుండు రమణుండు యేడ్చును**
**రమణి సేయుచుండు రంకు మీరి**
**రంకు చూడనెంతో రమణీయ తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 678**

**తా॥** రమణి ఉల్లాసంగా ఉంటోంది. పురుషుడు దుఃఖిస్తున్నాడు. జరామరణాల వల్ల ప్రకృతి సృష్టిని సాగించుకు పోతూనే ఉంటోంది. సృష్టిని పరిశీలిస్తే అదంతా బ్రహ్మమే.

**రూపు లేని వనిత రూఢి పతివ్రత,**
**నీటు లేనివాడు పోటుబంటు,**
**తెలుపు వచ్చువాడు దేవర బంటురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 679**

**తా॥** అందచందాలు లేని ఆడిది నిజంగా పతివ్రతే. పిరికితనం లేనివాడు పోరాడే బంటు. జ్ఞానం కలవాడే దైవభక్తుడు.

**ఇహమునందు నేమి యిడుముల బడినను,**
**పరమ సాధనార్థ పదవి గాదు,**
**నరులు గారు యెట్టి వెరవున జూచిన,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 680**

**తా॥** ఎంత శ్రమ పడినా అదంతా వృథా. దానివలన సాధించదగిన ఘనత ఏంలేదు. ఏదేనా సాధించాననుకుంటే అది ఉత్తమ పదివి కాదు. ఐహిక శ్రమల జీవితానికే పరిమితము అయిన వారు మనుష్యుల గణనలోకి రారు. ఏ విధముగా చూచినా వారు పశుతుల్యులు.

**పతి యొనర్చు చెడ్డ పతి కవశ్యము వచ్చు**
**పతి యొనర్చు మంచి సతికి సగము,**
**పతి యొనర్చు చెడ్డ సతికేల రాదురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 681**

**తా॥** ఆడది చేసే చెడుకి ఫలితం భర్త అనుభవించవలసి ఉండును. పెనిమిటి చేసే మంచిపనిలో సగభాగం స్త్రీకి చెందుతోంది. అలాటప్పుడు భర్త చేసే చెడులో సగం భార్యకి ఎందుకు చెందరాదు?

**కరువులు గండముల్ కఠిన కష్టవు రోగము లెన్ని వచ్చినన్,**
**గరిమను జీవరాసులకు గట్టిగ నాయువు గల్గినంత వే**
**మరువగ వంగనేల మరి మాటికి లేదననేల మూఢుడై,**
**యరయ దయాళుడైన న పరమాత్ముడు యొక్కడు దిక్కు వేమనా. 682**

**తా॥** కరువులు వచ్చినా, గండాలు సంభవించినా, ఎన్నో ఎంతో కష్టమైన రోగాలు వచ్చినా జీవకోటికి ఆయుర్భాగ్యం బావుంటే ఆ దయామయుడైన సర్వేశ్వరుని కరుణచే ఆపదలను దాటి ఆ కష్టాల్ని మరిచిపోయే మా కలాంటివేంరావనో మూర్ఖంగా ఉంటారు. దేవుని దయవల్ల కష్టాలు గట్టెక్కారన్నది నిజం.

**ఘటము జలములందు గగనంబు కనబడు**
**ఘటము జలము లేమిగ గనమేమి?**
**ఘటములోని జ్యోతి గ్రమమున దెలియుడీ !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 683**

**తా॥** కుండలో నీరున్నంతసేపూ ఆకాశం కనపడుతుంది. కుండలో నీరు లేనప్పుడు ఆకాశం కనపడదు. కాబట్టి శరీరం ప్రాణం ఉన్నంతలో జ్ఞానం కోసం ప్రయత్నించి ముక్తిని పొందాలి.

**ఘటము గాన్గ జేసి కరణ మెద్దుగ జేసి,**
**తవిలి కర్మములను నువుల జేసి**
**తెలిసి గానుగాడు తిలకారకాత్మయు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 684**

**తా॥** కుండ శరీరం, అంతఃకరణం ఎద్దు కర్మఫలం నువ్వులనుకుంటే తెలుకులవాడు నూనెను పిండినట్లు జ్ఞానాన్ని పొందవచ్చును.

**ఆమడ కామడ కడవులు**
**గ్రామములు చెరువులు నదులు కర్మములింతే,**
**తామెందులోన దిరిగిన**
**వేముడు నీతోడ వచ్చు వెంటనె వేమా. 685**

**తా॥** ఆమడ ఆమడకీ అడవులు, గ్రామాలు, చెరువులు, నదులు కర్మలూను వీటిలో తమరు ఎందులో సంచిరిస్తూన్నా విష్ణువు శీఘ్రంగా సహాయుడుగా ఉంటుంటాడు.

**ఆత్మ దేహమందు సతి సూక్ష్మముగ జూచి**
**దేహ మాత్మయందు దేటపరచి,**
**యాత్మ నెందుజూడు నతడెపో బ్రహ్మంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 686**

**తా॥** ఆత్మ అతి స్వల్పమైనదిగా తెలుసుకుని దేహమును ఆత్మ పదార్థంతో సమన్వయ పరచి సర్వమందు ఆత్మని చూచేవాడు బ్రహ్మ స్వరూపుడు.

**పుడమి సుప్పరంబు బురికొల్పి జగముల,**
**రక్ష జేయ గల్గు రాజు లెవరు?**
**మహిపతి యను పేరు మనుజున కేడదో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 687**

**తా॥** భూమి మొదలుకొని ఆకాశం దాకా కల జగతిని రక్షించాలంటే అంతటివాడే సమర్థుడు. రాజనగా అతడు ఓ మనిషే. అలాంటి మనిషి అనంత విశ్వమును పాలించేవాడు ఓ రాజు అవడం తగనిది, అది ఆ బృహస్పతికి మాత్రమే తగి ఉంది.

**ఎరుక యుండువాని కెరుక యేముండును?**
**యెరుక లేనివాని కెరుక లేదు;**
**యెరుక లోని యెరుక నెరుగుట తత్త్వంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 688**

**తా॥** జ్ఞానం కలవానికి తెలుసుకోవలసింది ఏముంటుంది? ఇక ఆత్మజ్ఞానం అన్నమాట యేముంటుంది? జ్ఞానం వల్ల తత్త్వాన్ని పొందవచ్చును.

**గింజ జెడగ నాడకీడు తోడనె తాకు**
**గింజ గల్గియున్న గీడుబోవు,**
**గింజలు గలవాని లంజల పంచను**
**గంజి కుంద్రు జనులు గడగి వేమ ! 689**

**తా॥** బీజాలు చెడిపోతే ఆడకీడు వెంటనే తగుల్తుంది. బీజాలుంటే కీడు తొలగిపోతుంది. డబ్బున్నవాడి లంజల పంచనదిని గంజికోసం జనులు పడికావులు కాస్తుంటారు.

**అదన భుక్తిచేత మొదటి సొమ్ముకు హాని,**
**కుదువ సొమ్ము కెన్న కొంత హాని,**
**మొదట పక్షమునను మూలకర్తకు హాని,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 690**

**తా॥** విశేషంగా భుజించడం వల్ల మొదట డబ్బు తరిగిపోతుంది. సొమ్ము నిలవ అట్టే పెట్టుకుంటే అదీ సొమ్ముకి హాని చేస్తుంది. అతిగా భుజించడం వల్ల గృహ యజమాని చాలా నష్టపోతాడు.

**మనసులోని శివుని మానుగా దెలిసిన,**
**యోగి యంద్రు వాని నుర్విజనులు,**
**నీవు నన్నెరుంగ నీవె పో శివుడవు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 691**

**తా॥** మనస్సులో శివ స్వరూపాన్ని చక్కగా అర్థం జేసుకుంటే అటువంటి మహానుభావుణ్ణి యోగి అంటారు. నువ్వు ఆత్మ పదార్థాన్ని తెలుసుకుంటే నువ్వే శివుడవు అవుతున్నావు.

**పృథివి కుదకమేగె పృథివిపై మొలకెత్తె,**
**మొలక పృథివి కేగె మొగడె సుతుడు,**
**ధరణి జనుల కెల్ల తల్లియు పెండ్లాము**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 692**

**తా॥** భూమీ నీరూ కలిస్తే మొలకలు లేచాయి. మొలకలు భూమిలోకి వెళ్ళాయి. స్త్రీ పురుషుల శుక్రశోణితాల వల్ల కొడుకు పుట్టాడు. భర్తకి భార్య కొడుక్కి తల్లి వరసలు ఏర్పడ్డాయి.

**అవుట గామెరుగని యజ్ఞాన జీవులు,**
**మూలము దెలియకను ముట్టుచేత,**
**యనుదినము సృజించి యాత్మ దెలియలేక,**
**చచ్చి పుట్టుచుండ్రు జగతి వేమ ! 693**

**తా॥** తెలివి తక్కువవారు కార్యకారణ భావంలో కార్యక్రమం తెలియక జన్మ మరణ ప్రవాహంలో తిరిగు తూంటారు.

**తనువు లస్థిరములు ధర్మము సత్యము,**
**చేయు ధర్మమెల్ల చెడని పదవి,**
**కని విని మరి తెలియ గనరు నరపశులు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 694**

**తా॥** శరీరాలు నశించిపోయేవి, మనుష్యులు బ్రతికిన కాలంలో వేసిన ధర్మం చిరకాలం ఉంటుంది. పశువుల్లాంటి మనుష్యులు ఇదంతా చూసి వినీ కూడా ధర్మచింతన చేయక ఉంటున్నారు. అందుకే వారు నరపశువులు.

**ఆర్త విద్యలెల్ల యపకీర్తి పాలాయె,**
**వార్తకెక్కు యెంత వారికైన,**
**యార్తి విద్యలెల్ల ధూర్తుల పాలాయె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 695**

**తా॥** ఆర్త విద్యలు పదిమంది నోళ్ళకీ ఎక్కి ఎంతటి వారినయినా అప్రతిష్ఠపాలు చేస్తాయి. ఆర్తి విద్యలు అంటే బాధాకరమైన విద్యలు దుర్మార్గుల పాలవుతున్నాయి.

**కడుపు కెంత మరులు కళవళపడుదురు,**
**కడుపు కొరకు నూళ్ళు గహనములును,**
**కడుపు కెట్లయైన గలుగును భుక్తిరా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 696**

**తా॥** ఊళ్ళూ, అడవులూ, కొండలూ ఇదంతా మాది అని ఆక్రమించి ఉంచుకుంటూన్నారు. ఎందుకింత పొట్టకూటి గోల? కడుపుకి కావలసిన అన్నం ఎలాగూ దొరుకుతుంది.

**దాన ధర్మములను తగ రేపు నేడని,**
**కాల లయము సేయు కష్టజనుడు,**
**తాను యేమియౌనొతన బ్రతుకేమౌనొ?**
**మాయ దెలియలేడు మహిని వేమ !** **697**

**తా॥** తెలివి లేనివారు దానధర్మాలు చేయవలసి వచ్చి నప్పుడు "ఇదిగో రేపో యెల్లుండో ఊ! అలాగే చేద్దాం ఊ! చూద్దాం తప్పకుండా" అంటూ సమయం దాటేస్తూంటారు. చేసే లోపుగా అలాటివాడి బ్రతుకు ఏమౌతుందో తానేమౌతడో ప్రపంచం మాయ తెలుసుకోలేక పోతున్నాడు.

**పరగ రాయ నికులు బాచన్న ధనమెల్ల**
**భటులపాలు కవులపాలు తలప**
**నొనర హీనజనుని ధనము దాయాదుల**
**పాలు జారకాంత పాలు వేమ !** **698**

**తా॥** బాచిరాజు గారి డబ్బంతా భటులపాలో కవులపాలో అవుతోంది. మంచి చెడ్డలు తెలియని వాడి దగ్గర ఉన్న సొమ్ము వారసులపాలో లేదా సానిముండలపాలో అవుతోంది.

**ప్రాకటముగ నిట్టి లోకములో గంటు,**
**పల్లెముత్తడెన్న పరమ గుణుడు,**
**అన్నదానమునను హరుపూజచేతను,**
**హరునిలోన గలసె యరదు వేమ.** **699**

**తా॥** గంటుపల్లి ముత్తడే చాలా మంచివాడు. అతడు అన్నదానం చేసి హరుని పూజించి, ఈశ్వరునిలో లీనమయ్యాడు.

**ఎంత కరువువైన నెంగిలి యన్నము**
**పరుల కిడెడు ధర్మపరులు చూడ,**
**భూమి మీద నెంగ్లి పుల్లెలు నాకెడు,**
**కుక్కలై పుడుదురు కూడి వేమ !** **700**

**తా॥** ఎంతటి కరువున్నా అన్నదానం చేసేటప్పుడు ఎంగిలి చేసిన అన్నమును పెట్టరాదు. అలాంటి వాళ్ళు తమ తరవాత పుట్టుకలో ఎంగిలాకులు నాకే కుక్కలై పుడతారు.

**తనదు దత్తము పరదత్త మొక్కటి గాగ**
**జూడ కనుభవింప చోద్యమిలను.**
**తొడరి యాలు నమ్మి తొత్తును గొన్నట్లు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **701**

**తా॥** తనదీ పరాయివారిదీ ఏదీ గాని ఆలోచించక తనదిలాగే అనుభవిస్తూంటారు కొందరు మానవాధములు. ఇది చాలా చిత్రమైనది. ఎలా ఉందంటే భార్యను తెగనమ్మి తొత్తును కొనుక్కున్నట్లుంటుంది.

**ఈకె లండజేసి తోక లండలజేసి,**
**కోక లండజేసి కొంత మాయె**
**నాకు లండజేసి నఖిల జంతువులకు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 702**

**తా॥** పక్షులకు ఈకలాధారంగానూ, జంతువులకి తోకలాధారంగానూ, స్త్రీలకి కోకలాధారంగా జేసాడు. ఆకులండజేసాడు వృక్షాదులకు.

**చెల్లని సతి నొల్లని సతి**
**నొల్లని చెలికాని విడువ నొల్లని వాడే**
**గొల్లడు గాడా ధరలో,**
**గొల్లనికి గలవె వేరె కొమ్ములు వేమా? 703**

**తా॥** పనికిరాని స్త్రీని ఒప్పుకొని, స్త్రీని అలాగే ఒప్పుకోని, స్నేహితుణ్ణి విడవకుండా ఉన్నవాడే గొల్లడు అలాటి గొల్లవానికి వేరే కొమ్ములున్నాయా?

**ఎంత సంపదొనరు నంత కష్టపుచింత**
**చింతచేత మిగుల చివుకు మేను,**
**చింతలేక నున్న చెడని సంపద జూడ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 704**

**తా॥** ఎంత సిరిపంపదలుంటే అన్ని కష్టాలు పడాలి. పైకి నున్నగా ఉన్నా ఆ శరీరం అంతా చింతలతో చివికి పోతుంది. అందుచేత చింతలు కల్పించని గొప్ప సంపదయే సంపద, ముక్తి సంపద.

**జీవభేద మెరిగి చెడిపోనివారికి**
**భావి జనుల చెలిమి పట్టుబడదు;**
**నీరు ముత్తెమైన నీరు గా బోవునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 705**

**తా॥** జీవుడూ ఆత్మల సంబంధాన్ని తెలుసుకున్న చెడువారితో స్నేహం యేర్పడి చెడిపోవడం జరగదు. ఎలా గంటే నీరే ముత్యమౌతుంది. ఒకసారి నీరు ముత్యమైన పిమ్మట ఆ ముత్యం తిరిగి నీరుకాదు.

**పతికి మారు బల్కు పడతియే శునకంబు,**
**మీరు సతిని గనయ మిగులు పతియు,**
**పంది పంది గూడి పడదొకో రొంపిలో**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 706**

**తా॥** భర్తకి అడ్డం చెప్పే స్త్రీయే కుక్క. అలాంటి భార్యతో కాపరం చేసే భర్త అంతటివాడే. వారు బురదలో పొర్లాడే పందుల్లాంటివారు.

**పొట్టివాడు కీడు పొడలపురుగు కీడు,**
**వట్టి యాన కీడు వరుడు కీడు,**
**పొట్టి చెయ్యి కాలు పొనగంగ కీడురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 707**

**తా॥** సంసారానికి పొట్టివాడు చెడుపు; పొడపాము ప్రమాదం; ప్రయోజనం సాధించలేని కోరిక చేటు; వరుడు కీడు, అంతేకాదు పొట్టికాలూ చెయ్యా ఉన్నవాడూ కూడా కీడే.

**కట్టె పైని యున్న కట్టెకు ఘనమేమి**
**చెట్టుపైని యున్న చేరు ఘనము,**
**కట్టె చెట్టు గలసె కటకటా దైవంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 708**

**తా॥** కట్టె మీద ఉన్న కట్టెకు గొప్పతనం ఏంలేదు. చెట్టుమీద ఉంటే కట్టే ఘనతను చేరుతోంది. కట్టె చెట్టూ రెండూ ఒకటే, రెండూ దైవస్వరూపమే. ఒకదాని కొకటి భిన్నం కావు.

**కొట్టిన దిట్టిన గానీ,**
**కట్టు బిగించినను గాని కరికరి సేయన్,**
**కట్టడివని యనకుండును,**
**దిట్ట మదిని శివు దలపక దీరదు వేమా. 709**

**తా॥** కొట్టినా సరే నిందించినా సరే బంధనం హెచ్చు చేసినా యింకా అల్లరి పెట్టినా గొప్పవాడు కాడు. నలుగురూ తిడతారు. అప్పుడైనా శివుణ్ణి తల్చుకోక తప్పదు.

**సిగ్గటంచు నుండు సిగ్గు యెచ్చో నుండు?**
**యాకలేచు నుండు యాక లేచు,**
**దాగియుండు నెన్న దాగినచోనుండు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 710**

**తా॥** సిగ్గు సిగ్గు అంటారు. ఆ సిగ్గు శరీరంలో ఎక్కడ ఉందో తెలుసా? ఆకలేస్తోందంటే కావాలి యెక్కడ వేస్తోంది? దేహంలో ఆజ్ఞానం ఎక్కడ ఉంటుంది.

**తన కేనాడును భిక్షము**
**తన కేనాడును భగంబు తనరను జడుపై**
**తను యున్న యట్టి తనువుకు**
**మనసందున చివుకుచుండు మునజుడు వేమా 711**

**తా॥** ధనధాన్యాదులతో నిండుగా ఉండాలనీ తెనెల్లప్పుడూ – భోగభాగ్యలతో వర్ధిల్లుతూ ఉండాలనీ కోరకుంటుంటాడు. తీరని అలాటి కోరికలతో ఉడికిపోతూ చిక్కి శల్యమై పోతాడు.

**పెట్టి పోయ నోన్కి పెర్గుడు సౌఖ్యంబు**
**యాలు చచ్చినగతి యదియు గాక**
**నుండునా శివుండు యొగివాని యందున,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 712**

**తా॥** ఇతరులకు యీయలేని వానికి భార్య చచ్చిన విధంగా పెరుగుడు సుఖం ఉంటే ఉండుగాక, కాని అటువంటి వాడిదగ్గర శివుడు మాత్రం ఉండడు.

**పొట్లకాయ రాయి పొడిగి త్రాటను కట్ట**
**లీల తోడ వంక లేక పెరుగు**
**కుక్కతోక గట్ట చక్కగా వచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 713**

**తా॥** పొట్లకాయ తిన్నగా పెరగడానికి రాయికడితే ఆ కాయ వంకర లేకుండా పెరుగుతుంది. అలాగే కుక్కతోకకి కనక కడితే వంకర తీరుతుందా?

**నోరెరిగి తాము యేమియు**
**నేరని జంతువుల జంపి నెమ్మది దిను యా**
**క్రూరపు సంకర జాతుల**
**మారణ మేమందు నింక మహిలో వేమా, 714**

**తా॥** మాంసం కొరకు కొందరు యేపాపం యెరుగని జంతువుల్ని చంపి తింటూంటారు. అటువంటి సంకర జాతుల వారు జరిపే మారణహోమం ఏమనవచ్చు?

**వంటి వారి యింట వండు వంటకమును**
**వంట తినిన యపుడె వకటివచ్చు**
**వచ్చినట్ల గాదు వరల నుభయలకును**
**కంటకమగు వంటకమున వేమ, 715**

**తా॥** వంటవారి యింట్లో పండిన వంటకమును తింటే సుఖంగా ఉండదు. ఆ తరువాత అది యిద్దరికీ కంటకప్రాయమవుతుంది.

**తామర యందున నీర్వలె**
**వేమన జరియించుచుండె వెదకుచు శివునిన్**
**యీ మాయ నమ్మగా రా**
**దీ మనమున తెలియరాదు ఈశుని వేమా. 716**

**తా॥** కష్టసుఖాలను తామరాకుమీది నీటిలా అంటక ముట్టక వేమన శివుడ్ని వెదుకుతూ సంచరిస్తున్నాడు. ఇదంతా మాయ. మాయతో నిండిన మనస్సుకి ఆ ఈశ్వర దర్శనం కావడం కష్టం.

**వేమన్నా నీ మహిమలు**
**వేమన్నా తెలియదింక నెటువలె నన్నా**
**వేమన్నా నీ చిత్తము**
**వేమన్నా నీవె మాకు నెవరు గతన్నా. 717**

**తా॥** ఓ వేమనా! ఎల్లాగూ నీ మహిమలు తెలుసుకోడం కష్టమయ్యా! ఎలాగమరి! వేమన్నా! నీ చిత్తంమరి? ఓ వేమనా! ఆలోచించగా నువ్వే మాకు మార్గం చూపాలి.

**కూటికి లేని వాని వలె కోపము లేకనుయెల్ల తావులన్**
**మాటికి మాటికిన్ మరియు మాటకు మాటకు పద్య పద్ధతిన్**
**ధాటి నెరుంగ జెప్పుచును ధారుణిలో శివరూపధారియై**
**మాటకు నున్న వేమన సమానము యెవ్వరు వెర్రి వేమనా. 718**

**తా॥** వేమన తెలుగు నేలమీద తిండిలేని వాడిలా తిరుగాడుతున్నాడు. మాటిమాటికీ మాటమాటకీ మంచి ధాటీగా పద్యాలు చెబుతూ పరిభ్రమిస్తున్నాడు. అతడు సాక్షాత్తూ జ్ఞాన స్వరూపుడైన ఈశ్వరావతారంలా అమాయకంగా సంచరిస్తున్నాడు. అటువంటి వేమనకి సాటి ఎవరూ లేరు.

**మేప రేమెరుంగ మేలైన వస్తువ?**
**దేహ మేమెరుంగు దివ్య బోధ**
**వితము దెలసి మీరు వేదాంత మెర్గుడీ,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 719**

**తా॥** ఏ వస్తువులు మంచివో ఏవి మంచివికావో ఎవరికేమి తెలుసు? శరీరానికి ఏం తెలుస్తుంది వేదాంత జ్ఞానం? మనస్సుకి తెలుస్తుంది. జీవన పద్ధతిని తెలుసుకోడానికి వేదాంత మార్గం అవలంభించండి.

**యుగముల జల్లగ జూచుచు**
**తగలక యుగయుగము లందు తపసులకైనన్**
**వగపే వగవక నుండిన**
**నిగనిగ మను కాంతి మదిని నిలుచుర వేమ . 720**

**తా॥** యుగాలు లోకాన్ని చైతన్యవంతం చేస్తూండేది. తపశ్శాలురకి కూడా అందనంతటిది. అటువంటి జ్ఞానం ఏ విధమైన స్వార్థ బుద్ధి లేకుండా మననం చేస్తే హృదయంలో జ్ఞానం ప్రకాశిస్తుంది.

**వినియు నినకయుండు వెఱ్ఱివాడై యుండు**
**కనియు గానకుండు కడగి యోగి**
**మనుజ వరులచేత మరిపూజ గొనుచుండు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 721**

**తా॥** యోగమును పొందిన యోగి వింటూన్నట్లూ ఒక్కొక్కసారి విననట్లూ పిచ్చివాడిలా చూస్తూన్నట్లుండి చూడకుండా ఉంటూంటాడు. అటువంటి మహానుభావుడు ప్రజలచేత పూజలు పొందుతూంటాడు.

**సుఖము నెల్ల దెలసి చూడంగ దుఃఖంబు**
**పుణ్యములును పాప పూర్వకములు**
**కొర్తవేయు దొంగ కోరిన చందమౌ,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 722**

**తా॥** మనం సుఖాలని భావిస్తూన్నవన్నీ దుఃఖమయములు. ఇక పుణ్యాలు పాపంతో మిశ్రమమై ఉంటాయి. వీట్ని మనుష్యుడు కోరడం ఎలా ఉంటుందంటే దొంగ కొరతవేయమని కోరినట్లుగా ఉంటుంది.

**ఆలుబిడ్డ లనుచు యతి మోహమున నున్న**
**ధనముమీద వాంఛ దగిలి యున్న**
**యట్టివాన్కి ముక్తి యవనిలో లేదయా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 723**

**తా॥** నా పెళ్ళామో నా పిల్లలో అని దృష్టి వాళ్లమీదే పెట్టుకొని డబ్బో డబ్బో అని డబ్బుమీదే కోరికలు పెంచుకుని ఉండేవాడికి యీ లోకంలో ముక్తి లేదు. ఊపిరాడకి చచ్చేవాడి బ్రతుకులా ఉంటుంది.

**కాకులున్న గూడు కోకిలరుగునట్లు**
**భ్రమరిచేత కీటము మను మాడ్కి**
**సత్య ముక్తి నీనిచెడు గటి గురుడయా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 724**

**తా॥** కాకులుండే గూటిలో కోకిలలు పెరుగుతాయి. తుమ్మెదల దగ్గిర కీటకం బ్రతుకుతున్నట్లు సత్యవాక్యాల్ని పలికేవాడే గురువౌతున్నాడు.

**విటుని కన్ను యెంత విశదమై యుండును**
**బోటి జూచు నిట్టి సాటిగలదె?**
**కంటిలోని పాప కన నెంతవాడురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 725**

**తా॥** విటుల కన్నులు చాలా స్వచ్ఛంగా ఉండి చక్కనైన అందకత్తెల చూపులతో కలిసి కనుపాపలు కామి భాషలను మాట్లాడుకుంటాయి. అలాంటి చూపులను మొగాడు విడనాడగలడా?

**ప్రభున కిచ్చినట్ల పెద్దల కియ్యరు**
**వనిత కిచ్చినట్లు వడుగు కీరు**
**సురలరకు కిచ్చినట్ల సుమతులకియ్యరు**
**మనసు పదిల పడదు మహిని వేమ.** **726**

**తా॥** ప్రభు కిచ్చినట్లు పెద్దలకివ్వరు, పడుపుకత్తె కిచ్చినట్లు వటువుకు నీయరు. మాదక ద్రవ్యాలకు వెచ్చించినట్లు పండితుల కివ్వరు.

**ఊరు యనుచు నుండ నొగి సంతసింతురు**
**యడవి యనుచు నుండ నడలచుందు**
**రూరు యడవి రెండు నొకటిగా జూచిన**
**నారితేరు యోగి యతడు వేమ** **727**

**తా॥** ఊరిలో ఉండడం అంటే ప్రజలు ఎంతో సంతోషిస్తారు. అదే అడవిలో ఉండడం అంటే జనులు హడలెత్తి పోతారు. ఊళ్ళో ఉండడం అన్నా అడవిలో ఉండడం అన్నా ఒక్కటిగా చూసేవాడే సిద్ధుడైన మహాయోగి.

**నీచుల వినుతులు సేయుచు**
**యాచకమున దిరిగితిరిగి యలయుట కంటెన్**
**యేచిన నింద్రియ పశువుల**
**గాచినవా డిందు నందు ఘనుడగు వేమా.** **728**

**తా॥** దుర్మార్గులను చేరి పొగుడుతూ యాచక వృత్తిలో తిరుగుతూండడం కంటే నయంగా విజృంభించే యింద్రియాలనే పశువుల్ని గట్టిగా అదుపు చేసేవాడు యిహపరాలలో ఘనుడుగా ప్రసిద్ధుడవుతాడు.

**భోగంబుల కాశించక**
**రాగద్వేషంబు లుడిగి రంగుగ భువిలో**
**వేగమె మోక్షము తనకును**
**రాగన్నను వాడు యోగిరాయడు వేమా.** **729**

**తా॥** భోగాలను కోరక రాగాన్నీ ద్వేషాన్నీ విడిచి పెట్టి సత్యవర్తనతో జీవనం సాగించేవాణ్ణి లోకం మోగింద్రుడని కీర్తిస్తుంది.

**పేదవాని బాధ పెనుభూతమై యుండు**
**చూడనట్టి బాధ జూడరాదు**
**కల్గువాని బాధ గనుల జూడగరాదు**
**యేమి జెప్పవచ్చు నింక వేమ?** **730**

**తా॥** పేదవాడి బాధలు చూడలేం. డబ్బున్నవాడికి అలాంటి బాధలు. ఆ బాధలతో వారు బాధ పడుతూంటే అవీ చూడలేం. ఇలాంటిది లోకం తీరు.

**జీవగుణము గల్గు జీవుండు బ్రహ్మంబు**
**సాటివచ్చు నెట్లు సరవి తోడ**
**యూరకుక్క సాటి యోగిని సేతురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 731**

**తా॥** కష్ట సుఖాలతోనూ రాగద్వేషాలతో ఉండే బ్రహ్మ సాక్షాత్కారం పొందిన మహాయోగికి సాటిరాడు. అలా సాటి చెబితే ఊరకుక్కను యోగి అనడంలా ఉంటుంది.

**అరయ నాస్తియనక నడ్డమాటాడక**
**దట్టుబడక మదిని తన్నుకోక**
**తనను గాదనుకొని తానబెట్టినదె పెట్టు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 732**

**తా॥** ఎవరైనా వచ్చి దేహి అంటే "లేదు" "కుదరదు" "నాస్తి" "న" "నై" లాంటి మాటలు ఉపయోగించక "ఇది" "ఇంత" యిద్దాం అనుకొని యిచ్చినదే పెట్టడం.

**పరుల నిందజేసి పరుల నా వారని**
**స్థిరమునస్థిరమును దెలియలేక**
**పరగ మిన్ను చేతబట్టుక పెట్టిన**
**పెట్టుగాదు కట్టి పెట్టు వేమ. 733**

**తా॥** ఇతరులను నిందించో నావారంటూనో గుప్పిడితో పెట్టినది పెట్టుకాదు. ఏదేనా నిండుచేత్తో పెడితే అది పెట్టు.

**ఒరులకొరకు భూమి నొరచెటివారును**
**యవని పతికి పర్వులైనవారు**
**పాల వంటి వారు పన్ను బెట్టెడువారు**
**వాకెరుంగరు కాపువారు వేమా. 734**

**తా॥** రాజుకి సన్నిహితంగా ఉండేవారూ కాపువారు. వారు చక్కనైన వారు. పన్నులు కట్టించువారు. వారి సంగతి నాకంతగా తెలియదు.

**బీరుబోవు కులము బిరుదు మ్రింగు కులంబు**
**యెల్ల జీవులను భరించు కులము**
**యిట్టి కులమువార లిహపరాదుల నెందు**
**పట్టు గలుగువారు పరగ వేమ. 735**

**తా॥** కాపాడేకులం పేరు ప్రతిష్ఠలు గల కులం యింకా అందర్నీ భరించే కులం. అటువంటి కలంవారికి ఇహపరాలలో మంచి ఆధారం కలిగి ఉంటున్నారు.

**కోమటోని యాళ కొండలు వానలు**
**సందరంబు శోధ చంద్రుకళలు**
**యాశకు మితిలేదు అక్కడ గతిలేదు**
**వచన శుద్ధి లేనివాని వేమ .** **736**

**తా॥** సిరిసంపదలు కొండగుట్టల్లాలో ప్రవాహంలాగో వచ్చిపడాలి. ఓ గమ్యం లేదు. అతను నోరు విప్పితే స్వార్థం అబద్ధం నిండుగా మెండుగా ఉంటాయి. సిరులతో చంద్రకళలకి సముద్రం ఉప్పొంగి నట్టుండాలి అతడే కోమటి.

**ప్రజ యొనర్చు చెడ్డ ప్రభునకు వచ్చును**
**ప్రభువు మంచి కొంత ప్రజకు సగము**
**ప్రభు వొనర్చు చెడ్డ ప్రజ కేల రాదురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **737**

**తా॥** ప్రజలు చేసే చెడు రాజుకి వస్తుంది. అట్లే ప్రభువు మంచి చేస్తే అందులో సగం వాటాకు ప్రజలు భాగస్వాములవుతున్నారు. ప్రభువు చెడుచేస్తే ఆ చెడులో కొంత భాగం ప్రజలకు రాదామరి?

**ఆడుదాని బొంకు గోడ బెట్టినయట్లు**
**పురుష వరుని బొంకు పూరితడికె**
**స్త్రీల నేర్పులు భువి చీకురాయి తనము**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **738**

**తా॥** ఆడదాని అబద్ధం పగడ్బందీగా గోడపెట్టినంతగా ఉంటుంది. మగవాని అబద్ధం పూరితడకలా నిలువదు. అబద్ధం అడ్డంలో ఆడవాళ్ళ నేర్పు చాలా గట్టిది.

**అన్యులకును వొచ్చు యాపద తనది గా**
**నున్నవాడు భువిని మన్నవాడు**
**మన్న వారిలోన మహి పరంబును లెస్స**
**కన్నవాడు మిగుల ఘనుడు వేమ !** **739**

**తా॥** ఇతరుల బాధలు తనవిగా భావించి చేతనైనంతగా సహకరించువాడు భూమి మీద జీవించినవాడు. ఉత్తమ పురుషునికి ఈ లోకంలోనే కాక అతనికి ఉత్తమ గతి కూడా ప్రాప్తిస్తుంది. అటువంటి మహాత్ముణ్ణి కన్న తండ్రి జీవితం ధన్యమైనది.

**కండలెల్ల గోయ కాసియ్య జాలని**
**బండగోవు కాన పడిన గలదె**
**కొండక్రింది పసిడి గోరిన చందమో**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **740**

**తా॥** కండలన్నీ కోసినా కాసింత ప్రయోజనం లేని బండ ఆవు నుండి ఆశించితే ఏం కలుగుతుంది? నిష్ప్రయోజనం. కొండకింద ఉన్న బంగారాన్ని ఆశించితే ఏం లాభం? ఏమీ లేదు.

**ఎలమిని ధనకాంక్ష నెదురు దన్నెరుగక**
**కన్ను గానకెల్ల గర్వములను**
**పుట్టిన చెడుగట్టి బుద్ధిహీనపు వాని**
**నడుగుబోవ గష్టమంత వేమ ! 741**

**తా॥** ధనాశాపరుడై ధనమదంతో కళ్ళు మూసుకుపోయి బుద్ధిలేని దుష్టుణ్ణి యాచిస్తే ఏ ప్రయోజనం లేదు సరికదా అడిగిన కష్టమే మిగిలుతుంది.

**అట్టికష్టుని బ్రతుకు యగ్నిపాలై పోవు**
**నిర్ధయాత్ము బ్రతుకు నీట గలియం**
**గ్రూరకర్ము బ్రతుకు చోరుల పాలౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 742**

**తా॥** ఆ దుర్మార్గుడు ఎప్పుడో నిప్పుల్లో పడి చస్తాడు. జాలిలేని మనసు గలవాడు నీళ్ళలో పడి చస్తాడు. దుర్మార్గాలు చేసేవాడు దొంగచేతుల్లో చస్తాడు.

**బాలలచనులు పూలబంతుల బోల్తురు**
**ప్రాలుమాలినట్టి భ్రష్టు లవని**
**మాంస ఖండమందు మరి యేమి యున్నది?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 743**

**తా॥** కొందరు కాముకులు బాలల లేత స్తనాలను పూలబంతులుగా పోలుస్తున్నారు. ఆ స్తనాలు మాంసం ముద్దలు మాత్రమే.

**ఒకరికీడు వేరె యొక్కని కియ్యడు**
**కీడు మేలు వారు పోడిమి దెలియరు**
**కాలు దెరుగు వారి గందర గోళము**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 744**

**తా॥** ఎవరి కీడు వారే అనుభవిస్తారు. ఎవరి మేలు వారే అనుభవిస్తారు. ఒకరి కీడు యింకొకరికి రాదు. ఒకరి మేలు యింకొకరికి రాదు. కీడు మేళ్ళు అనేవి వారి వారి సుకృత దుష్కృతాలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో గల రహస్యాన్ని యముడు గుర్తిస్తున్నాడు.

**పరగ నీ వరకును పడిన పాటెరుగక**
**నరుదు గాగ మనుజు డనగ బుట్టి**
**కీడు మే లెరుగక క్రిందాయె జూడరా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 745**

**తా॥** ఎన్నో పాట్లు పడి అతి కష్టం మీద అంటే ఏ పుణ్యవశంల్లో మనుష్యుడై పుట్టాడే కాని ఈ జన్మలో ఏం చెయ్యాలో ఎలా బ్రతకాలో మంచి చెడులలో దేన్ని ఆచరించడం వల్ల అమృతత్వాన్ని పొందగలడో అది తెలుసుకోలేక పోతున్నాడు.

**పుట్టలోన తేనె పుట్టిన రీతిని**
**గుట్టమీద మణియు పుట్టు విధము**
**కట్టెలోన నగ్ని పుట్టిన విధమున**
**బుట్టి పెట్టవలెను భువిని వేమ !** **746**

**తా॥** పుట్టలో తేనె చేరినట్లు, కొండ ప్రాంతాలలో మణి మాణిక్యాలు పుట్టిన విధం, కట్టెల్లో నిప్పు జనించిన విధంగా తాను జన్మ సార్ధక్యాన్ని సంపాదించాలి.

**తనదు నీడ శిశువు తా జూచుచున్నట్లు**
**తనదు నీడ జూచి తన్ను మరచి**
**పతిని యనుచు నొడువు భ్రాంతుల నేమందు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **747**

**తా॥** తన నీడను చూసి పిల్లలు ఆడుకుంటున్నట్లు మనుష్యుడు కూడా తన నీడను లేదా మీ లోకచ్ఛాయను చూసి నేనే దీని కంతకీ కర్తనని భ్రాంతి పడి జీవితం దొర్లించుకు పోయే వాళ్ళను గురించి ఏం అనుకోవాలో కదా?

**తావు లేనిచోట తావు తానై యుండును**
**తావు గలుగుచోట తాను లేడు;**
**తావు తానుయైన తత్త్వంబు దెలియుడీ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **748**

**తా॥** లేడని భావించే చోట తాను కనబడుతున్నాడని అనుకుంటూన్న చోట తాను కనబడటం లేదు. తావుకీ తత్త్వానికీ గల సంబంధమును తెలుసుకోవాలి.

**తన వలెను యనియును ధరబుట్టినవి గావొ**
**పరగ తమ్మువంటి బ్రతుకు గాదొ?**
**జ్ఞాని జ్ఞాని జంప కారణమేమిరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **749**

**తా॥** భూమి మీద పుట్టిన జీవజాలం అంతా సోదరభావం కలవి. తామెలాంటి వారో యితర జీవజాలం కూడా తమలాంటివే. అటువంటప్పుడు తోటి జీవాన్ని చంపడం ఆత్మహత్యా సదృశం అని భావించాలి.

**ఒక్క మనసుతోడ నున్నది సకలము**
**తిక్క బట్టి నరులు తెలియలేరు**
**యిక్క నెరిగి నడువ నొక్కటే చాలురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **750**

**తా॥** ఈ లోకంలో ఎన్నో శరీరాలు ఉన్నాయి. అన్ని శరీరాల్లోనూ మనస్సు అనేది ఉంది. ఆ మనస్సుతోటే ఈ లోకం అంతా ఉంది, కానీ ఆ మనస్సు తిక్క పట్టి ఉంటుంది. ఆ మనస్సు సరియైన స్థానం తెలిసి నడిస్తే అది చాలు.

**పరగ ముందరి తమ బ్రతుకు తెర్వెరుగక**
**సకల సంపదలును సతము లనుచు**
**జలము బాయు చేప చంద మేర్పడి తుద**
**గతియు వేరె లేక కలుగు వేమ ! 751**

**తా॥** తమ జీవన గమనం యెలా ఉంటుందో తెలుసుకోలేక తనకు గల సిరి సంపదలు అలాగే శాశ్వతాలు అని ఎంచుతాడు. నీళ్ళు పోయిన తర్వాత చేప బ్రతుకులాంటిది అని తెలుసుకోలేకపోతున్నాడు. అలాంటివారికి గతి లేదు.

**తిట్టి కొట్టిరేని తిరిగి మాటాడక**
**నట్టి యిట్టు జూచి యదరిపడక**
**తన్ను గాదని యటు తత్తర పడకున్న**
**నట్టివాడు బ్రహ్మమౌను వేమ ! 752**

**తా॥** ఎవరేమన్నా యేమీ అనకుండా తన్ను కాదని తత్తరపాటు పడకుండా ఉన్నవాడే బ్రహ్మమనిపించుకుంటున్నాడు.

**పిడుగును యరిచేత బిగబట్టి యందులో**
**కల్మషంబు నెల్లకడను దీసి**
**కడ నికరము చేత కలియుగమును బ్రోచు**
**కర్మ కర్త నెరుగ గదర వేమ ! 753**

**తా॥** పిడుగును అరచేతిలో ఉంచుకొని పాపాలన్నింటినీ తీసేసి చివరగా ఆ చేత్తోటే కలి పీడిత పాపుల్ని రక్షించే లోక యజమాని చేతలు తెలుసుకోతరం కాదు.

**పూర్ణమైన తనదు భుజబల్మి జూచుక**
**భువిని చెడుగుతోటి పోరరాదు**
**పాలకుండ చెంత పగులును నా రాయి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 754**

**తా॥** తన భుజబలం చూసుకొని లోకంలో దుష్టునితో పోరాడ్డం మంచిది కాదు. దైవం అండ కూడా చూసుకోవాలి. పాలకుండ దగ్గిర ఉన్న రాయ పగలదు.

**పరుల కుపకరించి పరుసొమ్ము పరునకు**
**పరగ నిచ్చెనేని పరము గలిగె**
**పరము కన్న నేమి పావన మా సొమ్ము?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 755**

**తా॥** పరుల ధనం తన వద్దకు వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా వారిది వారికి మాలుగా వప్పగించి ఉపకరించడం అన్ని విధాలా శ్రేష్ఠతమం. ఆ పరధనం

తను దక్కించుకోడం వల్ల వరాన్ని కోల్పోతాడు. ఇలాటి పాపపు సొమ్ము కంటె పరం గొప్పది.

**పల్గువాని కేటి పర సమృద్ధి దలంప?**
**పల్గు వరన వాని బలువు దప్పు**
**చలము వాని కేది సాత్విక ధర్మంబు?**
**యేము యొకటి ఘనము యిలను వేమ ! 756**

**తా॥** తన గొప్పతనం చూసి మురిసిపోయే వాడికి పరాయివారి భాగ్యాలు ఏవగింపుగా ఉంటాయి. అసూయాపరుడికి సాత్త్విక ధర్మచింతన యెలా ఉంటుంది?

**సాగి పారువారు సకల కార్యంబుల**
**వాగ్ర్వయములచేత వరలు చుండ్రు**
**సాగి పారని తరి సమకూడ దొక్కటి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 757**

**తా॥** అన్ని పన్నుల్లోనూ చురుకుగా మాటల ధాటితో ముందుకు పోవాలి. అన్ని పన్లూ డబ్బు చేత సాధించుకొనవచ్చు ననుకోరాదు. సమయస్ఫూర్తి లేకపోతే పనులు జరుగవు.

**అరయ హస్తమందు నభయహస్తంబివ్వ**
**దర్పణాంగుడైన తన్ను జూచి**
**మంగళంబు జేయు మంగళహీనుడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 758**

**తా॥** అభయహస్తం ఇస్తే దర్పణాంగుడు కూడా తనను చూస్తాడు. మంగళహీనుడు కూడా మంగళం చేస్తాడు.

**ఎరుక నెరుగనోని కెరుక యేదియొ నడ్చు**
**నెరుక లేనివాడు నెరుగలేడు**
**యెరుకలోని యెరక నెరుగుట తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 759**

**తా॥** అజ్ఞానంతో ఉన్నవారికి జ్ఞానోదయం అయ్యేదెట్లు? జ్ఞానం సంపాదించిన వాడే ఆ జ్ఞానం వల్ల తత్త్వం తెలుసుకోగలుగుతాడు.

**జన్మ మరణ సుషుప్తుల జగములెల్ల**
**జరుగుచుండగ నరుడు దా జంగమనుట**
**నదియు దెలియంగలేరు యీ యజ్ఞులైన**
**భూ ప్రజలు బుద్ధిలేకను పొసగ వేమ ! 760**

**తా॥** చావు పుట్టుక నిద్రలతో లోకాలు నడుస్తూండగ మనుష్యుడు అనడం ఆ సంగతి కూడా బుద్ధిహీనత వల్ల అజ్ఞులై తెలుసుకోలేక పోతున్నారు.

**పుణ్యము గలవాని పుష్టంబు పుండైతె**
**వసుధలోన చాల వార్తకెక్కు**
**పేదవాని యింట పెండ్లయిన నెరుగరు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 761**

**తా॥** గొప్పవాతుంటి మీద కాస్త పుండు పుడితే ప్రజలు విశేషించి చెప్పుకుంటారు. లేనివాడి యింట్లో పెళ్ళయినా ఎవరూ చెప్పుకోరు.

**వీటిదాని పొందు విడవ జాలక తుల్వ**
**చచ్చుదాక మోను చావ గుడిసె**
**భాగవతులపట్టు బట్టంగ నోపడు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 762**

**తా॥** పనికిమాలినవాడు ఓ వ్యభిచారిణిని పట్టుకొని చచ్చేదాకా చాప గుడిసెలను మోస్తాడు. భాగవతోత్తముల సాంగత్యాన్ని ఆశ్రయించడు.

**అనిచి పురుషుండు యొక్కడు**
**విను నిత్య మనిత్యమనక విధి మిట్టదగున్**
**తన సంకల్పమె బంధము**
**తన సంకల్ప క్షయంబె తత్త్వము వేమ ! 763**

**తా॥** అజ్ఞాని నిత్యం అనిత్యం అని అంటూంటాడు. తాను సంకల్పాలను నస్తూంటాడు. అవన్నీ అనిత్యాలే ఏసంకల్పం లేకుండా ఉన్నవాడే తత్త్వాన్ని తెలుసుకున్నవాడు.

**అమలమైన పలుకు లభిషేక వారధి**
**తనువు దేవళంబు తాల్మి నొంది**
**యాత్మ శివుని జేర్చు నాతడె శివయోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 764**

**తా॥** మంచి వాక్యమే అభిషేక జలం. శరీరమే దేవాలయం అని నమ్మి మనస్సులో సర్వదా శివధ్యానం చేసేవాడే శివయోగి.

**ఎన్ని తనువులైన చన్న నడ్డము గావు**
**మృతిని గెలువలేని యెరుకలేల?**
**దొంగరీతి గాక దొరుకునా మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 765**

**తా॥** మరణమును జయించ ఎన్ని శరీరాలు ధరించినా అన్నీ కొట్టుకు పోవలసిందే. దొంగలా మృతి చాటున దాక్కునే వాడికి మోక్షం రాదు. మృతికి సంబంధించిన జ్ఞానం పొంది బ్రహ్మలో లీనమవడం కర్తవ్యం.

**ఎట్టి రూపు జూడ నీ రూపు గనిపించు**
**నీదు రూపు జూడ నెచ్చు తెలివి**

**యెచ్చి తెలివియున్న నీశ్వరుడై తోచు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 766**

**తా॥** అంతటా నీ రూపమే కనిపిస్తుంది. అంతటా ఉన్నది నువ్వే. నిన్ను దర్శిస్తే జ్ఞానం పెరుగుతుంది. అలా జ్ఞానం పెరిగితే చివరికి తానే యీశ్వరుడవుతాడు.

**మతము లెన్నియైన సతముగా నుండవు**
**సతముగాను యుండు జగతి నొకటి**
**యంత మదము విడిచి నా బ్రహ్మమరయుట**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 767**

**తా॥** మతాలు ఏకరీతిగా ఉండవు. ఇన్నింటిలో వాస్తవమైన విషయం ఒకటి. అదే బ్రహ్మం. అజ్ఞానం లేదా మదం విడిచి తెలుసుకోవాలి ఆ బ్రహ్మమును.

**కోమటోని నిష్ఠ గురికి రాదెన్నడు**
**లోభగుణముచేత లోనికడగు**
**పులియు దాసరికిడ పొలుపగు చందమౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 768**

**తా॥** వైశ్యుని నిష్ఠపైకి రాదు. అది అతని లోభ గుణం వల్ల అంటే ఎందులో కలుగజేసుకుంటే ఎంత చేతి చేదు షాగవతం అంటుకుంటుందో అన్న సందేహం. ఇతని భయభక్తులు ఎలాటివంటే దాసరి గంతులు చూసి పులికూడా విస్తుపోయి నట్లుండును.

**గోపురములు చుట్టు కోనేర్లు తేరులు**
**యాకుపనులు గుడులు యలరగాను**
**దేవరంట పోతె దిగబట్టు కొనెనయా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 769**

**తా॥** గుడులూ గోపురాలూ చుట్టూ తటాకాలూ వాహనాలూ సుందర వనాలూ రమ్యంగా ఉన్నాయి. అక్కడ దేవుని చూడబోగా దాని ఆకర్షణలో లీనమైపోవడం జరిగింది.

**తల్లిదండ్రు లెన్న తన మొదలి గురువులు**
**పార్వతీ భవులును పరమ గురులు**
**కూలికాండ్ల జగతి గురులన ద్రోహంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 770**

**తా॥** మొదటి గురువులు తల్లి తండ్రి. పార్వతీ పరమేశ్వరులు పవిత్రమైన గురువులు. మా గురువులు ద్రోహులు.

**నవ్వును చదువును పాడును**
**నొవ్వక దానిట్లు నొచ్చి నొకబరి మరుచున్**

**నివ్వటిలియుండు ముదియును**
**యివ్విధమున జూడ లేడు నెవ్వడు వేమ !** **771**

**తా॥** నవ్వుతూంటాడు. చదువుతూంటాడు. పాడుతూంటాడు. ఇతరులను బాధించడు. ఒక్కొక్కసారి తన్మయుడై పోతుంటాడు. శాంతుడుగా వృద్ధి చెందును. అట్టివాడే ప్రాకృతయోగి.

**నీళ్ళ మీద జూడు నెరయ నోడ బలిమి**
**బట్టబయల జూడు బండి బలిమి**
**యాడుదాని బలిమి యాడనే చూడరా !**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **772**

**తా॥** నీటి మీద ఓడలు సాఫీగా నడచి పోతూంటాయి. అందులో అది బలమైంది, బండి భూమి మీద బలంగా నడుస్తుంది. ఆడదాని బలం అంతా నించున్న చోటే తెలుస్తుంది.

**నే నేవడను తలపెట్టగ?**
**మానసమున దలపకుండ మనుజున కకటా!**
**కానబడు పడక నుండును**
**మానుగ గనుగొనగ వలయు మహిలో వేమా!** **773**

**తా॥** మనస్సులో తలచక పోయినా మనుష్యుడికి నిద్రావస్థలోనూ “నేను అని అనుభూతి కనుక్కోవాలి”.

**బ్రతుకు నిత్యమనుచు పదురుచు వగమీర**
**విర్రవీగువారు వెర్రివారు**
**ప్రాణులెల్ల యముని బారి గొర్రెలు సుమీ**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **774**

**తా॥** బ్రతుకు నిత్యం అనుకుని దురహంకారం సంచరించేవాడు వట్టి పోతుగడ్డి మాత్రమే, ఈ ప్రాణులన్నీ పాపఫలితంగా యముని బారిపడే గొర్రెలను గుర్తుంచుకోలేక పోతున్నారు.

**బ్రహ్మవాదులెల్ల బ్రహ్మంబు యనగను**
**వలసి తెలసి చూడ వద్దనుండు**
**ముందు యున్న యట్టి ముద్రిక గానరో !**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **775**

**తా॥** బ్రహ్మవేత్తలు బ్రహ్మము కొరకు ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కానీ ఆ బ్రహ్మ పదార్థం తమ యొద్దనే ఉందని గ్రహించ లేకున్నారు.

**మదిని గానలేరు మరి బ్రహ్మమూర్తిని**
**మదిని గన్నవారు మహిని లేరు;**

**వెదకి తనువులోన వేడ్కతో నెరిగిన**
**యతడె యోగి వరుడు యం(ద్రు వేమ ! 776**

**తా॥** మనసా ధ్యానించి కూడా తెలుసుకోలేరు. అసలు ఆ బ్రహ్మ పదార్థాన్ని ఎరిగిన వారే కనబడ్డం లేదు, తత్త్వమును వెదకాలంటే దానికి లోకంలోకి వెళ్ళక్కర్లేదు. తనలో వెదికితే చాలు అర్థం అవుతుంది.

**మనసనలము రెంటికి నీ**
**ఘనమును కొంచంబు దెలియగా వలె సుమ్మీ**
**కనుమూసి తెరచి నంతనె**
**ఘనమై విహరించు మనసు గానరు వేమా ! 777**

**తా॥** అగ్ని మనస్సూ ఈ రెండూ క్షణంలో మార్పులు చెందుతాయి. కనుమూసి తెరిచినంతలోనే మనస్సు యొక్క పరిణామం ఎంతో ఘనంగా ఉంటుంది. కాని అది మనస్సు యొక్క విజృంభణం అని తెలుసుకోలేరు.

**మర్మ మెరుగలేక మతముల గల్పించి**
**యుర్వి దుఃఖ లగుదు రొకరికొకరు**
**గాజు యింట కుక్క కళవళపడు రీతి**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 778**

**తా॥** తమకు తోచిన విధాలను మతాలుగా నిర్మించారు. ఈ మతాల్లో అభిప్రాయం తెలియరు. ఇదంతా చూస్తే గాజు యింట్లో దూరిన కుక్క తన రూపమును చూసి తానే భయభ్రాంత మగు రీతిగా ఉంది.

**ఇహపరాదులకును యిది సాధనంబని**
**వ్రాసి చదివి విన్నవారికైన**
**మధ్య కర్మములను మహిమతో మడచును**
**పరులకైన ముక్తి పదము వేమ ! 779**

**తా॥** ఇహానికీ పరాన్నీ యిది సాధనం చేసినా చదివినా విన్నా కర్మలు నిలుచునా ఎలాంటి వారికైనా జ్ఞానం కలిగితే కర్మభారం తొలగిపోతుంది.

**వేద విద్య గాదు వీర విద్యయు గాదు**
**బాధ విద్య గాదు పరువు గాదు**
**మధురమైన యట్టి మనసు నిల్పెడు విద్య**
**స్వాదు విద్య యెన్న సరగ వేమ ! 780**

**తా॥** వేద విద్యా కాదు; యుద్ధ విద్యా కాదు; వైద్య విద్యా కాదు, నాగర విద్యా కాదు; మనస్సును నిర్మలంగా ఉంచుకుని చక్కగా ఆ మనస్సును ఏకాగ్రతగా ఉంచే మనోహరమైన విద్య. అటువంటి హృదయ విద్య. అదే ఆత్మ విద్య.

**వేయు విధము లమర వేమని పద్యంబు**
**లర్థమిచ్చు వాని నరసి చూడ**

**చూడ చూడ గలుగు చోద్యమౌ జ్ఞానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 781**

**తా॥** వేమన పద్యాలు వెయ్యి రకాలర్థాలిస్తాయి. ఇది ఇందులో ఉండే ఆశ్చర్యం; చూడండి.

**వేమన జెప్పిన పద్యము**
**సామంబున చదివినట్టి సజ్జనులెల్లన్**
**సోమన తల మందురు కడు**
**నేమంబున జాడరయ్య నేర్పున వేమా! 782**

**తా॥** వేమన రచించిన పద్యాలను సావధానంగా చదివే సజ్జనులు చాతుర్యం కలిగి క్షేమంగా ఉత్తమ తరగతికి చెందిన వారుగా ఉంటారు.

**అల్లుడైన నేమి? యన్యుడయిన నేమి?**
**చెప్పవలయు రీతి జెప్పినాము**
**హరుని యెరుక లేక యాకు నల్లాడునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 783**

**తా॥** అల్లుడైనా, మరెవరైనా అందరికీ ఒకే రీతిలో చెప్పాయి, శివుని నిష్పాక్షికంగా వ్రాసినాము. హరుని ఆజ్ఞ లేకుండా ఆకు కూడా కదలదు కదా!

**నూరు నాడవచ్చు నొకటి వ్రాయగరాదు**
**వ్రాతకన్న సాక్షి వలన దెన్న**
**పరగ వ్రాతలేని పక్షాన కన్పడు**
**బలిమి సాక్షి తగ నబద్ధి వేమ ! 784**

**తా॥** నూరు మాట్లాడవచ్చు. కాని ఒకటీ వ్రాతలో ఉండరాదు. వ్రాతకంటె మించిన సాక్ష్యం ఏమీ ఉండదు. వ్రాత మూలకమైన సాక్ష్యం లేనప్పుడు బలమైన సాక్షి నలుగురు చెప్పిన మాటే.

**ధారదత్తమైన తామ్రపు పలకలు**
**లావు యుంగరమున లంకె జేసి**
**అడియ మీద ముద్ర యమరి యుండంగను**
**నదిగొ శాసనంబు యవని వేమా! 785**

**తా॥** నీళ్ళతో ధారపోసి యిచ్చిన రాగిరేకులను రాజముద్రను జతపరచి ముడిమీద గుద్దితే అది శాశనం అవుతోంది.

**నీతి వైరాగ్య భక్తి వినీతులకును**
**ఘాతకులు గాని జ్ఞాన సంకలితులకును**
**వ్రాలకందని పద్యముల్ వేలసంఖ్య**
**చేత నందుగ వేమన్న జెప్పె భువిని 786**

**తా॥** నీతి కావాలన్నా, మోక్షం కావాలన్నా, భక్తి వినీతులకు, దుర్మార్గులు గాని జ్ఞానం గలవారి కోసం మాటల కందనంత మహోన్నత భావాలతో వేలకొలది పద్యాలు చేతనయినంతగా చెప్పాడు.

**గురుతు తిథుల వలన గులమెల్ల జెడిపోయె**
**స్త్రీల నడక వలన సిగ్గుబోయె**
**యేహ్యపల్వలముల నిల యెల్ల జెడిపోయె**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 787**

**తా॥** గుర్తు తిథుల వల్ల కులం అంతా చెడిపోయింది. అడవాళ్ళ నడకల మూలంగా సిగ్గు అంతా పోయింది. పనికిరాని మడుగుల వల్ల నేలంతా చెడిపోయింది. వాళ్ళ వల్ల బ్రతుకే నాశనమై పోయింది.

**చిత్త వాజి నెక్కి శిక్షింపనేరక**
**తత్తరించి రౌతు తరల నేల?**
**వారణాశి తనకు వయ్యాసి గాబోలు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 788**

**తా॥** గుర్రాన్ని ఎక్కి నడపడానికి చక్కని శిక్షణ యివ్వలేక కంగారుపడి లేచిపోడం దేనికి? అలా లేచిపోయే వారికి కాశీ నివాస స్థానం అవుతుందేమో మరి?

**రాజయోగి మహిమ రాజయోగికి గాక**
**నితర జనుల కెల్ల నేమి దెలును?**
**తాను దేవుడైన దైవము గొలుచునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 789**

**తా॥** రాజయోగి మహిమను తెలియాలన్న రాజయోగికి మాత్రమే తెలుస్తుంది. ఇతరులకు తెలీదు. తాను దేవుడైతే దైవం వచ్చి దాస్యం చేస్తుందా?

**దేవపూజలందు దేవాలయములందు**
**దేవుడంట జెప్పి తెరువు జూపె**
**తెలియ విశ్వమెల్ల దేవాదిదేవుడౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 790**

**తా॥** ఇది గుడి, ఇతను దేవుడు, ఇలా ఆ దేవుని పూజించడం అంటూ లోకం తెలుసుకునేలా ఓ దారి చూపెట్టడం అయింది, అసలు చూస్తే లోకం అంతా దేవుడే.

**గంపెడంత తవుడు గంపలో బెట్టక**
**చన్ను బట్టనీదు కొన్న బర్రె**
**వారకాంత లేల వలతురు యూరక**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 791**

**తా॥** గంపెడు తవుడు ముందు పెడితే తప్ప పశువు పొదుగులో చెయ్యి పెట్టనివ్వదు. అలాగే వారస్త్రీ కూడా చేతిలో డబ్బు పడితే తప్ప ప్రేమ ఒలికించదు.

**తివిరి లేమియుంట తెరువు కాడే మెర్గు?**
**మొఱ్రబెట్టి మొత్తుకొన్నగాని**
**పతితధర్మ మెన్న పడుచుకట్టె నార్గు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 792**

**తా॥** ఇంటిలో కలిమిలేములు దారిపోయే వారికి యేం తెలుస్తుంది? పడుచు శరీరానికి ఏం తెలుస్తుంది ధర్మం?

**దాతలేని కొంప దయ్యాల పెను వాడ**
**నీతి గానిమాట రాతి వేటు**
**ప్రీతి లేనిలంజ ఘూతియై తోచురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 793**

**తా॥** దానం చేయనివాడి యిల్లు పెద్ద భూతగృహం. నీతులు లేని మాటలు రాళ్ళ వేటు లాంటిది. ప్రేమ లేని భార్య పీక్కు తినే పిశాచం లాంటిది.

**చినుగుబట్ట గాని చీనాంబరము గాని**
**మురికి యొడలుగాని ముక్తి గాని**
**పరమ యోగి మహిమ బరికింప నరుదురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 794**

**తా॥** శరీరానికి చిరుగు గుడ్డయినా చాలు. గొప్పవారు మైపూతలతోను, సువాసనలతో పొంగిపోతూంటారు. మోక్షం కావాలన్న శరీరం ఎలా ఉన్నా పరవాలేదు. యోగి మహిమను చూపగలుగుతాడు కాని ప్రజలు ఆ విశేషం గమనించరు.

**వాని గాననోడు వాడు కానేకాడు**
**వానిలోనివాడు వాడు మమ్ము**
**వాని గన్నవాడు వాడ్కెతా యోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 795**

**తా॥** తత్త్వం తెలియనివాడు తత్త్వవేత్త కాడు. తత్త్వంలోనే ఉంది. తత్త్వం తెలుసుకున్నవాడు నిజమైన యోగి.

**కుక్క యేమెరుంగు గురులింగ దేవుని?**
**నక్క యేమెరుంగు నొక్కపొద్దు?**
**మూర్ఖుడే మెరుంగు మోక్షంబు త్రోవను**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 796**

**తా॥** గురులింగ జంగాన్ని కుక్కకి గానీ నక్కకుగానీ ఏం తెలుస్తుంది? అట్లె ముక్తికి దారి మూఢునికి ఏం తెలుస్తుంది?

**వెయ్యేరు గతుల జలనిధి**
**తియ్యని ననిశంబు గలయ ద్రిప్పుట యరుదౌ**
**కొయ్యకు దా సుజ్ఞానము**
**వెయ్యి విధంబులను జెప్పు వృధరా వేమా!** **797**

**తా॥** వేలకొలది బిందెలతో తియ్యని నీరు సముద్రములో జల్లితే సముద్రం తియ్యనౌతుందా? కొయ్యకి వెయ్యి విధాలుగా సుజ్ఞానం బోధిస్తే అసలు ఏ కొద్దిపాటి జ్ఞానం ఐనా అబ్బుతుందా?

**వెదకి కానలేరు వేదాంత వేద్యుని**
**యుత్తముండు గాంచు నుర్వీమీద**
**కలిగి లేనివాని కానంగ లేరయా !**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **798**

**తా॥** వేదాంత వేద్యుని ఎంత వెదికినా దర్శించలేరు. ఉత్తముడు మాత్రం దర్శించగలుగుతున్నాడు. ఉన్నవాడు లేకపోతే దర్శించలేరు. బ్రహ్మ సర్వకాల సర్వావస్థలయందు దర్శనీయం.

**జ్ఞానవంతు జూచి జనరు కర్మబద్ధులు**
**వెర్రి యంద్రు ప్రకృతి విడువలేరు**
**వెర్రి కవని బ్రకృతి వెదకిన గల్గునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **799**

**తా॥** జ్ఞానిని చూసి వెర్రివాడనీ ఉన్మాది అనీ ముద్ర వేస్తారు. ప్రకృతిని వెదకి బ్రహ్మమును గ్రహించగలవారు వారే.

**ఇంతి కనులు చనులు యెంత లెస్సని చూచి**
**మోహపడును బుద్ధి మోసపోయి**
**గరితలోని వాని కానలే డాయరా**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **800**

**తా॥** పడుచు యొక్క కన్నుల్నీ చన్నుల్నీ ఎంతో హాయిగా చూసి చూసి చివరికి మోహంలో పడి మోసపోతాడు. శరీర సౌష్ఠవంతో ఉన్న ఆమెను చూడ్డానికి యిష్టపడతాడే కాని ఆమెలో గల బ్రహ్మమును చూడలేకపోతున్నాడు.

**వాతగుణముచేత వలపైన మగవాడు**
**లొట్ట కనుల వాన్కి లోల మగును**
**పుట్టి జగతి నిలుచు పునరుద్భవంబగు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **801**

**తా॥** వాతగుణం గల మగవాడు వలపుల ప్రభావంతో ఓ చీపి కన్నులదాన్ని చేరదీసి దాంతో ఉండి దానికే పుడతాడు. మళ్ళీ చచ్చి మళ్ళీ పుట్టి అలా జన్మ మృత్యుప్రవామంలో పోతూంటాడు.

**ఏ సూత్ర మరసి చూసిన**
**స్త్రీ సూత్రం బదియు గాక సిద్ధముగాగన్**
**నా సూత్రం స్త్రీ సూత్రము**
**నా సూత్రము దెలియువాడు నాథుడు వేమా! 802**

**తా॥** ఏ సూత్రమును గురించి తలచినా స్త్రీ సూత్రమే లోకంలో ప్రధానం. ఆ సూత్రమే స్త్రీ సూత్రము, ఆ సూత్రం తెలుసుకున్నవాడే పతి అవుతున్నాడు.

**బందెత్రాళ్ళ తోడ బంధించి కట్టంగ**
**లింగ దేమి దొంగిలించినాడొ?**
**యాత్మలింగ మేల నర్చించి చూడరో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 803**

**తా॥** జంగాలు లింగాన్ని తాడుతో మెళ్ళో వేళ్ళాడదీసుకుంటారు. అలా కట్టుకున్నంత మాత్రంలో ఈశ్వరుడేమైనా దొంగిలించాడా? లింగధారణేల? ఆత్మలో గల లింగమును తెలుసుకుని అర్చిస్తే చాలదూ?

**మంత్ర మెల్ల మరచి మధురాధరము దల్చు**
**నేవిధమున భక్తు డెరుగు నిన్ను ?**
**యోని జూచి పరమ యోగంబు మరతురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 804**

**తా॥** జపంలో ఉండగా ఓ ఒయ్యారపు అందగత్తె. అందగత్తె కనబడితే ఆ భక్తుడు జపం తపం మరచి ఆమె కమ్మని పెదవిని ఆశించును. అట్లె మనసా ఆమె స్త్రీ ధర్మం గుర్తుకు తెచ్చుకుని ఆమెతో రమించాలని కోరిక పడుతూ జపం సంగతి మరచిపోతాడు.

**శైవ వైష్ణవాది షణ్మతంబులకెల్ల**
**దేవుడొక్కడనుచు దెలియలేరు**
**తమకు భేదమయిన తత్త్వంబు భేధమా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 805**

**తా॥** శైవం వైష్ణవం మొదలుగా గల ఆరు మతాలలోని సారం దేవుడొక్కడే. మెనిషి ఆ సంగతి మరచి ఖండన మండనలతో ఉంటారు. తమతో భేదం ఉంటే దేవుడిలో భేదం లేదని తెలుసుకోలేకపోతున్నారు.

**పూసపోగు బెట్టి పురుషుని భుజమెక్కి**
**కన్నులార్ప వారకాంత గాదు**
**తనకు లొంగువారి దడయక జంపురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 806**

**తా॥** ఆభరణంగా బంగారం పురుషుని భుజం ఎక్కి కూర్చుంటుంది. కన్నుల కింపుగా కనబడే వేశ్యకాదు. అది తనకి లొంగి ఉన్నవార్ని ఆలస్యం లేకుండా హతమారుస్తుంది.

**జడల దాల్చుటెల్ల జగము నీ యనుటెల్ల**
**యొడల విరుచుటెల్ల యోగమెల్ల**
**ముక్తికాంత బట్టి ముద్దాడు కొరకురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 807**

**తా॥** జడలను ధరించడం, లోకులచేత ఛీ అనిపించుకోడం, శరీరమును శుష్కింప చేయడం ఎందుకంటే ఆ ముక్తి కాంతను ముద్దాడడం కోసమే.

**తనలో సర్వంబుండగ**
**తన లోపల వెదకలేక ధరలో వెదకే**
**తనువుల మోపెడు యెద్దుల**
**మనుముల దెల్పంగ వశమె మహిలో వేమా! 808**

**తా॥** తనలోనే అంతా ఉంది. జనులు తమలో వెదకక భూమి మీద ఎక్కడో యేదో ఉంది అని భ్రమపడతారు. అటువంటి వారినేమనాలి?

**కరములందు తమరు గంగాధరుని బట్టి**
**తీర్థములకు బోయి తిరుగు చుంద్రు**
**వెన్న బట్టి నెయ్యి వెదకిన చందంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 809**

**తా॥** తమ చేతిలో గంగాధరుని ఉంచుకొని శివుని చూడ్డానికి కాశీ వెళ్లాను; వెన్నను చేత్తో పట్టుకొని నెయ్యి ఎక్కడ? అన్నట్టే!

**అరుతలింగ ముంచి యదియును జాలక**
**పర్వతమున కేగు పామరుండు**
**ముక్తి గాన నగునె మూఢాత్ముడగు వాడు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 810**

**తా॥** మెడలో ఈశ్వరలింగమును దాల్చి అది సరిపోక శివ దర్శనమునకు వెళ్ళిపోతూన్నాడు. ఎక్కడ శివుడున్నాడు? అని అంతటా వెతుకుతున్నాడు. ఆయనను మెడలో ధరించాలన్న తెలివి చాలక?

**స్నాన మొనర జేసి సద్ధర్మ మివ్వక**
**నీళ్ళ మునుగ దగునె నేర్పులేక**
**నీళ్ళ యందు కోడి నెలవుగా మునుగదా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 811**

**తా॥** ఏ దానధర్మాలూ చేయకుండా నీళ్ళలో స్నానం చేసినంత మాత్రాన పుణ్యం వచ్చునా? కోడీ మునుగుతుంది. నీటిలో దానికీ తేడా ఏముంది?

**కాలచక్ర మెరుగగా లేక నెప్పుడు**
**సంధ్య జపము సేయు జాణలార**
**సంధ్య జపములోని జాడ లెట్లుండును?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 812**

**తా॥** ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంవేళల రోజురోజూ జపం చేస్తున్నారు. దానివల్ల వచ్చే ఫలితం కనుక్కోలేకపోతున్నారు. సంధ్యాజపం జాడలింతే.

**కాశి యాత్ర బోయి గంగ దానము జేసి**
**కష్టపడిరి ముక్తి గానలేక**
**నెనుము తిరుగుచుండదే యెద్దు వెంబడి,**
**విశ్వదాభిరామ వినుర వేమా! 813**

**తా॥** కాశీయాత్రకు వెళ్ళి అక్కడ గంగ ఒడ్డున దానాలూ నిర్వహించితే ఏముంది? ముక్తి కలగిందా? ఇదంతా గేదె ఎద్దును వెంబడించి తిరిగినట్లుంది.

**కాశి బోవువాని కర్మ మేమని చెప్ప**
**చావ హేతువుండి చచ్చెనేని**
**మనసు కాశి జేరు మరి ముక్తి లేదురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 814**

**తా॥** కాశీ వెళ్ళేవాడి కర్మం ఏమని చెప్పవచ్చు? ఆ యాత్రికుడిని కాశీలో చస్తె అంతలో ముక్తి కలుగుతుందా? కట్టె కాశీ గంగలో కలిసినా ముక్తి మాత్రం రాదు.

**యోగి ననుచు గొంత యోగము గూర్చుక**
**జగములోని వారి జంపుకొనుచు**
**ధనము కొరకు మిగుల దాడాడు చుండిన**
**యోగి గాడు వాడు యోగు వేమ. 815**

**తా॥** యోగం కొంచం నేర్చుకొని నేను యోగిని అంటూ ప్రజలపై పడి వార్ని నానా హింసలు పెడుతూ డబ్బులను గుంజుతూ సంచరించే వారందరూ యోగులు కారు.

**పరమహంస ననుచు పంవగట్టుక భూమి**
**పర ధనముల కాసపడెటివాడు**
**పరమహంస గాడు పరమహింస యటంద్రు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 816**

**తా॥** పరమహంసనంటూ కాషాయాలు కట్టి పరుల సొమ్మును ఆశించేవాడు పరమహంస గాడు.

**మునిగి మునిగి మునిగి ముద్దయై ముద్దయై**
**వనరి వనరి పక్కి పక్కి తిరిగి**
**తిరిగి తిరిగి తిరిగి దిమ్మరై యుండును,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **817**

**తా॥** నదుల్లోనూ చెరువుల్లోనూ దొరువుల్లోనూ మునకలేసి తడిసి ముద్దయిపోయి ఉపవాసాలు లేసి చిక్కిపోయి దేశాటనలు చేసి చివరికి దేశ ద్రిమ్మర్లు అవుతున్నారు.

**బారెడేసి జడలు భస్మంబు పూతలు**
**మరునితోడ మారు మలయగలరు**
**ముంజి కోక లెల్ల లంజ కోకల కాయె,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **818**

**తా॥** బారెడేసి జడల ధరించి ఒళ్ళంతా విభూది రేఖలు తీర్చి దిద్ది. స్త్రీలు కనబడేసరికి మళ్ళీ వారితో మన్మథ క్రీడలకు దిగుతారు. భక్తులు సమర్పించిన ముంజి చీరలన్నింటినీ లంజల కిచ్చి లంజ చీరలుగా చేస్తున్నారు.

**బోడి తలలు నెల్ల బూడిదె పూతల**
**నాసవముల మారుతాశనముల**
**యోగిగాడు లోను బాగు గాకుండిన,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **819**

**తా॥** శిరస్సు గుండు చేసుకొని, విభూది రేఖలు తీర్చి దిద్దాడు. వేదాంత వాక్యాలు ఉదహరించడం నేర్చారు. అంతరంగం పవిత్రంగా లేనివానికి ఎన్ని వేషాలు వేసినా మోక్షం రాదు.

**ఆరు వేషములను యని చూడ బహువింత!**
**లాత్మయందు ధ్యాన మమర దెందు!**
**భీకరంబె కాని బిరుదు లేదు విరక్తి**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **820**

**తా॥** వేషంతో తయారయ్యాడు. ఆరురకాల మతాల వారూ తమతమ వేషాలను ధరించారే, కాని అసలు కావలసిన హృదయ ధ్యానం మాత్రం మనస్సున మచ్చుకి కూడా కనబడదు.

**కుక్కుట పవనంబు కొక్కెర ధ్యానంబు**
**యతుల నొసట నొననట్లు వ్రాసె**
**తొల్లి జేసినట్టి దోషంబు తగిలెనో**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **821**

**తా॥** సన్యాసుల నుదుట కోళ్ళవాసనా కొంగుజపం వ్రాసి ఉంది. లేదా పూర్వాశ్రమంలో ఉన్న అలవాటో అయి ఉండాలి.

**ఒడల భూతి బూసి జడలు ధరించిన**
**నొడయి డయిన ముక్తి బడయలేడు**
**తడికి బిర్రుపెట్ట తలపుతో సరి యౌనె,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **822**

**తా॥** వీభూది పూసుకొని జడలు ధరించినంత మాత్రములో రాజయినా ముక్తిని పొందలేడు. తడిక తలుపుతో సాటి అవుతుందా?

**శివుడు బ్రహ్మమనుచు స్మృతులెల్ల బలుకంగ**
**వేరెదైవములను వెలయ గొల్చి**
**బ్రహ్మజనులు చూడ భ్రష్టులైపోయిరి,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **823**

**తా॥** శృతి స్మృతులు శివుడు, బ్రహ్మం అని చెపుతూండగా అది తెలిసి కూడా బ్రాహ్మణులు వేర్వేరు వేల్పుల్ని పూజించడం మొదలు పెట్టి భ్రష్టాచారులయి పోతున్నారు.

**తలను వేలవేసి తాలి మించుకలేక**
**మూసి తెరుచు కన్ను మూగి యగుచు**
**జ్ఞాన మదియు గాదు కష్టపు శేషంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **824**

**తా॥** తల వేళ్ళాడదీసుకుని కళ్ళు మూస్తూ తెరుస్తూ మౌనం వహించి ధైర్యంలేక ఉంటారు. దానివల్ల శరీర కష్టమే మిగుల్తుంది కానీ జ్ఞానం అబ్బదు.

**శివుని భక్తులెల్ల భువి మంటి పాలైరి**
**వాదమేల? దైవ భేదమేల?**
**విష్ణుభక్తులెల్ల వెలిబూది పాలైరి,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **826**

**తా॥** భేదాలు ఏర్పరిచి వాద ప్రతివాదాలతో ఖండన మండనలతో శివ భక్తులందరూ మట్టిపాలైతే వైష్ణవులందరూ మట్టిపాలైతే వైష్ణలందరూ తెల్లటి నామాలు ధరించి వెలి బూడిద పాలయ్యారు.

**తన్ను దెలియకున్న దగ వేదములు వెఱ్రి,**
**సస్య సంపదకు ముసాబు వెఱ్రి!**
**యారు శాస్త్రములను యా పురాణములను**
**జబ్బు లనుచు జగతి చాటు వేమ.** **826**

**తా॥** తన్ను గురించి తెలియకపోతే వేదాలు వెఱ్రి? పంటలకు ముసాబు వెఱ్రి అంటే తెగులు. ఆరు శాస్త్రాలూ పద్దెనిమిది పురాణాలూ ఓ పెద్ద జబ్బు.

**వేమ డిట్టు జెప్ప వేయి పద్యంబులు**
**తప్పు లెన్ని యున్న నొప్పియుండు**

**బిత్తర పడ కందు బిత్తరై యుండదా,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **827**

**తా॥** వేమన్న వేల పద్యాలు యిలా చెప్పాడు. వాటిలో తప్పులున్నా అందలి సారాంశాల్ని యుక్తి యుక్తంగా తీసుకోవాలి కానీ అనవసరంగా వక్రభాష్యాలు చెప్పి మారు తోవ పట్టించరాదు.

**వెఱ్ఱి నక్కల వలె వేదముల్ జదివేరు**
**యాశయంబు లెరుగ రయ్యవార్లు**
**వేదసార మంత వేమన యెరుగును,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **828**

**తా॥** వేదాల్ని వెఱ్ఱి నక్కల్లా వల్లె వేయడం నేర్చారు. కానీ వేదోప బృంహితమైన లక్ష్యమేమో అయ్యవార్లు తెలియ లేకున్నారు. వేదసారమంతా వేమన్నకి తెలుసు.

**ఆలి రంకు దెలుప నఖిల యజ్ఞంబులు**
**తల్లి రంకు దెలుప తద్దినములు**
**కాని తెరువు కర్మకాండ కల్పితమాయె,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **829**

**తా॥** భార్య రంకు తెలపడానికే యజ్ఞకరణం. తద్దినం పెడితే ఆ తిదోదక పఇండ ప్రదానాదులు తల్లి వ్యభిచారం చేస్తే ముట్టవు. ఈ కర్మకాండ ముక్తికి కాని మార్గం.

**హింస జేయకుంటయే ముఖ్య ధర్మంబు**
**యనక హింస జేతు రవని సురలు**
**చావు పసివి దినెడు చండాలుడే మేలు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **830**

**తా॥** ఏ ప్రాణిని హింస చేయకపోవడమే ధర్మము. కాని దేవతలే హింసని చేస్తున్నారు. ఇలాంటి వేళ చూస్తే చచ్చిన పశువుల్ని తినే చండాలుడే మేలు.

**ముక్కు త్రాళ్ళు గూర్చి మురికి పోవగ దోమి**
**కచ్చు నీరు నించి కడిగి కడిగి**
**దొక్క దొలచినంత దొరుకునా తత్త్వంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **831**

**తా॥** ముక్కలో గుడ్డలు ఉంచి క్షాళించి మురికి పోయేలా ఉప్పళించి కడుపును మలహీనం చేసుకుని జపం చేసుకుంటారు. ఇవన్నీ చేస్తే తత్వం అవగరం అవుతుందా?

**జాత సూతకములు సత్యమై యుండంగ**
**నంటిన గుణములును హతము గాక**

**యతియు గననేల నవనిలో జీవుండు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 832**

**తా॥** పుట్టుక – చావును సత్యములుగా తలచి పాటిస్తూన్నాడు. అటువంటి గుణాలని నాశనం చేసుకోలేని మనిషి యతి అయితే ఏముంది?

**మదము వలను గలిగి మాటల బహుబల్కి**
**ముచ్చు సుద్దుల నొగి మోసపుచ్చి**
**కాసు రా బెనగెడు కష్టుండు గురుడౌనె?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 833**

**తా॥** మదంతో మాట్లాడం నేర్చి దొంగ మాటలన్నీ చెప్పి, డబ్బు గుంజుకు పోయేవారు గురువౌతారా?

**పేరు సోమయాజి పెను సింహబలుడయా?**
**మేకపోతు బట్టి మెడలు విరుచు**
**గాక క్రతువు వంక గలుగునా మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 834**

**తా॥** సింహబలంగల సోమయాజులుగారు మాంసమును తిని క్రతువులో మేక మెడలు విరిచినట్టి ఆ వంకని చంపుతున్నాడు వపాభక్షణానికి, ఇది ముక్తికి మార్గమా?

**సందె వార్చగనేమి జపము నేయగనేమి?**
**వేదశాస్త్రములను వెలయ నేమి?**
**పడతి గననినాడు బాపడు గాడయా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 835**

**తా॥** సంధ్య వారుస్తాడు జపంచేస్తాడు. వేదశాస్త్రాలు చదువుతాడు. ఇన్నీ ఉన్నా స్త్రీతో ఉంటే బ్రాహ్మణుడేమి?

**కుక్కలనగ కసి బాపలు**
**నక్కల బూజించినారు నా కేశునకై**
**చొక్కముగ జీవహత్యల**
**మిక్కుటముగ జేసి తమిని మించిరి వేమా. 836**

**తా॥** బ్రాహ్మలు ఇంద్రుడ్ని సంతోష పెట్టడానికి నక్కల్లాంటి దేవతల్ని పూజించడానికి జీవాల్ని హత్యచేసి సంతోషపడుతున్నారు.

**అరయ దోచువాడు గురువని తానెంచి**
**తిరుగువాడు తన్ను నరయలేడు**
**పనికిమాలినట్టి బానిసె కొడుకురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 837**

**తా॥** గురువునని అంటూ కల్లిబొల్లి మాటలు చెప్పి డబ్బు లాగేవాడు గురువెట్లగును? తనకు తానే గురువు కాలేని వాడు పనికిమాలిన బానిస కొడుకు.

**చాడి కాని మాట చావడిలో నిక్కు**
**వేటబో శునకము వెలయ నిక్కు**
**స్త్రీల జూచి నపుడు శిశ్నంబు నిక్కురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 838**

**తా॥** చాడీలు మాటలు కచేరీ సావిడిలో పట్టుగా ఉంటాయి. వేటకు పోయిన కుక్క మంచి పట్టుగా ఉంటుంది. ఆడదాన్ని చూడగానే పురుషావయవం చిరుసు పారుతుంది.

**పుట్టి శక్తులైదు పుడమి నంటింపంగ**
**విప్రులెల్ల వేదవేత్తలమని**
**శక్తి పుత్రు కులము జగతిలో నెరగరో,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 839**

**తా॥** భూమి మీద ఐదుశక్తులు ప్రాధాన్యత వహించాయి. అందరూ ఆ శక్తి పుత్రులే. కాగా బ్రాహ్మణ ఆశక్తి పుత్ర కులం అని గొప్పలు పోరాదు.

**భేదా భేదంబులకును**
**వాదంబై జనము చూడ వర్తించును నా**
**భేదాభేదము లుడిగిన**
**వేదాంత ధ్యాని యగుచు వెలుగుర వేమా. 840**

**తా॥** భేదం అభేదం విషయంలో వాదాలు చెలరేగి మతాలుగా చీలిపోయి నిలిచారు. అభేదాభేదాలు విడిచి వేదాంత నాదంతో నిలకడగా ఉండడం మంచిది.

**ద్విజ వరుండు చెడ్డ పిండంబు దినబోయె**
**పేరటాలు ముసరు పెండ్లి మెనసి**
**కులము మొదలు బోయె గూలె బో మానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 841**

**తా॥** బ్రాహ్మణుడు చెడ్డ పిండాలు తినబోయి, పేరంటాలు చెడుగు పెళ్ళికి కులం మానాభిమానాలూ చెరుచుకోడం అయింది.

**శూద్రులనుచు చూడ శూద్రుల బోనాడి**
**మాల కంటెను గడు మాల యగుచు**
**ద్విజుడ నే నటన్న ద్విజుడుగా నేర్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 842**

**తా॥** శూద్రుడు అంటూంటారు. కాని అలాంటివారు మాలవాడి కంటే కూడా కనికిష్టపువారునే బ్రాహ్మణ్ణి అని గర్వపడినంత మాత్రంచేత బ్రాహ్మణుడు కాదు.

**పుట్టి చచ్చు నరుడు పూర్వమేమి దెలక**
**బట్టబయలు నుండి భ్రమసి యెపుడు**
**తెలివి విడిచి భూమి దిరుగంగ నేటికి,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 843**

**తా॥** పుట్టి, చచ్చును మనుష్యుడు వెనకటి జన్మలో ఏ జన్మో తెలియక ఈ ప్రపంచాన్ని చూసి భ్రాంతిపడుతూ విశ్వమందంతటా వ్రేలాడుతున్నాడు.

**బ్రహ్మ నృపతి వైశ్యపతులును శూద్రులు**
**బ్రహ్మ విష్ణు హరులు పశువులెన్న**
**బ్రహ్మము దెలియక బహురూపు లిట్లయిరి,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 844**

**తా॥** బ్రాహ్మణులు, రాజులు, వైశ్యులు, శూద్రులు అన్న విభాగం యిలాగ బ్రహ్మ, విష్ణువు, గణాలూ, పశువులూ అని ఇదంతా బ్రహ్మమని తెలియక బహు విభాగాలుగా అయ్యారు.

**కలుష మొక్క యింత గాన్పింప దెందును**
**జూడ నెవరికైన సొంపుమీర**
**తమసం బడంగదా వెల్గును జ్ఞానంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 845**

**తా॥** ఎవరియందూ పాపం కనబడదు. అందరూ మంచివారే. గుణాల ప్రకోపం తగ్గితే జ్ఞానం ప్రకాశిస్తుంది.

**తనువునందు నగ్ని దరకొని కాల్వంగ**
**కాల్చుకొనుట యేమి కర్మమునకు**
**కాల్చుకొన్న యంత ఘను డాతడాయెనా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 846**

**తా॥** శరీరం తాపత్రయాలతో ఎలాగూ కాల్తూనే ఉంది. శరీరం కాలిపోయినా కర్మలు కాలిపోవు. అంతమాత్రం చేత అట్టివాడు గొప్పవాడు కాబోడు.

**త్రాడు మెడను వేసి తనకు శూద్రత్వంబు**
**బోయెననెడి దెల్ల బుద్ధి కొదువ**
**మనసు నిలక త్రాడు మరి వన్నె దెచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 847**

**తా॥** యజ్ఞోపవీతాన్ని ధరించినందువల్ల శూద్రత్వం పోయింది అన్నది సరికాదు, మనస్సుకి నిలకడ ఉండాలి. లేకపోతే శరీరానికి అందం అది యిస్తుందా?

**పట్టు చీర గట్టి పట్టె తిరుమణినిడి**
**సృష్టి వైష్ణవంబు శిఖలు మించె**

**చిన్నె లెన్నొ జేసి చెరచె వైష్ణవమిట్లు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 848**

**తా॥** పట్టుచీర కట్టాడు తిరుమణి దట్టంగా పెట్టాడు. పికలు ధరించాడు. ఇంకా యింకా ఎన్నో చిన్నెలూ వన్నెలూ పెట్టి చివరికి వైష్ణవాన్ని చెరిచాడు.

**కనువు నేరి తిన్న పసరపు మై దిన**
**మాలదండ్రు వాని మహిని జనులు**
**పంది గోడి దిన్న ప్రాజ్ఞుడందురు జనుల్**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 849**

**తా॥** లోకంలో ప్రజలు గడ్డిగాదం తిని బ్రతికేవాణ్ణి మాలవాడంటున్నారు. పందినీ కోడిని తినేవాణ్ణి ప్రాజ్ఞుడనీ అంటారు.

**ఊరు వాడు భావి యుదకము నిందించి**
**పాదతీర్థమునకు భ్రమసినారు**
**పాద తీర్థమునకు ఫలమేమి కద్దురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 850**

**తా॥** ఊరిలో ఉన్న భావిలోని నీటిని పవిత్రం కాదని భావించి, పాదోదకం కోసం పరుగులు తీస్తారు ప్రజలు. ఆ పాదతీర్థంవల్ల వచ్చే ఫలం ఏముంది?

**మొనసి యింద్రియముల మొదట నిల్పగతేక**
**సమసి పోవువేళ సన్యసించి**
**యాత్మశుద్ధి లేక నంటునా మోక్షంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 851**

**తా॥** మనసును సరియైన పద్ధతిలో నిగ్రహంలో ఉంచలేక చచ్చే సమయంలో సన్యసించితే మోక్షం వస్తుందా?

**చావు దెలయువాడు సన్యసించేదెల్ల**
**కడపలందు కులము జెడినయట్లు**
**పాప మొకటి మీద ఫలమేమి లేదురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 852**

**తా॥** మరణం సమీపిస్తోందని తెలిసినవాడు చివరికి కులం ఘనత తగ్గిందంటూ సన్యసించితే చివరికి మిగిలేది పాపఫలం మాత్రమే.

**వేల్ల కుక్కల యెంగిలి విశదమాయె!**
**పడుచు వేశ్యల యెంగిలి ప్రాప్తమాయె!**
**చెడుగు యెంగిలి యెంతకు శ్రేష్ఠమాయె!**
**యిష్టమగు వారి యెంగిలి యెగు వేమ! 853**

**తా॥** తెల్ల కుక్కల యెంగిలి వేశ్యపడుచుల ముద్దులు ప్రాప్తించాయి. చెడు స్త్రీల యెంగిళ్ళు ఎంతో రుచీ మంచివిలా ఉంది. ఇష్టమైతే యెంగిలీ రుచే అన్నీ రుచే.

**ఎంత కడుగ నోటి యెంగిలి బోవునా?**
**యనృతము విడు నోరు యదియు నోరు,**
**యనుదినంబు చూడ నన్మృత మాడెటి నోరు**
**నోరు కాదు కిందినోరు వేమ. 854**

**తా॥** అసత్యం చెప్పడం విడిచి పెట్టిన నోరు మాత్రమే నోరు. అన్నీ అబద్ధాలే ఆడే నోరు అది నోరుకాదు అనకూడని కిందనోరు.

**అంగమందు లింగ మతిశయంబున గట్టి**
**లింగమందు భక్తి నిలుపలేడు**
**ముక్తి లేక తుదను మూర్ఖుడై పోవురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 855**

**తా॥** మెడలో ఈశ్వర లింగాన్ని కట్టుకున్నాడు. కాని లింగమందు మాత్రం భక్తి తాత్పర్యంతో ఉండలేక పోతున్నాడు.

**విష్ణు భక్తులెల్ల వెలబూది పాలైరి**
**వాదమేల? మత విభేదమేల?**
**తెలియ లింగధరులు తిరుమంటి పాలైరి,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 856**

**తా॥** విష్ణు భక్తులందరూ విభూదులు ధరించడం మొదలు పెట్టారు. వాద ప్రతివాదులతో మత విభేదాలతో మతి పోయినట్లున్నారు. ఇక శైవులని చూస్తే వారందరూ తిరుమణిషా లవుతున్నారు.

**తల్లి గర్భమందు తాను వెడలు వేళ**
**నరుత లింగముండ దరసి చూడ**
**నడుమ లింగమున్న నవుబాటు గాదటో!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 857**

**తా॥** తల్లి కడుపు నుంచె మెడలో లింగం ధరించలేదు. ఆ తరువాత మధ్య కాలంలో లింగాన్ని ధరించితే అది చూసే వారికి నగుబాటు అనిపించుతుంది.

**పట్టు పాగ జుట్టి పట్టు, ధోవతి గట్టి,**
**సృష్టి వైష్ణవంబు మిట్టిపడును**
**చిన్నె లింతెకాని శ్రీవైష్ణవ మతంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 858**

**తా॥** పట్టుబట్ట తలపాగా చుట్టాడు. పట్టు ధోవతులు ధరించాడు. ముఖం చూడగానే వైష్ణవమతం ఉట్టిపడుతూన్నట్టుంటాడు. పటాటోపంతో ఉన్నది వైష్ణవమతము.

**రూపవంతులు గురు రూపవంతులు జూడ**
**వారి వారి నేల గారవింప**

**మొద లెరుగకయున్న మోక్షంబు గలుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 859**

**తా॥** వైష్ణవ గురువులుగానో, శైవ గురువులుగానో చక్కని ఆకారాలు ధరించినంత మాత్రంలో ఎందుకు గౌరవించడం? మూల మేమిటో తెలియని వారికి మోక్షం కలగదు.

**మాలవాని నేల మరి మరి నిందింప**
**నొడల రక్తమాంస మొకటి గాదె**
**వానిలోన మెలగు వాని కులంబేది?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 860**

**తా॥** మాలవాడు అంటూ మాటిమాటికీ నిందించడం దేనికీ? అందరిలోనూ గల రక్తమాంసాలూ ఒకటేకదా! అంతేకాదు వానిలో గల వాడి కులం అటే వాడిలోనూ యీశ్వరుడున్నాడు కదా! ఆ కుల మేది?

**స్థావరముల భక్షింతురు**
**భావింపగ జంగమములు బహువిధ రుచులన్**
**యావల సకల ప్రాణులు**
**తీవరమున తమ్ము దామె తిందురు వేమా. 861**

**తా॥** భక్షకులు స్థావరాల్నీ తింటారు. రకరకాల మార్పుల రుచులతో జంగమాలనీ తింటారు. ఆ తరవాత కనిపించిన ప్రాణినల్లా భక్షిస్తారు. చివరికి తమను తామే భక్షిస్తారు.

**శక్తులు జపములను సేయగ సాగితే**
**పురుషులే యికను పుడమిలోన?**
**పాప మెంచవద్దు పట్టి శిక్షింపుడీ**
**పుణ్య పురుషులెల్ల భువిని వేమ. 862**

**తా॥** స్త్రీలు కూడా జపాలు తపాలు చేయడం మొదటు పెడితే మగవారెందుకు? లోకంలో గల పుణ్య పురుషులు పాపం చేసేవార్ని పట్టి శిక్షించండి.

**ప్రాణలింగమెన్న ప్రార్థించి కీర్తించి**
**కట్టివేయ నేమి కల్లజేసె?**
**నఖిలజనుల కెల్ల నానందమే సాక్షి,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 863**

**తా॥** ప్రాణలింగాన్ని ప్రార్థించమనికీ అందరికీ చేరికలో ఉండాలి. ఆలయాల్లో కట్టి పడేయడం కేవలం మిథ్య.

**ఉప వనముల నుండి యొగి నీళ్ళలో మున్గి**
**కూడు వండి వేల్పు గుడువు మనుచ**

**దాని నోరు గొట్టి తమరె తిందురు గద,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 864**

**తా॥** వనాల్లో ఉండేవాటినీ నీళ్ళలో మునిగి ఉండే వాటినీ పట్టి ఆహారంగా మార్చి దేవతలకి నివేదన చేస్తున్నారు. వాటి నోళ్ళు కొట్టి చివరకి మనుష్యులే వాటిని భక్షిస్తున్నారు.

**శిలలు జూచి నరులు శివుడని మెత్తురు**
**శిలలు శిలలు గాని శివుడుగాడు**
**తనదులోని శివుని దానేల తెలియదో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 865**

**తా॥** రాళ్ళను చూసి శివుడని మెచ్చుకుని పూజిస్తుంటారు. శివుని ఎప్పుడూ శివుడే కాని ఎన్నటికీ రాయి కాజాలడు. శివుడు రాయిలో ఉన్నాడని మొక్కడం కంటె తనలో గల శివుడ్ని తెలుసుకోడానికి ఎందుకు ప్రయత్నిండడో?

**తల్లి గౌరి తనకు తండ్రియే శంభుండు**
**ప్రమధ గణము లఖిల బాంధవులును**
**తనకు బుట్టినిల్లు తనరు కైలానంబు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 866**

**తా॥** తనకి తల్లి పార్వతి, తండ్రి ఈశ్వరుడు ప్రమధ గణాలే చుట్టాలు. తన పుట్టిన చోటు కైలాసం.

**తల్లి దండ్రు లనుచు తత్త్వంబు నెరుగరు**
**యోని లింగములను సుధ్భవించి**
**విష్ణు వరయ దల్లి వెలియ రుద్రుడె తండ్రి,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 867**

**తా॥** నా తల్లి! నా తండ్రి! అని అంటున్నారు. యోని తల్లి లింగము తండ్రి అని. అనగా విష్ణువు యోని రూపం అనుకుంటే శివుడు లింగరూపుడు. అదే తల్లి తండ్రీ అన్నమాట. వారిని ఆదిదంపతులు అంటారు.

**మనసు గెలిచి పూనిమన్న సుజ్ఞానులు**
**కడక మోక్షపదము గనుచు నుండ్రు;**
**చెట్టు బెట్ట ఫలము చేకూర కుండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 868**

**తా॥** మనస్సును మెప్పించి నిగ్రహించిన మహాను భావులు తప్పకుంమ మోక్ష పదాన్ని పొందుతారు. ఎలాగంటే ఫలవృక్షాన్ని పెంచి పెద్దచేస్తే ఫలించకుంటుందా?

**మోహము తీరక యుంటే**
**దాహంబై దేహమంత దల్లడ పడనీ?**

**గేహములో పోరాడక**
**దేహంబున నున్న శివుని దెలియర వేమా! 869**

**తా॥** శరీరంలో విజృంభించే యింద్రియాలను శాంత పరచి ఆ దేహంలో గల శివుడ్ని తెలుసుకో!

**లింగ మంగమునను లీల దెలియు వెన్క**
**మనసు లింగమందు మరుల కొనుచు**
**మనసు నిల్ప నందె మరి లింగముండురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 870**

**తా॥** శరీరంలోని లింగం యొక్క ఉనికిని మనస్సు గుర్తించితే మనసు లింగమందు నిమగ్నమవుతుంది. మనస్సును నిలకడగా ఉంచితే అందులోని లింగాన్ని దర్శించవచ్చు.

**శివుడు బ్రహ్మ మనుచు శృతు లెల్ల బలుకంగ**
**పరుల గొల్చు నెట్లు బ్రాహ్మణుండు?**
**హరుని భక్త జనులు యగ్రజు లనరాదె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 871**

**తా॥** శివుడే బ్రహ్మమని శృతులు పేర్కొంటూండగా బ్రాహ్మణులు యితర దేవతలను సేవించడం దేనికి? హరుని సేవికచే వార్ని అగ్రజులనరాదా మరి?

**అగ్ని చేత బట్టి యా పరమేశుని**
**నింద జేసి నరులు నీరుగారె**
**దక్షు క్రతువులోని తల్లడ మెరుగరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 872**

**తా॥** పరమేశ్వరుని మించిన దైవం లోకంలో లేదు. అట్టి శివుని మనుష్యులు నిందించరాదు. యజ్ఞాగ్నిని చేత్తోపట్టుకుని అహంకరించిన దక్షుడి మీద హుంకరించిన అధ్వర ధ్వంస లీలని గుర్తుంచుకోండి.

**కలియుగమున నున్న కాపు కులానకు**
**వేమన దన కీర్తి విక్రయించె;**
**నున్న ధర్మమెల్ల నుర్విలో నరులకు,**
**కోరి బెట్టె పరము గోరి వేమ. 873**

**తా॥** ఆంధ్రభూమిలో ఉన్న ధర్మాలన్నింటినీ మోక్షం కొరకు ముచ్చ టించాడు. వేమనకు ఎంతో కీర్తి లభించింది. దాన్నంతనీ కలియుగంలో కాపుకులానికి అమ్మాడు.

**చెవిని నిల్లు గట్టి చెప్పెను వేమన,**
**బట్టబయల నుండు బ్రహ్మ మనుచు,**
**బుద్ధి గలిగి యందు బొంది సుఖించుడీ !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 874**

**తా॥** వేమన వేయి విధాలుగా చెవులు గళ్ళు పడేలా చెప్తున్నాడు. బ్రహ్మం ఎక్కడా బంధింపబడకుండా బయలునే ఉంటుందని వివేకంతో దాన్ని తెలుసుకుని సుఖించండి.

**పొంకముగను మనసు పోనీక సర్వేశు**
**వంక నిల్పువాడు వంశవరుడు,**
**వంక నిల్పకున్న వచ్చునా పదవులు ?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 875**

**తా॥** మనస్సును యింద్రియ సుఖాల వెంపు పోనీక సర్వేశ్వరుడ్ని నమ్మి బ్రతుకు సాగించువాడు వంశానికి ప్రతిష్ఠ తెచ్చేవాడు. ఈశ్వర ధ్యానం విడవకున్నవాడు ఉత్తమ పదవులు పొందవచ్చును.

**ఉండి యుండి జ్ఞాన యుగములు చనిపోవ**
**ప్రాణహాని లేదు ప్రళయముననను,**
**ప్రాణహానియైన పరమాత్మ గలసునో?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 876**

**తా॥** ఎన్ని యుగాలు గడిచి పోయినా జ్ఞానికి ప్రాణ హానిలేదు. ప్రాణ నిర్యాణవేళ అట్టివాడు పరమాత్మలో లీనమోతాడు.

**గురువు తానయైన హరుని దా జూపును**
**బ్రహ్మ లోక మతడు పారజూవు,**
**శిష్య నరసినట్టి చీకటి చావురా !**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 877**

**తా॥** తెలిసిన మంచి గురువు శివుడ్ని చూపగలడు. ఇంకా గురువు బాగుగా బ్రహ్మలోకాన్ని చివరికంట చూపగలడు. శిష్యుడ్ని ప్రబోధించి అజ్ఞానాన్ని తొలగించి ముందుకు నడపగలడు.

**ధనమే మూలము జగతికి,**
**ధనమే మూలంబు సకల ధర్మంబులకున్,**
**గొనమే మూలము సిరులకు,**
**మనమే మూలంబు ముక్తి మహిమకు వేమా, 878**

**తా॥** ధనమే అన్నింటికీ మూలం. ఏ ధర్మాలు నిర్వహించాలన్నా అన్నింటికీ మూల ధనం. డబ్బుతో డబ్బును సంపాదించడం చూస్తున్నాం. ముక్తి తెలుసుకోవాలంటే మనస్సే మూలం.

**కడగిగాలిలేని గగనంబు భంగిని,**
**బలు తరగలు లేని జలధి మాడ్కి,**
**నిర్వికారముననను నిశ్చలత్వమున తా**
**నుండెనేని ముక్తి యొనరు వేమ. 879**

**తా॥** గాలిలేని ఆకాశంలాగా, కెరటాలు సంక్షోభంలేని సముద్రంలా, ఏ విధమైన వికారాలూ లేక నిలకడగా ఉంటే అటువంటి మనస్సుకి ముక్తి సాధ్యం.

**నీళ్ళు బోసి కడిగి నిత్యంబు శోధించి,**
**కూడుబెట్టి మీద కోకగట్టి,**
**యేమి పాట్లుపడుదు రీ దేహము నకిల!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 880**

**తా॥** పన్నీటితోటి చక్కగా కడిగి ఎల్లప్పుడూ శుభ్రపరచి దానికి హితంగా ఆహారం పెట్టి ఆర్షణీయంగా బట్టలు తొడిగి పదన స్వభావంగా దేహానికి అన్నీ అలా చేస్తూ పడరాని పాట్లు పడుతూంటారు.

**గద్ద గణము నిద్ర కలలు కోరికెలును,**
**ముద మొసంగు శకునములును జెలగు,**
**ప్రశ్నలు పదివేలు పరికించి చూడంగ,**
**నవును కాక పోవు నవని వేమ. 881**

**తా॥** సోదె చెప్పించుకోడం, స్వప్నాలూ, సంతోషాన్నిచ్చే శకునాలూ, ప్రశ్నశాస్త్ర అంటె చిలక ప్రశ్న మొదలైనవి. ఒక్కొక్కసారి అవచ్చు అట్లే ఫలించక పోనూవచ్చు.

**లేడు లేడనినను లేడు లేనే లేడు,**
**కాడు కాడటన్న కానె కాడు;**
**తోడు తోడనినను తోడనే తోడౌను,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 882**

**తా॥** లేడు లేడు అనేవారికి లేడు. కాడు కాడు అనే వారికి కానేకాడు. ఉన్నా డనుకొన్నవారికి తోడై ఉంటాడు.

**శివుని మీద మనసు స్థిరముగా నుంచిన**
**నౌను మోక్ష మరయ నౌనదౌను,**
**శివుని మీద మనసు చీమంత తప్పిన**
**కాదు కాదు ముక్తి కాదు వేమ. 883**

**తా॥** మనస్సును శివుడిపై ఉంచిన ఈశ్వరానుగ్రహం వల్ల కావలసిన ముక్తి లభిస్తుంది. శివాధ్యానం సరిగ్గా లేకపోతే ముక్తి రాదనీ తాత్పర్యం.

**తల్లి కెదురుకొనుట తండ్రి కెదురుకొంట,**
**యన్న కెదురుకొనుట యరయ మూడు**
**పాతకముల నెరిగి వర్తింపగా వలె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 884**

**తా॥** తల్లి, తండ్రి అన్నను ధిక్కరించడం అన్నవి మూడు పాపం అని తెలుసుకుని జాగ్రత్తగా నడుచుకోవలెను.

**లోభ మోహములను ప్రాభవములు దప్పు**
**తలచిన పనుతెల్ల దప్పి చనును;**
**తామొక్కటి దలంపదైన మొక్కటిదల్చు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 885**

**తా॥** లోభమోహాలు గొప్పతనమునకు చిహ్నాలనీ భావిస్తున్నారు. అలాంటి వారికి తలచిన కార్యం నెరవేరదు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచిందన్న సామెతలా ఉంటుంది.

**వరలు రత్న సమితి వలె గూర్చు ధాన్యంబు**
**జక్క దంచి వండి మిక్కుటముగ,**
**సుష్టు భోజనముల జూరగ నిడు వాడు**
**చెప్పనేల వాడె శివుడు వేమ. 886**

**తా॥** మంచి ధ్యానమును దకచి సండి కడుపు నిండా చక్కటి భోజనమును పెట్టేవాడు నిజంగా సొడుతో సమానుడు.

**ఒకటి క్రింద నొక్కటొనర లబ్ధము బెట్టి**
**వలనుగ గుణియింప వరస బెరుగు**
**నట్టి రీతి నుండు నౌదార్య ఫలములు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 887**

**తా॥** ఒక దానికింద ఒకటివేసి గుణిస్తే అంకెల లబ్ధం పెరుగుతుంది. ఔధార్యం యొక్క ఫలం కూడా అలాగే ఉంటుంది.

**అన్న మరుగ నతని కన్నంబు బెట్టిన**
**పారవేయు దాని ఫలితమేమి?**
**ధనికునకు నొసంగు దానము లటువలె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 888**

**తా॥** అజీర్తి వాడికి అన్నం పెడితే దాన్ని పారేస్తాడు. అందువల్ల యే ప్రయోజనం సిద్ధించదు. అట్లే డబ్బున్న వాడికి దానం యిస్తే ఏముంది.

**ఇరుగు పొరుగు వారి కెనయు సంపద జూచి,**
**తమకు లేదటన్న ధర్మమేమి?**
**ధర్మమన్న తొల్లి దన్నుక చచ్చిరి,**
**కర్మఫలము నేడు గలిగె వేమ. 889**

**తా॥** ఇరుగు పొరుగువారి సిరిసంపదలను చూసి బాధ పడరాదు. తమకు లేదంటే వెనక జన్మలో పెట్టి పుట్టలేదు. అందుకే విచారం దేనికి? దాని ఫలమే యిప్పటి లేమికి కారణం.

**ఆకలన్న వారికన్నంబు బెట్టిన,**
**హరున కర్పితముగ నారగించు,**
**ధన విహీనున కిడు దానములటు వలె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 890**

**తా॥** ఆకలి అని బాధపడే వారికి అన్నంబెట్టితే అది ఫలవంతం అవుతుంది. అది ఈశ్వరార్పణంగా భుజిస్తాడు. అలాగే డుబ్బులేనివాడికి దానం యిస్తే అది సార్థకం అవుతుంది.

**కలిగి పెట్టలేని కర్మ జీవుల కెల్ల**
**తిరిపెమును దొరకవుర దీనులార !**
**తెలియ జూచుకొనుడు దృష్టాంతమిది మీకు**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 891**

**తా॥** పెట్టగలిగిన సమర్థత కలిగి ఉండి కూడా పెట్టని లోభులకు తరువాత జన్మలో ముష్ఠి కూడా దొరకదు. దీనికి కావాలంటే కావలసినన్ని ఉదాహరణలున్నాయి.

**తిరిపెగాడయినను తిరిపె మెత్తిన యట్టి**
**తిరిపెమందు తాను తిరిపె మిడిన,**
**తిరిపెము తిరిపెమున దిగబడి పోవురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 892**

**తా॥** ముష్టివాడు అడుక్కొని తెచ్చి దానినుండి బిచ్చంవేస్తే ముష్టి నుండి బిచ్చం వల్ల సరుకు తగ్గిపోతుంది.

**తాము బలిమిబెట్ట తమకు తామె కల్గు**
**నడుగ నిడిన తాము నడుగ గలుగు**
**నించు నీని వానికెందును గల్గదు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 893**

**తా॥** అడగకుండా యిచ్చేవాడికి అవసరం వచ్చినపుడు కావసింది అభిస్తుంది. అడిగితే పెట్టినవాడికి అడిగితే అభిస్తుంది. ఏ విధంగా ఈయనివాడికిలీ లోకంలో ఎప్పుడూ దొరకదు.

**తాము గడన సేయు ధనము తమది యని,**
**నమ్మి యుండ్రు వెర్రి నరులు భువిని,**
**తాము నొకరి కిచ్చు ధనమింతియే కాక,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 894**

**తా॥** ఇదంతా నాది నాది అని బుద్ధి హీనులయిన మనుష్యులు నమ్ముతారు. కాని తమరు దానం చేసినంతే తమకి విగులుతుంది. మిగతాది తమకి దక్కదని అమాయకులు తెలుసుకోలేరు.

**తాము దినక నటుల ధరతిము సేయక,**
**కొడుకుల కని ధనము గూడబెట్టి**
**తెలియ జెప్పలేక తీరిపోయిన వెన్క,**
**సొమ్ము పరుల నంటు జూడు వేమ. 895**

**తా॥** తాము తినక, ధర్మం చేయక కొడుకుల కోసం డబ్బు కూడబెడతారు. చచ్చిన తరువాత ధనం పోవలసిన చోటుకి సద్దుకుంటుంది.

**దాచిన ధనమునకు తానును కొడుకును**
**వాంఛ బడుటె కాని వట్టి భ్రమలు**
**భాగ్య హీనునకును ఫలము లభించునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 896**

**తా॥** తండ్రీ కొడుకులు దాచిన డబ్బును గురించి ఏవేవో అను కుంటూంటారు. అవన్నీ వట్టి భ్రమలని తెలుసుకోరు. భాగ్యహీనులకు సిరిసంపదలు అబ్బవు.

**భాగ్య హీనునకును పరుసవేది దొరుక**
**నదియు నిల్వ దపుడు వదలుగాక**
**వాన తోడవచ్చు వడగండ్లు నిల్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 897**

**తా॥** దరిద్రునకు ఎంతో భాగ్యం ఉన్నా అంతా కరిగి పోతుంది. ఒకవేళ వాడికి "పరుస వేది" లభించినా అదికూడా చేజారిపోతుంది. ఎలా అంటే వానతో వచ్చే వడగళ్ళ దానితోటే మాయమైపోతాయి.

**ధన విహీనుడైన తండ్రి గర్భంబున,**
**భాగ్య పురుషు డొకడు పరగ బుట్టి,**
**బహుళ ధనము గలిగి భద్ర మార్గంబున,**
**పరుల కుపకరించి ప్రబలు వేమ. 898**

**తా॥** ధనవిహీనుడనగా ఇక్కడ డబ్బు ఉండి కూడా అనుభవించ లేనివాడు, అటువంటి వాడికి ఓ భాగ్య పురుషుడు పుట్టి ఎక్కువ ధనమును సక్రమంగా మంచి మార్గంలో దాన్ని వ్యయపరుస్తాడు. ఆ విధంగా ఆతడు కీర్తివంతడవుతాడు.

**ఇహము నందు బాధలెన్నైన బడవచ్చు**
**యముని బాధలేక నమర వలెను,**
**పరుల బాధలేక బ్రతుకు డీ నరులార,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 899**

**తా॥** ఇహంలో ఎన్ని బాధలు పడినా పడవచ్చుగానీ తరువాత జీవితంలో యముని బాధ లేకుండా చేసుకోవాలి. పరుల బాధలకి గురికాకుండా బ్రతకడం నేర్చుకోవాలి.

**వల్లపైపు లేక, వాగ్దత్తమటు చేసి,**
**యదిగొ యదిగొ యనుచు నానబెట్టి**
**గడుపు బెట్టి రేపు గడియ గానిమ్మని**
**గడియ లోన బడియె గదర వేమ,** **900**

**తా॥** యిస్తానని చెప్పి యాచకుని అనగా ప్రతి గ్రహీత అదిగో, ఇక రేపే అంటూ గడువులు దాటే కాలం వెళ్ళబోస్తూండగా, దాత అంతట్లో ఎప్పుడో గటుక్కు మంటారు.

**పరుల కుపకరింప పాప క్షయంబగు,**
**పరుల కుపకరింప పట్టుకొమ్మ**
**పరుల కుపకరింప పరలోక సాధన**
**పరుల కుపకరింప బలిమి వేమ.** **901**

**తా॥** పరులకి ఉపకరించడం వల్ల పాపాలు నశిస్తాయి. పరులకు ఉపకరించడం పట్టుకొమ్మలాంటిది. పరులకి ఉపకరించడం పరలోకసాధన అవుతుంది. ఆఖరుగా పరులకి ఉపకరించడం ద్వారా బలాన్ని అంటే పేరు ప్రఖ్యాతలు పొందవచ్చు.

**అర్థవంతు సొమ్ము నాసింతు రర్థుల**
**య్యర్థికీని సొమ్ము వ్యర్థమౌను**
**వ్యర్థమైన సొమ్ము వ్యర్థుల జేరురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **902**

**తా॥** ధనవంతుని ధనమును యాచకులు అడుగుతారు. అలా ఇవ్వక మురగేసిన సొమ్ము ఉంటే వ్యర్థమైన సొమ్ము పనికిరాని వారి దగ్గరకు చేరుతుంది.

**ధర్మ కంటకుండు ధనముచే గర్వించి**
**సకల సంపదలను చాల చొరలి,**
**కడకు తాను మేలు గానక చెడిపోవు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **903**

**తా॥** సిరిసంపదలతో మదించి ఉన్న వాని చేతిలో ధనం సరైన తోవ కనపడక చివరికి చెడుత్రోవల పడిపోవును.

**ఇంతి తనదు పేరు నెల్ల కాలంబును,**
**ప్రజలు దలచునట్లు ప్రతిభ గాంచె**
**నింతికి పతిభక్తి యెంతన వచ్చును?**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **904**

**తా॥** స్త్రీ తన పేరును చిరకాలం ప్రజలు తిరిగి తిరిగి చెప్పుకునేలా ప్రతిభ కెక్కింది. స్త్రీకి పతిభక్తితో సాటి వచ్చునది యింకొకటి లేదు. స్త్రీ యొక్క పతిభక్తి అంతటిది.

**ధర్మమునకు కీడు దలచినవాడు తా**
**దుష్టమార్గుడగును దోవ చెడును**
**గురువు పత్ని గవయ గోరెడు వాడు తా**
**మొదలు సెడును జూడ మొనసి వేమ. 905**

**తా॥** ధర్మమునకు హాని కలిగించరాదు. అట్లు హాని కలిగించిన వాడు దుష్టుడై చెడు త్రోవపడును. గురువు భార్యను చెరిచేవాడు సమూలంగా నశించిపోతాను.

**అరయ చేసి మలచి యడిగెండ్లు మలిగెండ్లు**
**తిరిపె మిడెడు కటిక దేబెలెల్ల**
**నెలమి మన్ను దినెడు నెర్రలౌదురు సుమీ,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 906**

**తా॥** వెళ్ళి పొమ్మనక బిచ్చం పెట్టక భిక్షుకుల్ని నిలబెట్టి బాధపెట్టువారు తరువాత జన్మలో వానపాములై అంటే మన్నుతినే వాళ్ళుగా పుడుతారు.

**మత్సరంబు మదము మమకార మనియెడి**
**వ్యసనములను దగిలి మసలబోక,**
**పరుల కుపకరించి పరము నమ్మికనుండి,**
**యొనరుచుండు రాజయోగి వేమ. 907**

**తా॥** మచ్చరం, మదం మమకారం అన్న వ్యసనాల జోలికి పోక పరులకి ఉపకరించే దారిని నడుస్తూ దైవాన్ని నమ్మి రాజయోగి కీర్తిని పొందుతాడు.

**దాన ధర్మములును దయయు సత్యము నీతి,**
**వినయ ధైర్య ధుర్య వితరణములు**
**రాజు పాలిటి కిని రాజ యోగంబులు,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 908**

**తా॥** దాన, ధర్మం, దయ, సత్యం, నీతి, వినయం, ధైర్యం వితరణం అన్నవి నిజమైన ఉత్తమ గుణాలు అవి రాజుకి కూడా ఆచరణీయములు కీర్తిదములూను.

**క్రొవ్వుబట్టు పొరలు క్రూర కర్ముల పొరల్,**
**నవ్వు జేసినట్టి రవ్వపొరల**
**నెవ్వరైన నేమి యినజు వాకిట గాని,**
**యవ్వలికిని బోవునటర వేమ. 909**

**తా॥** కొవ్వెక్కిన దుర్మార్గులు యితరులను బాధించే పనులు చేసి వార్ని నవ్వులపాలు చేసినవారు యమధర్మరాజు పాంగణంలో నడిచేవారే గాని వేరే చోటుకి వెళ్ళలేరు.

**రోగి నరసినట్టి లోకోపకారులు,**
**భోగ భాగ్యములను బొంది తుదను,**
**పూర్వ వాసన దెగి పుర హరు తావున,**
**మ్రోగుచుందు రట్టె మొనసి వేమ. 910**

**తా॥** రోగాలషాలయిన అనాధుల్ని అదుకుని కాపాడే దయామయులు భోగభాగ్యాలు పొంది ఏవిధమైన పాపం లేక ఈశ్వర సన్నిధిని చేరి శివుని మన్ననలకు పాత్రులౌతారు.

**జ్ఞానమొన్న గురువు; జ్ఞానహీనము బుద్ధి**
**రెంటి నందు రిమ్మ రేచుపుడు**
**రిమ్మ దెలిసె నేని రెండొక రూపురా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 911**

**తా॥** జ్ఞానమే గురువు, ఇంకొక జ్ఞానం లేకపోవడం అనగా అజ్ఞానం ఈ రెండింటి ఘర్షణల మధ్య ప్రకాశా ప్రకాశంగా ఉంటుంది మనస్సు. ఈ రెండింటికీ దూరంగా ఉన్న నాడే ముక్తి.

**పుట్టినదియు మొదలు పురుషుడే కాలంబు,**
**పాపమెరిగి శుద్ధపశువు గాక,**
**ముదిసి యోగి కరణి ముదమొప్ప గావలె,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 912**

**తా॥** మొదలుకొని పాపం అంటే ఏమిటో బాగా తెలుసుకుని పశుతుల్యుడుగా ఉండక యోగిలా జీవితం సంతోషంగా గడపగలిగినవాడి జీవితం ధన్యమైనది.

**సకలాకారు దనంతుడు**
**సకలాత్మల యందు సర్వ సాక్షియు దానై,**
**సకలమున నిర్వికారుం**
**డకలంక స్థితిని బ్రహ్మమనబడు వేమ . 913**

**తా॥** అంతా ఆకారం కలవాడూ అన్ని ఆత్మల యందూ తాను సర్వమునకూ సాక్షిభూతుడు, అన్నిటా వికారము చెందినవాడు కళంకంలేని విధంగా ఉండును.

**నేనెవ్వడనని తలచడు,**
**మానసమున పుడమి లోని మనుజుండకటా!**
**కానడు తన సకలంబును,**
**మానుగ గనుగొనుట యెట్లు మహిలో వేమా. 914**

**తా॥** సాధారణంగా మనుష్యుడు లోకంలో నేనెవడ్ని అని తల్చుకోడు. తన సకలాన్నీ చక్కగా తెలుసుకోడం మెల్లగా అన్న సంగతిని గ్రహించడు.

**జనుడు తెలివి నొంద చంచలింపదు మది,**
**దైవమును దెలసిన తగులు బుద్ధి,**
**తివురు భాను జూచి తిమిరంబు నిలుచు?**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 915**

**తా॥** జ్ఞానం సంపాదిస్తే మనస్సు చపల కర్మల యందు ప్రవర్తించదు. దైవాన్ని తెలుసుకున్నందువల్ల బుద్ధి మంచి మార్గం వైపుగా ఉండును. సూర్యోదయం అయిన తరువాత చీకటి ఉండదు కదా? జ్ఞానం కలిగితే అజ్ఞానం ఉండదు.

**పగలు రేయు మరచి భావంబు మరచియు**
**తాను నేననియెడి తలపు మరచి,**
**యుండు వానినెంచ నుత్తమ యోగిరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 916**

**తా॥** రాత్రి, పగలు నేను, అతడు అనే జ్ఞానం లేదా శబ్ద జ్ఞానం అంతా మనస్సు నుంచీ మరచి ఉండేవాడే ఉత్తమ యోగి.

**మంట లోహమందు మాకుల శిలలందు**
**వటము గోడలందు ప్రతిమలందు**
**తన్ను దెలుసుకొరకు తగలదా పరమాత్మ,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 917**

**తా॥** మంట, లోహం, వృక్షమూలం, శిల, వస్త్రం, గోడ, ప్రతిమలయందు ఆత్మ ఉంది. దాన్ని తెలుసుకోవాలి.

**మనసులోని వాని మానుగా దెలిసిన**
**నుర్వి జనులు వాని యోగి యండ్రు;**
**నీవు నిన్నెరుంగ నీవె పో శివుడవు.**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 918**

**తా॥** మనస్సు నందున్న జ్ఞానమును విశేషంగా తెలుసుకున్న వానిని ప్రజలు యోగి అని అంటారు. నిన్ను నీవు తెలుసుకుంటే నువ్వే శివుడవు.

**మాట లోని వాని మహిమతా దెలియక,**
**మాట దెలియలేక మమత జిక్కె,**
**మాట దెలసెనేని మరి యాత్మ యోగిరా,**
**విశ్వదాభిరామ వినుర వేమ ! 919**

**తా॥** గురువు బోధనలను అర్థం చేసుకోక వేదాంత వాక్యసారాన్ని బాగుగా తెలుసుకోలేక భార్యా పుత్రాదుల మోహములో ఉండక ఆత్మజ్ఞానాన్ని తెలుసుకున్నవాడ్ని ఆత్మయోగి అంటారు.

**వ్రేయ వ్రేయగాను విత్తన మనిపించు,**
**వ్రేయ వ్రేయ ప్రబల వృక్షమగును,**
**తెలియ తెలియ వాడు దేవు డనందరు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **920**

**తా॥** వేయగా వేయగా విత్తనం అవుతోంది. వేయగా వేయగా పెరిగి వృక్షం అవుతోంది. తెలియగా తెలియగా అలాంటివాడు యోగి అనిపించును.

**గడన గల పురుషు గనుగొని,**
**యడుగులకును మడుగు లిడుదు రతివలు ధరలో,**
**గడన విడు పురుషు గనుగొని,**
**నడ పీనుగ వచ్చెనంద్రు నాతులు వేమా.** **921**

**తా॥** సమర్థగల మగవానిని చూసి స్త్రీలు అడుగులకి పరుగలొత్తు తూంటారు. సామాన్య పురుషుడ్ని చూసి ఆడవారు “నపీనుగ” నచ్చాదని వేహాకోళంగా తోపి పారేస్తారు.

**వంట దప్పునపుడు వంటకము విషంబు,**
**కంట జూడగానె కంటగించు**
**కంటకమున దిన్న కడి గండమై వచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **922**

**తా॥** వంటకం అంతా విక్షంలా ఉంటుంది. కంటితో చూడ్డానిక్కూడా యిచ్ఛ ఉండదు. కంటిగింపుగా ఉన్నప్పుడు తింటే అది నండం అవుతుంది.

**వంట వచ్చునపుడు వంటక మమృతంబు**
**కంటి కింపుగాను కానుపించు,**
**నొడల తినిన తిండి వడి మించ గడి దేరు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **923**

**తా॥** ఆరోగ్యం గల శరీరంతో ఉన్నవేళ వంటకం అమృతంలా ఉంటుంది. అది చూస్తే కంటికింపుగానూ కనబడుతుంది. తిన్న ఆహారం ఒంటబట్టి బలం గలిగి మంచి హుషారుగా ఉంటాడు.

**కలిగి ధర్మమివ్వ గానని వారును,**
**కలిగి తినక చాల గ్రాగువారు,**
**కలిమి నెచట జూడ గానక చెడుదురు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **924**

**తా॥** ధనం ఉండికూడా ధర్మం చెయ్యనివారూ కావలసినంత ఉండి కూడా తినక దాచిపెట్టుకుని మాడేవారూ కొంతకాలం అయిం తరవాత ఆ కలిమి లేములకి దూరమై ఆకలితో అమటిస్తారు.

**అల్లువాని మృతికి నాత్మ జింతించును;**
**తనయు మృతికి దానె దల్లడిల్లు;**
**పుణ్య పురుషు మృతికి భూమిలో జనులకీ!**
**యుగము గ్రుంగి నట్టులుండు వేమ.** **925**

**తా॥** అల్లుడు చచ్చిన మనస్సు భేదపడుతుంది. కొడుకు చచ్చిపోతే ఆ తండ్రి ఎన్నో బాధల పాలవును. పుణ్యాత్ముడు కనక చచ్చిపోతే ఒక యుగం ముగిసిందని మహాబాధపడతారు ప్రజలు.

**సకల విద్య నేర్చి చచ్చె బ్రతుకు విద్య**
**యొకటి నేర మనుచు నుర్విజనులు**
**కటకట బడుదురు కడ హాని దెలియరు,**
**విశ్వదాభిరామ వినుర వేమ !** **926**

**తా॥** చదువులన్నీ అభ్యసించి మరణించిన తరువాత బ్రతకడానికి అవసరమైన విద్యను తెలుసుకోలేనందుకు ప్రజలు విచారించుతారు. అయితే రాబోయే మరణాన్ని గురించి జనులు ఆలోచించలేక పోతున్నారు.

**దూర దృష్టి గనరు దుడ్డిన దనుకను,**
**పారుపట్టెరుగరు పడిన దనుక;**
**దండ సాధ్యులైరి ధర్మ సాధ్యులుగాక,**
**భూమి జనులు వెర్రి బుద్ధి వేమ.** **927**

**తా॥** పరుగు పెట్టడంలో గల కష్టం పడేదాకా అర్థం కాదు. పడిం తరువాత అర్థం అవుతుంది. మంచిమాటలు చెప్తే వినరు. ఇలా ఉంటాయి ప్రజల బుద్ధులు.

**ముష్టి వేపచెట్టు మొదలుగా ప్రజలకు,**
**పరగ మూలికలకు పనికివచ్చు,**
**నిర్ధయాత్మకుండు నీచుడెందునకును**
**పనికిరాడు గదర పరగ వేమ** **928**

